# ప్రస్థానం

అక్టోబర్-డిసెంబర్
2002

సమగ్ర సాహిత్యపత్రిక

రూ.10



ప్రజాశక్తి బుక్‌హౌస్

ప్రస్థానం సమగ్ర సాహిత్యపత్రిక
అక్టోబర్-డిసెంబర్ 2002
సంపుటి :1 సంచిక : 1

# సంకల్పం

దర్పణం, గమనం, ప్రస్థానం వార్షిక సంచికల తర్వాత..

సమగ్ర సాహిత్య త్రైమాస పత్రికగా ప్రస్థానం మీ ముందుంచ గలుగుతున్నందుకు సంతోషిస్తున్నాం.

తెలుగులో సాహిత్య పత్రికలు తక్కువగానే వున్నాయి. ప్రగతి శీల దృక్పథం కలిగినవి మరీ తక్కువ. ఉన్నవి తమ పాత్ర నిర్వహిస్తున్నా ఇంకా జరగాల్సింది చాలానే వుంది.

ప్రపంచీకరణ నేపథ్యంలో ఆరోగ్యకరమైన సాహిత్య సాంస్కృతిక రంగాలు దారుణమైన దాడికి గురవుతున్న పరిస్థితులలో - టీవీ చానళ్ల తాకిడికి పఠనాభిరుచి తగ్గు ముఖం పడుతున్న స్థితిలో - సామ్రాజ్యవాదం, మతోన్మాదం, టెర్రరిజం సవాళ్ల సంక్లిష్టతల మధ్యన -

జన బాహుళ్యాన్ని చైతన్యపరచి, ముందుకు నడిపించే సాహిత్య సృజన మరింత అవసరమవుతున్నది. ఈ సంక్లిష్టతల మధ్య సాహిత్య జీవులకు విశాల వేదికల ఆవశ్యకతా పెరుగుతున్నది.

ఇప్పటి వరకూ తెచ్చిన ప్రత్యేక సంచికలూ, జన కవనంవంటి ప్రయత్నాలూ, ఇప్పుడు ఈ త్రైమాస పత్రికా అన్నీ ఆ దిశలో అడుగులే.

ఆ ప్రయత్నాలన్నిటికి తోడ్పడిన శ్రేయోభిలాషులూ, కవులూ రచయితలూ దీన్నీ ఆదరిస్తారని విశ్వసిస్తున్నాం.

సామాజిక పురోగమనాన్ని వేగిరపరచే అన్ని ధోరణులనూ స్రవంతులనూ ప్రస్థానంలో సముచితరీతిలో ప్రతిబింబించడానికి ప్రయత్నం జరుగుతుంది. . సృజనాత్మక రచనలకూ, సాహితీ చర్చకూ అత్యధిక అవకాశముంటుంది. లబ్ధప్రతిష్టులు, అనుభవజ్ఞులతో పాటు ఔత్సాహికులకూ భాగస్వామ్యం కల్పించాలనేది సంకల్పం. వివాదాలూ, వ్యక్తి ప్రాధాన్యతలూ, వ్యాపార ధోరణులూ, వ్యర్థ సంచలనాలకు ఆస్కారం లేకుండా- అదే సమయంలో అర్థవంతమైన చర్చతో ముందుకు సాగవలసి వుంటుంది. ఈ స్థూలమైన అవగాహనే పత్రికా నిర్వహణకు ప్రమాణమవుతుంది.

నిబద్ధతతో పాటు సమకాలీనతను కూడా గమనంలో వుంచుకుంటూ ప్రయోజనంతో పాటు వైవిధ్యానికి కూడా ప్రాధాన్యత నిస్తూ ప్రస్థానం సాగుతుంది.

ఈ పత్రిక అన్ని విధాల జయప్రదం కావడానికి మీ సహాయ సహకారాలే కీలకం.

మీ సూచనలకు సర్వదా స్వాగతం.



## ఈ సంచికలో...

| | |
|---|---|
| ప్రస్థానం (కవిత) | .......... 2 |
| సాహిత్యంలో ప్రస్థానం | .......... 3 |
| సర్పదోషం (కథ) | .......... 6 |
| అరసం, విరసం, ప్రస్తుతం | .......... 11 |
| నవ్యసంప్రదాయం ఆధునికా నంతరవాదం ప్రాతిపదికలేనివే | ......... 14 |
| నా కన్నీటి వెనుక... | ......... 17 |
| రిచర్డ్ రైట్ | ......... 18 |
| భక్తి కవిత్వం : సామాజిక విశ్లేషణ | ........ 20 |
| నల్ల నెత్తుటి తుఫాన్ (కవిత) | ........ 23 |
| పాతపుస్తకాలషాపు, తప్పెడ(కవిత) | ........ 24 |
| కసాయి రాజ్యం, పునీత (కవిత) | ........ 25 |
| పరిజ్ఞానం, పరిశీలన కలిస్తేనే కథ | ........ 26 |
| కాగుబొత్త (కథ) | ........ 29 |
| ఐదుహంసలు | ........ 36 |
| కాళ్ళులేని సమీక్షకు కళ్ళిద్దాం రండి | ....... 40 |
| నిర్బంధాలు (కవిత) | ........ 42 |
| పునరపి | ........ 43 |
| వివాదంలో బూకర్ విజేత | ........ 44 |
| దేశభక్తి! | ........ 46 |
| బెంగాల్‌లో సాహిత్యం కోసం ప్రత్యేక బుక్ ఎగ్జిబిషన్లు | ........ 47 |
| మాయామబ్బులు (కవిత) | ........ 48 |
| సాహిత్య పత్రికలు : భావవ్యాప్తి | ........ 49 |
| హైకులు | ........ 53 |
| సీతాకోకచిలకల నీడలు (కవిత) | ........ 53 |
| నిశ్శబ్దమయిపోవడం (కవిత) | ........ 54 |
| ఆకాశ సముద్రం (కవిత) | ........ 54 |
| ప్రజల గొడవంతా మనగొడవే | ........ 55 |
| సందర్భం, రేపు (కవిత) | ........ 57 |
| చావుసావు(కథ) | ........ 58 |
| 'అమృతం కురిసిన రాత్రి' చిత్రం | ........ 61 |
| జోగునృత్యం,ఉత్తరం..ఏడ్చింది(కవిత) | ........ 62 |
| రా..మా...! (కథ) | ........ 63 |

సంపాదకులు
**తెలకపల్లి రవి**
ముద్రాపకులు, ప్రచురణకర్త
**వి. కృష్ణయ్య**
మేనేజర్
**కె. లక్ష్మయ్య**

అడ్రస్ : **ప్రస్థానం**
ప్రజాశక్తి బుక్‌హౌస్, 1-1-187/1/2,
వివేక్‌నగర్, చిక్కడపల్లి,
హైదరాబాద్-500 020
ఫోన్లు : 7660013, 7635136

# ప్రస్థానం

**కటుకోజ్వల ఆనందాచారి**



వేడి వెలుగుల్ని నింపుకున్న కళ్ళు
అక్షరాల్ని ఎగజిమ్ముతాయి
పదాలు వాక్యాలు వాక్యాలుగా ప్రవహించి
స్వేద బిందువుల్ని ముద్దాడుతాయి!
కవన తపోవనంలో
కర్షకుని సౌభాగ్యానికై కలం
మహాయజ్ఞాన్ని నిర్వహిస్తుంది
నిత్యకర్మజీవుల కళ్యాణానికై
సత్యశోధన మొదలౌతుంది
ఇక్కడ
అన్నిదారుల సంచారాలూ
ద్వారాలకు భావాల తోరణాల్ని
అలంకరిస్తాయి!
ఇక్కడ
సిరా చుక్కలు
శబ్దాలు శబ్దాలుగా విస్తరించి
మౌన సంస్కృతీ ఆవరణాలపై అలజల్లను చల్లుతాయి!

ఇక్కడ
శ్రమజీవన సౌందర్యాలయాల్ని
అక్షరం ఆవిష్కరిస్తుంది!
నవ్యలోక సుందర బృందావనికై
స్వప్నాలు మేల్కొంటాయి!
పర్వతాల్ని, అరణ్యాల్ని దాటి
మనువుల్ని ముసుగుల్ని వొదిలి
నేలనేలంతా పరచుకున్న
మట్టివాసనల్ని నిండారా నింపుకుని
అడుగు అడుగూ
ఓ క్రొత్త వెలుగు
ఆలోచనల స్పర్శతో
మహాప్రస్థాన ఆరంభం!

. . . . . . . . . . . . .


ముఖ చిత్రం : **రమణజీవి**

లోపలి చిత్రాలు : **మోహన్, అక్బర్, రమణజీవి,**
**ఏలే లక్ష్మణ్, గంగాధర్, శ్యాంమోహన్**

కార్టూన్లు : **గంగాధర్, రుక్మిణీ, శ్యాంమోహన్**

. . . . . . . . . . . . .

**కృతజ్ఞతలు**

ఈ ప్రారంభసంచికకు తమ రచనలు, చిత్రాలు ఇచ్చి
సహకరించిన మిత్రులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు.

సహృదయంతో అడ్వర్టయిజ్‌మెంట్లు ఇచ్చి తోడ్పడిన
శ్రేయోభిలాషులకు ప్రత్యేక ధన్యవాదాలు.

. . . . . . . . . . . . .

## దృక్పథం

# సాహిత్యంలో "ప్రస్థానం"

తెలకపల్లి రవి

దర్పణం, గమనం, ప్రస్థానం వార్షిక సంచికల వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని ఈ త్రైమాస పత్రిక మీ ముందుకొచ్చింది. తెలుగులో సాహిత్య పత్రికలే తక్కువ. నాలుగు కాలాలు నడిచినవి మరీ తక్కువ. అభిరుచి గల సాహిత్యాన్ని ప్రోత్సహించే పత్రికలు, ప్రగతి శీల భావాలు గల సాహిత్య పత్రికలు అసలు లేవని కాదు కాని దినపత్రికలలో సాహిత్య శీర్షికలు, ఆదివారం అనుబంధాలే ఎక్కువ ప్రభావం చూపుతున్నాయి.

జీవితపు వడికి ఒడుదుడుకులకు పతనమే తగ్గుముఖం పట్టిన స్థితిలో సాహిత్యం గురించే చదివేవారు ఎందరుంటారనే అనే సందేహాలు రావడం సహజం. శక్తివంతమైన ఏ గీతానికైనా జన బాహుళ్యం ఉర్రూత లూగడం ఆగలేదు.వీధినాటికల ప్రేక్షకులూ తగ్గలేదు. ఏ తెలుగు పత్రికా సాహిత్య పరిమళాలు లేకుండా, కవితా చరణాలు ఉపయోగించకుండా వెలువడ్డం లేదు. సభల్లో వక్తృత్వానికి సాహిత్యం అదనపు అర్హతగాకుండానూ పోలేదు.ఇంటర్నెట్ వెబ్‌సైట్‌లలో సాహిత్య సందర్శకుల సంఖ్య గణనీయంగా వుంటూనే వుంది. కానైతే దైనందిన వ్యవహారాల మధ్య, కంప్యూటర్ పరుగుల మధ్య కెరీర్ పుస్తకాలు చదివినంత పరిమాణంలో సాహిత్య గ్రంథాలు చదివే అవకాశం, వీలూ వుండటం లేదనేది నిజం.

అసలే ఈ వ్యవస్థ చైతన్య స్ఫోరకమైన అన్ని విలువలనూ తలకిందులు చేస్తుంది. అన్ని ఆసక్తులనూ వ్యాపారీకరిస్తుంది. 70 లలో కాల్పనిక సాహిత్యం, 80 లలో క్షుద్ర సాహిత్యం రావడం ఆ పరిణామ క్రమంలోనే. ఇప్పుడు టీవీ ఛానల్స్ విజృంభణతో వీక్షకుల కాలక్షేపానికి లోటు లేకుండా పోయాక అలాటి కాల్పనిక సాహిత్యమూ తగ్గుముఖం పట్టింది. కాని సీరియస్ సాహిత్యం, పుస్తకాలు రావడం ఆగిపోలేదు.

అంతెందుకు? హైదరాబాదు నగరంలో పుస్తకావిష్కరణ జరగని రోజే వుండదు..తెలుగుదేశంలో ప్రతి రెండో వాడూ కవి అని శ్రీశ్రీ అన్న మాటను నిజం చేసేలా వందల మంది కవుల పేర్లు కనిపిస్తాయి. (జనకవనం లాటి వాటిలో వందల మంది కవులు పాల్గొన్నారని విన్న తర్వాత ఒక సీనియర్ కవివరేణ్యుడు అంత మంది కవులు వుండటమేమిటి, ట్రాష్ అని కొట్టిపడేశారనుకోండి.) ఇదంతా తెలుగుదేశంలో సాహితీ చైతన్యాన్ని తెలియజేస్తుంది.దురదృష్టం ఏమిటంటే- సాహిత్యం గురించి ఆసక్తివున్నంతగా అవగాహనలేదు, అందుబాటూ లేదు. సాహిత్యం మహాభారత రచనాకాలం నుంచీ రాజకీయాలతో ముడిపడే వుంటోంది. కాని ఆ మాటను అంగీకరించడం మాత్రం మన విమర్శకులు చాలా మందికి ఇష్టం వుండదు.

నిజానికి నిష్పాక్షిక సాహిత్యం అంటూ వుండడం మిథ్య. ఎప్పుడైనా అది ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఏదో ఒక పక్షాన్ని బలపరుస్తుంది. అంతిమ విశ్లేషణలో అత్యధిక జన హితం కోరేదే నిజమైన సాహిత్యం. ఆ చెప్పే పద్ధతి మాత్రం మనో రంజకంగా వుండాలి. భావ వికాసమూ కలిగించాలి. ఈ రెంటినీ మేళవించగలిగిందే ఉత్తమ సాహిత్యం. అలాటి సాహితీ సృజనకు, దానిపై ఆరోగ్య కరమైన చర్చకు దోహదపడటమే ఈ సాహిత్య సంచిక ప్రధాన లక్ష్యం.ప్రపంచంపై సామ్రాజ్య వాద ప్రపంచీకరణ ఆధిపత్యాన్ని, దేశానికి చేటు తెచ్చే మతోన్మాదాన్ని, టెర్రరిజాన్ని వ్యతిరేకించే సాహితీ వేదికగా అది పని చేస్తుంది. శాస్త్రీయ దృక్పథాన్ని ప్రచారం చేస్తూనే ఎలాటి పిడివాదాలకూ లోనవకుండా విశాల భావనలను కాపాడుతుంది. విలువలకు విలువ నిస్తుంది.

II

కవులు ప్రపంచానికి అనధికార శాసనకర్తలు అని షెల్లీ అన్నది హోదాగా గాక బాధ్యత అన్న అర్థంలోనే. తెలుగు కవులు,రచయితలు ఈ విధమైన సామాజిక చైతన్యం అనేక సార్లు చాటుకున్నారు. సెప్టెంబరు 11 ఘటనల అనంతర కాలంలోనూ, ఇటీవల గుజరాత్ మారణహోమం తర్వాతనూ వ్యక్తమైన స్పందనే ఇందుకు ఒక నిదర్శనం. వ్యాపార పత్రికలు ఇచ్చే కొద్దిపాటి అవకాశంలోనే ఔత్సాహిక రచయితలు, కవులు తమ స్వరాలు వినిపిస్తున్నారు. ప్రజాకళాకారుల సహకారంతో పాలకులు దుర్నీతిని ఎండగడుతూనే

వున్నారు. ఈ సాహితీ సృష్టి సాధారణంగా వూహించగలిగిన దానికన్నా చాలా ఎక్కువ రెట్లు వుందనేది వాస్తవం. నగరాలు, పెద్దపట్టణాలలోనే కాదు, మారుమూల ప్రాంతాలలో కూడా విరివిగాసాహిత్య సభలు జరుగుతున్నాయి. ఈ కొత్త గొంతులకు, ప్రాంతాలకూ కూడా ప్రాతినిధ్యం కల్పించడం, ప్రచురణావకాశం ఇవ్వడం ప్రస్థానం మరో లక్ష్యం.

సాహిత్యాన్ని ప్రచారం కోసం ఉపయోగించరాదని వాదించే వారు ఎప్పుడూ వుంటూనే వున్నారు. ప్రజలకు మేలు చేసే ప్రచారమా కీడు చేసేదా అనే విచక్షణ లేకుండా ఈ చర్చ జరపడం అర్థరహితం. సాహిత్యానికున్న అనేక కర్తవ్యాలలో నిస్సందేహంగా ప్రచారం కూడా ఒకటి.అయితే ప్రచారమే సాహిత్యం పని కాదు. ప్రచారం కోసం రాసేదంతా సాహిత్యమూ కాదు. సందర్భం, విషయం, లోతు అన్నిటినిబట్టి అది గౌరవం పొందుతుంది. ప్రజలందరికి సంబంధించిన ప్రయోజనకరమైన అంశాలను నిస్వార్థంగా రాసే వారు రచయితలు కానట్టూ స్వంత గోడు వినిపించేవారే అసలైన అక్షర పుత్రులైనట్టు ఎవరైనా భావిస్తే అంతకన్నా హాస్యాస్పదమైన సంగతి వుండదు.

నాడూ నేడూ కూడా కాలానుగుణమైన పద్ధతులలో పత్రికలు సాహిత్యానికి సేవ చేస్తున్నాయి. అదే సమయంలో కొన్ని దుష్ప్రభావాలకు,అవాంఛనీయమైన సంచలనాలకు కూడా అవి కారణమవుతున్నాయి. సాహిత్య విలువలు ప్రచురణలో లభించే ప్రచారాన్ని బట్టి నిర్ణయమవుతాయనే ఒక దుర్భ్రమ ప్రబలింది. సాహిత్యం ప్రచారానికి కాదని అనేవారే లబించే ప్రచారాన్ని బట్టి విలువలు అంచనా వేయడం ఈ వ్యవస్థ తాలూకు వైపరీత్యాలలో ఒకటి. మహా రచయితలు కూడా మొదట పత్రికలలో పెద్ద ప్రాముఖ్యత పొందలేదని, ప్రజలు గుర్తించిన తర్వాతనే వారికి ప్రాధాన్యత పెరిగిందని గుర్తు చేసుకుంటే పత్రికా ప్రాపకం ప్రధానమనుకునే పొరబాటు భావన పోతుంది. సోదర రచయితలు కవులను గురించిన అభిప్రాయాలు దురభిప్రాయాలలో నూటికి తొంభై వంతులు ఈ కారణంగా ఏర్పడుతున్నవే. ఆఖరుకు పరమ జుగుప్సాకరంగా రచయిత్రులపై దాడి చేయడంలోనూ ఈ దుష్ప్రభావం కనపడుతుంది. నిజమైన సాహిత్య జీవులు ఈ వలయం నుంచి బయటకు రావాలి. ఇది మనం కూలగొట్టాలనుకుంటున్న వ్యాపార వ్యవస్థ తాలూకు వికృత ప్రభావమేనని గ్రహించాలి.

ఈ నాటి కాలంలో పుస్తక ప్రచురణ ఒక విధమైన ప్రహసనంగా సాగుతుందంటే ఎవరూ తప్పు పట్టనవసరం లేదు. శ్రీశ్రీ మహాప్రస్థాన గీతాలు సర్వత్రా మార్మోగుతున్న తర్వాత కూడా పుస్తక రూపంలో రావడానికి పదేళ్ళపైనే పట్టింది. ఆ పరిస్థితి ఇప్పుడు లేకపోవడం మంచి పరిణామమే. రచయితలు కొందరి ఆర్థిక స్తోమతలో, ఆలోచనల్లో వచ్చిన మార్పు ఇందుకు ప్రధాన కారణం. వేల రూపాయలు వెచ్చించి, బోలెడు వ్యయంతో ఆవిష్కరణ సభలు జరిపి,'అట్ట'హాసంతో పుస్తకాలు ప్రకటించిన తర్వాత అవి పాఠకులకు ఏ మేరకు చేరుతున్నాయని పరిశీలిస్తే నిరుత్సాహమే మిగులుతుంది. ఏ సాహిత్య సంస్థ దగ్గర చూసినా వందల సంఖ్యలో రచయితలు, కవుల చిరునామా లుంటాయి. విద్యా సంస్థలలో వందలాది మంది సాహిత్య విభాగాల వారుంటారు. వీరు గాక పరిణత పాఠకులు కూడా పెద్ద సంఖ్యలో వుంటారు. అయినా ప్రచురించే 500 కాపీలలో చాలా భాగం అలాగే వుండి పోతున్నాయంటే వీరు కూడా సాహిత్య గ్రంథాలను ఆదరించడం లేదని అర్థం కదూ? ఎవరికీ సాహిత్యం మీద ఆసక్తి లేదని, అభిరుచి లేదని నిర్వేదానికి లోనయ్యే రచయితలు పరస్పర ప్రోత్సాహం అవసరాన్ని గుర్తించడంలేదు. ఏ కొన్ని మినహాయింపులో తప్పిస్తే సాహిత్య బృందాల పాత్ర తక్కువగానే వుంది.

III

కెరీరిజం సాహిత్య రంగంలో చొరబడటం గురించిన ఆవేదన చాలా మందిలో కనిపిస్తుంటుంది. ఈ వ్యవస్థలో అలాటి అవలక్షణా లెప్పుడూ వుంటాయి. సాహిత్యం ఒక్కటే కెరీర్‌ను పెంచే స్థితి ప్రస్తుతం లేదు. దాన్ని ఇతరత్రా ఉపయోగించుకుని ప్రయోజనాలు పొందడం వేరేవిషయం. కాని ఎవరో అలా చేస్తున్నారంటూ ఎప్పుడూ అదే ప్రధానాంశంగా తీసుకుని సాహిత్య విమర్శనను దారి తప్పించడం సరైంది కాదు. సామాజిక బృందాల ప్రతిస్పందనలను సాహిత్యంలో ప్రతిబింబించడం చాలా ప్రధానమే కాని అదే ఏకైక సూత్రంగా తీసుకుని పట్టువిడుపులు లేని శిబిరాలుగా విభజించుకోవడం నష్టదాయకమైన విషయం. కులం, ప్రాంతం, జెండర్ ఏ ప్రాతిపదికనైనా సరే సాహిత్య చర్చలో సహనం సంయమనం కోల్పోవడం బాధాకరం. కాగా అసహనం అసభ్యతగానూ మారి ఇటీవల రాజధానిలో ఎదురైన పరిస్థితి లాటివి ఇంకా దుర్భరమైనవి. సాహిత్యానికి సమాజానికి వ్యక్తికి వుండాల్సిన సంబంధాన్ని సవ్యంగా అర్థం చేసుకుంటే ఈ సమస్యలలో చాలా వాటికి ఆస్కారమే వుండదు. కొకు అన్నట్టు రచయిత తనను సమాజం గుర్తించాలని

కోరుకోవడంలో తప్పు లేదు. కాని అంతకుముందు తాను సమాజాన్ని గుర్తిస్తున్నానా అని ప్రశ్నించుకోవాలి. అలా గుర్తించేట్టయితే సామాజిక పురోగమనానికి సమైక్యతకు ఏది దోహదపడుతుందో అర్థం చేసుకోవాలి. ప్రజా శత్రువులపై చేసే పోరాటానికీ సాహిత్యంలో భిన్నాభిప్రాయాలకూ మధ్య తేడాను చూడాలి. యోగ్యతాపత్రంలో చలం అన్నట్టు కవి మరో కవి గురించి సదభిప్రాయం వెలిబుచ్చడం జరగదనే స్థితి నుంచి బయటపడాలి. అభివృద్ధి నిరోధకత్వం, అరాచకత్వం మినహా మిగిలిన అన్ని ప్రగతిశీల ధోరణులనూ కలుపుకుపోవాలనే అవగాహన కావాలి. సాహిత్య సంఘాలు కూడా ఎప్పుడు ఏ నేపథ్యంలో ఏర్పడివున్నా చారిత్రిక అనుభవాలను సమీక్షించుకుని తదనుగుణంగా వ్యవహరించాలి. విశాల జనబాహుళ్యమే కాదు, వాస్తవానికి సాహిత్యాభిమానులలో కూడా చాలా భాగం తమ పరిధికి వెలుపలే వున్నారనే పరమ సత్యాన్ని గుర్తించాలి. ప్రగతి శీల భావాలు గలవారైనా ఏ సంస్థతో సంబంధంలేని మేధావులు కూడా గణనీయ సంఖ్యలో వున్నారు. నేటి పరుగు పందెపు పద్మవ్యూహంలో చిక్కిన యువత కూడా తెలియకుండానే కవిత్వం, కథల పట్ల ఆకర్షితులవుతున్నారు.. ఈ నవ కవుల సృజన సామర్థ్యానికి పదును పెట్టడం, వారిని వైయక్తిక వేదనల నుంచి సామూహిక చింతన వైపు నడిపించడం కూడా నేటి సాహిత్య కర్తవ్యాలలో ఒకటి. ఇలాటి నూతన దృక్పథమే లేకపోతే కొత్త తరాన్ని ప్రయోజనాత్మక సాహిత్యం వైపు ఆకర్షించడం సాధ్యపడదు. ప్రమాదకరంగా ముంచుకొస్తున్న ప్రపంచీకరణను ప్రతిఘటించాలంటే సాంకేతిక నైపుణ్యమూ వుండాలి. ఈ అంశాలన్నీ గమనంలో వుంచుకుని ప్రస్థానం నడుస్తుంది.

IV

తెలుగు సాహిత్యంతో పాటు భారతీయ భాషలలో వెలువడుతున్న సమకాలీన సాహిత్యాన్ని, దాంతో పాటే అంతర్జాతీయ సాహిత్య ధోరణులను కూడా ఎప్పటికప్పుడు పరిచయం చేయడానికి పరామర్శించడానికి ప్రస్థానం ప్రయత్నిస్తుంది. జిల్లాల్లో జరిగే సాహిత్య కార్యక్రమాల సంక్షిప్త సమాచారాన్ని అందిస్తుంది. నూతనత్వానికి ప్రాధానత్య నిస్తూనే గతంలో వెలువడిన విలువైన అధ్యయనాలను, రచనలను పాఠకులకు అందించడానికి కృషి చేస్తుంది.కవిత్వంతో పాటు ప్రజా గీతాలకూ చోటుంటుంది. స్థానికంగా జరిగే సాహిత్యసభలలో వక్తలు చేసే మంచి ప్రసంగాలను, ప్రముఖుల ఇంటర్వ్యూలను జాగ్రత్తగా రాసి పంపితే ప్రచురించే అవకాశముంటుంది. వివిధ విషయాలపై కవులు, రచయితలు, పాఠకులు తమ రచనలు, అభిప్రాయాలను పంపితే తగు శీర్షికలో ప్రచురిస్తుంది.

ఈ పత్రిక రూపకల్పనలోనూ పాఠకులకు భాగస్వామ్యం వుండాలనే ఉద్దేశంతో అనుకున్నవన్నీ ప్రవేశపెట్టలేదు,ప్రకటించడమూ లేదు. ఈ ప్రారంభ సంచిక చూసిన తర్వాత మీరు పంపే సూచనలు, సలహాలతో మెరుగుపరుచుకోవడానికి ప్రయత్నం జరుగుతుంది. అప్పుడు ఇంకో సారి ఈ అంశాలు సవివరంగా చెప్పుకోవచ్చు.

ఈ నాటి ధరవరలను దృష్టిలో వుంచుకుని పత్రిక రేటు చూస్తే అందరికి అందుబాటులో వుంచాలనే మా సంకల్పాన్ని అర్థం చేసుకోవచ్చు. ఇలాటి పత్రికలు నాలుగు కాలాలు నడవాలంటే కావలసింది సాహిత్యాభిమానుల అండదండలే. అందుకే మీరు తెప్పించుకోవడంతో పాటు మీ సాహితీ మిత్రులను కూడా చందాదారులుగా చేర్పించాలి. విశాల ప్రాతిపదికపై నడవనున్న ఈ పత్రికను సాహితీ సంస్థలన్ని తమదిగా స్వీకరించి ప్రోత్సహించాలి. సమాజ పురోగమనంలో, చైతన్య వ్యాప్తిలో సాహిత్యం పాత్ర తెలిసిన రాజకీయ కార్యకర్తలూ దీని ప్రాధాన్యత గుర్తించి ముందుకు నడిపించాలి. గ్రంథాలయాలకు, విద్యాలయాలకు, సంఘాలు యూనియన్ల కార్యలయాలకు తెప్పించాలి.సాహిత్యాభిమానులైన బంధుమిత్రులకు దీన్ని కానుకగా పంపించాలి.శక్తిని బట్టి రచయితలు,ప్రచురణ సంస్థలు బుక్ యాడ్స్ ఇచ్చి సహకరించాలి. ఇదంతా కేవలం ఆర్థిక ప్రయోజనం కోసమే కాదు, సమిష్టి కృషికి ఒక మార్గం.ఈ విధంగా మీ నుంచి సహకారం లభిస్తే ప్రస్తుతానికి త్రైమాస పత్రికగా ప్రారంభమవుతున్న ప్రస్థానం అనతి కాలంలో మరింత వేగంగా పురోగమిస్తుంది.

ఏమైనా దేశంలో పెచ్చరిల్లిన మతోన్మాదం ప్రజల సహజీవన సంప్రదాయాలను సర్వనాశనం చేస్తోంది. ప్రపంచీకరణ ప్రతిరంగంలోకి చొరబడి మన జీవితాలను తలకిందులు చేస్తున్న పరిస్థితులలో సాహిత్య సాంస్కృతిక రంగాలు మరీ కలుషితమవుతున్న నేపథ్యంలో సాహిత్య రంగంలో కర్తవ్యాలు నిజంగానే బృహత్తరమైనవి. ఆ దిశలో సాగే మహాప్రస్థానంలో భాగమే ఈ ప్రస్థానం.

దీనికి స్వాగతం పలకవలసినవారు మీరు. సహకరించి సహాయపడవలసినవారూ మీరే. మీకివే మా అక్షరాభినందనలు.


V

కథ

వి. ప్రతిమ

# సర్పదోషం

“ఏం దబ్బా... ఈ ఏండ...” విసుగ్గా ఆవులింతని పూర్తి కానివ్వకుండానే ఆవు కున్నాడు నారాయణ.... “దేవుడి మీద నమ్మకమే పోయేట్టుగా వుండాది” ....అప్పటికి ఎన్నిసార్లు ఆవులించాడో తెలీదుగానీ, యిలా అనుకోవడం మాత్రం యిరవ య్యోసారి... కంప్యూటర్ గ్రాఫిక్స్‌లా కిరణాల్ని కదిలిస్తూ చురుక్కుమన్పిస్తోన్న ఎండనీ, అప్పటి తన అవస్థనీ తెగ తిట్టుకుంటూ భార్యకేసి చూశాడతడు....




దూరంగా వున్న మండపంలోని నీడలో కూర్చుని, యెంతకీ కదలని ‘క్యూ’నీ, అందులో నిలబడి తకబికలాడుతోన్న భర్తనీ జాలిగా గమనిస్తోంది రుక్మిణమ్మ....


“ఎందుకొచ్చిన బాధ యిదంతా?... పుట్టిన్నాటినుండీ మనకి దోషాలే లేకుండా వున్నాయయా?.. అప్పుడంతా గడిచిపోలా.... ఇప్పుడు కొత్తగా సర్పదోషమేంది?... నాగదోషమేంది?... నా తలకాయ దోషం... పొద్దన్లేస్తే మట్టిపిసుక్కుంటూ... బర్రెలు తోలుకుంటూ, పేడెత్తుకుంటూ పని, పని... అని పన్లోబడి దొర్లేవాళ్ళకి ఈ పూజలెందుకు?... పునస్కారాలెందుకు?... ఎవురేది చెప్తే అది నమ్మేసేదే!” .. భర్త అమాయకత్వానికి లోలోపల విసుక్కుంటూ ఉన్నచోటనే పక్కకి జరిగి కూర్చుంది రుక్మిణమ్మ... గుళ్ళో ఏ మూల ఏ విగ్రహాల్ని కడుగుతున్నారోగానీ ఆ నీళ్ళన్నీ మండపం మీదుగా వచ్చి కాళ్ళని తడుపుతున్నాయి....

అప్పటి దాకా ఆ నీళ్ళల్లో తప, తప మంటూ ఆడుకుంటున్న అయిదారేళ్ళ పిల్లాడొకడు హడావిడిగా వచ్చి కొబ్బరి పెట్టమని తల్లిని వేధిస్తున్నాడు.... “ఏమోఁ చూడాల ఇప్పటికయినా మన పరిస్థితి బాగుపడతాదేమో” -భర్తతో మాట్లాడుతూనే ఆ తల్లి కొబ్బరిచిప్ప నేలకేసి కొట్టబోయి చేతిని కొట్టుకుంది. చీలిన కొబ్బరి చిప్పలో యిరుక్కు పోయిన ఆమె అరిచేతి చర్మం నుండి రక్తం కారుతోంది....

నవ్వొచ్చింది రుక్మిణమ్మకు.

ఇట్టాటి యన్నీ యెన్ని జూళ్ళేదు బతుకులో.... దోషాలూ, దొమ్మలూ సుట్టి, సుట్టి అయిపోయిందంతా... అంకమ్మ... అంకమ్మ అని నమ్ముకుంటినా?... చెంగాళమ్మ చుట్టూ తిరిగితినా... పోలేరమ్మకి పొట్టేలుతో పొంగలి పెడితినా... కావమ్మ తిరణాళ్ళకి నిప్పులగుండం తొక్కితినా? కనుపూరు జాతర్లో మొక్కితినా?... కాలినడకన తిరపతి కొండెక్కితినా? ఏ అమ్మా, ఏ అయ్యా దేనికీ అడ్డుపడనే లేదు... జరిగేది జరిగి పోతానే వుండాది... ఏదీ ఆగల్యా. అప్పట్నుంచే యిహన మనకి ఏ దేవుళ్ళూ, దెయ్యాలూ అడ్డుపడరని అర్థమయిపోయింది తనకి... పని.... పని.... తన పనేమొ, తనేమొ....

లేకుంటే లోకానికి కొడుకులేమయినా కొత్తా?... వోళ్ళకి రెక్కలొచ్చేది కొత్తా.... ఈ దినాల్లో ఎవురి బతుకులోళ్ళవి.... కన్నందుకు పెద్ద చేసి, చదువు చెప్పించాల... వయసొస్తే ఒక పిల్లన్చూసి పెళ్ళి చెయ్యాల... అవతల వోళ్ళ బతుకులోళ్ళవి... అంతే మన బాద్దిత... అవతల వోడి పెళ్ళాం, వోడి పిలకాయలు... వోడి సంసారం... కాటికి కాళ్ళు చాచుకుని కూచోని మనల్ని చూళ్ళేదంటే ఎట్టా?.... అదేవంటే మనుమంతా జూళ్ళేదా పెద్దోళ్ళని అంటాడు... అదంతా ఒక కాలం. ముందు మాదిరిగా వుండాయా యిప్పుడు దినాలు?... అంతా పరుగులు బాధలుగా వుండాది.. పల్లెల్లో మాదిరుంటాయా పట్నాల్లో.... ఆ బ్రెమ్మంగారు చెప్పినట్టు మంచినీళ్ళు గూడ డబ్బులిచ్చి కొనుక్కోవల్సిందే... చాలీ చాలని బతుకులు... ఎంతసేవయినా బొయి కొడుకింట్లో వుండాలంటాడు... మగ మనిషికేం దెలస్తాది... కోడలు పొమ్మనకుండానే పొగబెట్టేస్తాది... అయిమ్మికీ అనుకునేదానికిల్యా. అట్టుండాయి బాధలు...



మా బాబుకి నేపాడే లాలిపాటా లోకాలకన్నిటికీ జోలపాటా... ఎప్పుటెప్పుటివో జ్ఞాపకాలు మనసుని పిండి పిండి గుండెల్లో చెమరు... కళ్ళుమూసుకుంది రుక్మిణమ్మ... కళ్ళల్లో పొరలా పరుచుకున్న నీటి బొట్టు రెప్పలతాకిడికి చలించి కొలకుల్లోనుండి పక్కకి జారి వీడ్కోలు పలుకుతోంది... గొప్ప తత్త్వవేత్తలా నిర్లిప్తంగా కూర్చుంది రుక్మిణమ్మ...

"ఇంకలెయి... రావుకాలానికింక పది నిముషాలే వుండాది... టిక్కెట్టు మూడొందలంట... ఒక టిక్కెట్టు మీద యిద్దర్నే పంపిస్తారంట. పద్మయ్యకి వేరే ముప్పయి రూపాయల టిక్కెట్టు కొన్నా..." తప్పు చేసిన వాడిలా జంకుతూ రుక్మిణమ్మ కేసి చూశాడు నారాయణ...

రోట్లో తలదూర్చి రోకటిపోటుకి వెరవడమేమిటన్నట్లు భారంగా నిట్టూర్చింది రుక్మిణమ్మ... ఇద్దరూ కలిసి రెండడుగులు వేశారు పద్మయ్యకేసి... ఇంతలో అక్కడున్న పూలంగడివాళ్ళు కాకుల్లా నారాయణనీ రుక్మిణమ్మనీ చుట్టుముట్టేశారు...

"రండి... రండి. సర్పదోషం పూజకి ఈ పూలన్నీ కూడా కావాల. లోపలడగతారు.."

"ఏం పూలయ్యా?" విసుక్కుంది రుక్మిణమ్మ.

"అమ్మా, తుమ్మిపూలు స్వామివారి కిష్టం... నాగమల్లి పూలు సర్పదోషానికి... మీకు తెలీందేముంది- బిల్వపత్రాలు స్వామివారికి ప్రీతిపాత్రాలు..." అదరగొట్టేశారు... ఈ మాటలు టేప్ చేసిపెట్టిన వాటిలా వాడివాడి అరిగిపోయి వున్నాయి...

తమ దొడ్లో విపరీతంగా పూసి వాడిపోయే తుమ్మిపూలు అరపిడికెడు ఒక ఆకులో చుట్టి పది రూపాయలన్నాడు... నాలుగు నాగమల్లి పూలు ఇరవయి రూపాయలంట... మూడు తామరపూలు పాతిక... ఇన్ని మారేడు దళాలు ఒక సరిక్కాయితంలో పోసి పదిరూపాయలన్నాడు... ఇవన్నీ కొని తీసికెళ్ళకపోతే లోపల పూజార్లు పూజ చేయరన్నాడు... రుక్మిణమ్మ నారాయణకేసి చూసింది. ఇంకా నడివయసు వీడని నారాయణ ముఖంలో యివ్వాళ్టి వుదయం నుండీ రెండు ముడతలు ఎక్కువయినట్లన్పించింది... గతంలో రెండు మూడు మాత్రమే కన్పించే తెల్లవెంట్రుకలు యిప్పుడు నాలుగయిదు తయారయ్యాయి...

చచ్చినట్లు పూలన్నీ కొని సర్పదోషం తాలూకు కవర్లో వేసుకుని, హడావిడిగా సర్పదోషం పూజ జరిపించే హాలువైపుకి పరిగెత్తినట్టుగా నడిచారు... అసలే ఓజోన్ పొర చిట్లిన ఎండ... ఆ విశాలమైన ఆలయప్రాంగణంలో పరిచిన రాతిబండల మీద అరికాళ్ళు అంటుకుపోతున్నాయి... అప్పటికే అక్కడికి చేరుకున్న పద్మయ్య-

"రండి...రండి..." తొందరపెడుతూ నారాయణ చేతిలో నుండి టిక్కెట్లందుకుని ద్వారం వద్దనున్న వ్యక్తికందించి లోపలికి తీసుకెళ్ళాడు...

ఆ సువిశాలమైన మండపంలో అప్పటికే ఆనిపోయి వున్నారు భక్తులు... భోజనాల బంతికి కూర్చున్నట్లు వరుసలు, వరుసలుగా బారులు తీరి కూర్చుని వున్నారు... అంతా బాగా డబ్బున్న వాళ్ళలా కన్పిస్తున్నారు... ఇంతమందికి ఒకేసారి సర్పదోషమెందుకొచ్చిందో అర్థం కాలేదు రుక్మిణమ్మకు.

ఆ హాల్లో ప్రవేశించి దాదాపు చివరగా కూర్చున్నారు రుక్మిణమ్మా, నారాయణా... వారి వెనుక పద్మయ్యా... అప్పటికింకా రాహుకాలం రావడానికి అయిదు నిముషాలుంది...


కూర్చుని సర్దుకుని కళ్ళు మూసుకుని శివధ్యానం చేయసాగాడు నారాయణ... ధ్యానం చేస్తున్నాడో, కారిపోతున్న చెమటని తిట్టుకుంటున్నాడో అర్థం కావడంలేదు... ఆ హాలుకి తూర్పు మూలగా వున్న చిన్న వేదిక మీద శివలింగమూ, దాని ఎదురుగా వెలుగుతోన్న యిత్తడి దీపపు సెమ్మే... ఆ దీపపు కాంతిలో మెరుస్తోన్న శివుడి మూడో కన్నూ.. ఆ వేదిక పక్కనే నిల్చుని భక్తులందరినీ సావధానంగా పరికిస్తోన్న ఒక ముసలి పూజారీ...

ఆ హాలునంతటినీ ఒకసారి కలియజూసింది రుక్మిణమ్మ...

ధ్యానం చేసుకుంటున్న భర్తనీ, యింకా దోష నివారణకై విచ్చేసిన అశేష జనావళినీ జాలిగా చూస్తోందామె... ఆ భక్తుల్లో ఒక రాజకీయ నాయకుడున్నట్టుంది... అతడి వెనుక చాలా హంగామా వుంది...

మూసిన భర్త కళ్ళ వెనుకనున్న ఆలోచనల పరంపరని అంచనా వేయడానికి ప్రయత్నిస్తోందామె... ఏం మొక్కుతున్నాడితడు? తమిద్దరినీ తొందరగా ఒడ్డున పడేయమనా?... ఊహూఁ- ఒడ్డున పడేసేదానికయితే ఈ పూజలూ, పునస్కారాలూ, దోష నివారణలూ ఎందుకంట?... అయితే ఏం మొక్కుతున్నాడు? తిరపతిలో కాపురముండే కొడుకింటికి చేర్చమనా? ఊహూఁ- అయ్యుండదు... మరేంది?... ఆఁ- యాపారం గురించే అయ్యుంటాది... ప్చ్- యిట్టనే యవసాయం చేసుకుంటాపోతే ఆ రెండెకరాలుకూడా మిగిలేట్టుగా లేదు... అందుకే దాన్ని తెగనమ్మి అప్పులు దీర్చి, మిగిలిందాంతో ఏదయినా యాపారం చేయాలనుకుంటుండాడు...

పుట్టిన్నాటి నుండీ మట్టి పిసుక్కుంటూ బతికిన మనిషికి యాపారంలో ఒడుపులేం తెలుస్తాయని... తరతరాల్నుండీ తమకింత తిండి పెట్టిన నేలని అమ్ముకోడానికతడికి మనసొప్పడం లేదు... రెండు విధాలుగా ఏం చెయ్యాలో తెలీక కొట్టుమిట్టాడుతున్నాడు. ఆ బాధ చూళ్ళేక పద్మయ్య చెప్పాడు... సర్పదోషం పూజ చేయిస్తే అన్ని దోషాలూ బాధలూ తీరి వ్యాపారంలో బాగా కలిసొస్తాదని... వ్యాధొచ్చినోడూ, బాధొచ్చినోడూ ఒకటేగదా!...



''హూ!'' దీర్ఘంగా నిట్టూర్చింది రుక్మిణమ్మ భర్తవంక చూస్తూ...

అప్పటికి మైకు సవరించబడింది...

ధ్యానాల్లోనూ, మాటల్లోనూ నిమగ్నమై వున్న భక్తులు అంతా సర్దుకు కూర్చున్నారు...

"శుక్లాంబరధరం... విష్ణుం... శశివర్ణం"

వినాయకుడ్ని ఆవాహన చేస్తూ పూజ మొదలు పెడుతున్నాడు పూజారి. అందరు భక్తులూ గొణిగినట్లుగా అతడితో గొంతులు కలిపారు. శ్లోకం పూర్తయ్యాక పూజారి గొంతు సవరించుకుని చెప్పాడు:

"ఎల్లారుమే కవర్లో యిరుద రెండు తేంగా ఎడ్తి పక్కత్తిలో వెయ్యింగు... ఒణ్ణు సామికి... రెండావదు అమ్మణ్ణికి"

"అంతా మీ మీ కవర్లలో వున్న కొబ్బరి కాయల్లో రెండు తీసి పక్కన పెట్టండి... ఒకటి స్వామివారికి, రెండోది అమ్మణ్ణికి" చెప్పాడు పూజారి- ఒకసారి తమిళంలోనూ, రెండోసారి అచ్చతెలుగులోనూ...

శ్రీకాళహస్తి దేవాలయం ఆంధ్రదేశానికి చెందిందే అయినా ఉన్నది తమిళనాడు సరిహద్దుల్లో కావడంతో తమిళులు కూడా విరివిగా సర్పదోష పూజకి వస్తుంటారు. అందుకే యిరువురికీ అర్థమయ్యేలా రెండు భాషల్లో మైకుని అదరగొట్టేస్తున్నాడు పూజారి... పూజారి కేసి నిశితంగా చూసింది రుక్మిణమ్మ... లావుగా, నల్లగా, ఎత్తికట్టిన మాసిన తెల్లపంచెతో, పొట్ట ముందుకొచ్చి, తెల్లటి ఎత్తుపళ్ళతో, నాలుగు రోజుల్నాటి నలుపు, తెలుపు కలగలపిన గడ్డంతో చేసిపెట్టిన నల్లరాతి విగ్రహంలా వున్నాడతడు. గొంతు కూడా బండగా వుంది. ఏం చేప్తున్నాడో అర్థమై ఛావడంలేదు.

భక్తులంతా ప్లాస్టిక్ కవర్లు చప్పుడయ్యేలా అందులోని పూజా సామగ్రి తీసి బయటపెట్టి... పూజారి చెప్పినట్లు చేయడానికి హడావిడి పడుతున్నారు... అర్థంకానివాళ్ళు పక్కవాళ్ళని గమనిస్తున్నారు.

అప్పటికే నారాయణ కవర్లో వున్న ఎరుపు, నలుపు రంగు గుడ్డముక్కల్ని కిందపరిచి. పూజారి చెప్పిన నల్లధాన్యం, తెల్లధాన్యం పొట్లాలని రెండింటిమీదా కుమ్మరించాడు... ఒక్కతల నాగేంద్రుడ్నీ అయిదుతలల నాగేంద్రుడ్నీ పూజారి చెప్పినట్లుగానే విడివిడిగా తెల్లధాన్యం మీదొకటి, నల్లధాన్యం మీదొకటి వుంచాడు,... వెనక నుండి పద్మయ్య సూచనలు తీసుకుంటూ రుక్మిణమ్మ తాను ఊరికే కూర్చోవడం బాగోదన్నట్లు, ఆ పూజా సామగ్రి పొట్లాలన్నింటినీ ఒక్కొక్కటీ విప్పి పక్కన పెడ్తోంది...

''నాగపడిగ తలలు మీవైపు వుండేట్లుగా చూసుకోండి'' అరిచింది మైకు... ''ఇప్పుడు వాటికి పసుపూ, కుంకుమా పెట్టండి''

''రెండు నాగంకు మంజల్, కుంకుం వెయ్యింగు''

అరవ భక్తులూ, తెలుగు భక్తులూ కూడ పూజారి చెప్పినట్లే చేశారు...

"అగరొత్తులు కూడా వెలిగించి పెట్టు" పక్కవాళ్ళ నడిగి అగ్గిపెట్టె తీసి అందించాడు పద్మయ్య నారాయణకి... పద్మయ్య నారాయణకి చిన్ననాటి స్నేహితుడు... పండిత పుత్రుడు... తాత కవిత్వం వ్రాశాడంట... తండ్రి జ్యోతిష్యం చెప్పేవాడు... ఆ పాత వాసనలతోనే యితడు పదిమందికీ మంచీ, చెడూ చెప్తూ ఊళ్ళో పేరు తెచ్చుకున్నాడు.

నారాయణ ఏం వ్యాపారం చేయాలో అర్థంకాక, ఎప్పుడు మొదలు పెట్టాలో తెలీక పద్మయ్య వద్దకు మంచిరోజు చూడమని వెళ్ళినపుడు ఈ సర్పదోషపూజ చేయిస్తే అంతా సరిపడిపోతుందని స్నేహితుడ్ని దగ్గరుండి శ్రీకాళహస్తి గుడికి తీసుకొచ్చాడు పద్మయ్య...

మైకు బిగ్గరగా స్వామివారి అష్టోత్తరాన్ని పఠిస్తోంది.

భక్తులంతా కూడ ఏదో గొణుగుతూ, మంత్రాలు వల్లిస్తూ తుమ్మిపూలు చేతిలోకి తీసుకుని ఒక్కొక్కటీ నాగపడిగలమీదికి జారవిడుస్తున్నారు... రుక్మిణమ్మ కూడా ఏంతోచక నాగమల్లి పూలని అందంగా రెండు వెండి నాగపడిగల చుట్టూ అలంకరించింది.

ఏవేవో రెండు అష్టోత్తరాలు చదివి ఎట్టకేలకు పూజని పూర్తి చేశాడు పూజారి... రెండు భాషల్లోనూ భక్తులకేవో సూచనలు చేస్తున్నాడు...


రుక్మిణమ్మ యాధాలాపంగా తమ ఎదురుగా కూర్చుని వున్న జంటకేసి చూసింది... అతడెంతో విసుగ్గా పెట్టాడు ముఖం... బలవంతపు మాఘస్నానంలా తామర పూరేకుల్ని నాగపడిగల మీదికి విసుర్తున్నాడు విసుగ్గా... ఆమె భర్తవంక భయంగానూ, భగవంతుడి వంక భక్తితోనూ చూస్తూ ఏకసమయంలో రెండు పాత్రలు నిర్వహిస్తోంది.

"భక్తులంతా ఆ పడమర మూలకి వెళ్ళి టెంకాయల్ని కొట్టి తీసుకొచ్చి పెట్టండి..." మైకు బొంగురుగా అరవడంతో భక్తులంతా బిల బిలా లేచి వెళ్ళి తప తప మంటూ టెంకాయలు కొట్టారు... నారాయణ కూడా కొబ్బరికాయ పట్టుకుని లేచి వెళ్ళాడు. ఎదురుగా కూర్చున్న కౌశిక సమ్రాట్ మాత్రం లేచి వెళ్ళలేదు... అతడి భార్యే లేచి వెళ్ళి కొబ్బరికాయ కొట్టి తెచ్చి, పూజ చేసిన నాగపడిగల ముందు పెట్టింది...

ఇంతలో హారతి కర్పూరం వెలుగుతూ భక్తులందరినీ దాటుకుంటూ వస్తోంది...

"అంతా నాగదేవతకి హారతిచ్చి దణ్ణం పెట్టుకోండి."

భక్తులంతా శ్రద్ధగా మాస్టారికి భయపడే బడిపిల్లల్లా పూజారి చెప్పినట్లే చేస్తున్నారు... ఈలోపుగా పూజారి భక్తులందరి తరపునా భగవంతుడికి మనవి చేస్తూ దీవెనలందిస్తున్నాడు. "శివా! వీళ్ళందరికీ వాళ్ళ వాళ్ళ కార్యసిద్ధి కోసం తోడ్పడు... ఇక్కడికి విచ్చేసిన భక్తుల్లో పిల్లల్లేని వారికోసం పిల్లల్నీ, పెళ్ళికానివారికి పెళ్ళినీ, విద్యార్జన కోసం వచ్చిన వారినీ, కొత్తగా వ్యాపారం మొదలు పెట్టాలనుకుంటున్న వారినీ, ఇప్పటికే వ్యాపారాలు చేస్తున్నవారినీ అందరికీ కూడా దయచూపు... వాళ్ళు కోరిన కోరికలు తీర్చి కరుణించు శివా..." అంటూ మళ్ళీ యివే వాక్యాల్ని తమిళంలో నివేదిస్తున్నాడా సర్వాంతర్యామికి... ఒక్క భాషలో చెప్తే అర్థంకాదేమో ఆయనకి... లేక ఏయే భక్తులకు ఏమేం వరాలివ్వాలో చెప్తేనే కానీ తెలీదా? ఏందో... బాబాలూ... అవధూతలంటే మనుషులు కాబట్టి డబ్బులు గుంజుతుండారనుకుంటే, ఈ దేవాలయంలో కూడా... అంతా డబ్బుమయమైపోయింది...



అందరూ శ్రద్ధగా దణ్ణాలు పెట్టడం పూర్తయ్యాక... పూజారి గొంతు మళ్ళీ ఖంగుమంది... ఈసారి అతడు మైకునుపయోగించకుండా నమ్రత నిండిన స్వరంతో గట్టిగా చెప్తున్నాడు.. మైక్రోఫోనుకంటే స్పష్టంగా వుందతడిగొంతు.

''ఇప్పుడు అయ్యవారు మీ అందరి వద్ద కూ ఆశీర్వదించడానికి వస్తాడు... భక్తులంతా ముప్పయ్యొక్క రూపాయలు పూజ చేసినందుకు దక్షిణగా యివ్వండి... పూజార్లకు భోజనాది కాలకోసం బియ్యమూ, పప్పులూ, ఉప్పులూ ప్రత్యేకంగా మీరు తీసుకురాలేదు కాబట్టి ముప్పయి ఒక్క రూపాయలూ, అంతకు మించి వారి వారి యిష్టంతో దక్షిణలూ సమర్పించుకోవలసిందిగా కోరుతున్నాము..."

అదే విషయాన్ని మళ్ళీ తమిళ భక్తులకు వివరిస్తున్నాడు.

రుక్మిణమ్మకి చెడ్డ చిరాకొచ్చేసింది... భక్తుల్ని యింత పెట్టండి అంత పెట్టండి అంటూ వేధించడమేంది?... బయట తను మండపంలో కూర్చుని 'క్యూ'లో వున్న భర్తకోసం ఎదుర్చూస్తున్నపుడు అక్కడ గుడి గోడకు వేళ్ళాడుతుండిన బోర్డు మళ్ళీ గుర్తొచ్చింది... "భక్తులు ఎటువంటి కానుకలయినా, దక్షిణలయినా హుండీలోనే వేయవలెను... పూజార్లు కోరినప్పటికీ వారికివ్వొద్దు... అటువంటిదేమయినా జరిగితే వచ్చి ఫిర్యాదు చేయగలరు... ఇట్లు కార్యనిర్వహణాధికారి" అని వ్రాసి వుంది.

రుక్మిణమ్మ ఆలోచనలో నుండి తేరుకుని చూసేటప్పటికి ఆ విశాలమైన హాలులో వున్న దాదాపు వెయ్యిమంది కూడా తమ పర్సుల్లో ముప్పయిలూ, యాభయిలూ, వందలూ తీసిపెట్టుకుని, ఆశీర్వదిస్తూ వస్తోన్న పూజారి కోసం వినమ్రంగా ఎదురుచూస్తున్నారు...

ఈ పాపమంతా యిచ్చేవాడిదో, తీసుకునేవాడిదో అర్థంకాక చూస్తోన్న రుక్మిణమ్మకి ఒళ్ళు మండిపోయింది...

పొద్దుట్నుండీ చూస్తోంది... ఏందీ దోపిడీ...

నలుగురితోపాటు నారాయణ కూడా ముప్పయ్యొక్క రూపాయలు-రుక్మిణమ్మ అడ్డుపడుతున్నా వినక, పూజారికిచ్చేసి ఆశీర్వాదం పొందాడు... కుతకుతలాడిపోయిందామె...

''ఇప్పుడు రెండు నాగపడిగల్నీ చేతిలో వుంచుకుని ఆత్మ ప్రదక్షిణ నమస్కారం చేసుకుని స్వామివారి దర్శనానికి వెళ్ళినపుడు అక్కడున్న హుండీలో ఈ నాగపడిగల్ని జారవిడవండి..." మైకు మళ్ళీ అరిచింది...

కుతకుతలాడిపోతూనే రుక్మిణమ్మ పైకి లేచింది.

అంటే- ఈ నాగపడిగలు హుండీలో నుండి బయటపడి, మళ్ళీ సర్పదోష కవర్లలో దూరి కొత్తభక్తుల చేతుల్లోకి వెళ్తాయన్నమాట! విసుగ్గా నారాయణకోసం, పద్మయ్యకోసం కూడా ఎదుర్చూడకుండా, ఊపిరాడనట్లుగా వున్న ఆ హాల్లో నుండి తోసుకుంటూ బయట పడిందామె...

గుంపులు గుంపులుగా స్వామివారి దర్శనానికి పరిగెడ్తోన్న జనాల్ని విస్తుపోయి చూస్తూంది...


"ఈ గుళ్ళో యింతకుముందంతా యింత రష్ లేదు... ఇప్పుడే యిట్లుంది... ఈ నడమ ఆ గంగూలీ, నగ్మా యిద్దరూ వచ్చి సర్పదోష పూజ చేయించుకుని పోయారంట... అప్పుడ్నుండీ మరీ యింత పబ్లిసిటీ వచ్చేసింది ఈ పూజకి..."

రుక్మిణమ్మకి కొద్ది దూరంలో నిల్చుని ఎవరి గురించో ఎదురు చూస్తున్న ఒక జంట... వారిలో వారే యిసుక వేస్తే రాలని జనాల ఒత్తిడిని తిట్టుకుంటున్నారు...

''అదేంది?... నువ్విక్కడుండావా?... నీ కోనం వెతుక్కుంటుండాం... రా... రా... స్వామివారి దర్శనానికి వెళ్దాం... అప్పుడే చూడు ఎంత 'క్యూ' వుందో...'' చెప్పాడు నారాయణ భార్యని వెతుక్కుంటూ వచ్చి...

"నే(నాను... మీరిద్దరెళ్ళండి."

ఖచ్చితంగా వున్న భార్య గొంతు విని నివ్వెరపోయాడు నారాయణ... ఈ తంతంతా భార్యకి చాలా కోపం తెప్పించిందని అర్థమవుతూనే వుంది... భార్యకి అంత భక్తి లేదని తెలుసు కానీ, అసలు దేవాలయాల్లోనే భక్తి లేదన్న సంగతి యిప్పుడే అర్థమయింది నారాయణకి...



అయినా భార్య మాటల్ని పట్టించుకోకుండా-

"ఇది చానా పేరుగల్ల గుడి... కొన్ని వందల ఏళ్ళనాడు తమిళ రాజులు కట్టించిందట... అప్పట్లోనే ఎనిమిది కోట్లయిందంట... లోపల శిల్పాలూ, స్తంభాలూ అన్నీ చాలా బావుంటాయి..."

"అవునమ్మా, చాలా బావుంటుంది గుడి... రా పోదాం" పిలిచాడు పద్మయ్య...

"వొద్దు పద్మయ్యా, నే(నాను... మీరెళ్ళండి... ఈలోపుగా నేను బొయ్యి ఆ కార్యనిర్వహణాధికారెవురో తెలుసుకుని ఫిర్యాదు చేసొస్తాను...'' స్థిరంగా వున్న రుక్మిణమ్మ స్వరాన్ని విని నిర్ఘాంతపోయి చూస్తున్నాడు పద్మయ్య...

"ఏమనీ?'' విస్తుపోయి ప్రశ్నించాడు నారాయణ.

రుక్మిణమ్మ ప్రవర్తన యిద్దరినీ ఆశ్చర్యపరుస్తోంది.

"అవునయ్యా, నేను పోయి కంప్లయింటిచ్చొస్తా... భక్తుల్ని దక్షిణలు పెట్టమని వేధిస్తుండారని..."

"ఏందమ్మా నువ్వు?... ఇట్టాటివన్నీ యిక్కడ మామూలే!"

"అయితే ఎందుకా బోర్డు?"

"బోర్డు పెడతారు... నిజాయితీగా వుండామని తెలపడానికి. అంతమాత్రాన భక్తులు వెళ్ళి ఫిర్యాదు చేస్తారా?... చేసినా- వాళ్ళు పట్టించుకుంటారా? వాళ్ళకీ, వీళ్ళకీ ఎన్నో లింకులు... అందరికీ భాగాలుంటాయి... ఇదంతా పెద్ద వలయం లాంటిది...'' పద్మయ్య నవ్వాడు వెటకారంగా...

"ఇట్టాటియన్నీ శానా వుంటాయిలే, పోదాంపద. "రుక్మిణమ్మ చెయ్యి పట్టుకున్నాడు నారాయణ... భర్తకేసి తీక్షణంగా చూసింది రుక్మిణమ్మ...

"ఇదంతా యిప్పుడు మామూలే... ఎక్కడ లేదు చెప్పమ్మా! ఈ గుడికి మాత్రమే పరిమితమా?... తిరపతి కొండ మీద కళ్యాణం చేయించాలంటే లేదా?... అన్నవరంలో సత్యనారాయణ వ్రతం చేయాలంటే లేదా?... భద్రాచలంలో శ్రీరామ నవమి ఉత్సవాల్లో లేదా?... శ్రీశైలంలో లేదా?... ఎక్కడ లేదు చెప్పమ్మా! ప్రతీ చోటా వుంది... '' రుక్మిణమ్మకు నచ్చచెప్పాలని ప్రయత్నిస్తూనే అన్నీ ఏకరువు పెట్టాడు పద్మయ్య...

''అదేంది పద్మయ్యా, అట్టంటావు... అంతా యిట్నే వుండాదని అందురూ చూసీ చూడకుండా పోతే ఎట్ట పద్మయ్యా? చదువులు, వైద్యం సరే మనమాదిరోళ్ళకి అందుబాట్లో లేకుండా పోతుండాయి... ఆఖరికి దేవుడ్ని కూడా మామూలోళ్ళకి అందకుండా జేసేస్తే ఎట్ట చెప్పు?...'' తీవ్రంగా ప్రశ్నించింది రుక్మిణమ్మ....

చిరాకేసింది నారాయణకి... ''ఆల్యా... యిప్పుడీమె బొయి అంతా సరిజేసేస్తాది...'' పద్మయ్య ముందు యిదంతా పెద్ద అవమానంగా అన్పిస్తోంది నారాయణకి...


× × ×

నారాయణ, పద్మయ్యల మాట విని రుక్మిణమ్మ ఫిర్యాదు చేయడం మానుకుందా, లేక చేసిందా?... చేసినా ఆ కార్యనిర్వహణాధికారి పట్టించుకున్నాడా లేదా అన్నది మనకి తెలీదుగానీ, కొన్నాళ్ళ తరువాత నారాయణ ఆ దేవాలయం ముంగిట్లో టెంకాయల వ్యాపారం మొదలుపెట్టడంమాత్రం నిజం...

దొడ్లో పూసే తుమ్మిపూలనీ, మారేడు దళాలనీ ఆకుల్లో చుట్టి గుళ్ళో అమ్మేదాంట్లో సగం ఖరీదుకే విక్రయిస్తోంది రుక్మిణమ్మ...

ఇప్పుడు... రాహు కాలాల్లోనే కాకుండా సర్పదోష పూజ రోజంతా చేస్తున్నారా దేవాలయంలో!

V



కాలరేఖ

# అరసం, విరసం, ప్రస్తుతం...

*భారతదేశంలో... 1857 నాటి ప్రథమస్వాతంత్ర్య సంగ్రామం, దేశమంతటా ప్రాచుర్యం పొందిన సామాజిక సంస్కరణలూ, పూలేలాంటి ఉద్యమకారుల సాంఘిక విప్లవ భావజాలాలు, కాంగ్రెస్ సంస్థ ఆవిర్భావం... ఆవిష్కరించబడ్డాయి. 20వ శతాబ్దారంభానికే జాతీయోద్యమానికి ఉత్సాహభరితమైన రాజకీయ వాతావరణం వేరూనింది.*

**హరిపురుషోత్తమ రావు**

19వ శతాబ్దాంతంలో భారతదేశంలోనూ, ఇటు తెలుగునాటా, పాశ్చాత్య భాషా సాహిత్యాల ప్రభావం బాగానే పడింది. తెలుగుదేశంలో నవలా సాహిత్యానికి ప్రారంభం ఆ దశలోనే. (కందుకూరి వీరేశలింగం 'రాజశేఖర చరిత్ర') 20వ శతాబ్దారంభం నాటికి పాశ్చాత్యదేశాలలో వ్యాప్తి చెందిన రాజకీయ భావజాలాలు, మన సాహిత్యాలలో వ్యక్తం కావడం మొదలైంది. గత రెండు మూడు దశాబ్దాలుగా ప్రపంచాన్ని 'విశ్వగ్రామం' (Global Village)గా వర్ణించడం వ్యాప్తిలోనికి వచ్చింది. మొదటగా ఆ సమాసాన్ని సృష్టించినవాడు మార్షల్ మెక్లూహన్ అనే కెనడియన్ సాహిత్యాచార్యుడు. ఇప్పుడు సాంకేతికంగానూ, భావజాల వ్యాప్తి వలనా... ఆ సమాసానికి సమగ్రమైన రూపం ఏర్పడింది. అంటే, 19వ శతాబ్దంలో యూరప్‌లో వ్యాపించిన సాంస్కృతిక 'వెల్లువ' భావి ప్రపంచరూపానికి అవసరమైన విలువలనూ, ప్రక్రియలనూ భావజాలాలనూ... వెదజల్లిందనవచ్చును. 19వ శతాబ్దాంతానికి భారతదేశమంతటా సాంస్కృతికపరమైన ప్రకంపనలు వ్యాప్తి చెందాయి. అందులో అతి ప్రాథమికమైన ఆత్మగౌరవం, దేశభక్తి నుండి వసుధైక కుటుంబం వరకు... అన్ని ఆదర్శాలూ వ్యక్తమయ్యాయి. 20వ శతాబ్దపు పాలిత దేశాలన్నింటా ఇలాంటి వాతావరణమే దర్శనమిచ్చేది.

భారతదేశంలో... 1857 నాటి ప్రథమస్వాతంత్ర్య సంగ్రామం, దేశమంతటా ప్రాచుర్యం పొందిన సామాజిక సంస్కరణలూ, పూలేలాంటి ఉద్యమకారుల సాంఘిక విప్లవ భావజాలాలు, కాంగ్రెస్ సంస్థ ఆవిర్భావం... ఆవిష్కరించబడ్డాయి. 20వ శతాబ్దారంభానికే జాతీయోద్యమానికి ఉత్సాహభరితమైన రాజకీయ వాతావరణం వేరూనింది. ఆక్రమంలో యువవీరుల విప్లవోద్యమం, కార్మికోద్యమం, ...ఆ క్రమంలోనే సామ్యవాద రాజకీయాలూ, భారతదేశ చరిత్రలో భాగాలయ్యాయి.

ఇన్ని ఉద్యమాల వెనుకా సాహిత్యమూ సృష్టి అయింది. సాహిత్యమూ, రాజకీయపక్షాలూ.... కొద్దిగానో పెద్దగానో విభేదించుతున్నప్పటికీ సామ్యవాద భావజాలం... సామాన్య ప్రజలను ఆకట్టుకుంది. విద్యాధికులు కొందరైనా ఆ స్రవంతిలో ప్రవేశించారు.

తెలుగునాట కందుకూరి, గురజాడలు... వెనుక సంస్కరణోద్యమం, సాహిత్యోద్యమం ప్రజలకు సన్నిహితం అయింది. ప్రజలను సూటిగా చేరిన, చేరే సాహిత్యానికి సహజంగానే ప్రశస్తి ఏర్పడింది. మరోవైపున ఇది ప్రపంచవ్యాప్తంగా వ్యక్తమైన పరిణామం. ఆ సందర్భంలోనే 1935 సంవత్సరంలో పారిస్ నగరంలో ప్రపంచ రచయితల సదస్సు జరిగింది. అప్పుడు లండన్‌లో విద్యాభ్యాసం చేస్తున్న సజ్జాద్ జహీర్ ఆ సభకు హాజరయ్యాడు. ఆ తర్వాత లండన్‌లోని భారతీయ విద్యార్థులు భారత అభ్యుదయ రచయితల సంఘాన్ని ఏర్పరిచి, ఒక ప్రణాలికను రూపొందించారు (1936).

తెలుగులో 20వ శతాబ్దపు తొలిదశకం నుంచీ అభ్యుదయ రచనలు వెలువడుతూనే వున్నాయి. అలాగే రచయితలకు సంఘాలు లేవు కాని సమూహాలుండేవి. వారు ప్రచురణకర్తలుగా కూడా ఉండేవారు. 1929 ఆర్థిక మాంద్యం... ప్రపంచదేశాలన్నింటికీ వ్యాపించింది. సోవియట్ రష్యా మాత్రమే అందుకు మినహాయింపు. అందువలన సోవియట్ రష్యా మేధావులకూ, రచయితలకూ విద్యాధికులకూ... ఆసక్తికరమైన దేశమైంది. అలాగే సామ్యవాదం ఆకర్షణీయమైన భావజాలమైంది. ఈ పరిస్థితులలో అభ్యుదయ రచనలపట్ల ఆకర్షణా, ఉత్సాహమూ వ్యక్తమయ్యాయి. 1936లో జరిగిన తొలి అభ్యుదయ రచయితల సభకు తెలుగు రచయితలు (అబ్బూరి రామకృష్ణారావు, తుమ్మల వెంకటరామయ్య) హాజరైనప్పటికీ ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం 1943 నాటికి మాత్రమే ఏర్పడింది. అయితే ఇక్కడే ఒక విచిత్రం జరిగింది. 1920 దశకంలో తెలుగు సాహిత్యరంగంలో భావకవిత్వం 'రాజ్యమేలుతోంది'. అంతకుముందున్న కవుల సమూహాలన్నీ- సాహిత్య సమితులన్నమాట-నవ్యసాహిత్య పరిషత్తులో లీనమయ్యాయి. అభ్యుదయ రచయితల తొలి సమావేశంనాటికి కవులంటే భావకవులు మాత్రమే... అందుకు భిన్నమైనవారు అందరూ 'అభ్యుదయ రచయితలు' అని కూడా చెప్పలేం. 1943 నుండి 'అభ్యుదయ రచయితల సంఘం' (అరసం) ఏదో స్థాయిలో కొనసాగుతూనే వుంది. సోషలిస్టు, కమ్యూనిస్టు ఉద్యమాలూ, భావజాలాలూ కూడా అప్పటి నుంచి వ్యక్తమవుతూనే వున్నాయి. 1930 దశకం ప్రారంభంలోనే, శ్రీశ్రీ

భావకవిత్వ ధోరణిని 'వదులుచ్చుకుని' ప్రజా విప్లవమార్గాన్ని చేపట్టాడు. అయినా అందు బాటులో లేనందువల్ల 1943 అభ్యుదయ రచయితల తొలి సభకు హాజరు కాలేదు. 1936 నాటి 'భారత అభ్యుదయ రచయితల సంఘం' ప్రణాళికను అనుసరించు తున్నాయని ప్రకటించు కున్నప్పటికీ అభ్యుదయ రచయితల సంఘానికి స్థూలంగా విశాలప్రాతిపదికగల సంఘం ఏర్పడాలనే ఆకాంక్ష నిత్యం ఇబ్బంది పెడుతూ, 'సలుపు'తుండడంవలన... ఎక్కువ మందిని అలంకారం కోసం, ప్రతిష్టకోసం సంఘంలో కూర్చోబెట్టుకున్నారు. అభ్యుదయ రచయితల సంఘం 'ప్రజలతో వున్న ప్రమేయం' వలన ప్రత్యేకతను సంతరించుకుంటుందన్న స్పృహ కొరవడింది. అందువలన ఉప్పల లక్ష్మణరావు, ఆధునిక దృక్పథం ఉన్న తాపీ ధర్మారావు, ప్రజాస్వామిక దృక్పథాన్ని రచనల్లో ప్రతిఫలింపచేసిన ముద్దుకృష్ణ, నవ్యసాహిత్య పరిషత్తు పరిధి నుండి విముక్తమైన ఏల్చూరి వంటి వారిని మినహాయిస్తే కమ్యూనిస్టులు మినహా... ఆధునికులు అభ్యుదయ రచయితల సంఘంలో కనబడరు. ప్రజాస్వామ్య భావజాలాన్నీ, సోషలిస్టు విధానాన్నీ.. సంలీనపరుస్తూ ప్రత్యామ్నాయ మార్గాన్ని.. సృష్టించుకోవాలన్న అవగాహన అ.ర.సం.లో ఆ కాలంలో వ్యక్తం కాలేదు. అలాగే ఎన్ని ఆదర్శాలను లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ ఉదారవాద భావాలనూ, సంస్కరణవాద భ్రమలనూ. అ.ర.సం. విడనాడలేకపోయింది. అందుచేత, నాలుగో మహాసభ నాటికి (1947 జనవరి) సంస్థ తన ప్రత్యేకతనూ, విశిష్టతనూ కోల్పోసాగింది! సందట్లో సందడి'గా 'జానపద' గీతాలను రచించేవారిని.. తక్కువ చేసి చూడడం కొన్ని సందర్భాలలో జరిగిందని కూడా చెబుతారు. అందుచేత అ.ర.సం. ఒకరకంగా నిర్వీర్యంగా ఉండిపోయింది. 8 సంవత్సరాల తర్వాత, 1955లో, ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ ఎన్నికలలో ఓడిపోయిన తర్వాత విజయవాడలో ఐదో మహాసభ జరిగింది. (ఆ ఎన్నికలలో 'అభ్యుదయ రచయితల సహకారంవలనా, దన్నువలనా ఊరేగిన' మహామహులు... కమ్యూనిస్టు వ్యతిరేకవీరులయ్యారు.) 1948 ప్రాంతంలో అ.ర.సం. స్తంభించిందిగాని, 1958 నుంచీ అది 'మంచం పట్టి తీసుకోసాగింది.'

............ O ............



**శ్రీశ్రీ ఒక క్షణం ఆగి 'ఏనీ హౌ ది ఏరో లెఫ్ట్ ది బౌ' అన్నాడు.**

............ O ............

1955లో కమ్యూనిస్టు పార్టీ ఓటమి, 1956లో ఆంధ్రప్రదేశ్ నిర్మాణం, ఆ తర్వాత రచయితల సంఘాల వేదికలు హైదరాబాద్‌కు మారడం... త్వరత్వరగా జరిగాయి. సర్కారు వారికీ రచయితలకూ సాన్నిహిత్యం ఏర్పడిపోయింది. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతికంగా 'శూన్యం'లోకి ప్రయాణం ప్రారంభించింది. భాగ్యనగరంలో అతిక్షీణమైన హేయమైన సాంస్కృతిక వాతావరణం మొదలై, విస్తారమైన, అసాంఘిక దుష్ట సంప్రదాయాల రాజ్యం ఏర్పడింది. 'అప్పుడే' దిగంబరకవులు 'ప్రవేశం.' 'దిగంబరకవులు' అప్పటి అసహనానికీ, ఊపిరి సలపని సాంస్కృతిక హైన్యంపట్ల చిరాకుకూ... ప్రతినిధులు. 1960 దశకం ద్వితీయార్ధం మొత్తం... రాజకీయంగా, సాంస్కృతికంగా, కల్లోల కాలం. అలాంటి కల్లోలాలలో 'ఆకర్షణీయమైన' దశ దిగంబరకవుల 'శకం'- ఒక సంచలనమైన అరదశాబ్దికల్లోలం. ఇంచుమించు ఆ కాలంలోనే నక్సల్బరీ నుండి తెలంగాణా వరకు వ్యాపించిన విప్లవోద్యమం. దీనిని విప్లవోద్యమంగా గుర్తించనివారు అసంఖ్యాకులే. ఇది అట్లా ఉంచుదాం.

1970 జులై 4వ తేదీన ఆంధ్రదేశ సాంస్కృతిక వేదికపై.... 'విప్లవ రచయితల సంఘం' ఆవిష్కారమైంది. పైన చెప్పిన తేదీనాడు అసలు 'జరగవలసిన' సభ వేరే. నక్షత్ర సప్తకం (సెవెన్ స్టార్స్ సిండికేట్) అనే సంస్థ ఆనాడు అభ్యుదయ రచయితల సదస్సును భాగ్యనగరంలో ప్రభుత్వం వారి నీడను.. జరిపే కార్యక్రమాన్ని జరపడానికి ఏర్పాట్లు చేసింది. ఆ సదస్సులో ప్రధానాకర్షణ శ్రీశ్రీకి పర్సు బహూకరణ, సన్మానం... (1955లో అభ్యుదయ రచయితల ఆఖరు సభ (విజయవాడ) జరిగిందని గుర్తు తెచ్చుకోవడం అవసరం) ఈ 'సన్మానం-సభ' గురించి తొలి ప్రకటన వచ్చిన్నాటి నుంచి చివరి వరకు ఆంధ్రదేశంలో ఉన్న యువ రచయితల సందడి. సద్దు.... అపూర్వం. ఈ పర్సు తీసుకోవడం 'శ్రీశ్రీకి వ్యక్తిగతంగా అవమానం అభ్యుదయ రచయితల కందరికీ తలవంపులు' అని అనేకులు శ్రీశ్రీకి ఉత్తరాలు రాసారు. ఆయన అందరికీ సమాధానాలు రాశాడు కాని,

జూలై 4 ఉదయానికే హైదరాబాద్ నగరమంతా... వేరే సమాచారం వ్యాపించిపోయింది. 'శ్రీశ్రీతోసహా అనేక మంది కవులూ, రచయితలూ, అభ్యుదయ రచయితల సదస్సు'ను 'బహిష్కరించారు' లేదా తిరస్కరించారు-అనే సమాచారం. అయితే జూలై మూడో తేదీ రాత్రి దిగంబరకవులతో సహా ఆంధ్రదేశం నాలుగు మూలల నుంచి వచ్చిన యువ సాహితీకారులు... ఒక హోటల్ గదిలో సమావేశం అయ్యారు. ఆ హోటల్‌పేరు ఇంపీరియల్ హోటల్- (ఇదేదో గొప్ప హోటల్ అని బాపూ లాంటి చిత్రకారుడు భ్రమపడి ఆ రోజుల్లో కార్టూన్ వేశారు). అటు శ్రీకాకుళం, నక్సల్బరీ ఉద్యమాలు ఆనాటి సభికులకు ఉత్ప్రేరకాలు. అలాగే ఎక్కువ మందికి మార్క్సిజం-లెనినిజం, మావోయిజంలపట్ల తీవ్రమైన విశ్వాసం, గౌరవం... అక్కడున్న వారిలో కె. వి. రమణారెడ్డిగారికే కొంచెం 'అనుమానాలున్నట్టు' ఈ లేఖకుడికి అనిపించింది. ఈ విషయంలో పొరబడ్డానని తర్వాత చరిత్ర రుజువు చేసిందనుకోండి.

స్థూలంగా విప్లవపోరాటాలను బలపరచడం. అందుకు బాసటగా సాహిత్యం నిర్మించడం లక్ష్యాలుగా ఆ సమావేశానికి వచ్చిన వారందరూ నిర్ణయించారు. ఆ సంఘానికి 'విప్లవ రచయితల సంఘం' అని పేరుంచారు. తాత్కాలికంగా ఒక కన్వీనింగ్ కమిటీని వేసుకున్నారు. ఇప్పుడు వి.ర.సం. వయస్సు 32 సంవత్సరాలు. అయితే తొలి దశాబ్దాలలో 'విరసం' యువతకు ప్రతిబింబంగా నిలిచింది. పాటకు, గీతానికి... సోకాల్డ్ కవిత్వాని కంటే అధిక గౌరవం తెచ్చిపెట్టింది విరసం. అలాగే విరసం ప్రచురించిన కొన్ని కథలూ, నవలలూ కూడా బాగా ప్రసిద్ధమే. తెలంగాణా ప్రాంతం నుంచి వెలువడిన కథలు... నవలలూ పరిచయం చేయాల్సిన అవసరంలేనంతగా ప్రతిష్టను సాధించాయి. విరసం ఆశించిన విప్లవ పోరాటం గురించి సందేహాలూ, శంకలూ, వ్యతిరేకతా ఉన్నవారి సంగతి అలా వదిలిపెడితే... విరసం సాధించిన విజయాలూ విరసం అచ్చువేసిన

గ్రంథాలూ... బహుశా రచయితలకే కాక కార్యకర్తలకు కూడా చాలా ఉత్సాహాన్నిస్తాయి.

విరసం గురించి వివరంగా సమీక్ష చేసినప్పుడు, అది సాధించింది గణనీయమేనని చెప్పాలి. ప్రస్తుతం ఉన్న సరళీకరణ, ప్రపంచీకరణ 'వగైరాల' సంస్కరణల నేపథ్యంలో వామపక్షాల బాధ్యత పెరిగింది. భారంగా పెరిగింది. బహుశా అందుకు విరసం పాత్ర కూడా చాలా అవసరం. అయితే, విరసం అసలు ఏమీ తప్పులు చేయలేదని ఎవరూ అనరు... నేనూ అనను...

ఈనాటి సాహిత్యరంగంలో.... వామపక్షాలు చేయవలసిన కృషి ఎంతో ఎంతో ఉంది. ఈనాటి పోరాటం... సామ్రాజ్యవాదం మీద, మతతత్వం మీద, మాత్రమే కాదు. పేదరికం మీద... పెద్దపెద్ద పేర్లతో వినబడే సంస్కరణలపట్ల మరింత జాగ్రత్తగా... పోరాటసంస్కారాన్ని ఏర్పరుచుకోవాలి. అందుకు విరసం కూడా భాగస్వామి అవ్వాలి.

కొసమెరుపు : విరసం ఏర్పడిన రాత్రి... రెండు గంటలకు... శ్రీశ్రీ

'ఇప్పుడు చెప్పు.. ఇప్పుడు మనం చేసిన పని (విరసం నిర్మాణం)

సక్రమమేనంటావా?' అని అడిగారు


' అది మనం నిర్ణయించలేం. కాని ఒకటుంది. దశాబ్దాలపాటు యువకులు మిమ్మల్ని అనుసరించారు. ఇప్పుడు వారిని మీరనుసరించడం సబబేకదా!'


శ్రీశ్రీ ఒక క్షణం ఆగి 'ఎనీ హౌ ది ఏరో లెఫ్ట్ ది బౌ' అన్నాడు.


'బాణం విల్లును వదిలింది' అని అనువదించాడు.

మహాకవికి నాడు కలిగిన సందేహాల వంటివి ఇప్పటికీ ఏదో రూపంలో కొనసాగుతూనే వున్నాయి. వీటిపై చరిత్ర తన సమాధానాలు తనిచ్చింది. చాలా కాలం గడిచింది. అనేక పరిణామాలూ వచ్చాయి. ఏతావాతా పరిస్థితి మరింత క్లిష్టమైంది. సవాళ్ళు ఇంకా తీవ్రమైనాయి. ఈ సంధ్యలో ప్రతివారూ తాము నేర్చుకోవలసిన పాఠాలు నేర్చుకోవలసిందే. తప్పదు. అప్పుడే వారు సంధించిన బాణాలవుతారు.

V



ఇంటర్వ్యూ

# నవ్యసంప్రదాయం ఆధునికానంతర వాదం ప్రాతిపదిక లేనివే!

***1977-80ల దాకా నేను విశ్వనాథ సాహిత్య ప్రభావంలో ఉన్నాను. అనంతపురం వచ్చాక ఇక్కడి అవసరాలు, పరిచయాలు, ఆలోచనను విస్తరించాయి. భావవాదం వల్ల చేసేదేమీ లేదని తెలుసుకున్నాను. ఇటువైపు మొగ్గాను. కొన్ని దేశాలలో కమ్యూనిస్టు ప్రభుత్వాలు ఉన్నాయా? లేవా? అనేవి రాజకీయ పరిస్థితికి సంబంధించిన విషయాలు. జీవితాన్ని అర్థంచేసుకోవడానికి మార్క్సిస్టు సిద్ధాంతం తప్ప మరొకటి లేదు. మన భారతీయ సంప్రదాయ అలంకార శాస్త్రాల ప్రకారం చదివితే భారతమైనా అర్థంకాదు. మార్క్సిస్టు దృష్టితో చదివితేనే అర్థమవుతుంది.***

డా. రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి

***ఎప్పట్నుంచి మీరు సాహిత్య విమర్శలో ఉన్నారు?***

1972 నుంచి నేను సాహిత్య విమర్శ రాస్తున్నాను. ఎంఎ తెలుగు చదువుతుతున్న రోజుల్లో మా ఉపాధ్యాయులు సెమినార్లు చేయించేవాళ్ళు. 1972లో నా సెమినార్‌లో నేను 'తెలుగు సినిమా పాటల్లో సాహిత్య విలువలు' మీద పరిశోధన చేశాను. ఆ వ్యాసం 1972లో అచ్చయింది. ఆ తర్వాత 'ప్రభావతీ ప్రద్యుమ్నం' పరిశోధనాంశంగా తీసుకుని దాదాపు నాలుగైదేళ్ళు ప్రాచీన సాహిత్యానికే పరిమితమయ్యాను. 1977లో అనంతపురం పీజీ సెంటర్‌లో లెక్చరర్‌గా చేరిన తర్వాత కన్యాశుల్కాన్ని, మిగతా గురజాడ సాహిత్యాన్ని పాఠంగా చెప్పవలసి వచ్చింది. కన్యాశుల్కం పాఠంగా చెప్పడం నాకో పెద్ద మలుపు. అదివరకు ఉన్న సామాజికాభిప్రాయాలు, సాహిత్యాభిప్రాయాల్లో గురజాడ రాతలు పెద్ద మార్పు తీసుకొచ్చాయి. దాంతో కె.వి.ఆర్. 'మహోదయం', సర్దేశాయ్ తిరుమలరావుగారి 'కన్యాశుల్కం-నాటక కళ' చదివాను. ఆ విధంగా ఆధునిక సాహిత్య విమర్శ పరిచయం జరిగింది. తర్వాత గురజాడ వారి ఇతర సాహిత్యమంతా చదవడం, ఆధునిక విమర్శనా రంగంలోకి ప్రవేశించడం జరిగింది.

***తొలి విమర్శ ఎప్పుడు రాశారు?***

తొలిసారిగా 1980లో గోపీగారి 'తంగేడుపూలు'పై విమర్శనావ్యాసం రాశాను. అప్పటికి ఆధునిక సాహిత్యాన్ని విమర్శించడానికి నా దగ్గర తగిన సాధనాలు, పనిముట్లు లేవు. పూర్వ విమర్శకుల వ్యాసాలు చదివి, ఆ నమూనాలో అది రాశాను. ఆ తర్వాత అనేకమంది మార్క్సిస్టు సాహిత్య విమర్శకుల వ్యాసాలు చదివాను. ఎస్కే యూనివర్సిటీలో 'సుందరయ్య విజ్ఞాన కేంద్రం' సాంబిరెడ్డి గారు మార్క్సిస్టు రాజకీయ క్లాసులు తీసుకుంటుండేవారు. ఒకటి రెండింటికి నేను హాజరయ్యాను. ఓల్గా రచనలు, విశ్లేషణలు కూడా ప్రభావం చూపించాయి. దాంతో నా దృక్పథంలో మార్పొచ్చింది. అనంతపురంలో సాహిత్య వాతావరణం....కథారచయితలు, కవులు., సాహిత్య సమావేశాలు... లిటరరీ మీట్ అనే సాహిత్య బృందం...విశాలాంధ్ర... వీళ్ళంతా నేను సాహిత్య విమర్శకుడిగా ఎదగడానికి దోహదపడ్డారు.

***మార్క్సిస్టు సాహిత్య విమర్శనపై దాడి పెరుగుతున్న దశలో మీరు మార్క్సిస్టు దృక్పథం వైపు రావడానికి ప్రోత్సహించిన అంశాలేమిటి?;***

1977-80ల దాకా నేను విశ్వనాథ సాహిత్య ప్రభావంలో ఉన్నాను. అనంతపురం వచ్చాక ఇక్కడి అవసరాలు, పరిచయాలు, ఆలోచనను విస్తరించాయి. భావవాదం వల్ల చేసేదేమీ లేదని తెలుసుకున్నాను. ఇటువైపు మొగ్గాను. కొన్ని దేశాలలో కమ్యూనిస్టు ప్రభుత్వాలు ఉన్నాయా? లేవా? అనేవి రాజకీయ పరిస్థితికి సంబంధించిన విషయాలు. జీవితాన్ని అర్థం చేసుకోవడానికి మార్క్సిస్టు సిద్ధాంతం తప్ప మరొకటి లేదు. మన భారతీయ సంప్రదాయ అలంకార శాస్త్రాల ప్రకారం చదివితే భారతమైనా అర్థంకాదు. మార్క్సిస్టు దృష్టితో చదివితేనే అర్థమవుతుంది. ఇదే సరైన ప్రమాణం. సారాంశాన్ని అర్థంచేసుకోకుండా రూపాన్ని అర్థంచేసుకోలేం. వస్తువు కోసం రూపం తప్ప రూపం కోసం రూపం కాదు.

***తెలుగులో సాహిత్య విమర్శ ఎలా వస్తోంది?***

ఇవాళ తెలుగు సాహిత్య విమర్శ రెండు ప్రవాహాల నుంచి వస్తోంది. ఒకటి విశ్వవిద్యాలయాల నుంచి ఎంఫిల్, పిహెచ్‌డిలుగా విద్యార్థులు చేస్తున్న పరిశోధన. రెండోది సాహిత్య విమర్శకులు చేసే పరిశోధన. విశ్వవిద్యాలయాల వెలుపల నుంచి వస్తున్న సాహిత్య విమర్శే రాశిలోనూ, వాసిలోనూ మెరుగ్గా ఉంటోంది. విశ్వవిద్యాలయ పరిశోధనా విద్యార్థులు, సాహిత్యం పట్ల ఇంకా పరిణతి ఏర్పడనివారే అయినందువల్ల ఆ తేడా ఉంటున్నది. కొన్ని కేవలం డిగ్రీలు, ఉపాధి కోసం రాసినట్లు ఉంటున్నాయి. అంతేకాదు, గైడ్ చేసే విశ్వవిద్యాలయ అధ్యాపకులకూ, బయటి పరిశోధకులకూ మధ్య ఆలోచనా సరళిలో కూడా తేడా ఉంటోంది. ఇందుకు కారణం విశ్వవిద్యాలయ సమాజానికి, బయటి సమాజానికీ మధ్య 70 ఏళ్ళ తేడా ఉండడం. బయటి సమాజం ప్రభావం విశ్వ విద్యాలయాలపై ఉంటున్నది గానీ, విశ్వవిద్యాలయాల ప్రభావం సమాజంపై ఉండడం లేదు. నిజానికి యూనివర్సిటీల ప్రభావమే సమాజంపై ఉండాలి. కాని అలాంటి పరిస్థితి లేదు. ఇందుకు కారణం వాటి ధోరణులలో లోపమే అనుకోవాలి.

సమాజ ప్రభావమే గుణాత్మకంగా ఉంది. నా అనుభవంలో విశ్వ విద్యాలయాల బయట ఉన్న సర్దేశాయ్ తిరుమలరావు, రా.రా., మద్దుకూరి చంద్రశేఖర్‌రావు, పుచ్చలపల్లి సుందరయ్య, చే.రా. వంటివారివల్ల ఎక్కువగా నేర్చుకున్నాను.

**సాహిత్య విమర్శలో ఆధునిక మార్గం ఎప్పుడు మొదలైందంటారు?**

కట్టమంచి రామలింగారెడ్డిగారితో ఆధునిక మార్గంలో విమర్శ మొదలైందంటారు. అయితే, అంతకు ముందు గిడుగు రామ్మూర్తి, గురజాడ వ్యాసాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. కట్టమంచికి వారు రంగం సిద్ధం చేశారని చెప్పుకోవచ్చు. అయితే, కట్టమంచి తర్వాత విమర్శ ఆయన మార్గంలోనే పయనించలేదు.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, పుట్టపర్తి నారాయణాచార్యులు విమర్శలో వాస్తవికత మార్గాన్ని తీసుకొచ్చారు. అభ్యుదయ సాహిత్యం, విమర్శ మొదలయ్యాక ఆధునిక, ప్రాచీన సాహిత్యాలను మార్క్సిస్టు దృక్పథంలో విమర్శించడం మొదలయింది. శ్రీశ్రీ, కొ.కు., కె.వి.ఆర్., వల్లంపాటి వెంకటసుబ్బయ్య, వరవరరావు, తదితరులు సాహిత్య విమర్శను ఆ మార్గంలోకి తెచ్చారు.

***తెలుగులో సాహిత్య విమర్శ ఎంతవరకు ఎదిగింది?***

ఇది మౌలికమైన ప్రశ్నే. ఎదగలేదని అనేకులంటారు. కొ.కు. కూడా ఒక సందర్భంలో అన్నారు. రాశిలో తక్కువ కాదు. అయినా ఈ అభిప్రాయం వస్తున్నది అంటే కారణం వస్తున్నదంతా సాహిత్య విమర్శ కాదు. 'పరిచయ రచనలు' కూడా సాహిత్య విమర్శల్లో ఉండటం కనిపిస్తున్నది. రచన, రచయిత పరిచయాలే కానీ, విశ్లేషణ, సంశ్లేషణ కానివి అవన్నీ.

***పాఠకుడి స్పందన, సమీక్షకుడి పరిచయం, విమర్శకుడి విశ్లేషణ మధ్య విభజన రేఖ ఉంటుందా?***

లేదు. ప్రతి విమర్శకుడూ, పాఠకుడూ సమీక్షకుడే. తక్షణ స్పందన పాఠకుడి లక్షణం. పరిచయంతో సమీక్ష మొదలవుతుంది. ఎక్కువ భాగం సమీక్ష దశకొచ్చి ఆగిపోతూ.. అదే విమర్శగా చలామణి అవుతున్నది. దీనిని అధిగమించాల్సిన అవసరముంది. అధిగమిస్తున్న వాళ్ళూ ఉన్నారు. సాహిత్య



*కట్టమంచి రామలింగారెడ్డిగారితో ఆధునిక మార్గంలో విమర్శ మొదలైందంటారు.*

***అయితే అంతకుముందు గిడుగు రామ్మూర్తి, గురజాడ వ్యాసాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.***

విమర్శ ఎదగలేదనే విమర్శకు మరో కారణమూ ఉంది.

సాహిత్యంలో ఒక గుంపు గందరగోళం సృష్టించేందుకు శాయశక్తులా ప్రయత్నం చేస్తున్నది. ఉద్యమమే కానిదానిని ఉద్యమంగా మీడియాలో ప్రచారం చేస్తున్నది. చారిత్రక ప్రాముఖ్యం లేని గ్రంథాన్ని చాలా ప్రాముఖ్యమైనదిగా చెప్పటం, ఆకాశాని కెత్తడం చేస్తున్నారు. ఈరోజు మనం కోరుకుంటున్నది వెనకటి రోజుల్లోనే ఉందని గట్టిగా వాదిస్తున్నారు. భారతంలో భీముడు కుబేరవనం గురించి రక్షకులతో వాదిస్తూ "దీన్నేమైనా కుబేరుడు తవ్వాడా? ప్రకృతి సహజం అందరికీ హక్కుంది" అంటాడు. దీన్నిచూపి భీముడే తొలి మార్క్సిస్టు అనేవాళ్ళూ ఉన్నారు. రామాయణంలోని ఒక కథలో స్త్రీ పక్షి చనిపోయినప్పుడు పోతుపక్షి విలపిస్తుంది. ఇది చూపి స్త్రీ పురుష సమానత్వం ఆనాడే ఉంది. స్త్రీ పురుష సమానత్వం గురించి వ్యాసవాల్మీకులే చెప్పారు. కాకపోతే 'గురజాడ, శ్రీశ్రీలు దానిని కొనసాగించారు' అనేవాళ్ళూ ఉన్నారు. దీన్ని బట్టి వాళ్ళు సమాజాన్ని ఎంత తప్పుదారి పట్టిస్తున్నారో అర్థమవుతుంది. భావనలకు చరిత్ర ఉంటుంది. అన్ని భావనలూ అన్ని కాలాల్లో ఉండవు. సమసమాజం అనేది ఆధునిక భావన. మన ప్రాచీనులకు ఆ ఆలోచన లేదు. వారు అసమానతలతో కూడిన వర్ణవ్యవస్థను భగవంతుడు సృష్టించాడని, దాన్ని నిలపాలని అనుకున్నారు. సమసమాజ భావన భారతం నాడు ఉంటే ఏకలవ్యుడి బొటనవేలు కత్తిరిస్తున్నప్పుడు సమ సమాజవాది ఏం చేస్తున్నట్లు?

అసలు ఆధునిక భావజాలమని పారిశ్రామిక విప్లవం, స్వేచ్ఛా, సమానత్వ భావజాలాల నుంచి వచ్చినదాన్నే అంటున్నాం. ఆధునిక కాలంలో వచ్చిన ప్రతి రచనా ఆధునిక రచన కాదు. కానీ ఆధునిక కాలంలో వచ్చిన సంప్రదాయ సాహిత్యాన్ని ప్రేమించేవాళ్లు ఆధునిక భావనలతో వచ్చిన సాహిత్యాన్ని కూడా సొంతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. 'మేము ఆ పంక్తిలోకి తగమా?.., అదీ మాదే!' అంటూ వచన కవిత్వం మీద కూడా సంప్రదాయవాదులు విమర్శ రాస్తున్నారు. దీనివల్ల ఏది సంప్రదాయమో, ఏది ఆధునికమో తెలియక పాఠకుడికి గందరగోళం ఏర్పడుతోంది. ఇది చాలదన్నట్లు నవ్య సంప్రదాయవాదమనే కోణాన్ని లాగారు. ఇంగ్లీషులోని 'నియోక్లాసిజం' అనే దానినుంచి దీనిని పట్టుకొచ్చారు. సంప్రదాయం అన్నాక నవ్య సంప్రదాయం అంటే.., అసమానతకు నవ్య అసమానతలాగా అనిపిస్తుంది తప్ప మరొకటికాదు.

**సిద్ధాంతాలే పనికి రావనే వాదన గురించి..?**

ఈ మధ్య సిద్ధాంతాలకు కాలం చెల్లిందని కొందరు వాదిస్తున్నారు. కేవలం మార్క్సిజాన్ని వ్యతిరేకించడం కోసమే ఈ వాదన చేస్తున్నారు. వాస్తవంగా ఆటవిక సమాజం.. ఆదిమ సమాజాలకు కూడా ఒక నిబద్ధత, సిద్ధాంతం ఉన్నాయి. ఫ్యూడల్.., పితృస్వామ్యం.., పెట్టుబడిదారీ సమాజాలకు.. అంతెందుకు.. ఎప్పటి సమాజాలకైనా గతితార్కికంగా సిద్ధాంత మంటూ ఒకటుంటుంది. ఎవరికైనా నచ్చకపోతే మార్క్సిజాన్ని వ్యతిరేకించు కోవచ్చు. ఆ స్వేచ్ఛ ఉంది.. సిద్ధాంత దృష్టినే వ్యతిరేకించకూడదు. ఇది శాస్త్రీయ ఆలోచన కాదు. పాఠకుడికీ, రచనకూ మధ్య అగాధం పెంచడం ఇది.

వచన కవిత్వం మీద సంప్రదాయ వాదుల దాడి ఇది. ఇప్పుడూ 'నవ్య సంప్రదాయ వాదమనే' పేర ఆ దాడి కొనసాగిస్తున్నారు. నవ్య సంప్రదాయవాద మనేదే అసంబద్ధ సిద్ధాంతం. విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లే దీనిని ఉత్పత్తి చేస్తున్నారు.

***విమర్శనాదృష్టిలో ఆధునికానంతరవాదులపై మీ అభిప్రాయం?***

సమాజం ఇంకా ఆధునికం కాకుండానే ఆధునికానంతర వాదం అనడం అసంబద్ధమే. నేటికీ సమాజంలో కుల, మత

భావనలు పోలేదు. అనమానతలు, అంతరాలు తొలగలేదు. జీవితంలో రాకుండా సాహిత్యంలో పోస్ట్‌మోడర్నిజం ఎలా సాధ్యం? ఎలా ఉంటుంది? జీవితం మారాలని, మారాల్సిన అవసరాన్ని చెప్పేదే ఆధునిక వాదం, ఆధునిక సాహిత్యం. ఇంకా ఆ మార్పు జరగకుండానే పోస్ట్ మోడర్నిజం అంటే అది దృక్పథాన్ని గందరగోళపరిచేదే. నవ్య సంప్రదాయం, పోస్ట్ మోడర్నిజం రెండూ వాస్తవిక ప్రాతిపదిక లేనివి.

***కవిత్వంలో స్త్రీ, దళిత, మైనారిటీ, ప్రాంతీయ అస్తిత్వాలపై మీ అభిప్రాయం?***

సమాజంలోని అన్ని తరహాల వైరుధ్యాలూ రచయితలను ప్రభావితం చేస్తాయి. 1985 తర్వాత స్త్రీ, దళిత వాదాలు, 1992 తర్వాత మైనారిటీ కవిత్వం వచ్చాయి. వాటిని ఆహ్వానిస్తాను. రాజకీయ, ఆర్థిక విప్లవం, సమానత్వం రావాలంటే దానికంటే ముందే సాంఘిక విప్లవం రావాలని 1936లో అంబేద్కర్ కూడా చెప్పారు. అప్పుడే ఆ సమాజం ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. అంబేద్కర్ కులాన్ని నిర్మూలించాలన్నారు. దురదృష్టవశాత్తు నేటి కులసంఘాలు దాన్ని మరింత పటిష్టం చేస్తున్నాయి. తప్పుదారిన ప్రయాణిస్తున్నారు. ఒక విషయం చెప్పాలి. వర్గ చైతన్యమే బలమైన చైతన్యం. దళితుడు ధైర్యంగా మాట్లాడగలుగుతున్నా, స్త్రీ ఈ మాత్రం సమాజంలోకి వచ్చి పోరాడగలుగుతున్నా అందుకు కమ్యూనిస్టు పోరాటాలు ఏర్పరిచిన భూమికే కారణం. అయితే, మార్క్సిజాన్ని యాంత్రికంగా అన్వయిస్తే సరిపోదు. సాంఘిక పోరాటం, ఆర్థిక పోరాటం సమానంగా నడవాలి. తెలంగాణా పోరాటంలో కులమతాల కతీతంగా ప్రజలు ఏకమయ్యారు. దానికి భిన్నమైన చరిత్రా ఉంది. ఇంకా దళితవాడలను ఊరికి దూరంగానే ఉంచుతున్నారు. గాంధీజీ రాకపూర్వం సాంఘిక పోరాటాలు, రాజకీయ పోరాటాలు కలిసి నడిచాయి. గాంధీజీ వచ్చాక రెండు పగ్గాలూ తనే పట్టుకొని, మెల్లగా సాంఘిక పోరాటాలను వదిలేశారు. ఆయనకు వర్ణవ్యవస్థపై గౌరవం ఉండడమే అందుకు కారణం. కమ్యూనిస్టుపార్టీలు ప్రధానంగా ఆర్థిక పోరాటాలనే నడిపాయి. అది చరిత్రలో జరిగిన తప్పిదం. కార్మికుల ఐక్యతకు కూడా కులం గోడగా నిలుస్తోన్న పరిస్థితిని చూడాలి. ఇప్పుడు దాన్ని గుర్తించి సాంఘిక పోరాటాలు కూడా చేస్తున్నారు. కులవివక్ష వ్యతిరేక

............ O ............

*రచననొదిలిపెట్టి రచయిత మీదుగా వెళ్లే ధోరణి రా.రా.తోనే మొదలైంది. గురజాడ గురించే అలా రాశారు.*



............ O ............

పోరాటం ఎప్పుడో రావాల్సింది.

***సాహిత్యానికి పఠనీయత తగ్గుతున్న రోజుల్లో విమర్శ అవసరమూ, అస్తిత్వం గురించి చెప్పండి..***

సాహిత్యానికి ఉన్నంత కాలం సాహిత్య విమర్శకు కూడా అస్తిత్వం ఉంటుంది. దృశ్యమాధ్యమంలో మంచి ధోరణులుంటే పఠన మాధ్యమాన్ని డామినేట్ చేస్తుంది. నేడు దృశ్య మాధ్యమంలో గ్లోబల్ కంపెనీలు, పెట్టుబడులు, ముంచేయటాలు, స్త్రీలకు స్త్రీలే శత్రువులు వంటి ధోరణులు ఉన్నాయి. కావున మంచి సాహిత్యం అనేది ఇంకా పఠన మాధ్యమంలోనే వస్తున్నది.

***సినిమా, టీవీ సాహిత్యంపై విమర్శ ఎలా ఉండాలి?***

విమర్శకులు సినిమా సాహిత్యాన్ని దాదాపు విస్మరించారు. విమర్శ రావడంలేదు. రావాల్సిన అవసరం ఉంది. సినిమా సమీక్షలంటూ వస్తున్నవాటిలో వస్తు సమీక్ష లేకుండాపోతోంది. ఇది ఫలానా హీరో కెరీర్‌ను మలుపుతిప్పే సినిమాలాంటి వ్యాఖ్యానాలకే పరిమితమవుతున్నారు. టీవీ సీరియల్స్ పరిస్థితీ అంతే. చాలా బలహీనమైన వస్తువులతో నడుస్తున్నాయి. సినిమా సాహిత్యాన్ని విమర్శించాల్సిన బాధ్యత విమర్శకులపై ఉంది. కానీ పూనుకోవడం లేదు. నేడు సీమ కథలు హిట్టవుతున్నాయి. కోస్తావాళ్లకు అది ఫిక్షన్. వాటిలో మానవ సంబంధాలు, జీవితమే ఉండవు. డబ్బు రావడమే పరమార్థం.

***రచయితలు, కవులే విమర్శకులుగా ఉండడం వల్ల సబ్జెక్టివిజమ్ కనిపిస్తోందన్న విమర్శపై మీ అభిప్రాయం?***

ప్రతి రచయితా విమర్శకుడే. నన్నయ్యనుంచీ ఇది వుంది. రచయిత తను రాసే రచనకు కూడా ఏ వస్తువు తీసుకోవాలి, ఏ దృక్పథం అనుసరించాలి అనేవి ఆలోచిస్తాడు. ఇదంతా కూడా విమర్శలోకే వస్తుంది. సినారె తన శైలిలో 'కప్పి చెప్పేది కవిత్వం, విప్పి చెప్పేది విమర్శ' అన్నారు.

***రా.రా.ను క్రూరమైన విమర్శకుడంటారు?***

నిజమే. రచననొదిలిపెట్టి రచయిత మీదుగా వెళ్లే ధోరణి ఆయనతోనే మొదలైంది. గురజాడ గురించే అలా రాశారు. రారా, త్రిపురనేని మధుసూదనరావు లాంటివారు రచనతోపాటు రచయితపై కూడా విమర్శ చేసేవారు. ఎందుకిలా అంటే 'ఇవాళ ప్రతీప శక్తులు పుంజుకుంటున్నాయి. వారిని నైతికంగా దెబ్బతీస్తేతప్ప ఎదుర్కోవడం సాధ్యంకాదు' అని రారా అనేవారు. ఇది ఆమోదయోగ్యంగా అనిపించేది కాదు.

***తెలుగు నవల నిరాశను మిగిల్చిందంటారా?***

మన నవలలు పెద్ద కథలు. గొప్ప నవలలు తక్కువ. శాఖోపశాఖలుగా విస్తరించి జీవితాన్ని చెప్పిన నవలలు మరీతక్కువ. మాలపల్లి, అతడు ఆమెలాంటి కొద్ది నవలలే ఆ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయి. భావాల పరంగా మనం వ్యతిరేకించవచ్చు గానీ విశ్వనాథ వేయి పడగలులో ఆర్థిక సామాజికాంశాలన్నీ ఉన్నాయి. జీవిత పార్శ్వాలన్నీ ఉన్నాయి. మాలపల్లి రచయిత గాంధీయిస్టు. కానీ సమకాలీన మార్క్సిజం కూడా రాశారు.

***ప్రపంచ స్థాయిలో నేడు వస్తున్న విమర్శ పరిస్థితి?***

విదేశాలలో సాహిత్య విమర్శ పరిస్థితి మనకంతగా తెలియదు. స్ట్రక్చరలిజం, రీస్ట్రక్చరలిజం అనేవి ప్రధానంగా ఉన్నాయి. డీస్ట్రక్చరలిజమూ ఉంది. ఏతావాతా మనుషులు ఇంకా విడిపోవాలి. వ్యక్తి స్థాయికి చీలిపోవాలి అనేది పోస్టు మోడర్నిస్టుల మాట.

***యూనివర్శిటీలో వస్తున్న పరిశోధనల పరిస్థితి?***

యూనివర్శిటీలో ఇప్పుడెవ్వరూ ప్రాచీన సాహిత్యాన్ని పరిశోధించడంలేదు. అక్కడి సంప్రదాయవాదులు కూడా ఆధునిక సాహిత్యాన్నే పరిశోధిస్తున్నారు. కానీ టూల్స్ ఆధునికమైనవి కాదు. దీనికి విద్యార్థులను తప్పుపట్టాల్సిన పనిలేదు. కారణం అధ్యాపకులే. వీటిలో కూడా కొన్ని వాసి కలిగినవి వస్తున్నాయి. ఇటీవల అప్సర్, సుంకిరెడ్డి నారాయణరెడ్డి వంటివారు రాసినవి మంచి విమర్శలు.

**ఇంటర్వ్యూ : టి. ఏడుకొండలు**

V

# నా కన్నీటి వెనుక...




చెరుకుమల్లి సింగా

ప్రియమైన నాన్నకు...
నీ జ్ఞాపకాల నుండి
ఇక్కడికొచ్చాక
కొన్ని విషాదక్షణాల్లో
భుజ్ మహానగరమంతా
నూరు తూటాలు దిగిన గుండెలా
భూమిలోకి శిథిలమయింది నాన్నా...
మొత్తం ప్రపంచమంతా
భూమిలోకి కూలిపోతున్నట్టు భ్రాంతి
ఒక్క మహానగరమేకాదు
గుజరాత్ రాష్ట్రమంతా రక్తసిక్తమై
శిథిలాల్లో చిక్కుకుంది
కోటానుకోట్ల ఆశల ఊహల్లో
జీవించే వేలాది మానవ
రూపాలు మరేనాటికి
కనుపించని దూరాలకి
వెళ్ళాయి నాన్నా...
వందలాది నిలువెత్తు భవనాలు
నిలువునా పుడమిగుండెల్లో
ఒదిగిపోయాయ్
ఢమఢమా అంటూ కూలిపోతున్న
భవనాల్లో నిలిచిన
భరతమాత ముద్దుబిడ్డల ఆర్తనాదాలు
అణువణువులో ఇంకా వినిపిస్తూనే వున్నాయి నాన్నా
వందలాది చిన్నారి బిడ్డలు
రక్షించండంటూ
ఆకాశం చీలేలా పెట్టిన
ఆర్తనాద దృశ్యం నాకన్నుల్లో
నిలచిపోయింది నాన్నా...
. . .
నాన్నా... నువ్వు ప్రేమించే
ఏదేవుడూ...
మొత్తం నాదేశ ప్రజలు ప్రేమించే
ఏదేవుళ్ళూ
ఇక్కడి వారిని రక్షించలేకపోయారు
మన మహామహా నాయకుల
సంతాపాలు
వీడియోల ముందు నాటకాలు
బాగానే సాగాయి
కానీ నాన్నా... మన వీరుల త్యాగాలు
అనురాగాలు... ప్రేమలు
మాకు కొత్త జీవితాన్ని ప్రసాదించాయి.
మొత్తం ఈ నా ప్రజల
కోట్లాది సంతాపాలు... సహకారాలు
తీయని అనుభూతిని కలిగించాయి
. . .
నాన్నా... చివరిగా ఓ చిన్నమాట...
నా ప్రియమైన శ్రీమతి
చిన్నారి రాకేష్‌ల కోసం
ఎంత వెతికినా ఛిద్రమైన శిథిలాలు
వెక్కిరిస్తున్నాయి నాన్నా...
అయినా నా కన్నీటివెనుక
వారి రూపాలు పదిలమే నాన్నా...

## సంస్మరణ

# నల్లజాతి వేదనాస్వరం

# రిచర్డ్ రైట్



*1930వ దశకంలోని పెట్టుబడిదారీ మహా సంక్షోభం అనంతర సామాజిక సైద్ధాంతిక వెల్లువ ప్రభావంతో ఆయన రచనలు రూపుదిద్దుకున్నాయి. అమెరికా దక్షిణ ప్రాంతంలో జిమ్‌క్రో క్రూర చర్యలు, ఉత్తర ప్రాంతంలోని నగరాలలో నివసించే నల్లజాతీయుల దుర్భర పరిస్థితులను రైట్ తన రచనల ద్వారా జాతి చైతన్యంలో భాగంగా చేశారు. ఆయన రచనలు ఎంతో సందర్భోచితంగా ఉండేవి. ఎంతో శక్తిమంతంగా, నల్లజాతి ప్రజల స్థితిగతులపట్ల ఆగ్రహాన్ని ఆయన తన రచనల్లో వ్యక్తం చేశారు.*

**విజయరావు**

అమెరికా నల్లజాతి ప్రజలు అనుభవిస్తున్న కడగండ్లను అత్యంత ప్రతిభావంతంగా చిత్రీకరించిన ప్రఖ్యాత నవలా రచయిత రిచర్డ్ రైట్. ఈ కృషిలో ఆయన విజయవంతం కావడానికి ఒక ప్రధాన కారణం ఆయన నేపథ్యమే. ఆయన తాతలు బానిసలుగా పనిచేసి ఆ తర్వాత విముక్తి పొందారు. తండ్రి మిసిసిపిలో ఒక కౌలు రైతు. ఇలాంటి కుటుంబం నుండి వచ్చిన రైట్ చదువుకున్నది కూడా అంతంత మాత్రమే. పన్నెండేళ్ళ వయసు వచ్చేనాటికి ఆయన స్కూలుకు వెళ్ళింది మహా అయితే ఒక సంవత్సరం మాత్రమే. మరో ఐదేళ్ళకు అంటే పదిహేడేళ్ళకు ఎనిమిదో తరగతి పాసవడంతో ఆయన సంప్రదాయ స్కూలు విద్య ముగిసింది. కాని నలభై ఏళ్ళు వచ్చేసరికే ఆయన అమెరికా సాహిత్యరంగంపై ఆధిక్యత సంపాదించాడు. ఏడేళ్ళవ్యవధిలో నాలుగు పుస్తకాలు ప్రచురించాడు. ప్రతి ఒక్కటీ అద్భుతమైన విజయం సాధించింది. ఆయన మొట్టమొదటి నవల 'నేటివ్ సన్' (భూమి పుత్రుడు). 1940లో బయటికొచ్చింది. రోజుకు 2000 కాపీల చొప్పున అమ్ముడుపోయిన ఆ పుస్తకం అమెరికా చరిత్రలోనే అత్యధికంగా అమ్ముడుపోయిన నల్లజాతి రచయితగా రైట్‌ను నిలబెట్టింది. 1945లో ఆయన ప్రచురించిన 'బ్లాక్‌బాయ్' (నల్లజాతి బాలుడు) అంతకు మించిన విజయం సాధించింది. ఈ నవల ఐదు లక్షల కాపీలు అమ్ముడయింది. అమెరికా దక్షిణ ప్రాంతంలో తన చిన్ననాటి స్మృతులనే ఈ నవలలో ఆయన చిత్రించారు. 1938లో ప్రచురించిన 'అంకుల్ టామ్స్ చిల్డ్రన్' (అంకుల్ టామ్ పిల్లలు) అన్న నవలికల సంకలనం కార్మికుల జీవితాలను చిత్రించింది. '12 మిలియన్ బ్లాక్ వాయిసెస్' అన్న నవల మహావలసను అద్భుతంగా చిత్రించింది. అదే అంశంపై వచ్చిన జేమ్స్ అగీ, వాకర్ ఎవాన్స్‌ల 'లెటజ్ నౌ ప్రెయిజ్ ఫ్యామస్ మెన్' లాంటి మేటి నవలల సరసన నిలిచింది.

రిచర్డ్ రైట్ తనంత తానుగా రచనలు చేసుకుంటూ తనలో తానే నిమగ్నమై పోలేదు. ఆయన అనేకమందిపై తన ప్రభావాన్ని చూపారు. 1935లో ఆరంభమయిన చికాగో రినాయసెన్స్ అనే విశిష్ట నల్లజాతి సాహిత్య ఉద్యమానికి ఆ సమయంలో అదే నగరంలో నివసించిన రైట్ ప్రధాన ప్రేరకుడు. అంతేకాదు- బాల్ట్‌విన్, నెల్సన్ ఆల్‌గ్రెన్, కాల్ఫ్ఎలిసన్, గ్వెండోలిన్ బ్రూక్స్ లాంటి ప్రముఖ రచయితలను ఆయన ప్రోత్సహించి ముందుకు తెచ్చారు. రైట్ గురించి బాల్ట్‌విన్ ఇలా రాశారు: ''ఆయన నల్లజాతీయుడు. ఆయన ఒక రచయిత. నల్లజాతీయుడు రచయితగా విజయం సాధించగలడని ఆయన నిరూపించారు. ఆయన రచనలు 'నేటివ్ సన్', 'బ్లాక్‌బాయ్' నేడు క్లాసిక్స్‌గా పరిగణించ బడుతున్నాయి. నల్లజాతి సాహిత్య చరిత్రను తీర్చిదిద్దడంలో 'నేటివ్ సన్' అత్యధిక ప్రభావం చూపింది. సాహిత్య రంగంలో విజయాలన్నింటినీ ఆయన నలభైఏళ్ళలోపునే సాధించాడు. 1945లో ఆయన భార్యను, నాలుగేళ్ళ కుమార్తెను వెంటబెట్టుకొని పారిస్ వలస వెళ్ళారు. ఆఫ్రికా దేశమయిన ఘనాలో ఆ దేశానికి స్వాతంత్ర్యం రావడానికి ముందు పర్యటించి ''బ్లాక్ పవర్'' (నల్లజాతి అధికారం) అన్న నాన్‌ఫిక్షన్ గ్రంథాన్ని రచించాడు. 1988 నుండి ఇప్పటివరకు రైట్ జీవితంపైనే ఐదు గ్రంథాలు ప్రచురించ



"కమ్యూనిస్టు పార్టీని వదిలిపెట్టిన తర్వాత ఎక్కడికి వెళ్ళాలో నాకు అర్థం కాలేదు" అని రైట్ చెప్పారంటే ఆ అనుబంధం ఎంత ప్రగాఢమైందో అర్థం చేసుకోవచ్చు.

బడ్డాయంటే ఆయన ప్రభావాన్ని అర్థం చేసుకోవచ్చు.

రిచర్డ్ రైట్ కేవలం రచయిత మాత్రమే కాదు. ఆయన రచనలకు సాహిత్యపరమైన ప్రాధాన్యతేకాకుండా, సామాజికపరమైన ప్రయోజనం కూడా మెండుగా ఉంది. ఆయనలో తిరుగుబాటు తత్వం మూర్తీభవించివుంది. ఆ తిరుగుబాటు ధోరణి ఆయన రచనల నిండా తొణికిసలాడుతుంటుండేది. ఆయన అక్షరాలను ఆయుధాలుగా ఉపయోగించాడు. ఆయనలో ఈ ధోరణిని ప్రోత్సహించిందీ, పెంపొందించిందీ కమ్యూనిస్టు పార్టీతో ఆయనకున్న అనుబంధమే. కమ్యూనిస్టు పార్టీకి చెందిన కొన్ని సంఘాలలో ఆయన ప్రధాన పాత్ర నిర్వహించారు కూడా. 1930వ దశకంలోని పెట్టుబడిదారీ మహా సంక్షోభం అనంతర సామాజిక సైద్ధాంతిక వెల్లువ ప్రభావంతో ఆయన రచనలు రూపుదిద్దుకున్నాయి. అమెరికా దక్షిణ ప్రాంతంలో జిమ్‌క్రో క్రూర చర్యలు, ఉత్తర ప్రాంతంలోని నగరాలలో నివసించే నల్లజాతీయుల దుర్భర పరిస్థితులను రైట్ తన రచనల ద్వారా జాతి చైతన్యంలో భాగంగా చేశారు. ఆయన రచనలు ఎంతో సందర్భోచితంగా ఉండేవి. ఎంతో శక్తిమంతంగా, నల్లజాతి ప్రజల స్థితిగతులపట్ల ఆగ్రహాన్ని ఆయన తన రచనల్లో వ్యక్తం చేశారు. 'నేటివ్ సన్' నవలలో కథానాయకుడు 'బిగ్గర్'. రైట్ ఈ నవలలో బిగ్గర్‌ను తయారు చేసిన ప్రపంచం గురించి కాక, ఈ ప్రపంచంపట్ల బిగ్గర్ వైఖరి, అవగాహనలకే ప్రాధాన్యతనిచ్చారు. ఈ నవలలో బిగ్గర్ అంతర్మధనం అద్భుతంగా చిత్రీకరించబడింది. తన ఆవేశపూరిత లక్ష్యాలకు హేతుబద్ధమైన కారణాల గురించి బిగ్గర్ ఆలోచిస్తాడు. బిగ్గర్ తన చర్యలకు చట్టపరమైన, మతపరమైన, సైద్ధాంతిక పరమైన వ్యాఖ్యానాలు చేసుకుంటాడు. కాని, వాస్తవాలకీ ఆ వ్యాఖ్యానాలకూ పొంతన కుదరకపోవడంతో వాటన్నింటినీ బిగ్గర్ చివరికి తిరస్కరిస్తాడు. ఈ విధంగా రైట్ తన నవలకు కుహనా తాత్వికతకు బదులు వాస్తవికమైన పునాదిని కల్పిస్తారు. 'బ్లాక్ బాయ్' నవల కూడా ఇటువంటిదే. సైమన్ డి బొవాయిర్ చెప్పినట్లు "వ్యక్తి చైతన్యం, వ్యక్తి స్వేచ్ఛ" ఈ నవలలో వివరించబడ్డాయి. చాలా మంది భావించేట్లు ఈ నవల దక్షిణ ప్రాంతంలో రైట్ అనుభవించిన జాతి దురహంకార నేరాల జాబితా కాదు. ఆనాటి వాతావరణంలో బిక్కుబిక్కుమంటూ ఉండే ఓ పసివాడి మానసిక స్థితి అక్కడ చిత్రించబడింది. ఏడేళ్ళ వయస్సులో తండ్రి వదిలేశాడు. గుండె జబ్బుతో బాధపడే తల్లి. బంధువుల నుండి ఎటువంటి ఆప్యాయతలకు నోచుకోక పోవడం. అమ్మమ్మ నుండి ఎప్పుడూ చివాట్లు. రైట్ ఎంతో సున్నిత మనస్కుడు, మొహమాటస్తుడు కాని, ఎంతో తెలివైనవాడు. అదే సమయంలో సమస్యాత్మక బాలుడు కూడా. రైట్ తన కుటుంబాన్ని వదిలేశాడు. కుటుంబం ఆయనను వదిలేసింది. 'బ్లాక్ బాయ్' నవలలో బాల్యంలో ఉన్న రిచర్డ్ తన తల్లిని అడిగే ప్రశ్నలు ఈ ప్రభావానికి అద్దం పడతాయి. తాము అనుభవిస్తున్న జాతి వివక్ష గురించి రైట్ నుండి వచ్చే నిశితమైన ప్రశ్నలకు సమాధానం చెప్పలేని తల్లి 'పనికిమాలిన ప్రశ్నలు ఆపుచేస్తావా' అని కసురుకునేది. కమ్యూనిస్టు పార్టీని కూడా ఇలాగే ఆయన ప్రశ్నలతో ముంచెత్తేవారు. చివరికి ఆయన కమ్యూనిస్టు పార్టీని వదిలి పారిస్ వెళ్ళిపోయారు. కాని, కమ్యూనిస్టు పార్టీతో తన అనుబంధాన్ని, కుటుంబ అనుబంధంగా భావించానని, నిజజీవితంలో లభించని కుటుంబపరమైన అనుబంధాన్ని మానసికంగా తాను అక్కడ పొందానని ఆయన చెప్పారు. "కమ్యూనిస్టు పార్టీని వదిలిపెట్టినతర్వాత ఎక్కడికి వెళ్ళాలో నాకు అర్థం కాలేదు" అని రైట్ చెప్పారంటే ఆ అనుబంధం ఎంత ప్రగాఢమైందో అర్థం చేసుకోవచ్చు. పార్టీ నుంచి బయటకు వెళ్ళినా చివరివరకు కమ్యూనిస్టు అభిమానిగానే ఉన్నారు. చివరికి తన కుటుంబానికి కూడా దూరమయిన రైట్ ఏభైరెండేళ్ళ వయసులో గుండెపోటుకు గురయి, పారిస్‌లోని ఒక ఆసుపత్రిలో కన్ను మూశారు. అమెరికా నల్లజాతి ప్రజల హృదయాలలో ఆయన స్థానం నేటికీ చెక్కుచెదరలేదు. ఇటీవల కాలంలో ఆయన రచనలు మరింత ప్రశస్తిని సంతరించుకున్నాయి.

***(న్యూయార్క్ టైమ్స్ బుక్ రివ్యూ వ్యాసం ఆధారంగా)***

V

## నా పరిశోధన

# “తెలుగులో భక్తి కవిత్వం-సామాజిక విశ్లేషణ”

*తమ సమకాలంనాటి మతోద్యమాలతో స్ఫూర్తిపొంది, విస్తారమైన సాహిత్యరచన చేసిన వీరశైవ, వైష్ణవ మతోద్యమకవులను సవిమర్శకంగా అధ్యయనం చేయాలన్న సంకల్ప ఫలితమే “తెలుగులో భక్తి కవిత్వం-సామాజిక విశ్లేషణ.”*

**డా. పిల్లలమర్రి రాములు**
హైదరాబాద్ విశ్వవిద్యాలయం

సాహిత్య పరిశోధన ఈనాడు కేవలం శాబ్దిక చర్చలకో, ఆలంకారిక సంప్రదాయాల అధ్యయనానికో మాత్రమే పరిమితమైలేదు. కవులు, రచయితలు తమ సమకాలం నాటి సామాజిక దృగ్విషయాలకు స్పందించి సృజనాత్మక రచనలు చేపట్టినట్లే ఆధునిక పరిశోధకులు సహితం తమ కాలంలో ఎదురవుతున్న ప్రశ్నలకు సమాధానాలు అన్వేషించడానికి, ఆయా సామాజిక సమస్యలను చర్చించిన తీరును పరిశీలించడానికి కృషి సల్పుతున్నారు. ఒక కవి తన సాహితీ సృజన సమయంలో తానున్న సాహిత్య వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకున్నట్లే ఆధునిక పరిశోధకులు సహితం తామున్నరంగంలో తమ కాలంనాటికి జరిగిన పరిశోధనలను గమనంలో ఉంచుకునే తాము నిర్వహించ దలిచిన పరిశోధనను కొనసాగిస్తారు. ఆ సందర్భంలో తమకెదురైన అనేక ప్రశ్నలకు సమాధానాలను అన్వేషించుకుంటారు. ఆ రకంగా తమ భావాలకు ఒక సైద్ధాంతిక నేపథ్యాన్ని, తాత్త్విక దృక్పథాన్ని అలవర్చుకుంటారు. అందులోనూ తమ పరిశోధనను ప్రాచీన సాహిత్యంపై చేయాలని భావిస్తే ఆ కవులను కేవలం తమ ప్రాంతానికి సంబంధించినవీ, తమ జీవితాన్ని ప్రభావితం చేసినవేగాక భారతదేశమంతటా పరివ్యాప్తమై ఉన్న భావాలు కూడా ఎలా ప్రభావితం చేశాయని సూక్ష్మంగా పరిశీలిస్తారు. తమ సమకాలంనాటి మతోద్యమాలతో స్ఫూర్తిపొంది, విస్తారమైన సాహిత్యరచన చేసిన వీరశైవ, వైష్ణవ మతోద్యమకవులను సవిమర్శకంగా అధ్యయనం చేయాలన్న సంకల్ప ఫలితమే ‘‘తెలుగులో భక్తి కవిత్వం-సామాజిక విశ్లేషణ.’’

భారతీయ సామాజిక వ్యవస్థను అత్యంత శక్తివంతంగా ప్రశ్నించిన మతం - వీరశైవం. కులవిధానాన్ని, తజ్జనితంగా వచ్చే ఉచ్చనీచ భేదాలను ఆక్షేపించిన మతమది. కులవిధాన నిరసనతో ప్రారంభమైన ఈ మతోద్యమం వేదాలను, ఆధిపత్యతాత్త్విక సంప్రదాయాలను, ఆలంకారిక శాస్త్ర మర్యాదలను నిరాకరించి, ఒక నూతన దృక్పథానికి పునాదులు వేసింది. శ్రమించడమే దైవారాధనమని, అన్ని వృత్తులూ ఉత్తమమైనవేనని, వృత్తుల ద్వారానే ‘కుల’మనే భావన ఏర్పడిందని, కులాన్ని బట్టి మనిషి గౌరవాగౌరవాలను నిర్ణయించ కూడదని, ఏ వృత్తి అయినా భగవంతుని దృష్టిలో ఉత్తమమైనదేనని వీరశైవం ప్రతిపాదించింది. ఆ రకంగా సామాన్య వృత్తుల వారి మనోస్థైర్యాన్ని పెంపొందిస్తూ ‘కులరహిత’ విధాన సామాజిక స్థితికి ప్రాతిపదిక వేసింది.

ఈ క్రమానికి కించిత్ భిన్నంగా కుల వ్యవస్థలో ఏ వృత్తివారయినా ఏ సామాజిక స్థితి కలిగి ఉన్నవారయినా భగవదారాధన ద్వారా ఉత్తమకుల స్థాయిని సాధించవచ్చని వైష్ణవమతం ప్రచారం చేసింది. ఈ రెండు మతాలు ఆంధ్రదేశ సామాజిక జీవితాన్ని, కొందరు సాహితీ వేత్తలను ప్రభావితం చేశాయి. వీరశైవమతానికి పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాథుడు ప్రచారకులైతే, వైష్ణవమతానికి సామాజికాచరణలో బ్రహ్మనాయుడు, సాహిత్య సృజనలో అన్నమాచార్యులు బలమైన ప్రతినిధులు.

### సామాజిక చైతన్యదిశలో వీరశైవ, వైష్ణవ మతాలు

వీరశైవ, వైష్ణవ మతాలు రెండూ భిన్నమైనవైనప్పటికీ ఆ రెండు మతాలూ ప్రారంభమైంది తమిళ ప్రాంతం నుండే. శైవభక్తిని నయనార్లు, వైష్ణవ భక్తిని ఆళ్వార్లు ప్రచారం చేశారు. నయనార్లు ప్రచారం చేసిన శైవభక్తి సంప్రదాయం ఆనాటికే స్థిరపడిన కాలాముఖ, కాపాలిక సంప్రదాయాల నుండి కన్నడప్రాంతంలో వీరశైవ మతం రూపుదిద్దుకుంది. దీనిని బహుళ వ్యాప్తం చేసిన వ్యక్తి బసవేశ్వరుడు. ఆతడికి తోడ్పడినవారు - జడరదాసమయ్య, అల్లమప్రభు, అక్కమహాదేవి, చెన్నబసవన్న ఇతర వీరశైవ శరణులు. వీరు విశ్వాసాలకంటే ఆచరణకు, అధ్యయనంకంటే అనుభవానికి, సుఖలాలసతకంటే శ్రమజీవనానికి అధిక ప్రాధాన్యమిచ్చి నూతన సంస్కృతిని ప్రచారం చేశారు. కులవిధానాన్ని అత్యంత తీవ్రంగా గర్హించారు. తమ భావాల ప్రచారానికి ఛందోబద్ధ పద్యాలకంటే సులభవచనాలను వాహికలుగా చేసుకుని సామాన్యజనానికి చేరువయ్యారు. అదీ సాధారణ స్థాయిలో గాకుండా ఒక ఉద్యమంలా కొనసాగించడంవల్లనే కన్నడ ప్రాంతాన్ని అత్యధికంగా ప్రభావితం చేయగలిగారు. ఆ భావాలకు ఆకర్షితుడయ్యే మల్లికార్జున పండితారాధ్యుడు వీరశైవాన్ని ఆంధ్రదేశానికి పరిచయం చేశాడు. ఆయన సామాజిక రంగంలో గాఢమైన

ప్రభావాన్ని వేయగలిగినట్లుగాని, పెద్ద అనుచరగణాన్ని ఏర్పర్చుకున్నట్లుగాని, ఆయన జీవిత చరిత్ర (పండితారాధ్య చరిత్ర) విశదపర్చడంలేదు. కాని, తన భావాలను సాహితీలోకానికి అందించగలిగాడు. 'శివతత్త్వసారం' కావ్యం ద్వారా వీరశైవ భావాలను ప్రచారం చేస్తూ భక్తి మార్గాన్ని అనుసరించే వ్యక్తులలో తారతమ్యాలు లేవన్నాడు. తదనంతర కాలంలో ఈతడి ఆలోచనా విధానాన్ని, బసవేశ్వరుడి సంప్రదాయాన్ని గ్రహించి అనేక నవ్యభావనలను పాల్కురికి సోమనాథుడు సమర్థవంతంగా అందించాడు. సామాజికంగా సోమనాథుడు కుల వ్యవస్థను అత్యంత తీవ్రంగా గర్హిస్తూ రచనలు చేశాడు. తనను 'ఈశ్వరకులజు'నిగా ప్రకటించుకున్న తొలి తెలుగు సాహితీవేత్త సోమనాథుడు. తనకాలం నాటికే స్థిరీభూతంగా ఉన్న సంస్కృత ఆలంకారిక సంప్రదాయాలను త్రోసిపుచ్చి సమకాలిక ఇతివృత్తాన్ని స్వీకరించి నన్నయ్య మార్గానికి భిన్నమైన మార్గాన్ని సాహితీలోకంలో సుప్రతిష్ఠితం చేశాడు. తాను లిఖిత సంప్రదాయానికి చెందినవాడు కావడంవల్ల అనివార్యంగానే సంస్కృత మర్యాదలు కొన్నీ, అనుసరించే మతం సాధారణ ప్రజలకు సంబంధించింది గావడంవల్ల జానపద ఫణితులు కొన్నీ చేరి 'దేశి' సాహిత్య మార్గం రూపొందింది. ఇది సోమనాథుడు తెలుగు సాహిత్యానికిచ్చిన ప్రత్యేక కానుక.

**వైష్ణవం**

మరొక వైపు వైష్ణవమతాన్ని సామాజికంగా తొలిసారి ఆచరించి, చాపకూడు నిర్వహించి, అన్ని వర్గాల నుండి శక్తివంతులైన వ్యక్తులను ఉన్నతస్థానాల్లో నియమించడానికి బ్రహ్మనాయుడు జరిపిన కృషి అసాధారణం. బసవేశ్వరుడి కృషికి తుల్యమైన కృషిని సంకల్పించినవాడు బ్రహ్మనాయుడు. రాజ్యంపై ఆధిపత్య స్థిరీకరణకోసమా లేక వైష్ణవమత వ్యాప్తికై ఈ సంస్కరణ చేపట్టాడా అనేది సందిగ్ధంగానే ఉన్నా, వైష్ణవమతానుయాయి అయిన బ్రహ్మనాయుడు ఈ కార్యాన్ని చేపట్టడంవల్ల ఆ మతానికి కూడా సంస్కరణ గౌరవం లభించింది. బ్రహ్మనాయుడి తర్వాత సామాజిక రంగంలో వైష్ణవమత ఆచారాలను పాటించిన వ్యక్తులు కనిపించరు. తర్వాతికాలంలో కొద్దిభాగం కృష్ణమాచార్యులు, విస్తృతంగా అన్నమాచార్యుల రచనల్లో మాత్రమే వైష్ణవమత భావాలు కనిపిస్తాయి.

ఈ రెండుమతాల వారు ప్రతిపాదించిన భావాల్లోని అనేక సామ్యాలు పరిశీలిస్తే ఆశ్చర్యం వేస్తుంది. సామాజిక జీవితంలో వారు ఆశించిన విధానాన్ని గుర్తిస్తే ఆనందం కలుగుతుంది.

**దేవాలయాలు**

వీరశైవ మత ప్రచారకులు దేవాలయ సంస్కృతిని నిరసించారు. రాజులు, సంపన్న గృహస్థులు మాత్రమే దేవాలయాలు నిర్మించగలరు. శ్రమించి జీవించే భక్తుడు దేవాలయం నిర్మించలేడుగదా?

కలవారు శివాలయము కట్టెదరు
నేనేమిసేయుదు బడుగునయ్యా
నా కాలే కంభము దేహమే దేవళము
తలయే పైడి కలశమయ్యా....

స్థావరము చెడుగాని జంగము చెడదయ్యా... అంటూ తాను దేవాలయం నిర్మించలేనని, తన శరీరాన్ని దేవాలయంగా భావించమని, స్థిరంగా ఉండే దేవాలయం కూలిపోతుంది, సంచరించే జంగముడే చిరకాలం ఉంటాడని బసవన తెలిపాడు. జంగముడు దైవానికి మరో రూపమని తలచాడు. సరిగ్గా అన్నమయ్యగూడ,

"దేవుడా నా దేహమే నీకు తిరుమలగిరి పట్టణము
భావింప హృదయ కమలమే బంగారపు మేడ
నీవున్నచోటే వైకుంఠము నెరసులు మరిచోరరాదు
పావనమని చెప్పేది వేదము పాలించంగ వలెను" అని రాజులచేత, సంపన్నుల చేత నిర్మితమయ్యే దేవాలయాలపట్ల ఆక్షేపణ వ్యక్తం జేశాడు.

**కులం :** కులాన్ని గూర్చి ప్రస్తావిస్తూ,

"కాచి కుమ్మరియయ్యే-ఉతికి చాకలియయ్యే
చెవినుండి యూడిపడినవారు- కలరే భువిపై" అనీ,
విప్రుని మొదలంత్యజునిదాక
శివభక్తులగు వారినెల్ల ఒకటేయంటి
పాఱునిమొదలు శ్వపచుని వరకు
భవియగువానిని ఒకటేయంటి-నా మనసిట్లని నమ్మవయ్యా"

అంటూ బసవేశ్వరుడు పలికితే,

"ఒండేమి భక్తిసంగతిఁ
జండాలుండైన భూతి- శాసనధరుడై
యుండినఁ బూజ్యుడె యతనిన్
ఒండనగాఁ జనదు భక్తి యోగమున శివా!" అని పండితారాధ్యుడు ప్రబోధించాడు. ఈ భావాలనే అన్నమయ్య

"యెక్కువ కులజుండైన హీనకులజుండైన
నిక్కమెరింగిన మహానిత్యుండె ఘనుడు
వేదములు చదివియును విముఖుండై హరిభక్తి
యాదరించని సోమయాజికంటే
యేదియునులేని కులహీనుండైనను విష్ణు
పాదములు సేవించు భక్తుండె ఘనుడు" అని పేర్కొంటాడు. ధనం, విద్యలు మానవుడిలో అహాన్ని పెంచుతున్నాయని గుర్తించిన అన్నమయ్య వ్యక్తిఔన్నత్యానికి అవి గీటురాళ్ళుగావని,

"కులమెంతగలిగెనది కూడించుగర్వంబు
ధనమెంత గలిగెనది దట్టమౌలోభంబు
ఘనవిద్యగలిగినను కప్పుఁబైపైమదము
సిరులెన్ని గలిగినను చింతలేపెరుగు"నని పీడిత కులాలపట్ల అనాదరణ చూపగూడదనేకాదు, కులంవల్ల వచ్చే ఆధిపత్య భావాలను నిగ్రహించుకోవాలని, సమరసభావాలను ఏర్పర్చుకోవాలని చెబుతాడు. ఈ రెండు మతాలు శ్రమజీవనాన్ని ఉదాత్తీకరించాయి.

**శ్రమజీవనం**

పాల్కురికి సోమనాథుడు వ్యవసాయాన్ని, వాణిజ్యాన్ని, విద్యావర్తనాన్ని నిర్వహించుమంటూ,

"వలయుం గృషివాణిజ్యకు

శల విద్యావర్తనములు సలుపగ సధ్భ

క్తులకర్థం బార్జింపగ

నిలభక్తార్థంబె కానయెలమి మహాత్మా" అనీ,

"అర్థార్థము వ్యవసాయం

బర్థము జంగమహితార్థమదియును సధ్భ

క్త్యర్థము, సధ్భక్తియు ము

క్త్యర్థం బటుగానవలయు వ్యవసాయమిలన్" అని శ్రమించడం భక్తితో సమానమని బోధిస్తే,

"మహినుద్యోగిగావలె మనుజుడైనవాడు

సహజివలెనుండేమీ సాధింపలేడు" అంటూ

అన్నమయ్య శ్రమ ప్రాధాన్యాన్నే ప్రవచించాడు. అంతేకాదు, ఈ ఇరుమతాలవారు సంతోషమయ జీవనానికి నూతనార్థాన్నిచ్చారు.

**నిరాడంబరత**

అన్నమయ్య దృష్టిలో సుఖవంతమైన జీవితం అంటే అప్పు లేకపోవడం, దోషరహితంగా డబ్బు సంపాదించగలగడం, ఆవాసయోగ్యమైన ఇల్లు కలిగి ఉండడం-

"అప్పులేని సంసారమైన పాటేచాలు

తప్పులేని జీతమొక్క తారమైనంజాలు

కలతలేని గుడిశొక్క గంపంతైనంజాలు

చింతలేని యంబలొక్క చేరడేచాలు

జతగానితరుణి యేజాతైన నదేచాలు

వితలేని సంపదొక్క వీసమే చాలు"నని పేర్కొంటూ అత్యంత సులభజీవితాన్ని అన్నమయ్య అపేక్షించినట్లే, పాల్కురికి **సోమనాథుడు,**

"ఎన్ని ముఖంబులనర్థముఁ

బన్నుగ బడసియును వారుఁబడసితిమనర

త్యున్నతి గుడువరు, ముడువరు

చెన్నటిపనులకు వ్యయంబుసేయరు భక్తుల్" అని

పలురకాలుగా శ్రమించి డబ్బును సంపాదించినా తాము అధికంగా సంపాదించినట్లు గర్వపడడంగాని, వ్యర్థమైన పనులకు వృధా చేయడంగాని, లోభిలా ప్రవర్తించడంగాని జరపరాదని తెలిపాడు.

**హేతుబద్ధ ఆలోచనలకు ప్రాతిపదిక**

వీరశైవ, వైష్ణవకవులు- వీరితోపాటు భక్తి సంప్రదాయాన్ని పాటించిన రామదాసు, త్యాగయ్యలు, మరొకవైపు వేమన, వీరబ్రహ్మంలు ఆంధ్రదేశ సామాజిక జీవితంపై వేసిన ప్రభావాన్ని అధ్యయనం చేయడం ఈ పరిశోధనలో మరొక భాగం. అన్నమయ్య మొదలుకుని త్యాగయ్య వరకూ కేవల ఆచారాలవల్ల ఆధిక్యత ఏర్పడదన్నారు.

**అన్నమయ్య-**

"మిక్కిలి నీట మునింగే మీనుకది స్నానమా

కొక్కెర ధ్యానము చేసుకోగ అది యోగమా

నిక్కి ఆకుమేయు నిండనది తపమా

పులులు గుహలనుంటే పాల్లింప ఋషులా

యెలుగు గడ్డము వెంచు నింతలోనే యోగ్యుండా

యిలఁబక్షులాకాశానకేగితే దేవతలా" అని ప్రశ్నిస్తే,

**రామదాసు,**

"హెచ్చుగ నూటయెనిమిది తిరుపతిలెలమి తిరుగపని లేదన్నా,

ముచ్చటగా నాపుణ్యనదులలో మునుగుట పనియేమిటి కన్నా" అనడమూ,

**వీరబ్రహ్మం**

"నీళ్లలో మునిగిగొణుగుచునుంటె

నిలకడ చెడునుర ఒరే ఒరే

ఒక్కప్రొద్దులని యెన్నుచునుంటె

ఒనరుగ చెడుదువు ఒరే ఒరే..." అనీ

**త్యాగయ్య**

"నీటకాకిమునుగ - నిరతముదయస్నానమా

తేటకనులు కొంగగూర్చ-దేవదేవ ధ్యానమా

పత్రములను మేయుమేక-బలమైన యుపాసమా

చిత్రపక్షులెగయ సూర్యచంద్రులకు సామ్యమా" అని

వ్యాఖ్యానించగా వీటన్నింటి సారాంశాన్నే తన సహజరీతిలో వేమన

"నీళ్ల మునుగనేల? నిధులమెట్టగనేల?

మొనసి వేల్పులకును మ్రొక్కనేల

కపటకల్మషములు కడుపులోనుండగా" అని

కేవల ఆచారాలలోని డొల్లతనాన్ని ఆక్షేపించి హేతుబద్ధమైన ఆలోచనలకు ప్రాతిపదికవేసిన తీరును ఈ పరిశోధనలో విపులంగా ప్రదర్శించడమైంది.

ఆంధ్రదేశంలో ప్రచారమైన ఈ భావాలు తమ సమకాలం నాటి జీవితాన్ని మరింత వాస్తవికంగా ఆలోచించాల్సిన రీతిని, జీవితాన్ని మరింత తేజోవంతం చేసుకోవాల్సిన ఆవశ్యకతను బోధించినట్లుగా ఈ పరిశోధనలో నిరూపితమైంది.

వీరశైవ, వైష్ణవ మత భావాలకు తుల్యమైన భావాలతోనే క్రీ.శ. 16వ శతాబ్దంలో ఐరోపాలో వచ్చిన ప్రొటెస్టంట్ మతం ఛాందసవాదంపై తిరుగుబాటును లేవనెత్తి నూతన భావవికాసానికి దోహదపడిన తీరును అనేక ఉదాహరణలతో ఈ పరిశోధనలో చర్చించడమైంది. ఆ భావవికాసమే కొత్త సామాజిక విధానానికి కారణమైందన్న మాక్స్ వెబర్ అభిప్రాయాలను (The Protestant Ethic and the Spirit of Capitalism) ఈ పరిశోధనలో పరిశీలించడమైంది.

వీరశైవ, వైష్ణవ మతాలూ ఇతర భక్తి సంప్రదాయాలలోని కవులూ ప్రబోధించిన అంశాలు సామాజిక జీవితాన్ని బలంగా ప్రభావితం చేసినట్లయితే ఇతర దేశాల సాంఘిక సిద్ధాంతాల ప్రమేయం లేకుండానే స్వతంత్ర ఆలోచనలు అభివృద్ధి చెందివుండేవని భావించడానికి కావలసిన అంశాలను తెలుగులో భక్తి కవిత్వం-సామాజిక విశ్లేషణ చర్చించింది. V

## కవితలు

# నల్ల నెత్తుటి తుఫాన్



పొనుగోటి రవికుమార్


ఆకాశాన్ని తాకే సముద్రం
ఇంతకాలం అట్టడుగుకు తొక్కబడింది!
అప్పుడప్పుడు వచ్చే తుఫాన్లు
తీరం తాకకుండనే
అణగదొక్కబడుతున్నాయ్!!
సముద్ర విషాదాన్ని
అలలు ఒడ్డుకు మోసుకొస్తున్నాయ్
ఊరెలుపలున్న అలలు
భూమి నడిబొడ్డును
ముంచి వేయాలని
ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయ్!
గాలులు యుగానికి
ఆపలేని వేగంతో
శూన్యాన్ని పూరిస్తున్నాయ్!
మూడువంతులున్న నన్నే
అణగదొక్కుతూ...
నాకే దిక్కులేదన్న
మీ నాలుగు దిక్కుల్ని ముంచి వేస్తాను!!

ఎడారి వాయుగుండం
భూమండలం బూడిద
గంగ ఎండిపోయింది
భగీరథ ప్రయత్నం!
కార్గిల్ మంచు మంటల్లో
తుపాకుల శవపేటికలు భద్రం
పార్లమెంట్ పెచ్చులూడి
గుజరాత్, ఒరిస్సా అసెంబ్లీని
వెక్కిరించాయి!!
ముఖంలేని మమ్మీ
ముసుగు తీసి
వికృతంగా
ఆవులిస్తూంటే
ఎక్కడో
తెల్లభవనం
విరగబడి నవ్వుతుంది

ఆరేబియా సముద్రములో అల్పపీడనం
చెట్టుకన్ను చెమ్మగిల్లింది
అమ్మ కన్నులా!
రాత్రొచ్చిన ఈదురు గాలులకు
చెట్లు చేతులేత్తైచాయి
ఈడొచ్చిన బిడ్డా పైట లాగేసినట్టు
రాత్రంతా కీచక పర్వం
ఆకుల దుప్పట్లు
గాలిలో కలసి పోయాయి
దూరంగా ఎక్కడో
తుఫాన్ తరువాత ప్రశాంతత!
గాలి అమాయకంగా నవ్వుతుంటే
చెట్లు దీనంగా తలాడిస్తు
ప్రకృతి వికృతి చూస్తుందక్కడ
కాని ఇప్పుడు
చిరుగాలికి కూడ
చెట్లు 'గజగజ'
లాడిపోతున్నాయ్ అక్కడ!!

# పాతపుస్తకాల షాపు

## అడిగోపుల వెంకటరత్నమ్



గమనం ఆగుతుంది
వాహ్యాళి మజిలీ వేస్తుంది
భాషను సుసంపన్నం చేసిన
సాహితీ సంపదరాశులు...
అట్ట రెక్కలు తెగి
క్రిమికీటకాదులు భుజించి
మూల్యం ముద్రలు హరించి
రూపారూప గ్రంథాలు!
వర్షంలో తడుస్తూ
శిశిరంలో వణుకుతూ
గ్రీష్మంలో ఎండుతూ
జీర్ణావతారమై పుస్తకాలు!
దేవులపల్లి భావుకత
గురజాడ దేశభక్తి
చిలకమర్తి సందేశం
రాయప్రోలు ఉపదేశం
శ్రీశ్రీ మరో ప్రపంచం
కందుకూరి సంస్కరణ
చలం స్త్రీ జనోద్ధరణ

పాఠ్యాంశాలు పాలనాగ్రంథాలు
జాతీయ అంతర్జాతీయ జర్నల్సు
అక్కడ కనిపిస్తాయి వినిపిస్తాయి!
బార్టరు పద్ధతిలో
బెల్లానికో ఉల్లిపాయలకో
అణాకాణీకో అర్ధవెలకో
అమ్మిన అమూల్యాలు!
పైక్లాసు పుస్తకాల కొనుగోళ్ళకై
పాసైన విద్యార్థి అమ్మకాలు!
పుస్తకం నిద్రించదు
పుస్తకం మరణించదు
విజ్ఞానం వెదజల్లి
విశ్వదర్శనం చేయిస్తుంది!

అపురూపకావ్యాలు అందించి
ఆర్జనే ధ్యేయంకాని యజమాని
పాఠకుల ప్రియనేస్తం
చదువులమ్మ సేవకుడు!
అరుదైన గ్రంథాలతో
మనిషి నూరేళ్ళ జీవితం
నిండు ఆవిష్కరణ కోరి
పఠనానికి స్వాగతం పలుకుతుంది
పాత పుస్తకాలయం!

---

# తప్పెట

## పున్నమి వెంకటయ్య



అరరే కుర్మా! పర్మా!!
నర్సిగా! నారిగా!!
సర్పంచు సెప్పిండు
సాటింపు సేయాలట
ఊరు చావడికాడ
గుంపు సేయాలట
తప్పెట కొడితే కూలిస్తాడంట!!

అవ్వా! తాతకు సెప్పు!!
సావుకారి సిన్నబిడ్డ
పెద్దమంచైంది
ఊరంత తప్పెటేస్తే
సీసాకట్ల కుంచేడొడ్లిస్తాడట!!

అరే మారిగా!
మీ కులమోల్లికెల్లి జెప్పు
దొరబాబుగారిది పెళ్లి
ఊళ్లు ఊళ్లకు వినపడేలా
తప్పెట్లు కొట్టాలి
పెళ్లి అయ్యాక బోంచేద్దురుగాని
పాతిక రూపాయలిస్తాం!!

అయ్యో! మావా! ఇన్నావా!!
మనూరి బాపనయ్య
తండ్రి సచ్చిండట
సావుమాట సెవినేసి, గుంతదీసి
పాడీ ముంగల తప్పెటకొట్టాలే!

# కసాయి రాజ్యం

**నూకపంగు వెంకయ్య**




క్షణక్షణం గాంధీ పుట్టిన గడ్డ
గడ్డపారై గుండెను తొవ్వుతుంది
కళ్ళముందు సాక్షాత్కరిస్తున్న
విధ్వంసక దృశ్యాలన్నీ
రాజ్యం కళ్ళకు కమ్మిన కాషాయపొరలపై
వినోద చిత్రాలుగా రూపొందుతాయి
కనుచూపుమేర మట్టంతా
ఒడిలో రక్తాన్ని నింపుకుంది
కాలెటు కదిపినా
ఇంకా వెచ్చదనం ఆరని నెత్తుటి మడుగులు
నరికిపారేయబడ్డ దేహాల సముదాయాలు
అల్పప్రాణుల రుధిర రుచికి
ఆకస్మాత్తుగా ప్రాణం పోసుకుంటాయి
ఇతిహాసాల్లోని విగ్రహాలు
ఇక్కడ మనిషి అవయవాలకు
ఫిక్సెడ్ రేట్లుంటాయి
తల తాటికాయలా తెగిపడ్తే నెయ్యి

తమ్ముళ్ళ కాళ్ళూ చేతుల్నీ
యూరియాలా దంచితే సగం వెయ్యి
చెల్లెళ్ళ అంగాలపై ఎవరెక్కువ
బలం ప్రయోగించితే అంత డబ్బు
రేటెంతయినా ఫర్వాలేదు
మనుషుల ప్రాణాల్ని మాత్రం
తుంగలా తుంచేయాలి
సమాజం తెరపై
హంతకుడి చిత్రం స్పష్టమైనా
గంగను నెత్తినెత్తుకున్నోడి సేనల్నీ
రంగ్‌దళాల్నీ పరివారాల్నీ
ప్రజలాగ్రహ లావాల్నుండి రక్షణకు
అవినీతి గొడుగుపడ్తూ

శాంతిపావురమైన భరతతల్లిపైకి
నెత్తుటి అస్త్రాలు సంధిస్తున్న
కసాయి కాషాయ సింహాసనాన్ని
నేలకూల్చాల్సిందే!

# పునీత

**భండారు విజయ**




నేనీ నాటక ప్రపంచానికి
వేషా, భాషజాలు మార్చక
వెన్నెలలా వచ్చిన వేషధారిణిని
ఇక్కడ, కుటుంబమనే
ఇరకు గదిలో చిక్కి
చిత్రమైన మెలకువలు నేర్చిన నటిని
గారాల దొంతరలలో
మైమరచి నాట్యించిన నర్తకిని

అత్తింటి ఆనవాళ్ళను సైతం
ఆదరించిన అనుకూలవతిని
మురిపాలను ప్రేమామృతంతో
రంగరించి మురిపించే అనురాగ మూర్తిని
వేడి నీళ్ళకు చన్నీళ్ళుగా
వృత్తినే ప్రాణంగా ప్రేమించి
భేషజం లేని బాసుని
సబార్డినేటులోని సంశయాన్ని

జన్మనిచ్చిన పిల్లల
సైకాలజికి అనుకూలంగా మారే తల్లిని
స్నేహితుల అభిరుచులను
అతిథుల అనునయాలను
పదిలంగా పంచేనేర్పర్చిని
సుతిమెత్తగా అందరి హృదయాలలో
నిలిచిపోయే ధాత్రిని
కోపమొచ్చినప్పుడు శ్రావణ మేఘమై
సంతోషాదన తొలకరి జల్లునై
దుఃఖంలో బాధాసర్వద్రష్టనై
ప్రతిదినం
వివిధ భంగిమల్లో

మనోభావాలకతీతంగా
వివిధ పాత్రాపోషణలో
ఆరితేరిన మంత్రిని
నిండుగా సాగె సెలయేరుని
నేటి నవనాగరిక పునీతని

శిల్ప దర్శనం

# పరిజ్ఞానం, పరిశీలన కలిస్తేనే కథ...

***టెక్నిక్, శిల్పం పద్ధతి అనేవి ఒక స్థిరమైన ఫార్ములా అనీ, దాన్ని ఏ వస్తువుకైనా అన్వయించి ఓ కథ తయారు చేయవచ్చునీ ఒక భ్రమ. ఉత్తమ శ్రేణి కథల్లో టెక్నిక్, వస్తువులకు అవినాభావ సంబంధం ఉంటుంది. ఒకదానికొకటి ప్రాణప్రదంగా వుంటాయి. ఆ రెండింటి సమ్మేళనంతోనే సజీవమైన సృష్టి జరుగుతుంది. రెంటినీ వేరువేస్తే రెండు జడపదార్థాలు మాత్రమే మిగుల్తాయి.***

**ముక్తవరం పార్థసారథి**

కళకు మూలాధారం సత్యం. అంటే కళాకారుడు సత్యాన్వేషి. సృష్టిలో మంచిని పెంచటమే కళాకారుడి లక్ష్యం అంటాడు సెయింట్ థామస్.

కొన్నిసార్లు 'చచ్చు'గా రాస్తేనే అధిక ప్రజాదరణ పొందే సందర్భాలు కూడా వుంటాయి. కాని మంచిగా రాస్తే అచ్చుకాదనుకోవటం కూడా అర్థరహితమే. అయితే ఒక వుత్తమ శ్రేణి రచయిత అయ్యీ, లక్షలు సంపాదించాలంటే మాత్రం అసాధ్యం. రచన వెనక వివిధ వ్యక్తుల వుద్దేశాలు ఏమైనా, చివరికి రచనలో వుండవలసిన మంచి గురించి మాత్రమే ఈ బాణీ, ఇది కథారచన గురించిన చర్చ.

కొందరు వ్యక్తులు, కొన్ని సంఘటనలు పరస్పరం ప్రభావితం చేసుకుంటే ఏదైనా కథే - ఇదీ ప్రస్తుత చర్చలో కథకు నిర్వచనం. అంటే, కథకు అర్థవంతమైన కథనం వుండటం కనీసావసరమని వేరే చెప్పనవసరంలేదు.

కథను నిర్వచించడం చాలా సులభం. కాని తీరా రాయటానికి కూర్చుంటే మాత్రం ఏంరాస్తే కథ అవుతుందో అంతుపట్టదు. కొన్నిసార్లు కథ రాయటానికి కూర్చుని స్కెచ్ రాస్తాం, లేదా వ్యాసం, లేదా రెండూ కలిపిన మరో వంటకమేదో తయారు చేస్తాం, లేదా అభిప్రాయాలు చెప్పే సంపాదకీయం. అందులో ఓ పాత్ర కూడా వుండే వుంటుంది. లేదా డాక్టర్ల కేస్ హిస్టరీ రాస్తాం లేదా అలాంటి కలగాపులగపు రచన మరేదో తయారవుతుంది. ఇలాగ కథలురాయటంలో విఫలమైనవాళ్ళందరూ "కథలు/నవలలు రాయటమెలా" పుస్తకాలు చదివితే ఆ బ్రహ్మరహస్యమేదో తెలిసిపోతుందనుకుంటారు.

టెక్నిక్, శిల్పం పద్ధతి అనేవి ఒక స్థిరమైన ఫార్ములా అనీ, దాన్ని ఏ వస్తువుకైనా అన్వయించి ఓ కథ తయారు చేయవచ్చునీ ఒక భ్రమ. ఉత్తమ శ్రేణి కథల్లో టెక్నిక్, వస్తువులకు అవినాభావ సంబంధం ఉంటుంది. ఒకదానికొకటి ప్రాణప్రదంగా వుంటాయి. ఆ రెండింటి సమ్మేళనంతోనే సజీవమైన సృష్టి జరుగుతుంది. రెంటినీ వేరుచేస్తే రెండు జడపదార్థాలు మాత్రమే మిగుల్తాయి. అందువల్ల ప్రతి వస్తువుకూ ప్రతి కథకూ ఒక్కో విలక్షణమైన టెక్నిక్ అవసరమవుతుంది. అది ఫార్ములా కాదు.

కథా స్వభావాన్ని మనం మౌలికంగా పరిశీలిస్తే కథ అనేది ఒక స్పష్టమైన, స్థూలమైన విషయాన్ని గురించి వుంటుందనేది స్పష్టమవుతుంది. ఇంక పాఠకులు - పాఠకుణ్ణి ఒక మానవుడు అనేటంత విశాలమైన అర్థంలో తీసుకుంటే - పాఠకుడి గ్రహణశక్తి పంచేంద్రియాల ద్వారా మాత్రమే సంక్రమిస్తుందనేది స్పష్టం. ఆ పంచేంద్రియాల గ్రహణ శక్తుల ఫలితంగానే రచయిత కూడా రచన చేస్తాడు. ఈ పంచేంద్రియాల ద్వారానే కథ మనల్ని ప్రభావితం చేస్తుంది. ఒక అస్పష్టమైన భావాన్ని చెప్పటం సులభంగాని మనం చూసిన, గ్రహించిన దాన్ని యథాతథంగా సజీవంగా తిరిగి వర్ణించటం అత్యంత కష్టమైన పని. కథా రచయితది వస్తుప్రపంచం, ఈ వస్తు ప్రపంచాన్ని పరిపూర్ణంగా, సజీవంగా వర్ణించటమనేది ప్రారంభరచయితలకు గిట్టదు. ఈ ప్రారంభకులకు అభిప్రాయాలు, వుద్రేకాలు వ్యక్తం చేసే తొందర వున్నంతగా, వున్నదున్నట్టుగా చెప్పే ప్రయత్నం నచ్చదు. ఈ ప్రారంభ రచయితలు తమను తాము సంఘసంస్కర్తలుగానో, ప్రవక్తలుగానో భావించుకుని ఏవో అభిప్రాయాలతో, ఆలోచనల్తో యుద్ధం చేసి, కథ రాశాననుకుంటారు. వాళ్ళకు సమస్యలు తెలుసు. కాని వ్యక్తులు తెలియరు. వాళ్ళకు శాస్త్ర పరిజ్ఞానం వుంటుంది. రాజకీయ/సాంఘిక సమస్యలు, పరిస్థితులు తెలుసు. కేస్ హిస్టరీలు తెలుసు. కాని, వీటి వెనకవున్న వ్యక్తులు, వాళ్ళ ఆలోచనలు, వాళ్ళ ఇంద్రియగ్రహణశక్తి, ప్రవర్తన, ఈ లోకంలో జీవించటంలోని మిస్టరీ - ఇవి మాత్రం తెలియవు.

తాత్వికులు ఐహికాముష్మిక జీవితాలను వేరు చేసి చూశారు. ఆధ్యాత్మిక జీవితానికిచ్చిన విలువ భౌతిక జీవితానికివ్వలేదు. ఈ మేధావి కథకులు కూడా అంతే. వీళ్ళ దృష్టిలో వ్యక్తులకు అభిప్రాయాలుండవు. అభిప్రాయాలే వ్యక్తులుగా అవతారమెత్తుతాయి.

ప్రతిభావంతులైన ఎంతో మంది యువ రచయితలు ఈ పొరబాటే చేస్తుంటారు. తమకున్న అద్భుతమైన అభిప్రాయాలను ఎంతో వుద్రేకంతో ఎంతో అద్భుతంగా కాగితం మీద పెడతారు. కాని ఫలితం - కథలో వ్యక్తులుండరు, అభిప్రాయాలుంటాయి.

అసలు విషయమేమంటే, కథారచనకు కావలసిన ముడిసరుకు చాలా సామాన్యమైనది. మనిషి - మనిషికి సంబంధించిన విషయం మాత్రమే కథకు ముడిసరుకు. మనిషి మట్టిలోంచి వచ్చాడు. అందువల్ల గుడ్డలు మట్టికొట్టుకు పోతాయేమోనని భయపడే రచయిత కథారచన కుపక్రమించకూడదు.

అందువల్ల, ఓ వస్తువు దొరికి రాయటానికి కూర్చున్నప్పుడు తెలుస్తుంది ఈ రచయితకు- రచన చేయడమనేది ఎంత కష్టంతో కూడుకున్న శ్రమో! మేధాప్రతిభకాదు. అతిసామాన్యమైన మాటల్లో మనం చూసిన, మన మెరిగిన మనుషులకు ప్రాణప్రతిష్ఠ చేయాలి. అందుకు మన పంచేంద్రియాలు ఆరోగ్యంగా, పని చేయగలిగి వుండాలి. రచయిత వ్యక్తులకున్న అద్భుతమైన అభిప్రాయాల్ని వర్ణించినా, వర్ణించకపోయినా వాళ్ళ దుస్తుల్నీ, హావభావాల్నీ, ఆకారాన్నీ మాత్రం వున్నదున్నట్టుగా చెప్పగలగాలి. అయితే, చూసిందంతా వర్ణించాలని కాదు. రచన అంటేనే కొన్ని విషయాలను ఎంపిక చేసుకోవటం అని అర్థం. కథకూ, చెప్పదలచుకున్న వస్తువుకూ సంబంధించింది, ఏది చెబితే కథ ముందుకు పోతుందో అది మాత్రమే చెప్పాలి.

కథలోని సంఘటనలన్నీ పాఠకుడి మనో నేత్రం ముందు దృశ్యమానం కావాలి. అంతేకాని, ఎవరో అవి జరిగాయని చెబుతున్నట్టుగా వుండకూడదు.

ఆధునిక సాహిత్యంలో రచయిత కనిపించడు. కొందరు వ్యక్తులు, కొన్ని సంఘటనలు మాత్రమే వుంటాయి. వాటి నుండి పాఠకుడు అర్థం తనే గ్రహించాలి. వ్యక్తుల గురించీ, సంఘటనల గురించీ

.............. O ..............

***కథారచనకు కావలసిన ముడిసరుకు చాలా సామాన్యమైనది. మనిషి - మనిషికి సంబంధించిన విషయం మాత్రమే కథకు ముడిసరుకు.***



.............. O ..............

వ్యాఖ్యానాలు చేయటం, టీకాటిప్పణి చెప్పటం. నీతి బోధించడం ఆధునిక రచయిత వుద్దేశం కాదు. వ్యాఖ్యానం కాకపోయినప్పటికీ, వస్తువును ఎంపిక చేసుకోవటంలో, చెప్పటంలోనే రచయిత వుద్దేశం వ్యక్తమవుతుంది. ఉదాహరణకు సెజేన్ అనే చిత్రకారుడు టేబుల్ మీద ఆపిల్ పళ్ళున్నబొమ్మ గీశాడంటే, అక్కడేముంది - టేబుల్ గుడ్డా, ఆపిల్స్ మాత్రమే అని చెప్పలేం. మంచి రచయిత రాసిన కథలో ప్రతి సంఘటనా, వాడిన ప్రతి పదమూ ఎంతో జాగ్రత్తగా ఎంపిక చేయబడుతాయి. అందువల్ల రచయిత అభిప్రాయం కథలో అంతర్భాగంగా వుండిపోతుందే తప్ప కథ చివరనో, మరెక్కడో ప్రత్యేక వాక్యంగా కనిపించదు. కథలో రచయిత పాత్రల గురించి కాక, పాత్రల ద్వారా మాట్లాడతాడు. అనేకసార్లు రచయితలు చెప్పటానికి కొత్త విషయం దొరక్కపోయినా, కొత్త పద్ధతిలో చెప్పి నెగ్గుకొస్తారు.

కథలో ఏదో జరగాలి. భావవ్యక్తీకరణ కథకాదు. కథ చెప్పే వుత్సాహమే నీకు లేకపోతే నీలో మరెంత జ్ఞానమున్నా, మరెన్ని రకాల ప్రతిభలున్నా వృధాయే.

రచయితలో కొంత మూర్ఖత్వం, మూఢత్వం వుండటం తప్పనిసరేమో! చెప్పదలచుకున్నది గబగబా చెప్పెయ్యక, కాస్త డొంక తిరుగుడుగా చెప్పగలగటం కథా కథన సౌలభ్యానికి దారి. పరిశీలనవల్ల మనకు ఆ వస్తువు గురించిన జ్ఞానం పెరుగుతుంది. అందువల్ల పరిశీలన ఎంత ఎక్కువగా వుంటే కథారచన అంత లోతుగా వుంటుంది.

రచన అంటే వాస్తవ జీవితం నుండి పలాయనం కాదు. వాస్తవ జీవితంలోకి మరింత లోతుగా చూడటమే.

కళ అనేది ఒక సుగుణం, ఒక సచ్ఛీలత. సహజంగానే సచ్ఛీలతను ఆచరించటానికి కొంత నియమబద్ధమైన జీవితమూ కొంత త్యాగమూ అవసరం. రచయితలోని రచయిత తనలోనే వున్న వ్యసనపరుణ్ణీ, పిరికివాణ్ణీ గుర్తించి నిర్మూలించవలసి వుంటుంది. రచయితకు తన మీద మమకారం తగ్గి, రచన మీద మమకారం- అదొక వుద్యమమనే నిబద్ధత పెరగాలి.

ఈ దృక్పథంతో చూసినప్పుడు ఎంతటి వూహాజనితమైన కథల్లో కూడా ఒక హేతుబద్ధత అంతర్లీనమై వుంటుంది. హేతుబద్ధత అంటే నిజాన్ని తెలుసుకోవటమే. ఊహకూ, హేతుబద్ధతకూ అవినాభావ సంబంధముంది. కళాకారుడు ప్రతి వస్తువులోనూ హేతుబద్ధత చూడటానికి ప్రయత్నిస్తాడు. ఆ వస్తువు అలా ఎందుకుంది? దాన్ని అలా తయారు చేసిన కారణాలేమిటి? అని అతడు శోధిస్తాడు. అందులో కొంత హేతుబద్ధమైన వూహ లేకపోలేదు. నిప్పులాంటి నిజాయితీగల సత్యాన్వేషణవల్ల తప్ప ఈ రహస్యం బోధపడదు.

రచయిత స్వభావరీత్యా నిత్యవిద్యార్థి. నిత్యశోధకుడు. అంతా తనకు తెలుసునని ఎప్పుడూ అనుకోడు. నిజానికి రచన అంటేనే సత్యాన్వేషణ. సత్యాన్ని తెలుసుకున్న తర్వాత, ఎలా రాయాలో తెలుసుకున్న తర్వాత అతడు రచన చేయటం మానేస్తాడు.

రచన ఎలా చేయాలో తెలుసుకొనటానికి ప్రయత్నించటమే రచన.

ఏం చెప్పాలా అని ఆలోచించటమే రచన. ఏది సత్యం, ఏదసత్యం అని పరిశోధించటమే రచన. రచన ఒక డిస్కవరీ.

తనకే తెలియని కొత్త విషయాల్ని రచనా క్రమంలో కనుక్కుంటాడు రచయిత.

చవకబారుతనం, అహంకారం, దర్పం, అన్నీ తెలుసుననే తనం రచయితకు మంచివి కావు. ఇవి రచయితలో లేకపోతే మిగతా సుగుణాల మాట ఎలా వున్నా, రచనలో కనీసం ఈ దుర్గుణాలు వుండవని చెప్పవచ్చు.


కొంత భావుకత్వమూ, రచనా పరిజ్ఞానమూ వున్న ప్రతి వ్యక్తీ ఎప్పుడో ఒకప్పుడు రచన చేయటానికి వుపక్రమిస్తాడు. ఇదే పెద్దతప్పు. రచనక్కావలసింది కేవలం సాహిత్య పరిజ్ఞానమూ, భావుకత్వమూ కాదు. పరిశీలనను కథగా చెప్పగలిగే నేర్పుకావాలి.


నిజానికి ఈ 'కథలు రాయట మెలా' పద్ధతులు వచ్చింతర్వాత ప్రతివారూ కథలు ఎంత పుంఖానుపుంఖంగా రాసేస్తున్నారంటే చివరకు కథాప్రక్రియ ఈ చెయ్యితిరిగినవాళ్ళ చేతుల్లోనే ఖూనీ అయిపోతుందేమోనని అనిపిస్తుంది. ఎందుకంటే, కథలు రాయటానికి 'కథలు రాయటమెలాగో' తెలుసుకొనటమే కాదు- సత్యాన్వేషణ, దార్శనికత, మంచి ఏమిటో చెప్పాలనే తపన లేకపోతే ఈ కళ 'కథలు రాయటమెలాగో' తెలిసిన విచక్షణలేని హంతకులచేతుల్లో మారణాయుధంగా మారి, మన నైతిక, సాంస్కృతిక జీవనాన్నే హతమార్చే ప్రమాదముంది.


పానశాలల్లో, వేశ్యాగృహాల్లో, జూదశాలల్లో థ్రిల్ దొరకదని అనగలమా? థ్రిల్లర్స్ చదివినా అలాంటి థ్రిల్ దొరుకుతుంది. ముఖ్యంగా, 'అబ్బే, సాహిత్యం, కళలు వినోదం కోసం. కథలు చదివి ఎవరు చెడిపోతారూ? పోయేవాళ్ళెట్లాగూ పోతారు. సినిమాలు చూసి చెడిపోతారా? ఎవ్వరూ చెడిపోరు' అంటూ ఆర్గ్యుమెంట్లు తెచ్చేవాళ్ళు సాహిత్య, కళారంగాల్లో నైతిక విలువలు అవసరం లేదని ఆర్గ్యూ చేస్తున్నారు. వాళ్ళు తమ విశృంఖల, విచక్షణారహితమైన సాహితీసృష్టికి వాదన తయారు చేసుకుంటున్నారు.

(Flannery O' Connor రచన ఆధారంగా)

V



కథ

పెద్దింటి అశోక్‌కుమార్



# కాగుబొత్త

"గెటవుట్ ఫ్రం హియర్... ముసలాడికి తెలివిలేదు. నిన్ను నా పక్కనుంచాడు. మట్టివాసన భరించలేకున్నాను. ఒళ్లు కప్పు కోవడం కూడా తెలియదు. నీపేరేంటి?" చిన్నగా ఊపిరి పీల్చు కుంటూ అడిగింది గోద్రేజ్ ఫ్రిజ్. రాత్రనగా పోయిన కరెంటు రావడం దాని నరాల్లో జీవం నింపింది.

"నేను కాగుబొత్తను... నన్ను రంజన్ అని కూడా పిలుస్తరు." బెరుకుగా చెబుతూ చుట్టూ చూసింది కాగుబొత్త. చుట్టూ ఖరీదైన వాతావరణం... కొత్తగా వింతగా తను ఒదిగిపోలేని జాగా అని రాగానే తెలిసిపోయింది దానికి.

వింతగా వికృతంగా రక్తాన్ని అద్దుకున్నట్టున్న కాగు వైపు అసహ్యంగా చూసింది ఫ్రిజ్.

"బాబూ... మనది ఏ కంపెనేంటీ...?" ఎగతాళిగా అన్నది.

కాగుబొత్తకు అర్థం కాలేదు. ఏమిటన్నట్టు చూసింది. ఫ్రిజ్ వెక్కిరిస్తున్నట్టుగా నవ్వుతూ "ఎక్కడి నుండి వచ్చావు?" అన్నది. కాగు బొత్తకు రోషం వచ్చింది. "మన్ను నుంచి.. మన్ను నుంచి ఎదిగిన మానవ మనుగడ నుంచి... పచ్చి కూరల నుండి వండుకతినే కాలందాకా కరిగిన వందల సంవత్సరాల్లోంచి... తరానికీ తరానికీ పెరిగిన చేతివాటపు నైపుణ్యం నుంచి... కుమ్మరి లింగం వాముల నుంచి..." మాటలు పూర్తి కానేలేదు అందుకుంది ఫ్రిజ్.

"అది కాదు బుజ్జీ... కంపెనీ... కంపెనీ ఎక్కడుందంటన్న. ఐ.ఎస్.ఐ. మార్క్ ఉన్నదా?"

గా కంపెనీలు, మార్క్‌లు నాకుండవు. మనిషి రక్తాన్ని చెమటను అద్దుకుని పుట్టాను. మనిషి మనసులోని భావనలతో మమేకమై దోస్తి చేసాను. పుట్టిన్నుండి సచ్చేదాక మనిషి అవసరాలలో పుట్టి అవసరంగా పెరిగిన." ధీమాగా చెప్పింది కాగుబొత్త.

"అయితే అనవసరంగా ఇక్కడ ఎందుకున్నట్టు? ఏం చేస్తావు నువ్వు?" కోపంగా అడిగింది ఫ్రిజ్.

"ఎండాకాలమైతే నీళ్లను సల్లగజేస్త. వానకాలం ఏదన్నా ఇత్తు ఈదునం

పోసి మూతపెడితే పురుగు పట్టకుంట దాచి పెడత." అడిగిన తీరుకు కొద్దిగా నొచ్చుకున్నా నెమ్మదిగానే చెప్పింది కాగు. తన యజమాని గుర్తొచ్చి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. మూతి మూడు వంకర్లు తిప్పి పకాపకా నవ్వింది ఫ్రిజ్.

"అదేంటే.. ఏడుస్తున్నావు? కంపెనీ లాకౌట్ అయిందా...?" వెక్కిరిస్తున్నట్టుగా

"కంపెనీ కాదు. బతుకే లాకౌట్ అయింది. అయ్యకూ కొడుక్కూ ఉంటుంది చూడూ... పేగుబంధం... అదీ లాకౌట్. మల్లా అతుక్కోదు! ఒకతరంవారు మరోతరానికి అందించే పనితనం ఉంటుంది చూడూ. నైపుణ్యం... అదీ లాకౌట్. ఒకతరంతోనే ఆగిపోయింది!..."

"ఆగాగు. ఏదో నస మొదలెట్టావు. నీకో కంపెనీ లేదు, కాయిదంలేదు. అమ్మినవారు లేరు. కొన్నవారు లేరు. కార్మికుల్లేరు కథల్లేవు ట్రేడ్ మార్క్‌లేదు. ఐ.ఎస్.ఐ. ముద్రలేదు..." అంటూ తన కథను చెప్పింది ఫ్రిజ్.

వింతగా, కొత్తగా, భయం భయంగా ఫ్రిజ్ చరిత్రనంతా విన్నది కాగు. ఎందుకోకానీ వణుకు పుట్టింది. ఫ్రిజ్ మీద కోపం వచ్చింది. తన కష్టాలకు కారణమెవరో తెలిసిపోయింది.
బాధగానే పెదవి విప్పింది కాగు.

"నాకు కంపెనీ లేకపోవచ్చు. కన్నీటి తడి ఉంది. కార్మికులు లేకపోవచ్చు కష్టం ఉన్నది. ఆకలి ఉన్నది. నేనెన్నడూ నా యజమానికి లాభాలు తెచ్చిపెట్టలేదు. పొద్దు మాపు పొట్టకు తప్ప. ఇప్పుడు అది కూడా లేదు. కష్టాలను కన్నీటిని మిగిల్చివచ్చాను."



చెప్పింది రెండు ముక్కలే అయినా ఒక్కముక్క అర్థం కాలేదు ఫ్రిజ్‌కు. టైంపాస్ కొరకు అన్నట్టుగా కాగును తన కథ చెప్పమంది. కాసింతైనా బరువు తగ్గుతుందని కాగు తనకథను చెప్పడం మొదలెట్టింది.

అప్పటికి అర్ధరాత్రి దాటింది. కడుపులోని పదార్థాలను చల్లబరుస్తూ వింటుంది ఫ్రిజ్. ఖాళీ కడుపుతో కథను మొదలెట్టింది కాగు.

× × ×

ముసి ముసి మబ్బుల - మబ్బుల మీద రెక్కలు జాపిన కొంగలు తోరునాలు గడుతున్నాయి. కోడిగొంతు పొద్దు పొడుపును నిద్రలేపుతున్నది. తూరుపు కొండల సందున మొగులు ఎద్దుపుండయింది. ఎక్కడో గుడి మీద మైకు పాట. బజారు వెంట బర్ల జంగిడి సందడి.

ఆగమాగాన నిద్రలేచిన లింగం గోశిని సదురుకుంటూ బాయి దగ్గరికి నడిచాడు. గూట్లో ఉన్న మంజిన్ పొడితో పండ్లు తోమినట్టు చేసి నోట్లో నీళ్లు పోసి పుకిలిచ్చి ఊంచాడు. పీక్కపోయిన మొహం నిండా తెల్లటి గడ్డం. పొడుగ్గా సాగిన మెడల వంగిన నడుము బక్కగా ఉంటాడు లింగం. బనీను ఇడిచి మూలకు ఇసిరికొట్టి చెంబుతో బుడబుడ నీళ్లను కుమ్మరించుకున్నాడు.

గొట్టంతో పొయ్యిని రాజేస్తున్న ఎల్లవ్వ తలెత్తి చూసి కోపంగా "గట్టేంది... కొంకులు తడువలేదు. గోసిబట్ట నానలేదు. ఉనుక మీది రోకలి లెక్క ఉరుకులాడుతున్నవు. నాటి నుంచి ఈ ఉరుకులాట ఉంటే బంగ్లకడుదుంటిమి. పెయ్యంత తడుపుకో...గాశారం సాలది" అన్నది.

ఆమె వైపు చూడనైనా చూడకుండా దోతిని మార్చుకుని నొష్టికింత కుంకుమ అద్దుకున్నాడు లింగం. దిగూట్లె నుంచి ఊదు బత్తీల పుడాను అగ్గిపెట్టెను అందుకుని బయటకు నడిచాడు.

అతడి వెంట కుంకుమ బరిడీతో గులుక్కుంటూ బయటకు వచ్చింది ఎల్లవ్వ. 'నీ ఉరుకులాటనే చెప్పరాదు. ఉరుకులాట ఉత్తచాట' అనుకుంటూ.

ఆమె మాటలేవీ పట్టించుకోకుండా సారె చక్రం దగ్గరికెళ్లాడు లింగం. అరుగుకు ఆనించిన సారె చక్రం బండి పయ్యలా కొత్తగా ఉన్నది. కళ్లల్లో ఏదో మెరుపు. గతాన్ని తవ్వుతున్న జ్ఞాపకాలు. ఆప్యాయతగా సారె చక్రాన్ని తడిమాడు. పొడిగా, చల్లగా గరుకుగా తగిలింది. మట్టిలో కలిసిన గొర్రె బూరుతగిలి పాణమున్న మనిషి చేతినే పట్టుకున్నట్టుగా అనిపించింది. ఆ తాకిడి, అనుభూతి, పోగొట్టుకున్న బతుకు దెరువును యాదికి తెస్తున్నట్టుగా ఉన్నది. అలాగే సారె చక్రాన్ని తడుముతూ నిలబడ్డాడు లింగం.

"ఏమాయె - ఇంకేదో మసుల పడితివి. దుర్మార్తం జొత్తది. జెట్టన గానీ... బీరిపోతే పని నడువది... ఉన్న జాగలుండక ఒగయాల్లందెత్తివి." గుబ్బిగడ్డకు పసుపు, కుంకుమ బొట్లు పెడుతూ భర్తను తొందరపెట్టింది ఎల్లవ్వ.

ఉల్కిపడి అక్కడి నుండి కదిలి ఆగమాగాన కందెన నింపిన పావును అందుకోబోయాడు లింగం. పావు చేతిలోంచి పిసికి కిందపడింది. ఒక్కక్షణం భయంగా ఎల్లవ్వ వైపు చూసాడు. అప్పటికే తలెత్తి భర్తను చూసింది ఎల్లవ్వ.

"నీ పునుకుడు చేతులిరుగ. తొల్తతొల్త తోలుగుడ్డు వెట్టినట్టు పావును ఒలుకబోసినవా...? అందుకే నీకు నమ్మకంతో పని చెయ్యిమన..." వదురుతుంది ఎల్లవ్వ కోపంగా.

మారుమాటాడకుండా లింగం గుబ్బిగడ్డ దగ్గరికొచ్చాడు. కాలుపెట్ట సందులేనట్టు వాకిలి అంగడిగా ఉంది. ఒకవైపు నానబెట్టిన మట్టిగుంత. మరోవైపు బూడిది పోసి తొక్కిన మన్ను. దర్వాజా దాకా ఎండబెట్టిన మట్టి పెల్లలు. ఈత మొద్దులు, వాయిలిపొరుక, ఉనుక, బూడిదకుప్పలు.

అప్పటికే దారినవెళ్లే ఇద్దరు ముగ్గురు వ్యక్తులు జమయ్యారు. సారెను, కుమ్మరిమన్నును. లింగంను మార్చి మార్చి చూస్తూ "అగో.. కుమ్మరోల్ల తాత సారెబలిచ్చిండు. ఏంటిది తాతా... కుండలు జేత్తవా...? ఆనుడు చాతనైతదా?" అని అడుగుతున్నారు.

"ఎట్లనన్న తండ్లాడాలెనోయ్... పొట్ట తిప్పలుకు జేరిపోతులాట. నీ లెక్క పెండ్లాంను సూసుకుంట కూసుంటే

నడుత్తదా...'' అంటూ సారెముల్లు మీద గుబ్బిగడ్డ బొద్దిలో కందెనేసి సారె చక్రం పట్టుకుని "జరంత ఆసర పట్టుండ్రోయ్ సారెను దించుదాం" అన్నాడు లింగం.

తలో చెయ్యి వేశారు. బొద్దిలో దిగిన సారెచక్రం ముల్లు మీద గిరగిర తిరిగింది. ఎల్లవ్వ సారెమీద పసుపు కుంకుమ బొట్లు పెట్టింది. లింగం ఊదుబత్తీలను ముట్టిచ్చి మట్టిముద్దలో చెక్కి సారెను కళ్లకు అద్దుకున్నాడు. సారెకోలను అందుకుని గుంతలో ఆనించి గిరగిరా తిప్పాడు.

కొడుకు పుట్టుకతోనే మూలకుపడ్డ సారె అది. ఆనాటి నుండి బయటకు రాలేదు. వారం రోజుల కిందట బయటకు తీసి పొరుకను అల్లి ఎంటి తాల్లను చుట్టి మట్టిని దట్టించి ఎండ బెడితే బలంగా నిగనిగా మెరుస్తుంది. చాలా ఏండ్ల తర్వాత ఇంటి ముందు తిరుగుతున్న సారె చక్రం కొత్త సందడిని తెచ్చింది.

లింగం కళ్లల్లో చెప్పలేని ఆనందం. కేరింతలు కొడుతున్న చిన్న పిల్లగాడిలా చక్రాన్ని బలం కొద్దీ గిరగిరా తిప్పుతున్నాడు. దారివెంట పోయేవారంతా గుమికూడి సారె చక్రాన్ని, లింగంను చిత్రంగా, ఉత్సాహంగా చూస్తున్నారు. కొందరైతే ఆ దృశ్యాన్ని కొత్తగా చూస్తున్నారు. అప్పుడప్పుడూ కల్లు లొట్లకొరకో పెండ్లి కుండల కొరకో అరకొరగా తిరిగే సారెలు కూడా ఆగిపోయి చాలా రోజులయింది. అందరూ మరిచిపోయిన యాల్లన మళ్లీ తిరుగుడు మొదలెట్టిన లింగం సారె సంగతి వాములోని పొగలెక్కన ఊరంతా వ్యాపిస్తున్నది.



సారెను తిప్పినకొద్దీ మురిపెంగా ఉంది లింగంకు. మనసు ఉత్సాహంతో దరువులేస్తుంది. గిర్రగిర్ర కోలతో తిప్పుతున్నాడు. ముల్లు పాతదే అయినా పాలరాయి బొద్ది కొత్తది. కిర్రుకిర్రు మంటుంది. ఎప్పుడో యాది మరిచిపోయిన చేతివాటం. అందునా చేతగాని ముసలితనం. సారె వేగం ఎక్కువైనాక చేతులు పతుకులాడుతున్నాయి. అది గమనించి నట్టుంది ఎల్లవ్వ.

"మెల్లగ. పైలంగ తిప్పు. సొలిగిపడ్డవనుకో... మూతిపండ్లు ఒక్కటుండయి. కాళ్లు కొంకులకిరుగుతయి.'' వచ్చినవాళ్లకు కుంకుమబొట్టును పెడుతూ అన్నది.

"ఇప్పుడు ఆయనకేం చాతనైతది? వంగుడు లేసుడు వట్టిగైతదా? ఇప్పటికే తాత వంగిపోయిన కట్టెలెక్కున్నడు." సారెను చూస్తూ అన్నాడు ఒక వ్యక్తి.

"ఇది అమ్మ చెప్పిన ఇగురమే! తాత గుర్రమోలె ఉన్నడని ఈ పనిని ఓదిచ్చింది. ఇప్పుడు తాతకుయ్యకు నడుము టింగు మంటుంది." ఎల్లవ్వను చూస్తూ అన్నాడు ఒక పిల్లగాడు.

ఎల్లవ్వకు ఆ మాటలు సురుక్కుమన్నయి. ఆమెకు ముందే తెలుసు. ఇప్పుడు సారె గేరను బలిచ్చుడంటే మంది నోర్లల్ల నానుడేనని. అందరూ ముసలోడి గోసి బలిచ్చిందని తననే అంటారని కూడా తెలుసు. బొట్టుపెట్టుడు ఆపి పిల్లగాడి దిక్కుచూసింది.

"ఔ.. మంచిగంటివోయి. నీ బక్క మొడ్డల మన్నువడ. నాకు ఇంటి ముందుకు టాక్టరునిండ మన్ను వచ్చేదాక తెల్వది. సత్తెపీరీలకాడి బోడగుట్టమీద సమ్మక్క సారక్క దేవుండ్లను నిలిపింద్రుగదా! పెద్దజాతర జేత్తరట. అక్కడ తాగవోదామంటే నీళ్ళకు తావులేదాయె. కామరెడ్డి నుంచి ఇరువై ముప్పయి రంజన్లు తెత్తమన్నరట. ఆ పైసలల్ల ఇరువై పెద్ద కాగుల్ని చేసిత్తనని తాత గుత్తవట్టుకునెనట. టాక్టరోళ్లకు మన్ను జెప్పెనట. కైకిలి వెట్టిచ్చి కట్టెలు కొట్టిచ్చెనట. పాత సారె ఇవతలికి తీసేదాక నాకు ఎరుకనే లేదు. నీకు మానంలేక నన్నే అనవడితివి." నవ్వుకుంటూనే అయినా అందరూ వినాలని సూటిగా అన్నది.

పిల్లగాడు మనిషి మర్మం తెలిసినోడు. గోడమీది పిల్లి. ఎల్లవ్వ మాటల్ని గమనించి "ఏ ... నేను వట్టిగ... గమ్మతికి అంటున్న నమ్మా... అబ్బో... తాత సంగతి నాకు దెల్వదా! మంకురుగాడు, నీ మాటల్ని సూర్లజెక్కుతడు. ఒకటి చెప్పతడు ఒకటి చేస్తడు." నవ్వుతూ మాట మార్చాడు.

ఇవన్నీ వింటున్నాడు లింగం. ఏవీ మనసుకెక్కడం లేదు. మనసులో ఏదో బెరుకు. అది భయంగా మారుతుంది. ఆ భయం కాళ్లను వనికిస్తుంది. పని పాతదే! కానీ కొత్తగా ఉంది. అన్నింటిని మించి కాగులు అందుతయా లేదా అన్న భయం! అనుకున్నట్టు కుదురుతయా లేదా అన్న భయం! వాన వస్తదేమోనన్న భయం! ఒకదాన్ని మించి మరొకటి కలవరపెడుతున్నాయి.

ఈడు ముదిరిన పిల్లగాన్ని ఇస్కూల్లో పంతులు ముందు కూసోబెట్టి పరీక్ష రాయిస్తున్నట్టుగా ఉన్నది. వేగానికి తగ్గట్టుగా సారెకోల తిరుగక బొద్దిలోంచి తప్పుకుని గెటగెటమన్నది. సారె వంగి వంగి తిరిగింది.

''కుమ్మరోనివా... కరిద్దోనివిరా.. సారెగుంతల కట్టెవెట్టరాదు. ఏం జేసుక బతుకుతవు. గట్ల గెటగెట మంటదా...'' చిన్నప్పటి తండ్రి మాటలు బొచ్చెల మెరిసినయి. తన్నుకుంట గుద్దుకుంట పని నేర్పిన రోజులు యాదికచ్చినయి. తాను పని నేర్చుకుని తండ్రికి ఆసరగా నిలవడ్డడు. ఈ పని తన కొడుక్కు నేర్పకముందే సారె దూరమయింది. కొడుక్కు నేర్పిన పని తన పొట్టనే కొట్టింది. కట్టాలన్నీ యాదికచ్చినయి. కళ్లల్లో సన్నటి నీటిపొర.

సారెగుంతను కోలతో అందుకుని వేగంగా తింపిండు లింగం. చూస్తున్నవాళ్లు చూసినంతసేపు చూస్తూ బరువుగా కదులుతున్నారు. కొత్తవారు సంబూరంగా వచ్చి చేరుతున్నారు. ఎల్లవ్వ ఇంట్లకూ బయటకు తిరుగుతనే ఉంది. అడిగినా అడక్కపోయినా అందరికీ ఈ అంగడి తాతనే పెట్టుకున్నాడని చెబుతనే ఉంది. తేపతేపకు సారెదగ్గరికెళ్ళి చేతనైతదా లేదా అని చూస్తుంది. సదిరింతే సదురుతుంది. వదిరిందే వదురుతుంది. వద్దని పనిని ఆపలేకపోతుంది. అలాగని చెప్పలేకపోతుంది. ఇండ్లకు పోతుంది. ఇవతలి కత్తుంది. అందరూ ఏమనుకుంటున్నారో వింటుంది. ఆగమాగమై తిరుగుతుంది. మనుసులోనే ఖర్చా లాభం లెక్కగడుతుంది.

లింగం మాత్రం కాల్లుపంగటిచ్చి తిరుగుతున్న సారెముందు దీక్షగా నిలబడ్డాడు. బూడిదపోసి తొక్కి ముద్దజేసిన మన్ను పక్కనే

వున్నది. దాన్ని సారెపైకి ఎక్కించాడు. కాగు రూపం మనసులో మెదిలింది. అది వేళ్ళలో పురుడు పోసుకుంటుంది. మట్టి మీద వేళ్లు చురుకుగా కదులుతున్నాయి. చేప పిల్ల నీల్లలో ఈదినట్టు కొత్త నైపుణ్యమేదో వేళ్లలో పుట్టుకొస్తుంది. నిలువు తయారవుతున్నది. మట్టిని తాకిన వేళ్లు మెదడులోని పొరలను తొలుస్తున్నాయి. నిలువు తయారవుతున్నది. మన్ను మీద నీళ్లు చల్లి మూతికట్టులో పడ్డాడు లింగం. చేతులు వణుకుతున్నాయి. మూతి కుదరడంలేదు.

అటీటు తిరిగి సారెదగ్గరికే వచ్చి నిలబడింది ఎల్లవ్వ. అప్పటికి సారె దగ్గరున్నవాళ్లు వెళ్లిపోయారు. వచ్చిపోయేవారు దూరం నుంచే నిలబడి చూస్తూ వెళ్తున్నారు.

"ఔ.. వాళ్లు ఖాయంగానే చెప్పిండ్రంటవా...? అన్ని చేసినంక యాల్లకు వద్దంటరంటవా...? అది పది మందిల పని. ఒకలు ఔనంటే ఇంకొకలు కాదంటరు." భర్తవైపు అనుమానంగా చూస్తూ అడిగింది.

మూతి కుదరక తండ్లాడుతున్నాడు లింగం. ఎల్లవ్వ మాటల్ని పట్టించుకోలేదు. విసుగ్గా రెట్టించి అడగడంతో బదులు చెప్పాడు.

"గట్లెందుకంటరే.. మన పంతులే చెప్పిండు. అందులో అబద్ధముంటదా...? అంత అనుమానముంటే నువ్వే పొయ్యి అడుగు. బయానా ఇస్తనన్నడుగనీ నేనే వద్దన్న. అన్నీ ఒక్కసారే ఇయ్యిమన్న." పనిలో మునిగిపోతూ. నమ్మాలో నమ్మకూడదో తేల్చుకోలేక అయోమయంగా భర్తవైపు చూసింది ఎల్లవ్వ. ఇంట్లోకి వెళ్లి రోకలి బండతో తిరిగి వచ్చింది. మట్టి పెల్లల మీద రోకలి బండ గరిడెసాములా తిరుగుతుంది. రెండు మూడు దెబ్బలకే ఎగపొత పుట్టింది. ఆగి దమ్ము తీసుకుంటూ అడిగింది.



"ఔ.. మరి ఒక్కొక్క దానికి ఎంత ఇస్తనన్నరు. కైకిలన్నా గిట్టుతదా లేదా..." మూతికట్టు కుదరగానే నిలువును పెంచుతూ బదులు చెప్పాడు లింగం. "నూటయాభై ఇత్తనన్నరు. ఇరువై కాగులు చెయ్యమన్నరు. మనం ఐదారు ఎక్కువనే చెయ్యాలె. వాల్లకొకటి వీల్లకొకటి ఇచ్చుడుంటది."

"గట్లగాదు. పదిగల్ల ఎక్కువనే చెయ్యాలె. ఇరువై అన్న కాడ ఐదు ఎక్కువనే ఇయ్యాలె. బతిలాడితే తీసుకుంటరు..." అంటూ మాటలు ఆపి మట్టి మీద రెండు దెబ్బలేసి ఆపి నెత్తిని ముడివేసుకుంటూ "... గన్నిగనం ఎట్ల ఆనుతవయ్యా!.... చాతనైతదా...? కూలికి ఇసం తాగినట్టు జేత్తవు. నిలువులు ఆనంగనే అయిపాయెనా...? వాటికి కుదువడి జెయ్యాలెనాయె. నున్నగుంత చెయ్యాలె. ఎప్పుడో యాది మరిచిన పని" అన్నది దంచుతూ.

"చాతనైనకాడికి తండ్లాడాలె. ఎట్లమరి? నాలుగు వెయిలత్తే చిల్లర బాకీలు పోతయి. రెండు బియ్యం సంచులు తెచ్చుకుంటే యాడాది గాసం. మనది మనం చేసుకోవాలె. మన కడుపుకు ఎవలు పెడతరు. చేసుకతినాలె." గొణుక్కున్నట్టుగా అంటూ నిలువులో పడిపోయాడు లింగం నిలువు కుదరడంలేదు. నడుము గుంజుతుంది.

"నీ చేసుడు పాడుగాను. చేసినవు. సావుదాలకు ఇదో లేనిపని వెట్టినవు. అప్పుడు ఏరువడంగ చేను తీసుకుందామంటే కానియ్యకపోతివి. అమ్ముతనని వాడు అన్నప్పుడు దస్కత్ పెట్టద్దంటే అప్పుడు వినకపోతివి. కొడుకు మాయవారు పొత్తడని మురిత్తివి. ఇప్పుడు జూడు. వట్టిచేతులోడ కాళ్లకాటుకు రారా అన్నట్టాయె బతుకు. నలుగురిని కూడగొట్టి ఇదేంటిదని అడిగియ్యిమంటే ఈయాల్లం ఎత్తుకచ్చినవు. మన దొయ్యలు మనకుంటే ఈ బాధలు తప్పుకదా!" ఎగపోస్తూ అన్నది.

లింగంకు నిలువు పొట్టిగైతుంది. సాగదీస్తే పొడువవుతుంది. ఎట్లకుదురాలెనన్న తండ్లాట మొదలయింది. ఎల్లవ్వ మాటలు విన్నా విననట్టు పనిలో మునిగిపోయాడు. ఎల్లవ్వకు కొడుకు మీదకంటే బతుకు మీద- అందుకు కారణమైన భర్త మీద కోపమచ్చింది. పండ్లను బిగపట్టి కోపాన్నంతా రోకలిపై చూపుతూ "...ఏశంల మన్నువాడ ఎన్నేశాలేత్తివి బతుకుల. కుండలు కులకషిపని కొన్ని రోజులు తిరిగితివి. ఇండ్లేంలేదాయె. ఎగురుకుంట ఎగురుకుంట ఎవుసం జేత్తివి అండ్లేం లేదాయె. నడుమ నాలుగేండ్లు పీకెవట్టి ఊదినవేమో సంసారం జరంత పురికి వచ్చేయాల్లకు ఇచ్చుకపాయె. ఇగ కొడుకంట పుట్టిండేమో... రామా నారాయణా... నన్నెట్ల కొండవోతవోగనీ నిండు పందిరికిందున్న. ఒక్క కొడుకని ఒడిగట్టి సాదుకుంటే పిడికెడు మెతుకులు పెట్టడుకు చేతులత్తలేవు. కలకలాంటే కన్నీల్లే సాలు. ఊకుంటే ఉసురే సాలు వానికి పుట్టినోల్లు వాన్ని ఇట్లనే జెయ్యని..." కళ్లల్లో నీళ్లు నిండాయి ఎల్లవ్వకు. గొనుక్కుంటూ ఎగపోస్తూ మన్నును దంచుతుంది. కొడుకు మాయవారు పోత్తే ఈ కష్టాలుండకపోవునని ఆమె ఆలోచన.

లింగంకు కూడా కళ్లల్లో నీళ్లు తిరిగినయి. మూలకున్న సారెను ముందుకు తీసిన్నాడె బతుకు కండ్ల ముందు కదిలి తండ్లాట మొదలయింది. బుడ్డగోశి పెట్టుకుని కుండలు గురుగులు చెయ్యటం నేర్చుకున్న రోజులైతే మరీమరీ యాదికత్తున్నయి. చేతుల కుండను బొంగరం లెక్క తిప్పతడనో కుండలు గాజు లెక్క చేతడనో మంచి పనోడనో అందరూ మెచ్చుకునే మాటలు... దేశాయి గారు వచ్చినప్పుడల్లా తన కుండలే కావాలని మస్కూరోల్లను తోలిన రోజులు యాదికస్తున్నయి. ఎల్లవ్వ గొనుగుడు, ఎగపోత కలగలిపి వినిపిస్తున్నాయి. ఎందుకోగాని కొడుకు మీద కోపం రావడం లేదు. జాలి కలుగుతుంది. వాడు మాత్రం ఏం జేస్తడు? తెగిపోయిన పతంగిలా ఎక్కడో కాటగలిసిండు అనుకుంటున్నాడు.

ఎరంవడ్లు, వడ్లకట్టలు, కూరాడుకుండలు, ఐరేండ్లు, బోనాలు, బల్లకడువలు, ఎసులలు, కంచుల్లు, గూనలు, మంగులాలు, కాగులు, కలికుండలు, ఒత్తుకుండలు, పేర్పులు, గోలాలు, గొబ్బలు, లొట్లు, గురుగులు... మనిషి పుట్టింది మొదలు సచ్చేవరకు తీరొక్క పనిముట్లను సారెమీదనే మలిచి ఇండ్లకు చేరవేసిన రోజులు, మట్టితో సారెకు, సారెతో కుమ్మరికి, కుమ్మరితో ఊరికి ఉండే సంబంధాలు... మట్టితో మనిషికి ఉన్న అవసరాలు... వాటి చుట్టూ తిరిగిన సారె గేరల నైపుణ్యం గుర్తుకొచ్చింది.

నిలువు కుదరడంలేదు. నడుము గుంజుతుంది. లేచి కొద్దిసేపు నిలబడి మళ్లీ పనిలో మునిగిపోయాడు. అసలు కుదురుతాయా లేదా అన్న కొత్త భయం మొదలయింది లింగంకు.

తను ఏడుస్తున్నా కూడా లింగం నోరు విప్పకపోవడంతో ఎల్లవ్వకు కోపం వచ్చింది. రోకలిని ఆపి కోపంగా "ఏంటింది... మూగదయ్యమోలె 'ఊ' అనవు 'ఆ' అనవు" అన్నది అదిలిస్తున్నట్టుగా.

అప్పటికీ నోరు విప్పలేదు లింగం. అతడి బాధ అతడికుంది. మట్టికి మనిషికి మధ్య పుట్టి, అవసరాలతో పెరిగి, తరతరానికి నాణ్యతను నైపుణ్యతను పెంచుకుని, మట్టి నుండి తొట్టి చేసి అవసరాలు తీర్చిన సారెచక్రం ఎక్కడ ఎందుకు ఆగిపోయిందో తెలుస్తూనే ఉంది. మట్టి నుండి మనిషి ఎంత దూరం పోయిండో తెలుస్తనే ఉన్నది. అయినా బాధ అదికాదు. మట్టి రూపం మనసులో మెదలగానే వేళ్ల సందుల్లో పురుడు పోసుకునే ఈ కళ తనతోనే సమాధి అవుతుందనే బాధ.

'ఏ కుల కస్మివాడైనా పనిముట్లకు ఇంకొకరి చేతికిందికి పోవాలె. అదే నేనైతే నా సారెను నేనే చేసుకుంట. ఒకలకు చెయ్యి చాపేటోన్నిగాదు." చేతినిండా పని ఉన్నప్పుడు మీసాలు మెలివేసి చెప్పేమాటలు గుర్తొచ్చినయి.

"ఔ.. ఏంబుట్టింది నీకు. దయ్యం బట్టిందా! సప్పుడు జెయ్యవు." గట్టిగా గద్దించింది ఎల్లవ్వ. లింగం ఈ లోకంలోకి వచ్చాడు. నిలువు కుదిరింది. కొద్దిగా ధైర్యం వచ్చింది.

"ఏం సప్పుడు జెయ్యన్నే... మనం ఏరు వడ్డప్పుడు ఎట్లుండె. కూసుందామంటే తీరకపోవు. నాలుగు పుట్ల ఎరం.. పందుము వడ్ల కట్టలు..." మాటలు పూర్తిగాక ముందే అందుకుంది ఎల్లవ్వ.

"ఆహా... నువ్వింకా కుండలు గురుగుల కాలంలనే ఉన్నవు. అది ఆచ్చిపిట్ట ఎత్తుకపోయింది. ఇప్పుడు నడువబోయే సంగతి చూడు. నలుగురిని కూడగొట్టి అడిగిపియ్యి. ఏదన్నా ఇచ్చేటట్టు మాట్లాడుమను. పసలుకు పుట్టెడు వడ్లు వొత్తననె- అదీ లేకపాయె. వెయ్యి రూపాయలిత్తననె- ఇదీ లేకపాయె." యాష్ట పడుతున్నట్టుగా అన్నది.



నిలువును ముల్లుతో కోసి అరచేతిలో పట్టుకుని అందునా అనద్దా అని కొద్ది తడవు ఆలోచించి నిలువును ఎండలో పెడుతూ అన్నాడు లింగం.

"వాడు మాత్రం యాడి నుండి తెస్తడే.. పొక్కగాని పాములెక్క తిరుగుతున్నడు. ఏ పని చేసినా లాసేగావట్టె. ఏదీ ముడివడుత లేదాయె. నాలుగురోజులాగుదాం."

వెంటనే అందుకుంది ఎల్లవ్వ. "అగో సూడు పాము పగేంది...? తోక చుట్టమేంది..? ఎవలన్న ఇంటె నవ్వుతరు. నువ్వొకటి నేనొకటా... సుతులెందుకంటే గతుల కొరకు అన్నట్టు తవ్వెడు కైకిలి చేసి అయ్యవ్వను సాదినోళ్లు లేరా? ఇల్లిత్తే అదీ అమ్ముకునె. ఎకురం భూమి ఇత్తే ఇదీ అమ్ముకునే! నాలుగు దొయ్యలు మనవి మనకుంటే వానికి ఎవలు ఆశ పడుదురు?"

మౌనంగా సారెవద్దకు వెళ్లి మట్టి మీద నీళ్లు చల్లి కోలను అందుకున్నాడు లింగం. ఎల్లవ్వ ఇంట్లోకి వెళ్లి పొయ్యిమీద ఎసరు పెట్టివచ్చింది. భర్త తననే తప్పపట్టడంతో ఆమె కోపం గంభీరమౌనంగా మారిపోయింది. మళ్లీ కొడుకు ముచ్చటనే తీసింది రోకలి అందుకుంటూ.

"అన్నీ నడుమంత్రపు ఏశాలేనాయె. ఏదో వయిలు కేసిట్ల దుకాణమని పెట్టె. అదీ కొద్ది రోజులేనాయె. ఆటోలో కూసుండి పీకె పలికెటిది తెచ్చెనేమో అదీ కొద్ది రోజులేనాయె. ఏ పనిని పొందుపడి చెయ్యకపాయె. ఇప్పుడు పిరుజో గిరుజో అంటరు పెద్ద పెట్టె లెక్కుంది. కొక్కకోల సీసలు తెచ్చి అమ్ముతున్నడట. ఇదెన్నిరోజులో? వాడు ఏశమేసిన దానికల్లా అయ్యోపాపమని కూసుంటే మనబతుకెట్ల? సావుదాలకు గంజిగూడా పొయ్యడా? నీకు అడుగబుద్ధిగాకపోతే చెప్పు. నేను అడిగిపిత్త." కచ్చితంగా అన్నది.

ఆలోచనల్లో పడ్డాడు లింగం. కొడుకు ఏ పనీ పొందుపడి చెయ్యడని ఎల్లవ్వ అనుకుంటుంది. అందులో లాభం లేకపోతే మానెయ్యక మరేం చేస్తాడని లింగం అనుకుంటాడు. కొడుకు ఆత్మగల్ల కొడుకే. అగాయి బుగాయి తిరిగేటోడు గాదు. మరి ఎక్కడ కాటకలిసింది! ఇల్లునిండా వడ్లతో చేతినిండా పనితో కులకషిపి తనకండ్ల ముందే పెరిగి విరిగింది. బతుకు దెరువు క్రమంలో తాను వృత్తిని వదిలి బాబా బ్రాన్ బ్యాండ్ మేళంలో కలిసాడు. అప్పుడు కొడుక్కు ఐదారేండ్ల వయసు. వాడు బుద్ధి నేర్చేనాటికి ఇంట్లో బీప్లేట్ పీకెనే కనిపించింది. కుమ్మరి లింగంకు బదులు, బీప్లేట్ లింగం అనే పేరే వినిపించింది.

మట్టి ముద్ద మీద కదిలిన వేళ్లనైపుణ్యం పీకెమీద పనికొచ్చింది. ఏ పాటైనా రెండు మూడుసార్లు వినగానే నోటికి వచ్చేది. దాన్ని పీకె మీద సాధన చేసేవాడు. చదువుకొంటూనే అప్పుడప్పుడు గజ్జెలు ఊపడానికి వెళ్లేవాడు కొడుకు. పెద్దవాడయ్యాక వీడియో కేసెట్లు నవలలు అద్దెకిచ్చే దుకాణం తెరిచాడు. అది తొందర్లోనే మూతపడింది.

చదువబ్బని కొడుకు పీకె ఊదడం కంటే తేలికని కేసియొా ప్లే చేయడం నేర్చుకున్నాడు. వెంట రెండు డ్రమ్ములు ఒక ఆటో ఉంటే సరి. డజను మంది ఉన్న బాబా బ్రాస్ బ్యాండ్ కంటే నలుగురితో నడిచే క్యాసియో ట్రూప్ తక్కువ రేటులో వచ్చేది. అదొక వింతలా కూడా ఉండేది. గొంతుతో ఊదడం లేదుకాబట్టి భరత్ తీసేప్పుడు ఎన్ని పాటలైనా ప్లే చేసేవాడు. తొందరలోనే బాబా బ్యాండ్ మూత పడింది. లింగం బీప్లేట్ పీకె శిలుమెక్కింది. ట్రంపెట్, సాక్స్, హారన్ పీకెలు మాయమయ్యాయి.

చేతుల పనిని కొడుకు అందుకున్నాడని సంబూరపడ్డాడు లింగం. కానీ ఆ పని కొడుకు చేతుల్లో ఎక్కువ రోజులు నిలువలేదు. చూస్తుండగానే ఐదారు కేసియోలు వచ్చాయి. గిరాకీ పడిపోయింది. రక్తమాంసాలకు ఊరిగా చేసి ఊదాలె కాబట్టి బీప్లేట్ పీకె ఐదారేండ్లు తన చేతుల్లోనే ఉంది. నాలుగు సెల్సులతో నడిచే కేసియో నలుగురి చేతులు మారింది. బతుకు దెరువు తండ్లాటలో వేరుకాపురం, దొయ్యలు అమ్మడం అన్నీ జరిగిపోయాయి. కొడుకు బతుకులోని మార్పును గమనిస్తున్న లింగంకు ఏది అడగాలన్నా నోరు రావడంలేదు. కనీసం

ఈ కూల్ డ్రింకుల అమ్మకంలోనైనా బాగుపడితే అదే చాలనుకుంటున్నాడు.

సారె చక్రం కాలుకు సర్రున కొట్టింది. 'అవ్వా' అన్నాడు లింగం వెనక్కి విరుచుకపడుతూ. రోకలి బండను వదిలి సారె వద్దకు ఉరికింది ఎల్లవ్వ. కాలును పిడికిడితో పట్టుకుని లేచి కూసున్నాడు లింగం. వేళ్లసందుల్లోంచి చిక్కటి రక్తం కారి, మట్టి పెల్లల మీద ఇంకిపోతుంది.

"నీ పనింట్ల పీనిగెల్ల. ఏం పని మొదలువెడితివి. యాడ తలిగింది?" భయం భయంగా చేతిని గుంజేసింది ఎల్లవ్వ.

కాలిబొక్క తెల్లగా కనిపించింది. తోలు ఓర్సుకపోయింది. రక్తం ధారలు కట్టింది. మట్టిలో కలిసి నల్లగా మారుతుంది. అది చూసి ఎల్లవ్వ ఒక్కసారిగా వణికిపోయింది. "ఇగనేనేం చెయ్యాలె... ఇది వట్టిగానె తక్కువైతదా..." అంటూ ఇంట్లోకి పోయింది. పసుపు తెచ్చి గాయానికి అద్ది కాసు సున్నం దంచి కట్టుకట్టింది.

వద్దన్నా వినకుండా నిలువులు చేసే పనిలో మునిగిపోయాడు లింగం. నొప్పికాలు మీద నిలబడటం కష్టంగా ఉంది. ఒంటికాలు మీదనైతే నిలబడరావటంలేదు. నొప్పిని పండ్లమధ్య బిగపట్టి ఓర్చుకుంటూ సారెపై ఆనుకున్నాడు లింగం. వంగి పైకి లేచేప్పుడు నరాలు జివ్వుమంటున్నాయి.



భర్త గిలగిలకొట్టుకోవడం చూస్తనే ఉంది ఎల్లవ్వ. పని బందు వెట్టాలనిపిస్తుంది. కానీ ఏడాది గానం, చిల్లర అప్పులు తీరుతాయనడంతో దుగపడి చెప్పలేకపోతుంది. ఇంతవరకూ ఎలాగో నాలుగు రోజులు కష్టపడితే సరె అనుకుంది. ఇప్పుడు ఆలోచనమారి, చెయ్యగలమా లేదా అని భర్తను అంచనా వేస్తుంది.

పగలు యాల్లయింది మూడు నిలువులు దిగినాయి. అన్నంతిని మళ్లీ పనిలో దిగారు. కాలు నలుపుతుంది. నొప్పి ఎక్కువవుతుంది. నొప్పిలేనట్టే మొండిగా సారెపై ఆనుతున్నాడు లింగం. పచ్చిబిగిలను ఎండ నుండి నీడకు మార్చి రాయిని మోటు సల్పను అందుకుంది ఎల్లవ్వ. లోపల మసిని పోస్తూ గుండు రాయిని పెట్టి అదుముతూ సల్పతో కొట్టడం మొదలెట్టింది. ఆమె చేతిలో కాగు బొంగరంలా తిరుగుతుంది.

నిలువులన్నీ దిగేనాటికి వారం దాటింది. లింగంకు జరం పుట్టింది. నున్న గుంతలయ్యేసరికి ఎల్లవ్వ నడుము కొంకశీలిపోయింది. మంచంలోంచి లెవ్వలేదు. కాగులు నెర్రెలు వారకుండా గట్టింపు చేసి ఎండ నీడలకు మారుస్తూ సంటి పిల్లను పోదను చేసినట్టుగా చేసాడు లింగం. వాము పేర్చేనాటికి ఇద్దరూ మంచం పట్టారు. దేకినట్టుగా నడుస్తూ వెళ్లి వామును అంటించాడు. వారి గోస చుట్టుపక్కల వాళ్లకు కన్నీరును తెప్పించింది.

ఎన్నో ఏండ్ల తర్వాత మొదటిసారిగా ఇండ్ల మధ్య కుమ్మరి వాము మంటలు లేచాయి. ఆ గాలితో వాము పొగ కలిసిపోయింది. వాము చుట్టూ లేచినపొగ కొత్త ఇండ్లల్లో నిండింది. వారికి అది కొత్త. ఇదేం పొగ అని విచిత్ర పడ్డరు. విసుక్కుంటూ తలుపు లేసుకున్నారు. ఇక రోజు గిట్లయితే మనం పోగు వోసినట్టేనని తిట్టుకున్నారు. కాలుతున్న మట్టి వాసన కమ్మగా, కొత్తగా దట్టమైన పొగతో కలిసి పైకి లేచింది.

చీకట్లో నాలుకలు చాపిన మంటలతో కుమ్మరి వాము తన ఉనికిని చెప్పుకుంటుంది. వాముపొగ సుడులు తిరుగుతూ ఆర్తిగా అన్ని మూలలను తడుముతూ మనిషి మనిషినీ పలకరిస్తూ సూరుపొక్కల్లోంచి, కిటికీల్లోంచి ఊరంతా కలియతిరిగి పైకిలేచింది.

లింగం అక్కడే వాము దగ్గరనే అలసిసొలసి నిద్రపోయాడు. ఎల్లవ్వ ఇంట్లో పడుకుంది. కంటిమీద కునుకు రావడంలేదు. కండ్లపొంటి నీళ్లు కారుతున్నాయి. "ఇందరు ఇన్ని రకాల మాట్లాడిత్తున్నరు. రోజూ ఇంటి ముందటి నుండే పోతున్నడుగనీ నాయినా, జరమచ్చినాదే? అవ్వా, ఎట్టున్నవే? అని కొడుకు మాట్లాడిస్తలేడని" ఆమె మనుసు వాములా రగులుకుంటుంది. 'వాడు పెడితే ఎంత, పెట్టకపోతే ఎంత! యాడాదికి ఒక్కసారి గిట్లనే వాము చేసి కాగులు కాల్చుకుంటే ఎవ్వలకు ఎదురు సూడకుంట బతుకచ్చు. అట్లనో ఇట్లనో గడ్డకు వడ్డము" అనుకుంటుంది పుట్టెడు జరంతో కూడా.

ఇద్దరూ మనుసుల్లో మనుసులై తిరిగేనాటికి వాము కాలి కూలింది. ఐదు వందల దాకా మందులకు ఖర్చయినయి. అయినా మొహంలో చెప్పలేని ధీమా! ఎక్కడికక్కడ లెక్కలేసుకున్నారు.

పైస పైసా కూడవెట్టిన గల్లగురిగిని పలుగగొట్టి పైసలేరుకున్నట్టు వామున్న పలుగజేరి, కాగుల్ని పైకి తీసారు. రెండు పలిగిపోగా ముప్పయి రెండు కాగులు మిగిలినయి. ఆఖరునాడు పడుకుంటూ లేసుకుంటూ చేసిన కుండల్ని ఇంటికొకటి పంచింది ఎల్లవ్వ.

కాగులన్నింటిని ఏరి వరుసగా బోర్లించాక లక్షల ఆస్తి తమకు దక్కినంత తృప్తి కలిగింది. ఒకటికి రెండుసార్లు ప్రేమగా తడిమి చూసుకున్నాడు లింగం. అప్పటికి జాతర దగ్గరపడింది. కార్యక్రమాలు జోరును అందుకున్నాయి. అన్నింటినీ జాతరకు ఇత్తే బాగుండునన్న ఆలోచన వచ్చింది ఎల్లవ్వకు. పైగా పంతులంటే గురి. తండ్రి ఉన్నప్పటి మేనతు. ఇప్పుడు బంగ్లకట్టిండుగని అప్పుడేముండె? మాతో ఉన్నోడేనాయె. ఈంతసానం జెయ్యడా అనుకుంది.

"ఇగో మనం ఒక పని చెయ్యాలె. ముందుగల్ల రెండు కాగుల్ని పంతులుకు ఒకటి సర్పంచ్‌కు ఒకటి వట్టిగ పంపుదాం. తెల్లారినంకపోయి పంతులును కలువు. బతిలాడితే ముప్పయికి ముప్పయి కొంటడు." సలహా చెప్పింది ఎల్లవ్వ. అలాగే చేశాడు లింగం.

మరునాడు లెక్క మాట్లాడుకోవడానికి పంతులు ఇంటికి వెళ్లాడు లింగం. వచ్చిపోయే జనంతో ఇల్లంతా సందడిగా ఉంది. జాతరకు సంబంధించిన పనుల రూపకల్పన అక్కడే జరుగుతుంది. లింగం కాళ్లు కడపవద్దనే ఆగిపోయాయి. అతడి చేతుల్లో తయారైన కాగు మాత్రం ఎవరూ వెళ్లనంత లోపలి ఇంట్లోకి వెళ్లి గర్వంగా నిలబడి

లింగంనే చూస్తుంది. చిన్నగా నవ్వుకుని అక్కడే అరుగుమీద కూర్చున్నాడు లింగం.

పంతులుదీ తనదీ ఒక్క ఈడే. తను ఊళ్లోకి ఇల్లరికం వచ్చినప్పుడే పంతులు బతకడానికి వచ్చాడు. అప్పట్లో తన మామనే పంతుల్ని చేరదీసాడని ఇప్పటికీ పంతులే చెబుతుంటాడు. సెల్‌ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతూ అటువైపు వచ్చాడు పంతులు. లింగంనుచూస్తూనే పలకరించి నవ్వాడు.

“ఏంరా లింగం... బాగున్నవా? ఇంతకు ముందే యాది జేసుంటిని. మీ కుమ్మరోల్లంతా కలిసి దేవునికి ఓడి బియ్యం తేవాలెరా... తొమ్మిది సోలల బియ్యం కుడుక కనుము నూటపదార్లు అంతే. కొత్త దేవుడు ఏది మొక్కితే అది ఇతది” అన్నాడు. దూదినిమ్మపండులాంటి పొట్ట. ఆయాసంతో ఎగపోస్తున్నాడు. దిగి వచ్చిన దేవుడిలా కనిపించాడు లింగంకు.

చేతులెత్తి దండం పెడుతూ “అదెంత భాగ్యం పంతులూ? మీరు చెప్పినంక తేమా?” అంటూ కాగుల ముచ్చట ఏదైనా చెబుతాడేమోనని చూసాడు లింగం. పంతులు ఆ ముచ్చట ఎత్తకపోయేసరికి తనే తీసాడు.

“అరే... ఆ ముచ్చట నీకు మొన్ననే చెబుతామనుకుని మర్చిపోయిన. ఈ జాతర చెయ్యవట్టి ఆగమాగముంది. కాగులు కొంటే నాలుగైదు వెయిలు కావాలె. దాంట్ల నీళ్ల తెచ్చి నింపుడుకు ట్రాక్టర్ కిరాయి గావాలె. మొత్తం ఏడెనిమిది వెయిల ఖర్చు. అయితావె పెడుదామను కున్నాం. మొన్ననే నీ కొడుకు వచ్చి అక్కడ నీళ్ల పాకెట్లు అమ్ముకుంటనన్నడు. అమ్ము కున్నందుకు మాకే రెండు వెయిలు ఇస్తనన్నడు. ఇదేనయముందని కమిటీ మెంబర్లు ఒప్పుకున్నారు. సర్పంచ్ కూడా సరేనన్నడు...” ఎవరో పిలిస్తే వెళ్లిపోయాడు పంతులు.



లింగంకు కాల్లు చేతులు సల్లవడ్డయి. సల్ల చెమటలు పుట్టినయి. చలిజ్వరం వచ్చినవాడిలా వణికిపోయాడు. ఎలా చేరుకున్నాడో కాని పతుకులాడినట్టుగా కొడుకు దగ్గరికి చేరుకున్నాడు. ఇంటినిండా నీళ్లపాకెట్లే! ఫ్రిజిలో పెట్టి చల్లబరుస్తున్నాడు. ఇద్దరు ముగ్గురు వ్యక్తులు పాకెట్లను ప్యాక్ చేస్తున్నారు. తండ్రిని చూసి మొహం చిట్లించాడు కొడుకు.

“కమిటీకి రెండు వెయిలిచ్చిన, పది వెయిల మాలు తెచ్చిన, వెయ్యి ఖర్చయినయి. కోడలు మీది పుస్తెలతాడు అమ్మిన. ఇప్పుడు నువ్వు అమ్ముమంటే అమ్ముత. వద్దంటే తీసుకపోయి వాగులపారేత్త.” యాష్టగా అన్నాడు కొడుకు. లింగంకు మొదటిసారిగా కొడుకు మీద కోపం వచ్చింది. అదీ కొద్దిసేపే! బతుకు దెరువు పాకులాటలో కొడుకెవరు తండ్రెవరు అనుకున్నాడు. పంతులు మీదా సర్పంచ్ మీదా కోపమొచ్చింది. ఒక్కసారిగా నూరేళ్ళ ముసలితనం పైబడినట్టయింది. బిత్తిరి చూపులు చూస్తూ సొలుక్కుంటూ సొలుక్కుంటూ ఇంటికి వచ్చి మంచంలో వాలిపోయాడు.

విషయం తెలుసుకుని కొడుకును ఆడిపోసుకుంది ఎల్లవ్వ. ఆమె గుండె దడ రెట్టింపయింది. తనో మంచంలో ఒరిగిపోయింది. వదురుతనే ఉంది.

“వాన్నిగాదు, నీళ్లను ముల్లెగట్టి అమ్ముతున్న కంపినోన్ని అనాలె. దేవుని గుడిదగ్గర దానం చెయ్యాల్సిన నీళ్ళు అమ్ముకుంటార్రా? థూ...!” లింగం కూడా వదరుడు మొదలెట్టాడు. ఇద్దరికీ చలిజ్వరం అందుకుంది. ఈ విషయం తెలిసి మన్నుజార గొట్టినోళ్లు, కట్టెలు కొట్టినోళ్లు పైసల కొరకు ఇంటికి వచ్చారు.

మరునాడే తన గుర్తుగా ఉంచుకొమ్మని ఇంటి కొకటి పంచాడు లింగం. పంచిన ప్రతీ ఒక్కరికి ‘కాగుబొత్త కథ’ను వివరంగా చెప్పి, మనవలకీ మనవరాండ్లకీ చెప్పమన్నాడు.

. . .

కథ చెప్పడం ఆపి ఫ్రిజ్ వైపు దీనంగా చూసింది కాగుబొత్త. దాని కళ్లనిండా కన్నీళ్లు. లింగం రూపం మనసులో మెదిలింది. చివరగా మిగిలిన తానొక్కతైనా ఇంటిలోనే ఉంటాననుకుంది. లింగం బాగలేడని చూడడానికి వచ్చిన పట్నం మనిషికి కథంతా వినిపించి తనను అప్పగించాడు లింగం.

ఎందుకోగానీ ఫ్రిజ్ గంభీరంగా వింటుంది. కిటికీలోంచి ఎండ చురుక్కుమంటుంది. అంతవరకూ ఇంట్ల అలికిడి లేదు. ఒక్కరొక్కరే నిద్ర లేస్తున్నారు. మొదట నిద్ర లేచిన పిల్లలు కాగుబొత్తను విచిత్రంగా చూస్తూ కేరింతలు కొడుతున్నారు.

“అదీ నా కథ. లాభాలు తేకపోయినా ఫరవాలేదు. కనీసం నా యజమానికి బుక్కెడు కూడును పెట్టలేకపోయాననే నా బాధంతా....” కాగుబొత్త చెబుతుంది.

గుర్రుమని శబ్దం చేస్తూ ఫ్రిజ్ మౌనంగా ఉండిపోయింది.

“ఏయ్... దీన్ని ఇక్కెడవరు పెట్టారే...” కేకతో రెండూ ఉల్కిపడ్డాయి.

ఇంటి యజమానిలాగున్నాడు. నిద్రకళ్లతో కాగును కోపంగా చూస్తూ అరిచాడు. కాగుకు భయమేసింది.

“నిన్న మామయ్య ఊరి నుండి తెచ్చాడు.” లోపలి నుండి యజమానురాలి కంఠం.

“ఆ... తెచ్చాడులే... ఈ బంగారాన్ని... హాల్లో దిష్టిబొమ్మలా ఎందుకు...? స్టోర్ రూమ్‌లో పడేయ్!” ఆర్డర్ ఇచ్చాడు. పిల్లలు గిచ్చుతూ, కొడుతూ, లోపలికి తొంగి చూస్తూ అల్లరి చేస్తున్నారు. క్షణాల మీద పనిమనుషులు ప్రత్యక్షమై లేవనెత్తారు. కాగు కన్నీళ్లు కారుస్తూ ఫ్రిజ్ వైపు చూసింది. ఫ్రిజ్‌కు గుండె కరిగింది.

కాగును దుమ్ముపట్టిన స్టోర్ రూంలోకి మారుస్తూ ఇద్దరు మనుషులు లింగంను గుర్తు చేసుకుంటున్నారు. “పాపం... వాని రెక్కలు బొక్కలు ఇయ్యల్ల అయిమన్నయి. ఒక్కనాడురికేం లేకపాయె... కడుపునిండ తిన్నది లేదు. కంటినిండ పన్నది లేదు... ఇయ్యాల్టితో పేరు మాసిపాయె....” వింటున్న కాగుబొత్త గుండె జల్లుమంది. అంతే! దుఃఖం ఆగలేదు. పక్కున పలిగింది.

V

రీవ్యూ

# ఐదు హంసలు

## రూపవైవిధ్యమే మిగిల్చే పోస్టుమోడ్రనిస్టు ప్రయోగం

*ఈ నవల మీద జరగాల్సినంత చర్చ జరగలేదు. దీనికి చాలా కారణాలు ఉన్నాయి. కొంతమంది ఈ నవల అర్థం కాలేదన్నారు. కొంతమంది ఇది తిరోగమన నవల (నాన్-ప్రోగ్రెస్సివ్) అన్నారు. ఏమైనా దీన్ని అర్థం చేసుకోవటం క్లిష్టతరమైంది కనకనే పాఠకులు, విమర్శకులు సరైన స్పందన చూపలేకపోయారు.*

**జిలుకర శ్రీనివాస్**

తెలుగు నవలా ప్రక్రియలో ప్రయోగాలు అరుదుగానే కన్పిస్తాయి. కవిత్వంలో చేసినన్ని ప్రయోగాలు నవలా రచనలో రచయితలు చేయలేదనిపిస్తుంది. వస్తువును సులభంగానూ, ఆనందాయకంగానూ అందించే ప్రయత్నమే జరిగింది. కందుకూరి నుంచి ఓల్గా వరకు. వస్తువు మారింది. ప్రపంచీకరణ తర్వాత పరిస్థితి ఇంకా మారింది. అయితే పాశ్చాత్య సాహిత్యంలో పోస్ట్‌మోడ్రనిజం వేసిన ప్రభావం ఏమీ తక్కువ కాదు. పోస్టుమోడ్రనిజం సృష్టించిన తాత్త్విక గందరగోళం తెలుగు సాహిత్యాన్ని కూడా తాకింది. అయితే, తెలుగు పోస్ట్‌మోడ్రనిస్టు రచయితలు చాలా తొందరగానే ఆ గందరగోళం నుంచి బయటపడినట్టు కన్పిస్తుంది. దానికి కారణం తెలుగు గడ్డమీద జరిగిన, జరుగుతున్న ప్రజాస్వామిక మార్క్సిస్టు పోరాటాలు, కమ్యూనిస్టు సైద్ధాంతిక భావజాల సాంస్కృతిక వారసత్వమేనని చెప్పవచ్చు. పోస్టుమోడ్రనిజం ప్రవచించిన కొన్ని మంచి అంశాల్ని పోస్టుమోడ్రనిస్టులు తెలుగు సాహిత్యానికి అందచేశారన్నది కూడా నిజం. దళిత, స్త్రీ, మైనారిటీ తదితర సమూహాల పోరాటాలు చారిత్రక అవసరంగా వచ్చాయి. ప్రాగ్మటిక్ పాలిటిక్స్ (పోస్టు స్ట్రక్చరలిజం/పోస్టు మోడ్రనిజం) తర్వాత ఏం జరుగుతుందన్నదే నేటి పాశ్చాత్య మేధావుల పరిశోధనగా సాగుతున్నది.

పోస్టుమోడ్రనిజం ఇక ఎంతమాత్రమూ సరిపోదని సియాటిల్ నుంచి బషీర్‌బాగ్ వరకు జరిగిన పోరాటాలు ఆచరణాత్మకంగా నిరూపించాయి. దళిత, స్త్రీ, మైనారిటీ, ప్రాంతీయ తదితర వాదాలన్నీ ప్రపంచీకరణ, మతతత్త్వానికి వ్యతిరేకంగా ఉమ్మడిపోరాట ప్రతిపాదనల్ని ముందుకు తెస్తున్నాయి.

పోస్టుమోడ్రన్ జీవితాన్ని చిత్రించే నెపంతో 'నేనూ-చీకటి', 'ఐదుహంసలు' నవలలు వచ్చాయి. 'ఐదు హంసలు' ఆటా వారి పోటీలో రు.50 వేల బహుమతి పొందింది. అయితే ఈ నవల మీద జరగాల్సినంత చర్చ జరగలేదు. దీనికి చాలా కారణాలు ఉన్నాయి. కొంతమంది ఈ నవల అర్థం కాలేదన్నారు. కొంతమంది ఇది తిరోగమన నవల (నాన్-ప్రోగ్రెస్సివ్) అన్నారు. ఏమైనా దీన్ని అర్థం చేసుకోవటం క్లిష్టతరమైంది కనకనే పాఠకులు, విమర్శకులు సరైన స్పందన చూపలేకపోయారు. "ఆధునిక కవిత్వం అర్థం కావాలంటే ఆధునిక జీవితం అర్థం కావాల"ని శ్రీశ్రీ చెప్పారు కదా! అలాగే పోస్టుమోడ్రన్ రచనలు అర్థం కావాలంటే కూడా పోస్టుమోడ్రన్ జీవితం తెల్సుండాలి. అయితే అలాంటి పోస్టుమోడ్రన్ జీవితం మన సమాజంలో కన్పిస్తుందా?అని ప్రశ్నిస్తే ఉందనే చెప్తారు. 'మెట్రోపాలిటన్, కాస్మోపాలిటన్ నగరాల్లో కన్పిస్తుంది' అంటారు. ఆ నగర జీవితాన్ని ప్రతిబింబించేదే ఐదు హంసలు. అయితే రచయిత డా॥ వి. చంద్రశేఖరరావు దళిత, స్త్రీవాదుల పోరాటాలే ఆధునికానంతర వాస్తవ పోరాటాలుగా, చారిత్రక అవసరాలుగా చిత్రించారు. నవల ఆసాంతం స్త్రీల, దళితుల జీవితాల్లో జరిగిన అన్యాయాలను, వారికితోడుగా మార్క్సిస్టుల పాత్రని 'మాజికల్ రియలిజం' అనే ఫాంలో సృజించారు.

ఇక్కడ మాజికల్ రియలిజం గురించి కొంత చెప్పుకోవాలి. 'మాజికల్ రియలిజం' ఒక రచనా ప్రక్రియ. ఇది 1920లో లాటిన్ అమెరికాలోని ఫైన్ ఆర్ట్స్ (school of painters)లో వచ్చింది. 1940లో ఈ మాటని క్యూబన్ నవలాకారుడు అలిజ్ కార్పెన్‌టైర్ మొదటిసారిగా సాహిత్యంలో ప్రయోగించాడు. లాటిన్ అమెరికన్ రచయితలు ఫాంటసీ, మైథాలజీని వాస్తవిక సాహిత్యం(realistic fiction)తో కల్పి సృజిస్తున్న ధోరణిని ఆయన గుర్తించాడు. ఈ ధోరణిని చెప్పడానికి ఆయన వాడిన మాట ''మార్వెలెన్ రియాలిటీ'' (to real marvillos- లాటిన్లో, Marvellus reality). ఈ ప్రక్రియని విస్తృతంగా ప్రచారంలోకి తెచ్చినవాడు గాబ్రియెల్ గార్షియా మార్క్వెజ్. మార్క్వెజ్ సాహిత్యంలో చేసిన సేవకు 1982లో 'నోబెల్ ప్రైజ్' వచ్చింది. ఈయన 'వన్ హండ్రెడియర్స్ సాలిట్యూడ్' (1967) అనే నవలకు ప్రపంచ వ్యాపిత గుర్తింపు వచ్చింది. ఇదే 'మాజికల్ రియలిజం'కు విస్తృతవ్యాప్తిని తెచ్చిపెట్టింది.

M.H. Abrram మాజికల్ రియలిజాన్నిలా తెల్పుతాడు: "These writers interweave in an ever-shifting pattern, a sharply etched realism in representing ordinary events and descriptive details together with fantastic and dream like elements, as well as with meterials derived from myth and fairy tales" (A glossary of literary terms, 1993)

అబ్రం ప్రకారం మాజికల్ రియలిజంలో చెప్పే విధానం ఎప్పుడూ మారుతుంటుంది. విపరీత భావన, అసంబద్ధత, కలలు కల్సిన సాధారణ అంశాలు, వివరణాత్మక సంఘటనలు వాస్తవంగా చిత్రించబడ్డాయి. అదే విధంగా

అభూత కల్పిత కథలు, కాల్పనికత నుండి తీసుకున్న అంశాలు ఉంటాయి.

జానన్ కాలంటానివెూ ప్రకారం "Not fantasy, science or horror, magical realism is a distinctive Genre that typically presents charectors that live in two worlds: every day reality and the world of the charactor's own dreams and superstitions" (Magical realism outside of Latin America.)

విలక్షణమైన పాత్ర లుంటాయి. అవి రోజువారి వాస్తవ జీవితంలో, వాటిపైన కలల ప్రపంచంలోనూ అంధవిశ్వాసాల్లోనూ జీవిస్తూ ఉంటాయి.

ఈ ప్రక్రియలో జార్జి లూయిస్ బోర్గ్స్ అర్జెంటైనాలో, మార్క్వేజ్ కొలంబియాలో, గుంటర్ గ్రాస్ జర్మనీలో, జాన్ పాల్స్ ఇంగ్లాండ్‌లో- ఇంకా అనేకమంది ప్రపంచ వ్యాపితంగా రచనలు చేశారు. తెలుగులో వి. చంద్రశేఖరరావు 'ఐదు హంసలు', మునిపల్లెరాజు 'మాజికల్ రియలిజం కథలు' వచ్చాయి.

ఈ ఫాంలో వచ్చిన రచనను అర్థం చేసుకోవటం కొంచెం కష్టమే! మార్క్వేజ్ 'వన్ హండ్రెడ్ ఇయర్స్ సాలిట్యూడ్' నవలలో పాత్రలకు రెక్కలు మొలవటం, గాలిలో ఎగిరి ఎక్కడెక్కడో విహరించటం, వివిధ జీవులతో సంభాషించటం ఉంటాయి. విచిత్రమైన, భయంకరమైన కలలు ఆయన రచనలో కన్పిస్తాయి.

'ఐదు హంసలు'లో కూడా ఈ విధమైన అంశాలు కన్పిస్తాయి. ఒకచోట చంద్రశేఖరరావు నిరంజన్ పాత్రతో అనిపిస్తాడు- ''అయినా మార్క్వేజ్‌కో, బోర్హాస్‌కో, మరో ఎక్స్‌కో, మరో వైకో పారడీలు ఎందుకు సృష్టించాలి! నేను నిరంజన్‌ను... మనం..." ఈ నవల చాలా చోట్ల మార్క్వేజ్‌ను అనుసరించినట్టుగా కన్పిస్తుంది. 'నాలుగో హంస' కథ నుంచి కొంచెం తన పంథా మార్చుకున్నట్టు కన్పిస్తుంది. నవలను అర్థం చేసుకోవడానికి పాఠకుడు ముందుగా 'ఐదోహంస'కథను చదవాలి. అప్పుడే సులభంగా అర్థమవుతుంది. లేకపోతే నిరంతరం రూపాంతరం చెందే పాత్రలు

.............. O ..............

**నవలను అర్థం చేసుకోవడానికి పాఠకుడు ముందుగా 'ఐదోహంస'కథను చదవాలి. అప్పుడే సులభంగా అర్థమవుతుంది. ప్రతీ హంస ఒక జీవితానికి మెటాఫర్. ఈ విధానమే నవలను ఫజిల్‌గానూ, మిరాకిల్‌గానూ మార్చింది.**



.............. O ..............

అసంబద్ధంగా తోస్తాయి. అసంపూర్తిగా తొలగిపోయే పేరాలు, అంతర్ధానం అయ్యే పాత్రలు, మనస్సునిండా బీభత్సాన్ని నింపే అబ్సర్డ్ వర్ణనలు మనల్ని చికాకుపరుస్తాయి. కాని ప్రతీ హంస ఒక జీవితానికి మెటాఫర్. ఈ విధానవేు నవలను ఫజిల్‌గానూ, మిరాకిల్‌గానూ మార్చింది.

నవలలో నిరంజన్, సత్యప్రకాశం, లలిత, తీర్థముఖి, వెూహనసుందరం ప్రధానపాత్రలు. హైదరాబాద్ నగరం నవలకు కేంద్రం. నిరంజన్ సత్యప్రకాశం, లలితల ఇంట్లో ఉండి నవల రాస్తుంటాడు. నిజ జీవితంలోని వ్యక్తుల్నే వివిధ పేర్లతో పాత్రలుగా మలుస్తుంటాడు. 'ఐదు హంసలు' పేరుతో ఒక్కో హంసగా ఐదు కథలు చెప్తాడు. వీటన్నిటిలో నిరంజన్ కామన్ క్యారెక్టర్. మిగతా కథల్లో స్త్రీ పాత్రలు, పురుష పాత్రలు మారుతుంటాయి.

'మొదటి హంస' కథలో నిరంజన్, కోమలి డ్రీం ఫాక్టరీ (నాటకాల్లో)లో పన్చేస్తుంటారు. వెూహనసుందరం, ఆనందశంకరం మరో రెండు పాత్రలు. మోహన సుందరం ఈ కథలో ఆదర్శవాది. నాటకం రవీంద్రభారతిలో ప్రదర్శిస్తూంటే, ప్రేక్షకులు ఆనందోత్సాహంలో నాటకం మధ్యలో అతన్ని రోడ్డుమీదికి ఊరేగింపుగా తీసుకురావటం, పోలీసులు అతణ్ణి అరెస్టు చేయటం జరుగుతాయి. యాక్సిడెంటులో కోమలి కాలు విరిగిపోతుంది. కొయ్యకాలుతో నడుస్తుంటుంది. తన ఫ్లాష్ బాక్ చెప్తుంది. తన భర్త వేరే వివాహం చేసుకున్నది చెప్తుంది. నిరంజన్‌కు ఆమె మీద కోర్కె కల్గుతుంది. ఒక రాత్రి సమాధుల మధ్య తనతో సమాగమించమని, తల్లి కావాలని ఉందని చెప్తుంది. అలా వారి ప్రణయంవల్ల ఒక వికృత శిశువును కంటుంది. నుదురుమీద ఒంటి కన్ను ఉన్న శిశువును వదిలి కోమలి ఎటో వెళ్ళిపోతుంది. ఒంటికన్ను కుర్రాణ్ణి బాలభగవంతునిగా ఆనందశంకరం ప్రచారం చేస్తాడు. కోమలికి తనకు కలిగిన వికృత శిశువుతో ఆనందశంకరం ఏదో చేస్తాడని నిరంజన్ ఊహిస్తాడు. ఆనందశంకరానికి మహిమలంటే ఎక్కువ ఇష్టం. డబ్బు సంపాదనకు ఆ అబ్బాయిని ఉపయోగిస్తాడు.

'రెండోహంస కథ'లో మాలతి తన జ్ఞాపకాల్ని రాసుకుంటుంది. దళితుల మీద జరిగిన దాడులకు, దళితుల చైతన్యానికి మాలతి ఒక మెటాఫర్. మాలతి, మోర్మియో మాష్టారు, మోహనసుందరం, వెన్నెలక్క, నిరంజన్ పాత్రలు ప్రధానమైనవి. మాలతి దళితయువతి, కాలేజీవిద్యార్థి - మోహనసుందరం అదృశ్యమాంత్రికుడు - నిరంజన్ బ్రహ్మణకులంలో పుట్టినా కుల వ్యతిరేక చైతన్యం కల్గిన వ్యక్తి. మాలతి వెూహనీసుందరం ప్రభావంతో 'ఉక్కు హంస'గా మారుతుంది. మాలతి తూనీగలతోటి, చిలకలతోటి చిన్నప్పుడు మాట్లాడుతుంది. అవి జరగబోయేం ప్రమాదాన్ని ముందే ఊహిస్తాయి. రోడ్డు రోలర్ మాలతి కాలు మీద నుండి పోయి నుజ్జునుజ్జు అవుతుంది. అప్పటి నుండి 12 ఏళ్లు మాలతి నిద్రపోదు. వెన్నెలక్క నక్సలైట్. ఆమె పాటతో మాలతి నిద్రపోతుంది. కథ చివర నిరంజన్ చేస్తున్న సర్కస్ చూడ్డానికి వచ్చిన వెన్నెలక్కను పోలీసులు కాల్చి చంపుతారు. మోహన సుందరం వెన్నెలక్క మృతికి జోహార్లర్పిస్తూ ప్రదర్శన తీస్తాడు. ప్రదర్శన నుంచి తప్పుకుంటే నీకు చావు మూడుతుందని చెప్పినా ఫ్రెండ్స్ బలవంతంపై నిరంజన్ మందుపార్టీకి వెళ్తాడు. తిరిగి వస్తుంటే పోలీసులు కాల్చి చంపుతారు.

'మూడో' కథలో నిరంజన్ సైబర్‌సర్కస్‌లో పోస్టు మోడర్న్ మార్క్సను కలుసుకుంటాడు. పి.ఎం. మార్క్స మిరాకిల్‌బాయ్‌గా ప్రచారం పొందుతాడు. ఆధునికానంతర యువతకు పి.ఎం. మార్క్స ఒక ప్రతీక. ఆధునికానంతర వాదాల గురించి, కంప్యూటర్ టెక్నాలజీ గురించి అనర్గళంగా మాట్లాడ్తాడు. ఆ తర్వాత వెూహన సుందరంను కల్సుకుంటాడు. మోహిని,

మోహన సుందరాన్ని నిరంజన్‌కు పరిచయం చేస్తుంది. మోహిని ప్రకాశ్ భార్య. ప్రకాశ్ గిరిజనులకు పాఠాలు చెప్పినందుకు పోలీసులు 'డిటెన్' చేస్తారు. మోహిని, నిరంజన్ సెక్స్ పార్ట్నర్స్‌గా జీవిస్తుంటారు. మోహన సుందరానికి దళిత ఉద్యమాలపై, జాతుల, కులాల, సాంస్కృతిక ఉద్యమాలపై ఎక్కువ నమ్మకం. మోహన సుందరం నివసించే ఇంటిని ఎవరో పేల్చటంతో చనిపోతాడు. ఆ శిథిలాల మధ్య నిరంజన్ తిరుగుతూ జ్ఞాపకాలు నెమరువేసుకుంటాడు. కథ అయిపోతుంది. నిరంజన్ పి.ఎం మార్క్స్‌ను, లలితను ఫ్రెండ్స్‌ను చేస్తాడు, తర్వాత కథకు ప్రారంభసూచనగా. మార్క్స్ తాను మిరాకిల్ బాయ్‌ను కాదని నమ్ముతుంటాడు. ఆనందశంకరం ప్రపంచాన్ని మోసం చేస్తున్నాడనుకుంటాడు. ఇదీ అసంపూర్తిగా, అసంబద్ధంగానే ముగించి, నాల్గోకథను చెప్తాడు.

నాల్గో కథలో 'మల్లిక' ఒక దళిత యువతి. ప్రేమవివాహం చేసుకుంటుంది. సరిపడక నాన్నమ్మ మాటతో విడాకు లిచ్చేస్తుంది. ఫెమినిస్టు పాఠాలు ఆమె దగ్గరే నేర్చుకుంది. పట్నంలో చదివినపుడు మోహన సుందరంతో పరిచయం అవుతుంది. భూమికోసం పోరాడి తన తాత, తండ్రి మరణిస్తారు. తల్లి సూరమ్మకు శివయ్యకు లైంగిక సంబంధమున్న విషయం మల్లికకు తెలిసి, అతణ్ణి ఇంటికి రానీదు. శివయ్య మల్లికపై అత్యాచారయత్నం చేసి అరెస్టవుతాడు. పోలీసుల చేత తన్నులు తిన్న శివయ్య అక్కసుతో మల్లిక నిద్రిస్తునప్పుడు కాలు నరికేస్తాడు. మల్లిక కొయ్యకాలుతో నడుస్తుంది. రిజర్వేషన్‌వల్ల గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయి అభివృద్ధి ప్రచారం చేస్తుంది. బిబిసి, ఇతర మీడియా ఆమెకు మంచి పేరు తెచ్చిపెట్టాయి. ఎమ్మెల్యేగా పోటీ చేయాలనుకున్నప్పుడు అగ్రకులాలు మాదిగ పల్లెమీద దాడి చేసి చాలా మందిని హతమార్చుతారు. మల్లిక కూడా కన్పించకుండాపోతుంది. ఈ న్యూస్ కవరేజికి నిరంజన్ వస్తాడు. మోహన సుందరం కన్పించి "మల్లిక చనిపోలేదు! మరో కొత్త జీవితంలోకి వెళ్ళిపోయింది. మల్లిక గురించి చింతించవద్దు. రెక్కల హంస! ఎగరటం అనే విద్య తెలిసింది" అంటాడు ఆశావహంగా.

'ఐదోహంస కథ'లో నిరంజన్



*ఈ నవల కమ్యూనిస్టుల్ని గుర్తిస్తూనే, వారిని విమర్శించేదిగా కన్పిస్తుంటుంది.*

రాసిన కథనే తీర్థముఖి, సత్యప్రకాశం, లలిత, నిరంజన్‌లు నాటకంగా వేస్తారు. న్యూమిలీనియం సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్ళను చూస్తారు. ఆనంద శంకరం టాంక్‌బండ్‌మీద పి.ఎం. మార్క్స్ చేత మహిమలు చేయిస్తానని వేదికపై నుంచి చెప్తాడు. లలిత స్టేజీ మీదకు వచ్చి, నేనూ మిరాకిల్ చేయగలనని, తన తెగిన కాలుకి అమర్చిన కృత్రిమ అవయవాన్ని తొలగించి నడుస్తుంది. హంసలు అరుచుకుంటూ వచ్చి లలితను మోసుకొని గాలిలోకి ఎగురుతాయి. జనం చప్పట్లు కొడ్తారు. ఆ తర్వాత మోహన సుందరం పాత్ర వేదిక ఎక్కాలి. అయితే మోహన సుందరాన్ని పోలీసులు చంపారని అనుకుంటాడు. నాటక సమయానికి వస్తాడని లలిత చెప్తుంది. అన్నట్టుగానే మోహన సుందరం వస్తాడు. మోహన సుందరం మోసుకొస్తున్న విగ్రహంలో ఆదివాసిని, దళితుణ్ణి, పోరాటయోధుని చూసి, "అవును అతనే కొత్త మిలీనియం మానవుడు" అనుకుంటాడు నిరంజన్. ఇంకా ఇలా అరుస్తాడు: "మోహన సుందరం మన మిత్రుడు, మన నాయకుడు, మన పోరాటం, మన క్రీస్తు, మన మార్క్స్! రండి అతణ్ణి స్వాగతిద్దాం."

దీంతో ఐదు హంసలు నవల ముగుస్తుంది. ఈ నవల కమ్యూనిస్టుల్ని గుర్తిస్తూనే, వారిని విమర్శించేదిగా కన్పిస్తుంటుంది. నవల ఉద్దేశాన్ని 'ఐదోహంస' కథలో ఇలా చెప్తాడు: "ఆదియందు ఉద్యమ ముండెను. ఉద్యమం రక్తమాంసాల మనిషిగా రూపాంతరం చెంది, మన మధ్యన నివసించటం మొదలుపెట్టెను. ఆ మనిషి లేదా ఉద్యమం పేరు మోహనసుందరం. గడిచిన శతాబ్దానికి సర్వమూ, భావ ప్రకటనా అతనే అంటారు. అతని జీవితం ఒక రహస్య సంకేతంలానో, యుద్ధగానంతోనో, క్లిష్టమైన సామాజిక సిద్ధాంతం (ఉదా. మార్క్సిజం) లాగా ఉండేది. అతని చుట్టూ కమ్మిన పొరల్ని తొలగించడమే ఈ నాటకం ముఖ్య ఉద్దేశం."(232)

హంసల గురించి చెప్తూ "అవును, హంసల గురించి కూడా చెప్పుకోవాలి. ఇవి ప్రధానంగా పోస్టుమోడ్రన్ అంశాలు. చాలా యేళ్లు గాయపడి, రెక్కలు విరిచేయబడి, ఇప్పుడే రెక్కలు మొలుస్తున్న సందర్భం. వేలాది హంసలకు ప్రతినిధిగా ఈ హంస - మోహనసుందరం గురించి సాక్ష్యం చెబుతుంది." (232)

హంసల పేర్లు చెబుతూ "ఇవాళ లలిత, నిన్న మోహిని, అంతకుముందు కోమలి, ఇంకెప్పుడో మల్లిక, మాలతి వగైరా."(232)

దళిత, స్త్రీవాదాల్ని ఆధునికానంతరవాద ఉద్యమాలుగా పరిగణించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించినవాళ్లు, ఈ నవలలో ఆ పోరాటాల్ని ఆధునికానంతర పోరాటాలుగా చిత్రించడాన్ని అంగీకరించకపోవచ్చు. నిరంజన్, లలిత, సత్యప్రకాశంలు మార్క్సిస్టు అయిన మోహన సుందరం కోసం చూసినట్టే ఈ రోజు దళిత, స్త్రీవాదులు ప్రపంచీకరణకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు చేస్తున్న పోరాటం వైపు చూస్తున్నారు. ఈ నవలా రచయితకిష్టం లేకున్నా లలిత, నిరంజన్, తీర్థముఖి, సత్యప్రకాశ్‌లను మార్క్సువాది అయిన మోహనసుందరంతో జత చేశాడు. దళిత, స్త్రీవాద ఉద్యమాలు విడివిడి స్రవంతులైనా విస్తృతం, నిర్మాణయుతంగా పాలకవర్గాలపై కార్మికవర్గం చేస్తున్న ప్రధాన పోరాటంలో కలవక తప్పని చారిత్రక సందర్భం ఇది.

డా॥ వి. చంద్రశేఖరరావు నవల ఎలా రాయాలో, ఎలా ప్రయోగాలు చేయవచ్చో తెల్సినవాడు. మాజికల్ రియలిజాన్ని మన సాహిత్యంలో కలిపే ప్రయత్నం చేశారు. అందరికీ అర్థమయ్యేట్టు రాయటం అవసరం. అది నిబంధనగా మారి అభివ్యక్తికి సంకెలగా మారకూడదు. సాహిత్యంలో చేసే ప్రయోగానికి ప్రయోజనం ఉండాలి. ప్రయోజనం లేని ప్రయోగం వృధా ప్రయత్నం అవుతుంది. చంద్రశేఖరరావు చేసిన ప్రయోగం నవలా శిల్పం, రూపంలో కొత్తదనాన్ని తెచ్చింది. ఒక కొత్త ఫాం (form) తెలుగు సాహిత్యానికి పరిచయం చేశారు. అంతవరకే దాని ప్రయోజనం

V

మీ
కోసం
విభిన్న
వినూత్న
శీర్షికలు

## ఇది రాయండి!

ఏదైనా చూసినపుడు, విన్నప్పుడు దీన్ని కథగా రాస్తే బాగుంటుందని అనుకోవడం మనకందరికీ తెలుసు. అయితే అలవాటు లేక, అవకాశం లేక, రాయడం జరక్కపోవచ్చు. అలా మిమ్మల్ని కదిలించి రాయాలనిపించిన అంశాలు సూచిస్తే రచయితలు, కవులు రాయడానికి వీలుంటుంది. ఆ విధంగా వారు పాఠకులు కోరుకునేదేమిటో తెలుసుకునే అవకాశమూ వుంటుంది. మీ అసంపూర్ణ రచనలు కూడా పంపించవచ్చు.

## నచ్చినవి- నచ్చనివి

మీరు చదివిన పుస్తకాలు, కథలు, కవితలు ఏవైనా సరే- వాటిలో మీకు నచ్చిన అంశాలూ నచ్చని అంశాలూ ఈ శీర్షికలో తెలియజేయవచ్చు. సాధారణంగా రచనలకు సంబంధించిన మరే ఇతర విషయమైనా కూడా రాయొచ్చు. కవులు, రచయితలు తమను తాము సరిదిద్దుకోవడానికి, నేర్చుకోవడానికి దోహదపడుతుంది. విమర్శనా దృష్టితో చదివే అలవాటు పెంచుతుంది.

## నేనూ- నా రచనా

పాఠకులు, విమర్శకులతో రచయితలు తమ భావాలు పంచుకునే శీర్షిక ఇది. తమ పుస్తకం లేదా రచన ఏ పరిస్థితులలో రూపు దిద్దుకుందో ఎలాటి అనుభవాలు మిగిల్చిందో వారు రాయవచ్చు. అలాగే వచ్చిన విమర్శలకు సమాధానంగా తమ భావాలు తెలియజేయవచ్చు.

## సాహిత్య సమాలోచన

ఈ శీర్షికలో పాఠకుల సందేహాలకు జవాబులుంటాయి.పత్రికా పరంగా ఇచ్చే జవాబులతోపాటు ఎవరైనా ప్రముఖులను ఉద్దేశించి అడగదలిస్తే వారి సహకారంతో జవాబులు తెప్పించేందుకు ప్రయత్నిస్తాము.

## ముద్ర

ప్రతి ఒక్కరూ సాహిత్యం పట్ల ఆసక్తి పెంచుకోవడానికి ఏదైనా చదవడం గాని ఎవరైనా రచయితల కవుల ప్రసంగాలు వినడం గాని మరేదైనా ఘటన గాని కారణమై వుండొచ్చు. అదే విధంగా వారి దృక్పథంలో మౌలిక మార్పు రావడానికి కూడా ఇలాటి సందర్భం వుండొచ్చు. వాటిని ఈ శీర్షికలో ఇతరులతో పంచుకోవచ్చు .

## బాల సాహితి

హైస్కూలు లోపు విద్యార్థులకోసం ఉద్దేశించిన శీర్షిక ఇది. మీ పిల్లలు, విద్యార్థులు రాసే వాటిలో బాగున్నాయనిపించేవి పంపించవచ్చు. వీలైతే పూర్తిగానూ లేదా కొంత భాగం ప్రచురించగలం. ఈ శీర్షికకు రాసినవారి పేర్లు, రచనల పరామర్శ వుంటుంది. సీనియర్ రచయితలతో చేయించే పరామర్శల ద్వారా వారు నేర్చుకునే అవకాశముంటుంది. ప్రత్యేకంగా నూతనత్వం గల అంశాలు పిల్లల రచనలలో స్ఫురించితే మాత్రం పెద్దలు ప్రత్యేక శ్రద్ధతో తప్పక పంపించండి.

## లేఖలు

పాఠకులు, సాహిత్యకారులు తమ అభిప్రాయాలను లేఖల శీర్షికకు రాయవచ్చు. సాహిత్య పత్రిక గనక రాజకీయ సామాజిక అంశాలు పరిమితంగనూ సాహిత్యం ప్రధానంగానూ తీసుకుంటే మంచిది.

## వెంటాడే వాక్యాలు

జీవితంలో వివిధ సందర్భాలకు ఉపయోగపడే కొటేషన్స్ కవిత్వం నుంచి తరచూ ఉటంకిస్తుంటాము. అయితే చాలా వరకు ఇవి గతంలో వచ్చిన కావ్యాలకే పరిమితమవు తుంటాయి.అలాగాక 1990ల నుంచి మీరు చదివిన కవిత్వంలో ఆకట్టుకున్న చరణాలను వెంటాడే వాక్యాల శీర్షికకు పంపించవచ్చు.

ప్రెస్‌నోట్స్

# కాళ్ళులేని సమీక్షకు కళ్ళిద్దాం రండి!

*కొన్ని సమీక్షలను పక్కనబెడితే ఏ సమీక్ష చదివినా యేమున్నది గర్వకారణ మనిపిస్తుంది. మరికొన్ని అతి పొగడ్తల్లా ఉన్నాయి. ఇంకొన్నేమో పసలేని పుస్తకాల్ని పట్టుకుని, తెలుగు సాహిత్యానికే వెన్నెముక కాగల పుస్తకాలని యోగ్యతా పత్రం మీద యోగ్యతాపత్రం ఇచ్చేస్తున్నారు.*

**నాళేశ్వరం శంకరం**

సాహిత్య ప్రక్రియల్లో విమర్శకున్న గౌరవం సమీక్షకు లేదు. వాఙ్మయాన్ని నడిపించగల శక్తి సమీక్షకు ఉన్నప్పటికీ దాన్ని గుర్తించేవాళ్ళు అరుదు. అలసటలేని సాహిత్య పురోభివృద్ధిని నడిపించే ఒక పాదం విమర్శదైతే, మరోపాదం సమీక్షదని విశ్వసించాలి. సమీక్ష స్థాయికి విమర్శ పడిపోయిందంటారు. కానీ సమీక్షస్థాయి ఎంత చులకనై పోతుందో గుర్తించరు. సమీక్షకు వ్యక్తిత్వం లేకపోతే సామాన్య పాఠకుడి అభిరుచి అవిటిదైపోతుందని గుర్తించాలి.

పుస్తక సమీక్ష వైయక్తిక స్వప్రయోజనాలకు లోనుకావడానికి ప్రధానకారకుడు సమీక్షకుడేనని అసహనానికి గురయ్యే సాహిత్యవేత్తలు లోపల లోపల నిందిస్తూ ఉంటారు. నిజానికి ఆ సాహిత్యవేత్తలే తాము ప్రచురించుకున్న పుస్తకాలకు, అత్యుత్తమ సమీక్షా ప్రశంసలు రావాలని సమీక్షకులనూ, వాటిని ప్రచురించే పత్రికా సంపాదకులను మచ్చిక చేసుకుని నాణ్యమైన సమీక్షలు చేయించుకునే పద్ధతికి స్వస్తి చెబితే తప్ప సమీక్షకు స్వంత వ్యక్తిత్వం ఏర్పడదు. మరో విషయం ఏమంటే- లబ్ధప్రతిష్ఠుల గ్రంథాలకు మాత్రమే సమీక్షలు రాసి లబ్ధిపొందే సమీక్షకులు లేరని కాదు. ఇష్టుల రచనల్ని పైకెత్తే సమీక్షకులు అన్ని కాలాల్లో ఉంటారని మరువరాదు. కర్ణుడి చావుకు వెయ్యి కారణాలన్నట్టు సమీక్షల డొల్లతనానికి సవాలక్ష కారణాలున్నాయి. అయినా, సమీక్ష తిరోగమనం చేయకుండా పురోగమన ప్రయాణంలో ఉన్నందుకు దానిని కాస్తంతైనా అభినందించక తప్పదు.

పుస్తక సమీక్షలకు ప్రాధాన్యతనిచ్చే దిన, వార, మాస, త్రైమాసిక పత్రికలు 35-50 మధ్య ఉన్నాయంటే ఆశ్చర్యపోతారేమో! ఉదాహరణ కోసం మూడు నెలల కాలంలో వివిధ పత్రికల్లో కవిత్వం, కథ, నవల, విమర్శ, జీవిత చరిత్రతోపాటు వివిధ సాహిత్య అంశాల మీద వచ్చిన సమీక్షలు యెంతలేదన్నా రెండువందల దాకా ఉంటాయి. ఒక పుస్తకం మీద ఒక పత్రికలో కాక, వివిధ పత్రికల్లో వచ్చే సమీక్షల్ని లెక్కవేస్తే వాటి సంఖ్య పెరగక మానదు.

ప్రచురణ విషయంలో కవిత్వంతో పోటీపడేవిధంగా యెంతలేదన్నా యాభైదాకా కథాసంకలనాలు వచ్చాయి. కొన్ని సంపుటాలపై సమీక్షలు కూడా వచ్చాయి. తోలేటి జగన్మోహనరెడ్డి - లక్ష్మీకటాక్షం, పులికంటి కృష్ణారెడ్డి - పులికంటి దళితకథలు, మునిపల్లె రాజు మాజికల్ రియలిజం కథలు, నామిని సుబ్రహ్మణ్యం నాయుడు- మా అమ్మ చెప్పిన కథలు, ఐతా చంద్రయ్య-సిద్ధిపురి కథలు, కె. ఎస్. రమణ- మలుపులు, మధు-చిత్తర్వు మధీ కథలు, వి. అశ్వినీకుమార్ - అమాహ, శ్రీనివాసమూర్తి - కథ సమయం, శ్రీవిరాగి - భిన్నస్వరాలు, దాట్ల దేవదానంరాజు - దేవదానం కథలు, 2001 కథావార్షిక సంకలనంతోపాటు వి. యశోదారెడ్డి, ఉప్పల నర్సింహం, ముదిగంటి సుజాతారెడ్డి, కాసుల ప్రతాపరెడ్డి కలిసి ఇది వరకు రాసిన తమ తమ కథల్లోంచి నాల్గేసి చొప్పున యేర్చికూర్చిన సంకలనం వచ్చింది. కె. పి. అశోక్‌కుమార్, నవీన్, కమలిని, సావిత్రి, జె. శ్యామల, తెలిదేవర భానుమూర్తి, చినవీరభద్రుడు, హెచ్చార్కె, అవసరాల రామకృష్ణారావు, పసుపులేటి శ్రీధర్‌బాబు, ప్రసాద్, సుధామ, ఆనంది, కె. పి. గోపాలం వంటివాళ్ళు చేసిన పుస్తక సమీక్షలు ప్రశంసలు అందుకోగలవు. 2001 కథావార్షిక సంకలనానికి రాసిన హెచ్చార్కె సమీక్ష అమూల్యమైంది. కథల మీద చినవీరభద్రుడు, నవీన్, అవసరాల రామకృష్ణారావు సమీక్షలు మెచ్చుకోదగ్గవి.

సాహిత్య విమర్శపై ఆశ్చర్యపడే విధంగా విమర్శ గ్రంథాలు వచ్చాయి. కుంటముక్కల లక్ష్మీనారాయణ శర్మ దీపిక-అప్పకవీయ ద్వితీయాశ్వాస వివరణపై ఒక సమీక్ష, అద్దేపల్లి రామమోహనరావు వ్రాసిన అభ్యుదయ విప్లవ కవిత్వాలు-సిద్ధాంతాలు-శిల్పరీతులు అనే పరిశోధనా గ్రంథం మీద మాకినీడి సూర్యభాస్కర్ సమీక్ష, సోమసుందర్- భావయాత్రి,కారయిత్రిపై సన్నిధానం నరసింహ శర్మ సమీక్ష, పారిజాతా పహరణంపై బి. రామకృష్ణారావు సమీక్ష, త్యాగరాజు సర్వస్వంపై చాగంటి కపాలేశ్వరరావు సమీక్ష, కావ్యనిధానము-కావ్యలక్షణ సంగ్రహంపై రూపనగూడి నారాయణ సమీక్ష, తెలుగు సాహిత్యంలో ధనుశ్శాస్త్రముపై జొన్నలగడ్డ మార్కండేయ సమీక్ష, ననుమాసస్వామి అనువీక్షణంపై డా॥

మంతెన సమీక్ష వంటివి ఎన్నో వచ్చాయి. ఈ సమీక్షలలో విమర్శనా గ్రంథాలే కాక పరిశోధనా గ్రంథాలు కూడా సమీక్షించ ప్రయత్నించారు. అయితే, ఈ విమర్శ గ్రంథాల మీది సమీక్షలు సామాన్య పాఠకునికి అర్థమయ్యేవిధంగా రాయాల్సివుంటుంది.

ఏ ప్రక్రియలో రానన్ని కవితా సంపుటాలు, సంకలనాలు కవిత్వంలో రావడం విశేషం. వివిధ భారతీయ భాషల్లో అచ్చయ్యే కవిత్వంతో పోల్చుకుంటే మన భాషాకవులే అగ్రభాగాన ఉంటారు. కవిత్వంలోనే కాదు- కవిత్వ విమర్శలోనూ అచ్చయ్యే గ్రంథాలు అధికంగానే ఉన్నాయి. అయితే, కవిత్వంపైన కవిత్వ విమర్శపైన సమీక్షలు రాసేవారికి ఆ రెండు ప్రక్రియల గూర్చి క్షుణ్ణంగా తెలిసివుండాలి. కవిత్వ శ్వాస తెలియకుండా సమీక్షించడం మంచిది కాదు. చాకిరేవులో బండకేసి బట్టల్ని కొట్టే బాపతుగానో, వార్తలు రాసే విలేకరిగానో రెండు చేతులతో సమీక్ష చేసేవాళ్ళ శాతం తగ్గితే మంచిది. దింపుడు కల్లం దగ్గర శవాన్ని దించి మళ్ళీ యెత్తుకున్నట్టు, ఉత్తుత్తిగా శవం ముందు దుఃఖించినట్టు వస్తున్న సమీక్షలు యెన్నో వున్నాయి. కవులు కవిత్వంతోపాటు సమీక్ష చేయడానికి పూనుకోవడం మంచిదే. అయితే కవుల మధ్యనుండే అసూయలూ, రాగద్వేషాలూ పెచ్చుపెరిగి, గిట్టనివారి కవిత్వంపై ఒకరకమైన సమీక్షలూ, ఇష్టపడే వాళ్ళను పైకెత్తే సమీక్షలు చేసే అవకాశం ఉంది. ఎన్ని అవలక్షణాలున్నా మంచి సమీక్షలు వస్తూనే వున్నాయి. ఏనుగు నర్సింహారెడ్డి- నేను, శిఖామణి - కిర్రు చెప్పుల భాష, తెలంగాణా పొక్కిలిని సంకలనం చేసిన జూలూరు గౌరీశంకర్ సంకలనంపై కె. శ్రీనివాస్ సమీక్ష, రాధాకృష్ణమాచార్యులు - భూమి పొరల్లోంచి, వి.ఆర్.శర్మ - తెల్లచీకటి, కె. గీత - ద్రవ భాష, ఘంటసాల నిర్మల- నిర్వచనం, సూరం శ్రీనివాసులు - సున్నితపు త్రాసు, కాళిదాసు-మయసభ, ముకుంద రామారావు- మరో మజిలీకి ముందు, ఎన్. వేణుగోపాల్-పావురం, నందిని సిధారెడ్డి-ఒక బాధకాదు, చైతన్యప్రసాద్-సహస్ర వర్ష, సంకేపల్లి శివప్రసాద్- అష్టమ సముద్రం, పి. విద్యాసాగర్-గాలికట్టతోపాటు తెలంగాణా గోలుకొండ కవుల సంచికపైన, సీమకవుల మీద ఆలస్యమైనా కొన్ని పత్రికల్లో సమీక్షలు రావడం ముదావహం. పొక్కిలిపై కె. శ్రీనివాస్ సమీక్ష, అష్టమ సముద్రం మీద ఎ.కె. ప్రభాకర్ సమీక్ష, సహస్ర వర్ష మీద చినవీరభద్రుని సమీక్ష కవులను బాగా ఎస్టాబ్లిష్ చేశాయి. కె. శ్రీనివాస్ సమీక్ష కవిత్వంలోని లోతుపాతుల్నేకాదు- లోపలి బయటి ప్రపంచపు తెలంగాణా ఎవేర్‌నెస్ కనిపిస్తుంది. ముకుంద రామారావు మరో మజిలి ఎప్పుడో వస్తే ఇప్పుడు వరఖల శివకుమార్ దాన్ని చక్కగా విశ్లేషించారు. అలాగే అద్దేపల్లి రామ్మోహనరావు కందుకూరి శ్రీరాములు సందర్భాన్ని ఉత్తమ సమీక్షకుని టూల్స్‌తో సమీక్షించారు. ఘంటసాల నిర్మల నిర్వచనం సమీక్షించిన తీరులోనే ఆమె మంచి కవయిత్రిగా, నాలుగు కాలాలు నిలబడదగ్గ కవిత్వాన్ని యెత్తి చూపి ఎస్టాబ్లిష్ చేశారు. ఎస్వీ సీమకవిత్వ ప్రాధాన్యాన్నీ, అక్కడి కవిత్వంలోని ప్రత్యేకతల్ని సమీక్షించారు. ఎస్వీకన్న ముందు సీమ కవిత్వాన్ని సమీక్షించారనేది మరువరాదు. ఎస్వీ తనదైన శైలిలో విశ్లేషించారు. చొప్పదండి సుధాకర్, అన్నవరం దేవేందర్, బండ్ల మాధవరావు కవులైనప్పటికీ సమీక్షలో కాలు మోపుతున్నందుకు సంతోషమే. ఇటీవల పి. విద్యాసాగర్ - కాలికట్ట మీద సుచిత్ర చేసిన సమీక్ష బాగుంది. పుట్టపర్తి నాగపద్మిని, రెంటాల శ్రీవెంకటేశ్వరరావు, భానుప్రసాద్, వేదాంత సూరి, గోపరాజు నారాయణరావు సమీక్షలలో తాత్వికత, లోతైన భావవిశ్లేషణ, కవిత్వ నిర్మాణ రహస్యాలను కవులెలా వాడుకున్నారో చూపించాలి. అది సమీక్షకుని బాధ్యత. కవిలోని నిర్మాణపరమైన వైవిధ్యం, విలక్షణత, నిర్మాణ రీతిని సమీక్షకుడు విశ్లేషించకపోతే పాఠకునికి కవిలోని ప్రతిభ తెలియకుండాపోతుంది.

తెలుగులో జీవిత చరిత్రలు, ఆత్మకథలకు పెట్టింది పేరు కానీ, ఇటీవల అటువంటి గ్రంథాలు అచ్చుకావడంలేదు. సాహితీవేత్తల స్వానుభావాలు ఆత్మకథల ద్వారానే భద్రపరచడానికి వీలుంటుంది. బూదరాజు రాధాకృష్ణ 'విన్నంత-కన్నంత' పుస్తకం అనేక మంది సాహితీవేత్తల చేత మన్ననలు పొందింది. రాధాకృష్ణ విలక్షణమైన ఆత్మకథను నాగసూరి వేణుగోపాల్, డి. చంద్రశేఖర్‌లతోపాటు మరికొందరు కూడా లోగడ సమీక్షలు చేశారు. చంద్రశేఖర్ ఆత్మకథను సమీక్షించే తీరులోనే సమీక్షించారు. నిన్న మొన్నే వచ్చిన శీలా వీర్రాజు ఆత్మకథపై సమీక్షలు మొదలుకాలేదు. శీలావి ఆత్మకథను వచన కవిత్వంలో రాసి తొలి ప్రయోగం చేశారు. తొలి ప్రయత్నంగా అది సాహిత్య చరిత్రలో నిలిచిపోయే అవకాశం ఉంది.

నవలలు-దిన, వార, మాస పత్రికల్లో వచ్చేవీ, డైరెక్టుగా వచ్చేవి యెన్నున్నా మంచి విలువలతో నాల్గుకాలాలపాటు నిలదొక్కుకునేవి అతి తక్కువగానే వస్తున్నాయి. నిజానికి నవలలు చదివే పాఠకులు తగ్గిపోయారు. మంచి నవలకు యెవరూ ప్రచారం చేయవలసిన అవసరం వుండదు. కె. రామచంద్రమూర్తి కాలమేఘం మంచి పేరు సంపాదించుకుంది. వర్తమాన చరిత్రకు సాహిత్యరూపం కాలమేఘమని హరి మంచి సమీక్ష చేశారు. అలాగే పునర్ముద్రణ పొందిన రావూరి భరద్వాజ పాకుడురాళ్ళపై 'సినీ జీవితాల్ని బొమ్మకట్టి చూపిన పాకుడు రాళ్ళు' అని శ్రీకాంత్ మంచి సమీక్ష చేశారు. తెలిదేవర భానుమూర్తి కవిత, కథ మీద సమీక్షలు చేశారు. అలాగే నవల మీద మంచి సమీక్ష చేస్తున్నారు. అక్కినేని కుటుంబరావు చేదుపాట మీద, కాలువ మల్లయ్య భూమి పుత్రుడు, సాంబయ్య చదువు, మాట్లాడే బొమ్మలు అనే నవలలపై ఉత్తమ సమీక్షలు చేశారు.

సుప్రసిద్ధ కవి ఇస్మాయిల్‌పైనా, లబ్ధప్రతిష్ఠులైన దేవిప్రియపైన సావనీర్లు ఇటీవల వచ్చాయి. దేవిప్రియపై వచ్చిన సావనీర్ యెంతో ప్రామాణికంగాను, మంచి విలువలతోను వచ్చినప్పటికీ దానిపై యెక్కడా సమీక్ష రాలేదు. ఇస్మాయిల్ సావనీర్‌పై తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి మొదలగువారు సమీక్షించారు. సావనీర్లను సమీక్షించే పద్ధతి శాస్త్రిగారికి తెలుసనిపిస్తుంది- ఆయన సమీక్షను చదివినవారికి.


సాహిత్యంలోని వివిధ అంశాలపై యెన్నో సమీక్షలు వచ్చాయి. కె. రామదాస్-తెలుగు దినపత్రికల్లో సాహిత్యం అనే పరిశోధనా గ్రంథం, తెలకపల్లి రవి సంపాదకత్వంలో వచ్చిన 'జనకవనం', సాహిత్య సంఘాలు-ధోరణులు రెండు పుస్తకాలు విలువైనవి. చారిత్రిక విశ్లేషణలు, పత్రాలతో కూడిన సాహిత్య సంఘాలు-ధోరణులు పుస్తకంపై గోవరాజు నారాయణరావు చేసిన సమీక్ష అందరినీ ఆకర్షించింది. సాహిత్య ప్రత్యేక సంచిక ప్రస్థానంపై కె. పి. అశోక్‌కుమార్ ఒక పత్రికను సమీక్షించే పద్ధతిలో సమీక్ష చేశారు. వివిధ అంశాలలో భాగంగా నక్సలిజంపై వచ్చిన పుస్తకంపై సుధామ సమీక్ష, విధ్వంసవిప్లవమా? అనే పుస్తకంపై ఆర్వియార్ సమీక్ష, 'ద బుక్ రివ్యూ' అనే తెలుగు సాహిత్యంపై ఆంగ్లంలో వచ్చిన సంకలనాన్ని రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి అతి సూక్ష్మ స్వభావంతో విశ్లేషించి, సమీక్షించడం విశేషం.

సమీక్షపై చివరగా ఒకమాట: కొన్ని సమీక్షలను పక్కనబెడితే ఏ సమీక్ష చదివినా యేమున్నది గర్వకారణ మనిపిస్తుంది. మరికొన్ని అతి పొగడ్తల్లా ఉన్నాయి. ఇంకొన్నేమో పసలేని పుస్తకాల్ని పట్టుకుని, తెలుగు సాహిత్యానికే వెన్నెముక కాగల పుస్తకాలని యోగ్యతా పత్రం మీద యోగ్యతాపత్రం ఇచ్చేస్తున్నారు. అలసట లేకుండా రెండు చేతులతో వారం వారం సమీక్షలు రాసేవాళ్ళ ఓపికకన్నా వారంవారం వాటిని చదివే పాఠకుని సహనాన్ని స్మరించుకోవడం మంచిది. పెళ్ళికీ తద్దినానికీ ఒకే మంత్రమన్నట్టు యేదైనాసరే రాయడానికి సమీక్షకుడు పూనుకోకపోతే మంచిది. మంచి పుస్తకాలు ఉత్తమ సీనియర్ సమీక్షకులకు ఇచ్చేకన్నా కొత్తవాళ్ళ పుస్తకాల్ని సీనియర్లు సమీక్ష చేస్తే కొత్త రచయితల స్కిల్స్ సాహిత్యంలో ఎస్టాబ్లిష్ కావడానికి వీలుంటుంది. రొడ్డకొట్టుడు సమీక్షకులు ఎంతమట్టుకు సమీక్షలు చేయకుండావుంటే అంతమట్టుకు సమీక్ష బాగుపడటానికి వీలుంది. కాళ్ళులేని సమీక్షకు కళ్ళయినా యిద్దాం రండి!

V

## కవిత

# నిర్బంధాలు



**అనిశెట్టి రజిత**

మనుషులు
చెవిటీ మూగల్లా భావరహితంగా ఉండాలి
నిర్వికారంగా శూన్యంలోకి చూస్తున్నట్లుండాలి
చూపులేనితనం వరమనుకునిగుడ్లు మిట్కరిస్తుండాలి
ధ్యానంలో నిమగ్నమైనట్లు అజ్ఞానంలో
ఆదమరిచి నిద్రిస్తుండాలి
స్థితప్రజ్ఞత్వపు ఫోజులివ్వాలి
వెర్రిబాగులతనాన్ని నటించాలి
పిచ్చిపువ్వులా కనిపించాలి

స్నేహాలు తెగిన పూతీగలై వడలిపోతాయి
సుఖదుఖాల పరామర్శలు ఏకాకిత్వంలో కూరుకుపోతాయి
చైతన్యం అజ్ఞాతంలోకి అనివార్యంగా
ఉద్యమాలు అటకెక్కిన పిల్లిలా...
బూజుల కప్పుకున్న సహజీవనాలు
వెల్గులకు మొహం చాటెయ్యాలి
ఊపిర్లపై నిషేదాజ్ఞలు!
శ్వాసలాడితే నిర్బంధాలు!

సడక్‌ల మీద రెండు కాళ్ళతో నడిస్తే చెకింగ్‌లు
కదిలితే కారు చీకటి ఖైదుకొట్లు
ప్రశ్నలపై పన్నిన కుట్రల కేసులు
సోదాలు...గాలింపులు... అరెస్టులు...
వారెంటులు... చెరసాలలు... ఉరికొయ్యలు
అంతా వైకల్యం మరెంతో వైఫల్యం
పలవరింతలు పచ్చిద్రోహాలు
పలకరింతలు ఘోర నేరాలు

విద్రోహం కానిదేమీ లేదు
నిందితులు కాని ప్రజలెవ్వరూ ఉండరు
ప్రపంచాన్ని ఆయుధాలే పరిపాలిస్తుంటే
పౌరజనాన్ని భయాలే ఆవహిస్తుంటాయి
భూమి ఆకాశం పొగమబ్బుల ముట్టడిలో
కాలపు కత్తి అంచుల మీద కదలికలా..?
నీళ్ళూ కన్నీళ్ళూ దిగ్బంధంలో
లబ్‌డబ్‌లు గప్‌చుప్‌ల నిర్బంధాల్లో...

# పునరపి

నవలలోని కథ నుండి రచయిత చెప్పదలచుకున్న అంశమేదో ఉంటుంది. అట్లాంటి అంశాన్ని వస్తు లక్ష్యం అంటాం. కథను నడిపే ముఖ్యమైన భావాన్నికానీ, కథకు మూలమైన రచయిత ఉద్దేశాన్నికానీ పరిశీలించటం వస్తు లక్ష్యస్థాయి పరిశీలన అవుతుంది. దీన్నే మనం రచనోద్దేశం అని అనవచ్చు. కథానికల్లో అయితే దీన్ని కొందరు విమర్శకులు పాయింట్ అని పిలుస్తారు.

రచనోద్దేశం రచయిత నవలలోని కథ ద్వారా సామాన్యీకరించిన జీవిత సత్యం. అన్ని రకాల నవలల్లోనూ రచనోద్దేశాలు ప్రస్ఫుటంగా కనపడకపోవచ్చు. మొక్కపాటి బారిష్టరు పార్వతీశం వంటి హాస్య నవలల్లో రచనోద్దేశం హాస్యోత్పాదకతే. అపరాధ పరిశోధక నవలల్లో రచనోద్దేశం అపరాధ పరిశోధనే.

ఈ రచనోద్దేశం ఒక పాత్రను వెల్లడించడం కావచ్చు. అది ప్రకృతిలో, సంఘంలో ఉండే మానవ సంబంధాల ద్వారా వెల్లడి కావచ్చు.

రచనోద్దేశాన్ని ఎట్లా కనుక్కోవటం? ఇందుకు కొన్ని సూత్రాలున్నాయి. అవి 1. ఇతివృత్తం ద్వారా రచయిత జీవితం మీద వెల్లడించదలచుకున్న సాధారణీకరణ అంశం ఏమిటి అనేది ఆలోచించడం, 2. ప్రధాన పాత్ర లేదా ప్రధాన పాత్ర మార్పులు పొందడం ద్వారా తెలిసే దేమిటి అనేది ఆలోచించడం, 3. కీలకమైన ఘర్షణ ద్వారా తెలిసేదేమిటీ అనేది ఆలోచించడం.

రచనోద్దేశం అనేది ఒక నీతివాక్యం లాగా, ఒక సామెత లాగా, ఒక జాతీయం లాగా, ఒక గంభీరోక్తిలాగా, ఒక పాఠం లాగా ఉండదు. కన్పించదు. అది కథా జీవిత సారంలగా కనపడుతుంది. రావిశాస్త్రి అల్పజీవి రచనోద్దేశం ఏమిటి అని ఎవరైనా ప్రశ్నించారనుకోండి. పిరికితనమూ, భయమూ మనిషిని దారుణమైన ఆత్మన్యూనతకు గురిచేస్తుంది. ఆత్మ విమర్శనాజ్ఞానం మంచి మార్గాన వెళ్ళే అవకాశం కల్పించవచ్చు అనేదే అల్పజీవిలోని ప్రధానపాత్ర సుబ్బయ్య ద్వారా రచయిత చెప్పదలచుకున్న రచనోద్దేశం అని జవాబు చెప్పవచ్చు.

**కేతు విశ్వనాథరెడ్డి**

("దృష్టి" సాహిత్య వ్యాసాలు నుంచి)

---

పెట్టుబడిదారీ ముఖ్య నినాదం 'స్వేచ్ఛ' అయితే ఈ వ్యవస్థలో సామాజిక అవసరాలతో సంబంధంలేని విచ్చలవిడితనమే స్వేచ్ఛగా చలామణి అవుతుంది. నిజానికి వాస్తవ మానవావసరాన్ని గుర్తించటమే స్వేచ్ఛ. ఆ గుర్తింపు కలిగిన మనిషి తన శక్తి సామర్థ్యాలను ఒక ఆశయానికి అనుగుణంగా స్వచ్ఛంద కార్యకలాపాల్లో (Spontaneous Activities) సార్థకం చేసుకుంటాడు. అట్లా మనిషి తన జీవనగతిని తాను నిర్ణయించుకునే స్వేచ్ఛ ఇక్కడలేదు. కాబట్టి అతని ఆచరణ పరాయి ఆచరణ (Alienated Activity) అవుతుంది. అంటే అక్కడ సృజనాత్మకత, తన కార్యకలాపాలకు తనే కర్త అయిన జీవితానుభవం లోపిస్తాయి. ఫలితం వ్యక్తిత్వ విచ్ఛిన్నత ఈ (Disintegration of Man). ఈ విచ్ఛిన్నతని కప్పిపుచ్చటానికి కృత్రిమ జీవిత కార్యకలాపాలు ఏర్పడతాయి. సంపన్నతా సౌఖ్యాలు, అధికార సౌఖ్యాలు, ఆడంబరం, వస్తువుల కొనుగోలు, పార్టీలు, ప్రదర్శనలు మొదలైన విషయాలతో కూడిన కుహనా వ్యక్తిత్వం (Pseudo personality) మనుషుల కేర్పడుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో అన్నింటినీ కొనగలగటమే మనిషి సామర్థ్యానికి ప్రమాణమవుతుంది. "I am more the more I have."

మనిషి కంటే నిర్జీవమైన డబ్బే ప్రధానమైన ఆర్థిక ప్రయోజనవాదంవల్ల సమాజంలో అమానవీకరణ (Dehumanisation) జరుగుతుంది.ప్రేమ, శ్రమ మొదలైన ప్రాథమిక జీవన ప్రాతిపదికలు విలువ కోల్పోతాము. మనుషుల మధ్య మానవీయ సంబంధాలు తెగిపోయి వస్తు సంబంధాలు ఏర్పడతాయి. ఈ అమానవీకరణే ఆధునిక సమాజంలో పరాయితనానికి నేపథ్యం.

ప్రకృతికి దూరమైపోవటం, శ్రమఫలితాన్ని కోల్పోయి డొల్లగా మిగలటం, సమూహంలో ఒంటరితనం, అర్థహీనత(Meaninglessness), అనంబద్ధత(Absurdity), ఆత్మ విచ్ఛిన్నత (Disintegration) మొదలైనవి పరాయితనానికి అనేక ముఖాలు.

కవిత్వంలో పరాయితనానికి ప్రత్యేకత వుంది. అక్కడ సామాజిక వస్తుగతాంశాలతోపాటు వ్యక్తిగతాంశాలకు కూడా ప్రాధాన్యం ఉంటుంది. అంటే కవి వ్యవస్థలో పరాయితనం గురించి రాయటం ఒక విధానం, తనలో పరాయితనం గురించి రాయటం మరో విధానం.

ప్రాచీన సమాజంలో ఈ పరాయితనం ఉండే వీలుందా? ప్రాచీన కవిత్వంలో ఈ భావన కన్పిస్తుందా? అని రెండు ప్రశ్నలిక్కడ వేసుకోవాలి. సొంత ఆస్తి పుట్టుకలో శ్రమ పరాయితనం బీజాలను మార్క్స్ గుర్తించాడు. కనుక వర్గ సమాజం ఏర్పడినప్పటి నుంచి వ్యవస్థలో ఏదో ఒక స్థాయిలో ఈ పరాయితనం ఉండి వుండాలి. అయితే ప్రాచీన భారతీయ భూస్వామ్య వ్యవస్థలో జనసామాన్యం చాలావరకు తమ ఉనికిని ఉన్నది ఉన్నట్టుగా ఆమోదించినట్టుగానే అర్థమవుతుంది. ఇందుకు కర్మసిద్ధాంత ప్రధానమైన మతం - ప్రజలపై ఎంతో పట్టుగలిగి వుంది గనుక - దోహదం చేసి వుండాలి. అంతేగాక భూస్వామ్య వ్యవస్థలో ప్రతిమనిషికీ ఒక నిర్దిష్ట స్థానం, భద్రత వుంటాయి. పరాయితనం ఏర్పడటానికి అవసరమైన సామాజిక సంక్లిష్టత, సమాజ-చట్రం నుంచి విడిపోయే మానసిక పరిస్థితి (Avertion from the Social System) ప్రాచీన సమాజంలో తక్కువ. వ్యక్తుల పరాయితనం ఛాయలు మాత్రం కొన్ని కన్పిస్తాయి. కాబట్టి వెనకటి భూస్వామ్య వ్యవస్థలో పరాయితనం అనేది వ్యక్తి స్థాయి అంశమేగాని (Individual Phenomena) సమాజస్థాయి అంశం (Social phenomena) కాదు.

**పాపినేని శివశంకర్**

("సాహిత్యం మౌలిక భావనలు" నుంచి)

## అవార్డులు-రివార్డులు

# వివాదంలో బూకర్ విజేత

*ఈ ఏడాది బూకర్ ప్రైజ్ పేరు 'మ్యాన్ బూకర్ ప్రైజ్'గా మారింది. కొత్తగా ఈ ప్రైజ్‌ను స్పోన్సర్ చేస్తున్న వ్యాపార సంస్థ 'మ్యాన్ గ్రూప్' లోని మ్యాన్ అనే పదమే ఇప్పుడు అదనంగా వచ్చిచేరింది. స్టాక్ మార్కెట్ లావాదేవీలు నిర్వహించే ఈ సంస్థ బూకర్ ప్రైజ్‌ను స్పాన్సర్ చేయడమే కాకుండా బహుమతి మొత్తాన్ని ఒక్కసారిగా 30 వేల డాలర్ల నుండి 75 వేల డాలర్లకు పెంచింది. రూపాయల్లో అయితే ఈ మొత్తం 15 లక్షల నుండి 37 లక్షల ఏభైవేలకు పెరిగింది.*

ధనస్వామ్య సమాజంలో ప్రతిదీ డబ్బు చుట్టే తిరుగుతుంది. వ్యాపార మొక్కటే కాదు సాహిత్యమైనా, సంగీతమైనా, సైన్సయినా, క్రీడ అయినా అన్నింటి పరమార్థం 'అర్థం'తోనే ముడిపడుతుంది. వ్యక్తులు తమ తమ రంగాలలో అత్యుత్తమ ప్రతిభను సంపాదించేందుకు పోటీ పడుతుంటారు. ఆ పోటీలో అగ్రస్థానంలో ఉన్నవారికి కీర్తి, కనకం రెండూ లభిస్తాయి. ఇదే సమయంలో అలాంటివారిని ఉపయోగించుకొని తమ తమ లాభాలు పెంపొందించుకోవడానికి వ్యాపార సంస్థలు కూడా పోటీ పడుతుంటాయి. ధనస్వామ్య సమాజం పూర్తి వికృత స్వరూపం సంతరించుకున్న తర్వాత ఈ అవార్డులు, రివార్డుల ఎంపికలో వ్యాపార సంస్థలదే ఆధిపత్యస్థానమవుతుంది. నేటి పెట్టుబడిదారీ ప్రపంచీకరణ వాతావరణంలో జరుగుతున్నదిదే. ఈ పరిస్థితిలో అవార్డుల కోసం ఎన్నెన్నో రాజకీయాలు, మరెన్నో పైరవీలు చోటు చేసుకుంటాయి. అవార్డు ఎంపికలు తీవ్రమైన వివాదాల్లోనూ చిక్కుకుంటాయి. ప్రపంచ ప్రఖ్యాత నోబుల్ ప్రైజ్ వెనుక నడిచే రాజకీయాలు, పైరవీల గురించి ఇప్పటికే అనేక వివరమైన, విశేష కథనాలు ఎన్నో వెలువడ్డాయి. క్రికెట్ మ్యాచ్ ఫిక్సింగ్‌లు, వ్యాపార సంస్థలు ఎరచూపే భారీ మొత్తం కోసం క్రికెట్ స్టార్స్ వెంపర్లాట నిత్యకథనాలే. ఇప్పుడు తాజాగా కామన్‌వెల్త్ దేశాల రచయితలకిచ్చే బూకర్ ప్రైజ్ ఇలాంటి పరిస్థితిలోనే చిక్కుకుంది.

ఈ ఏడాది బూకర్ ప్రైజ్ పేరు 'మ్యాన్ బూకర్ ప్రైజ్'గా మారింది. కొత్తగా ఈ ప్రైజ్‌ను స్పోన్సర్ చేస్తున్న వ్యాపార సంస్థ 'మ్యాన్ గ్రూప్' లోని మ్యాన్ అనే పదమే ఇప్పుడు అదనంగా వచ్చిచేరింది. స్టాక్ మార్కెట్ లావాదేవీలు నిర్వహించే ఈ సంస్థ బూకర్ ప్రైజ్‌ను స్పాన్సర్ చేయడమే కాకుండా బహుమతి మొత్తాన్ని ఒక్కసారిగా 30 వేల



డాలర్ల నుండి 75 వేల డాలర్లకు పెంచింది. రూపాయల్లో అయితే ఈ మొత్తం 15 లక్షల నుండి 37 లక్షల ఏభైవేలకు పెరిగింది. ప్రైజు మొత్తాన్ని పెంచడమే కాకుండా బూకర్ అవార్డు గ్రహీత ఎంపిక ప్రక్రియలోను, ప్రకటించడంలోను, ప్రదానం చేయడంలోను వినూత్న పద్ధతిని అనుసరించింది.

ఈ ఏడాది బూకర్ ప్రైజ్ కెనడా రచయిత యాన్ మార్టెల్ నవల 'లైఫ్ ఆఫ్ పి'ని వరించింది. ఈ ఎంపిక ఉద్విగ్న భరితంగా జరిగిందని నిర్వాహకులు వివరించారు. మరో రచన కూడా పోటా పోటీగా ఉండటంతో న్యాయనిర్ణేతలు 4-1 తేడాతో మార్టెల్ నవలను ఎంపిక చేశారని చెప్పారు. ఈ ఏడాది బూకర్ ప్రైజ్ కోసం మొత్తం 130 రచనలు పోటీ పడ్డాయి. వీటన్నింటినీ న్యాయనిర్ణేతలు చదివి, ఆరింటిని తుది ఎంపికలో పోటీ పడడానికి అర్హమైనవిగా నిర్ణయించారు. ఈసారి ఎంపిక 'నూతన యుగానికి నాంది' అని న్యాయనిర్ణేతల చెయిర్ పర్సన్ లీజా జార్డైన్ అభివర్ణించారు. ఆ విధంగానే అక్టోబర్ 22వ తేదీన ఫైనల్ జాబితాలోని రచనలపై జడ్జల మధ్య జరిగిన సంభాషణల్లో కొన్ని భాగాలను టెలివిజన్‌లో ప్రసారం చేశారు. బూకర్ ప్రైజ్ చుట్టూవున్న నిగూఢత ఈ విధంగా తొలగిపోయిందని నిర్వాహకులు తమకు తావే కితాబులిచ్చుకున్నారు. దీనికి తగ్గట్టుగానే బూకర్ ప్రైజ్ ఈ ఎంపిక ప్రక్రియ గతంలో మాదిరి విలాసవంతమైన స్టార్ హోటళ్ళలో కాకుండా ఒక పీజా సెంటర్‌లో ఏర్పాటు చేశారు. సంపన్నులు, ఉన్నత విద్యావంతులకు మాత్రమే అర్థమయ్యే రచనలకు కాకుండా అత్యధిక ప్రజానీకమిచ్చిన రచనకే తాము బహుమతి ఇస్తున్నామని చెప్పుకోవడానికి కూడా ఈ విధంగా వారు వ్యవహరించారు. ఈ ప్రచారం అంతా బూకర్ ప్రైజ్ స్పాన్సర్ చేసిన మ్యాన్ గ్రూప్‌కే లాభిస్తుందని వేరుగా చెప్పనవసరంలేదుకదా!

ఇక బహుమతి పొందిన పుస్తకం విషయానికొద్దాం. ఇక్కడే అసలు సంచలనం దాగివుంది. 'లైఫ్ ఆఫ్ పి' నవల పిసైన్ లేదా

పి అనే పదహారేళ్ళ కుర్రాడు క్రూరజంతువులతో ఒంటరిగా గడిపిన గాథ. పి తండ్రి జంతు ప్రదర్శనశాలను ఓడలో కెనడాకు తరలిస్తుంటాడు. ఆ ఓడ సముద్రం మధ్యలో తుపాను తాకిడికి ధ్వంసమై మునిగిపోతుంది. పి అనే ఈ కుర్రాడు, ఒక బెంగాల్ పులి మాత్రమే ప్రాణాలతో మిగుల్తారు. ఆ పులితో పి ఎలా గడిపిందీ ఎంతో ఉత్కంఠభరితంగా మార్టెల్ వర్ణిస్తారు. ఇదేదో సింద్‌బాద్ సాహసయాత్రల ఫక్కీలో కాకుండా, నిజంగా తామే అటువంటి పరిస్థితిలో చిక్కుకున్నామన్న అనుభూతిలో మునిగిపోయే విధంగా పాఠకులను ఈ నవల కట్టిపడేస్తుందని 'గార్డియన్' పత్రికలో జస్టిన్ జోర్డన్ వ్యాఖ్యానించారు. ఈ అవార్డును స్వీకరిస్తూ మార్టెల్ తనతో పోటీపడిన ఇతర రచయితలను కూడా ఎంతో మెచ్చుకున్నారు. వారందరిలోకి అదృష్టవంతుణ్ణి కావడంతో ప్రైజ్ తనకు దక్కిందని ఆయన సంబరపడిపోయారు.

కాని, ఈ ఏడాది బూకర్ ప్రైజ్ కథ ఇంతటితో ముగియలేదు. పులిట్జర్ ప్రైజ్‌తో పోల్చబడుతున్న ఈ ప్రైజ్ ఈ ఏడాది గ్రంథచౌర్యం వివాదంలో చిక్కుకుపోయింది. ''మాక్స్ అండ్ క్యాట్స్'' (పులుల మధ్య మ్యాక్స్) అన్న తన విజయవంతమైన నవలలోని ఇతివృత్తాన్ని 'లైఫ్ ఆఫ్ పి'లో మార్టెల్ దొంగిలించారని బ్రెజిల్ రచయిత మొనాసిర్ స్క్లెయర్ ఆరోపించారు.

మార్టెల్ కథలో మాదిరిగానే దీనిలో కూడా ఒక పదిహేను- పదహారేళ్ళ పిల్లవాడు క్రూరజంతువుతో గడుపుతాడు. అయితే మార్టెల్ కథలో పిల్లవాడు బెంగాల్ పులితో గడిపితే, స్క్లెయిర్ కథలో చిరుతపులితో గడుపుతాడు. భారతదేశంలో తాను విన్న ఒక కథ తన నవలకు ప్రేరణ అని చెప్పిన మార్టెల్ ఇప్పుడు 'మాక్స్ అండ్ క్యాట్స్' కూడా తన దృష్టిలోకి వచ్చిందని అంటున్నారు. కేవలం ఆ ఘటనను మాత్రమే తాను స్వీకరించానని, కథనమంతా తన స్వంతమేనని ఆయన వివరణ ఇస్తున్నారు.

కాని ఈ వివరణను అరవైఐదేళ్ళ స్క్లెయిర్ అంగీకరించడం లేదు. ఒక ప్రముఖ రచయిత, అందులోను బూకర్ ప్రైజ్ గ్రహీత తన నవలలోని ఇతివృత్తాన్ని స్వీకరించడం తనకు ఎంతో గర్వంగా ఉందని అంటూ, ఈ విషయాన్ని మార్టెల్ బహిరంగంగా ప్రస్తావించి ఉండాల్సిందని అభిప్రాయపడుతున్నారు. మార్టెల్ మాత్రం తన వాదనకు సమర్థనగా తాను స్క్లెయిర్ నవలను చూడలేదని 'న్యూయార్క్ టైమ్స్ బుక్ రివ్యూ'లో జాన్ అప్‌డైక్ సమీక్షను మాత్రమే చూసి ఆ నవల ఇతివృత్తాన్ని తెలుసుకున్నానని చెబుతున్నారు. అంతగా పేరు ప్రఖ్యాతులులేని ఒకలాటిన్ అమెరికా రచయిత నవలలోని ఇతివృత్తాన్ని ఎక్కువ మందికి అందచేయవచ్చునన్న ఉద్దేశంతోనే తాను అలా చేశానని మార్టెల్ అంటున్నారు. కాని మార్టెల్ వాదనకు ఇక్కడే చావుదెబ్బ తగిలింది. అసలు 'న్యూయార్క్ టైమ్స్ బుక్ రివ్యూ'లో స్క్లెయిర్ నవలను సమీక్షించనే లేదన్న వాస్తవం వెల్లడయింది. దీన్ని బట్టి ఆ నవల పూర్తి ప్రతిని మార్టెల్ చూసి ఉంటారని భావిస్తున్నారు. అయితే, ఈ రెండు నవల్లోను ఇతి వృత్తం మాత్రమే ఒకే మాదిరిగా ఉంటుంది తప్ప మార్టెల్ నవలలో మతపరమైన అంశాలు ప్రధాన పాత్రవహిస్తే, స్క్లెయిర్ నవలలో నాజీజం, నియంతృత్వాల వ్యతిరేకత ప్రధాన అంశంగా ఉంటుంది. ఈ పరిస్థితిలో బూకర్ ప్రైజ్ నవల అసలు సిసలైందో కాదో ఎలా బయట పడుతుందో వేచిచూడాల్సిందే.

**-జి.వి.**





## టుమ్రీ

# దేశభక్తి!

**తూములూరి వెంకటేశ్వరరావు**

రామరాజ్యానికి, చంద్ర రాజ్యానికి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంత వైరం. అందుచేత వాళ్ళు వీరోచితంగా యుద్ధం చేయడానికి నడుం కట్టారు. రామరాజ్యాధినేతలు చంద్ర రాజ్యంమీద నిప్పులు చెరిగారు. తమ సరిహద్దుల్లో ఉగ్రవాద అలజడికి, దేశంలో మతకల్లోలాలకు చంద్ర రాజ్యమే కారణమని తీవ్ర ఆరోపణలు చేశారు. చంద్రరాజ్య పతనాన్ని కళ్ళారా చూస్తామని, వారు అనుసరిస్తున్న మ్లేచ్ఛమతాన్ని రామరాజ్యం నుండి పునాదులతో సహా పెకిలిస్తామని ప్రతినబూనారు.

ప్రభువులవారు చేసిన ప్రతినలు ప్రజల్లో పూనకం రేపాయి. చంద్రరాజ్యం అంతు చూడాల్సిందేనంటూ రామరాజ్య ఏలికల బంట్లు వీరంగం వేశారు. రాజ్యమంతటా యుద్ధజ్వరం వ్యాపించింది. ఆఘమేఘాల మీద సైనిక బలగాలన్నింటినీ సరిహద్దులకు తరలించారు. ప్రజాసంక్షేమానికి వినియోగించాల్సిన రాజ్యధనం యావత్తును యుద్ధనిధి క్రింద ఖర్చు చేసేందుకు ఉద్యుక్తులయ్యారు.

రామరాజ్యంలోని కొందరు ఇది సరికాదన్నారు. ఒకప్పుడు రామరాజ్యమూ, చంద్రరాజ్యమూ ఒకేటేనన్న నిజాన్ని మరవరాదన్నారు - రామరాజ్యంలోనూ, చంద్రరాజ్యంలోను ప్రధాన మతాలను అవలంబించే ప్రజలు భాయి-భాయిగా ఉండేవారని, వారి మధ్య మతదురభిమానాన్ని రెచ్చగొట్టడం సబబు కాదన్నారు. యుద్ధాన్ని తెచ్చి ఉభయ రాజ్యాల ఆర్థిక వ్యవస్థలను పతనం చేయవద్దని, ప్రజాసంక్షేమాన్ని నీరుకార్చవద్దని వేడుకొన్నారు.

వారి వేదనలన్నీ అరణ్యరోదనలయ్యాయి. గుణపాఠం నేర్పవలసిందేనని రామరాజ్యాధినేతలు, అడుగుముందుకేస్తే అంతుతేలుస్తామని చంద్రరాజ్యాధినేతలు భీషణ ప్రతిజ్ఞలు చేశారు.

ఇరు రాజ్యాలు కోట్లాది రూపాయలను కుమ్మరించి సైనిక బలగాలను సరిహద్దుల్లో నిలిపాయి. సైనిక బలగాల నిర్వహణకు అపరిమితంగా వ్యయమౌతోంది. ఇరు రాజ్యాలవారు 'నువ్వు అడుగు ముందుకెయ్'.... అంటే... 'నువ్వు అడుగు ముందుకెయ్'... అంటూ సవాళ్ళు, ప్రతిసవాళ్ళు విసురుకొంటూ కాలం వెళ్ళబుచ్చసాగారు.

రోజులు గతించాయి. నెలలూ గతించాయి. అయినా యుద్ధం మొదలుకాలేదు. ఒకరినొకరు అంతుచూసుకోవడాలు జరగనేలేదు.



అప్పటిదాకా యుద్ధజ్వరంతో ఊగిపోయిన అపరదేశభక్తులు ఒకరిమొఖా లొకరు చూసుకున్నారు. ఏమిటి మన రాజ్యాధినేతలు ఇలా మిన్నకున్నారు అంటూ నాలుకలు చప్పరించారు.

ఈలోపు సరిహద్దుల్లో మోహరించిన సైన్యం ఖర్చు అపరిమితంగా పెరగసాగింది. ఇరు రాజ్యాలకు అది పెనుభారంగా పరిణమించింది. ముందుకెళ్తే నుయ్యి, వెనక్కొస్తే గొయ్యి అన్న చందంగా పరిస్థితి తయారయింది.

"ఏం చెయ్యడమా..." అని తలలు పట్టుకొన్న రామరాజ్యాధినేతలకు వెనక్కి వచ్చేందుకు ఓ గడ్డిపోచ దొరికింది. సరిహద్దుల్లోని సామంత రాజ్యంలో జయప్రదంగా ఉగ్రవాదాన్ని ఎదుర్కొని ఎన్నికలను నిర్విఘ్నంగా నిర్వహించ గలిగామని, ఇది చంద్రరాజ్య ఓటమికి చిహ్నామని ప్రకటించి సైన్యాన్ని ఉపసంహరించారు. ఇది జరిగిన మరుసటి రోజే రామరాజ్యం ఉపసంహరించింది కనుక మేమూ ఉపసంహరిస్తామంటూ చంద్ర రాజ్యాధినేత ప్రకటన చేశారు.

. . .

"ఏమండీ? ఈ యుద్ధ ప్రకటన ఎందుకు చేసినట్లు? ఎందుకు ఉపసంహరించినట్లు?'' అర్థం కాని రామరాజ్య మహామాత్యులవారి అర్ధాంగి ప్రశ్నించింది. మహామాత్యులు చిరునవ్వు రువ్వి "రాజ్య ప్రజల్లో మనమంటే అభిమానం గతించింది. మన మంత్రివర్యులు, స్వపక్షీయులు నిర్వహించిన అవినీతి కార్యకలాపాలవల్ల మన పరువు మంటగలిసింది. పోయిన పరువును నిలబెట్టుకునేందుకు, ప్రజల దృష్టిని మళ్ళించేందుకు ఇంతకంటే గొప్ప సాధనం మరొకటి లేదులే" అంటూ మీసం దువ్వారు.

"మీ తెలివితేటలు అమోఘం. అయితే నాదో సందేహం..." ఆగిపోయింది అర్ధాంగి.

''సందేహమేల? అడుగు'' అన్నారు మహామాత్యులు.

''సంఖ్యరీత్యా చూసినా, బలంరీత్యా చూసినా చంద్రరాజ్యం చాలా బలహీనమైనది. దానిని జయించడం సులభం. మీరు ప్రకటించినట్లుగా దానిపై యుద్ధం చేసి గెలిచివుంటే మీ కీర్తి మరింత అమోఘంగా పెరిగేది కదా?'' ఆగిపోయింది అర్ధాంగి.

''అది అసాద్యము. ఏలనన... చక్రవర్తిగారి చల్లని దృక్కులు చంద్రరాజ్యంపై వున్నవి. చంద్రరాజ్యపు పొరుగు దేశాలతో చక్రవర్తిగారి వాణిజ్య ప్రయోజనాలు ముడిపడి ఉన్నవి. కనుక చంద్రరాజ్య రక్షణ చక్రవర్తిగారి అవసరం. చక్రవర్తిగారిని ఎదిర్చి నిలబడుట మనకసాధ్యము. కనుకనే ఆ ప్రయత్నము మానితిమి.'' చల్లగా చెప్పారు మహామాత్యులు.

"ఈ విషయము మీకు ముందు తెలియదా?" మళ్ళీ ప్రశ్నించింది అర్ధాంగి.

"తెలుసు... అయినప్పటికీ రాజ్య ప్రజల దృష్టి మళ్ళించుటకు ఇంతకంటే మార్గాంతరము లేదని యోచించితిమి.'' బదులిచ్చారు మహామాత్యులు. వారి విశాల ఫాలభాగంమీద ముద్దు పెట్టుకొంటూ చెప్పింది అర్ధాంగి- "మీ తెలివి అమోఘము... మీ దేశభక్తి అపారము.''

V

# బెంగాల్‌లో సాహిత్యం కోసం ప్రత్యేక బుక్ ఎగ్జిబిషన్లు

*మామూలు బుక్ ఎగ్జిబిషన్లంటేనే పుస్తకాభిమానులకు పండగ. అయినా వాటి నిర్వహణ ఎంతో వ్యయ ప్రయాసలతో కూడిన పని. అలాటిది అచ్చంగా సాహిత్య గ్రంథాల కోసం ఒక ఎగ్జిబిషన్ జరపడమంటే ఆశ్చర్యకరం కదా.. అయితే పశ్చిమ బెంగాల్‌లో గత పదేళ్లుగా అలాటి ప్రత్యేక సాహిత్య ఎగ్జిబిషన్లు జరుగుతూన్నాయి. అఖిల భారత వీధి నాటిక బృందాల సమావేశంలో పాల్గొనేందుకై ఇటీవల హైదరాబాదు వచ్చిన* ***బెంగాల్ ప్రజాతంత్ర రచయితలు, కళాకారుల సంఘం నాయకులు విజయ్ భట్టాచార్య*** *బెంగాలీ సాహిత్య రంగాన్ని గురించి వామపక్ష ప్రభుత్వం సాహిత్యం కోసం చేపడుతున్న చర్యల గురించి ఒక ఇంటర్వ్యూలో వివరించారు..*

**బెంగాలీ సాహిత్యంతో తెలుగు పాఠకులకు అత్యంత సన్నిహిత పరిచయముంది. శరత్ బాబు తెలుగు రచయిత అనేంతగా ఆయన పుస్తకాలు అనువాదమయ్యాయి. రవీంద్ర నాథ టాగోర్ ప్రభావం కూడా ఎక్కువే. ఇప్పుడు కూడా మహా శ్వేతా దేవి వంటి వారి రచనలు బాగా ఆదరణ పొందాయి. మరి బెంగాల్‌లో నేటి సాహిత్య దృశ్యం ఎలా వుంది? ఆ వారసత్వం ఏ మేరకు కొనసాగుతోంది?**

ఈ నాడు కూడా ఎందరో యువ రచయతలు,కవులూ శక్తివంతమైన సాహిత్యం సృష్టిస్తున్నారు.ఆ వారసత్వం ముందుకు సాగుతూనే వుంది.19 శతాబ్దితో పోల్చదగిన వైతాళికులు రాకపోయినా చాలా మంది మంచి రచయితలు అభివృద్ధి చెందుతున్నారని మాత్రం చెప్పగలను. కాని నిస్సందేహంగా ఈ నాడు కూడా చాలా మంది గొప్ప రచయితలున్నారు.వారంతా వామపక్ష ప్రభుత్వం పట్ల సానుకూల వైఖరితో వుంటున్నారు.ఈ ప్రభుత్వం సాహిత్యానికి అందిస్తున్న ప్రోత్సాహమే అందుకు కారణం.బంగ్లా అకాడమీ సాహిత్య గ్రంథాల ప్రచురణలో అమూల్యమైన కృషి చేస్తోంది. పాతతరం రచయితల గ్రంథాలు భారీ ఎత్తున పునర్ముద్రించి అందిస్తోంది. ఇటీవలి కాలంలో ఆ విధంగా 200 పుస్తకాలు అచ్చయ్యాయి.నజ్రుల్ ఇస్లాం రచనలు పూర్తిగా అందుబాటులోకి తీసుకొచ్చింది. దానికి చాలా అనూహ్య స్పందన వచ్చింది. బెంగాలీ నిఘంటువును ఆధునీకరించి తీసుకురావడం అన్నిటికన్నా పెద్ద విషయం. అందులో అనేక కొత్త పదాలు చేర్చి అత్యంత ప్రయోజనకరంగా చేయడాన్ని అందరూ హర్షించారు.అందుకే ప్రముఖ రచయితలు చాలా మంది వామపక్ష ప్రభుత్వాన్ని బలపరుస్తున్నారు.

***రచయితలను ప్రోత్సహించే చర్యలేమిటి?***

చాలా వున్నాయి.కలకత్తా బుక్ ఫెస్టివల్ ప్రతిష్టాత్మకమైందిగా పేరు తెచ్చుకుంది. అక్కడ లోగడ ఘోర అగ్ని ప్రమాదం జరిగినపుడు నిర్వాహకులు ఇక దాన్ని కొనసాగించలేమని భయపడ్డారు.కాని వామపక్ష ప్రభుత్వం ప్రత్యేకంగా ఆర్థిక సహాయం చేసి నిలబెట్టింది.ఇంకో విశేషమేమంటే సాధరణంగా జరిగే ఈ బుక్ ఫెయిర్ గాక ప్రత్యేకంగా సాహిత్యం కోసం ఒక పుస్తకోత్సవాన్ని నిర్వహించడం. దీంట్లో రచయితలు తమ పుస్తకాలను తాము ప్రదర్శించుకోవడానికి, విక్రయించుకోవడానికి వీలుంటుంది.పదేళ్లుగా అమలు జరుగుతున్న ఈ పద్ధతి చాలా ఆదరణ పొందింది. ఈ సందర్భంగా సెమినార్లు, సాహిత్య గోష్టులు జరుగుతుంటాయి.ఇవన్నీ రచయితలకు చాలా ఉత్సాహమిస్తున్నాయి.సాహిత్య పత్రికలకు కూడా ప్రత్యేక సహాయం లభిస్తుంది.

***సంఘ పరంగా మీరు చేస్తున్న కృషి గురించి చెప్పండి..***

పశ్చిమ బెంగాల్ ప్రజాస్వామ్య కళాకారులు,రచయితల సంఘంలో పాతిక వేల మంది సభ్యులున్నారు.ప్రొఫెసర్ హీరేన్ ఛటోపాధ్యాయ(హీరేన్ ముఖర్జీ) దానికి అధ్యక్షులుగా వున్నారు.సునీల్ గంగోపాధ్యాయ, పవిత్ర సర్కార్, అనునయ చటోపాధ్యాయ, ఇంద్రనాథ్ బందోపాధ్యాయ వంటి వారందరూ ఈ సంస్థనూ, వామపక్ష ప్రభుత్వాన్ని బలపరిచేవారే.

***మరి మహాశ్వేతాదేవి..?***

ఆమె కూడా సాధారణంగా సానుకూల దృక్పథంతోనే వుంటారు.ఏవైనా సమస్యలు, సందర్భాలలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయొచ్చు...

***బెంగాలీ సాహిత్యంలో నేటి దృశ్యం ఎలా వుంది? దళిత వాదం, స్త్రీ వాదం ప్రభావం వుందా?***

ఇతర భారతీయ భాషలలోనూ, ప్రపంచంలోనూ వచ్చే నూతన ధోరణులన్నీ బెంగాలీ సాహిత్యంలోనూ ప్రతిబింబించు తున్నాయి. దళిత సమస్య, స్త్రీ విముక్తి సమస్య విస్తృతంగానే చర్చించబడుతున్నాయి. మల్లికా సేన్ గుప్తా లాటి వారు ఈ సమస్యలను శక్తివంతంగా చిత్రించారు.

*మరి పోస్ట్ మాడ్రనిజం?*

అది కూడా వుంది. మాణిక్ బందోపాధ్యాయ రచనలలో దాన్ని చూడగలం.1990 ల తర్వాత ఈ వాదం వచ్చింది. అయితే చాలా మంది దాన్ని సరిగ్గా అర్థం చేసుకున్నట్టు కనిపించదు. పోస్టు మాడ్రనిజంగా చలామణి అవుతున్నదాంట్లో అవగాహనా పరమైన గందరగోళం చాలా వుంది. యూరప్‌లో అది వచ్చిన సందర్భం వేరు. ఇక్కడ అనుకుంటున్నది వేరు. అసలు18 వ శతాబ్దిలో ఇంజనీరింగ్ పరిభాషలోని స్ట్రక్చరలిజం అనే దృక్పధాన్ని సాహిత్యానికి యధాతథంగా వర్తింపజేయడమే సరికాదు. అయినా ఈ వాదనలన్నిటి పట్లా మేము సర్థాలంగా సానుకూల వైఖరితోనే వుంటున్నాము కాని ప్రతికూలత చూపడం లేదు. ఆ విధంగా వారి అవగాహనలోని లొసుగులను సరిదిద్దే ప్రయత్నం జరుగుతుంది.

***సాహిత్యం పట్ల సాధారణంగా ఆదరణ ఎలా వుంది?***

చూడండి.. పాత కాలపు ప్రసిద్ధ రచయితలు- శరత్, రవీంద్రనాధ టాగోరు, బంకిం తదితరుల రచనలు ఇప్పటికి పెద్ద ఎత్తున అమ్ముడు పోతుంటాయి. అయితే కొత్త వారిలోనూ చాలా మంచి రచయితలు వచ్చారని చెప్పాను కదా.

***శరత్ దేవదాసు పై సినిమాల గురించి మీరే మనుకుంటారు? దేవదాసు బెంగాల్‌లో కంటే బయిటే పాపులర్ అని ఎవరో అన్నారు.***

అది నరికాదు.దేవదాను బెంగాల్‌లో చాలా చాలా పాపులర్. అందుకే రెండు మూడు సార్లు ఆ కథ సినిమాగానూ వచ్చింది.కాని సమస్యేమిటంటే బెంగాలీ యేతరులకు దేవదాసు గురించి సరైన అవగాహన లేదు.వారు దేవదాసును రకరకాలుగా అర్థం చేసుకుంటుంటారు. ఇప్పుడు సంజయ్ లీలా బన్సాలీ తీసినదైతే అసలు దేవదాసు కథతో ఏ మాత్రం సంబంధం లేని వ్యవహారం. ఇది బెంగాలీలకు చాలా కోపం, బాధ కలిగించే వ్యవహారం. అయినా మేము సినిమాల కన్నా వీధినాటికల పైనా ఇతర రచనల పైనా ఎక్కువగా కేంద్రీకరిస్తుంటాము.

V

## కవిత



# మాయామబ్బులు

**సత్యాజీ**

మేఘాలు కమ్ముకుంటూనే వున్నాయిపైన
వాన చినుకే రాలదు ఒకటైనా!
ఆకాశం కరుణిస్తుందేమో ఏ క్షణాన్నైనా వర్షిస్తుందేమో
అనంతచూపులు ఎడతెగని ఆశలు
పచ్చనిపైరులా ఆకాంక్షల రెపరెపలు

అప్పుడప్పుడు ప్రభుత్వ పథకాల పందేరంలా చిరుజల్లులు
తలలు వాల్చేస్తున్న తలపులపైన ఆశల చిగురింత
చినుకు ఒకటి వచ్చి వాలితే చాలు నేలంతా ధన్యమైనట్టు పులకింత
కల్లమంతా ధాన్యాగారమైనట్టు కళ్లనిండా దృశ్యాదృశ్యాల పరదా
చేలు కాయాల్సిన కాయలు కళ్లకు కాస్తున్నాయి
ప్రకృతి పగబడితే అన్నీ వికృతాలే

ముసురు పట్టాల్సిన కాలంలో చాలుతడి కోసం వెతుకులాట
ఆశానిరాశల మధ్య వాన చినుకుల సయ్యాట
ఏది నిజమో ఏది అబద్ధమో
ఏది సంభవమో ఎప్పటికి అనుగ్రహమో
అందినట్టే అంది ఆకాశమంత దూరమైపోతోంది వాన చినుకు
కనుపాపల్లో కదలాడుతున్న వరిపైరు జారిపోతుందని కాబోలు
ఎంతసేపటికీ వచ్చి వాలదు కుదురైన కంటి కునుకు!

వాన చినుకును వాంఛిస్తున్న అన్నదాతను
నమ్మించి వంచిస్తోంది ఆకాశం
మొన్నటిదాకా మండిపోయి
అప్పుడు ముఖంనిండా మాయామబ్బులు పులుముకొని
ఏ బాబుని చూసి నేర్చుకుందో
మెరిపించి మురిపించటం, కురవకఉండానే కరువుని మరిపించటం!

అడుగుజాడలు

# సాహిత్య పత్రికలు: భావవ్యాప్తి

*'ప్రస్థానం' సాహిత్య పత్రిక ప్రారంభ సమయంలో గతంలో నడచిన ప్రముఖ సాహిత్య పత్రికల చరిత్ర, ఒడుదుడుగులు, విశేషాల రేఖా చిత్రణ...*

మొత్తంగా తెలుగు పత్రికా రంగానికి 130 ఏళ్లకు మించిన చరిత్రలేదు. ప్రెస్‌లు మద్రాసులో మొదలవడం, తాళపత్రాల సేకరణ ఆనాడే ప్రారంభం కావడంతో తొలినాటి పత్రికలు భాషా, సాహిత్య, సాంస్కృతికాంశాలకు తగు ప్రాధాన్యతనే ఇచ్చాయి. నాటి పత్రికాధిపతులందరూ పండితులే కావడం ఆ ప్రాధాన్యతకు మరో కారణం. దేశంలో సంస్కరణవాద ప్రభావం నాటి పత్రికలపై కూడా పడింది. అందువల్లే పత్రికల్లో సమాచారంతోపాటు సామాజికాంశాలనూ, సాహిత్యాన్నీ ప్రచురించేవారు. సామాజిక జీవన చిత్రణ, మథనం, సారం సాహిత్య ప్రయోజనమైతే దానిని జనబాహుళ్యంలో చర్చనీయాంశం చేసి మేలిమిని చిలికి తీసేవిగా పత్రికలను చెప్పుకోవచ్చు. ఈ రీత్యా చూసినప్పుడు తొలినాటి పత్రికలు తగుమేర సఫలీకృతమయ్యాయనే చెప్పవచ్చు. తొలి తెలుగు పత్రికగా బొంబాయిలో ప్రారంభమైన ఆంధ్రపత్రిక అది మొదలైన 19 నెలల అనంతరం 1910లో సంవత్సరాది సంచికను విడుదల చేసింది. అది పూర్తిగా సాహిత్య సంచికే. ఆ తర్వాత వరుసగా ఆంధ్ర పత్రిక వార్షిక సంచికలు సాహిత్య సంచికలుగానే విడుదల కావడం, సాహితీ పిపాసులు ఎదురుచూడడం ఆ రోజుల్లో పరిపాటి. ఈ వార్షిక సంచికల్లో ఉన్నవ లక్ష్మీనారాయణగారి తిక్కన, అన్నమాంబ నాటికలు, గురజాడ వారి బిల్హణీయం, సాహిత్యాంశాలు ఇంకా తిరుపతి వెంకటకవులు, వెంకట పార్వతీశ కవులు, గిడుగు, కట్టమంచి, తాపీ ధర్మారావు, మామిడిపూడి వెంకట రంగయ్య తదితర ఉద్దండుల రచనలు ప్రచురితమయ్యేవి. పత్రికాపరంగా సాహిత్యాంశాల ప్రాధాన్యతకు మొదలు అదైతే 1910 నాటికి సాహిత్యాంశాలే ప్రధానంగా సాహితీ పత్రికల శకం ప్రారంభమయ్యింది.

20వ శతాబ్ది పూర్వార్థంలో వచ్చిన ప్రముఖ పత్రిక ఆంధ్రభారతి. 1910 ఫిబ్రవరిలో ఈ మాసపత్రిక ప్రారంభమయ్యింది. ఆర్థిక, సామాజిక, రాజనైతిక, ఐతిహాసిక, వైజ్ఞానాది జ్ఞానాభివృద్ధికర వ్యాసాలను, శిల్పచిత్ర పటాలను వారు ప్రచురించేవారు. ఆధునిక కథా సాహిత్యానికి వేగుచుక్కలాంటి గురజాడ 'దిద్దుబాటు' తదితర కథలు తొలిగా ప్రచురించింది ఆంధ్రభారతే. ముత్యాల సరాలు కూడా ఇందులోనే ప్రచురిత మయ్యింది. దీని ముద్రాపకులు అయ్యంకి వెంకట్రామయ్య. రాయప్రోలు వారి ప్రవాస పుష్పాంజలి, బలిజేపల్లి లక్ష్మీకాంతం కమలిని కవితలు ఆంధ్రభారతి తొలి సంచికలోనే ప్రచురించారు. తిరుపతి వేంకట కవులు ఆంగ్ల పదాలతో రాసిన శార్దూల పద్యం రెండవ సంచికలో ప్రచురితమయ్యింది. ఇవన్నీ నాటికి కొత్తదారులే. బంకించంద్ర చటోపాధ్యాయ 'శైవాలిని' ఇందులో ధారావాహికగా ప్రచురితమైంది. నవలలు, సీరియల్స్‌కి అదే ఒరవడి కావచ్చు. ఇందులో రాజకీయ, సామాజిక వ్యాసాలు కూడా రావడం దాని సమగ్రతకు నిదర్శనం. 1911- 1913 మధ్య ఒక మంచి సాహిత్య పత్రికగా పేరు తెచ్చుకున్నది, కాళ్లకూరి నారాయణరావు సంపాదకత్వంలో వచ్చిన 'మనోరంజని'.

ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రిక 1912 చెన్నైలో త్రైమాసిక పత్రికగా ప్రారంభమైంది. రెండేళ్ల తర్వాత కాకినాడలో మాసపత్రికగా మారింది. శుద్ధ గ్రాంధిక వాద పత్రిక ఇది. మరుగునపడిన ఆంధ్ర సాహిత్య గ్రంథాలను ప్రచురించాలన్న అభిలాషగల వారిని ఒకే వేదిక మీదకు తెచ్చింది. జయంతి రామయ్య. ప్రాచీన సాహిత్యంలో విజ్ఞాన సంపదను వెలికితీసి, పత్రికా ప్రచురణలో ఉన్నత విలువలు, ప్రమాణాలు పాటించడానికి ప్రయత్నించింది. తాళ్లపాక అన్నమాచార్యుడి రాగిపత్రాల్లోని కొన్ని వార్తా విశేషాలను పరిషత్ పత్రిక ప్రచురించింది. కేవలం పాతభావాలు పట్టుకున్నందుకే ఇది మూతపడింది.

పరిషత్ పత్రిక గ్రాంధికవాదుల చేత చిక్కడంతో 1918 ప్రాంతంలో ఆంధ్ర పత్రిక సంవత్సరాది సంచికలు, కృష్ణాపత్రికలు మాత్రమే విరివిగా, కవితలు, సాహిత్య వ్యాసాలను ప్రచురించేవి. ఆ దశలో తెనాలిలో సాహితీసమితి ఏర్పడింది. దీని స్థాపకులు శివశంకరశాస్త్రి, పత్రిక ఏర్పాటు కోసం ప్రయత్నం చేశారు. ఇందుకోసం 1920లో ఈ బృందంలోని పూర్ణశర్మ తన ఇల్లు అమ్మగా, 65/- వచ్చాయి. ఆ డబ్బు అయిపోయాక పొట్ట చేతబట్టుకొని జయాపూర్ వెళ్లారట ఉద్యోగం కోసం. సాహితీని బెజవాడలో ప్రచురించేవారు. సాహితి రావడంతోనే నవ్య సాహిత్య కవులను అది ఆకర్షించింది. వేదుల, దేవులపల్లి, నాయని, విశ్వనాథ, కొడాల, నండూరి, మునిమాణిక్యం, మొక్కపాటి.. అలా ఆకర్షితులైన వారిలో కొందరు. వీరంతా సాహితికి రాసేవారు.

ఆధునిక దృష్టి, వాడుక భాషావాదానికి తొలి అడుగుల్లో ఇది ఒకటి. బసవరాజు అప్పారావు గీతాలు, మునిమాణిక్యం కాంతం కథలు, నాయని సుబ్బారావు 'మాతృ గీతములు' మొదలు ముద్రించిన కీర్తి సాహితిదే. నండూరి 'ఎంకిపాటలు' సాహితిలో వచ్చినప్పుడు 'ఆ పాటల్లో భావాలు గొప్పవి.. భాషాలోపం చేత ఆ భావాలు రాణించడం'లేదు అని ఒక పాఠకుడు లేఖరాస్తే, 'అందు నాయకీనాయకులు పాటక జనం కాబట్టి ఆ భాష వాడితే గుణమే కాని దోషం లేదు' అని సంపాదకులే సమాధాన పరిచిన ఆధునిక దృష్టి 'సాహితి'ది.సాహితికి శివశంకరశాస్త్రి కొంతకాలం, కొన్ని సంచికలకు వీరరాఘవ స్వామి, కొడాలి ఆంజనేయుశర్మ సంపాదకులుగా ఉన్నారు. నోరి నరసింహశాస్త్రి నిర్వహణ భారం వహించారు.

ఇరవయ్యో శతాబ్ది మూడో దశకంలో సమకాలీన సాహిత్య, సాంఘిక, రాజకీయ రంగాలకు అద్దం పట్టిన మాసపత్రిక వీణ. పాటిబండ్ల మాధవశర్మ సంపాదకుడుగా ఉన్న ఈ పత్రిక బెజవాడ సమీపంలోని తేలప్రోలు నుంచి వెలువడేది. శ్రీశ్రీ, గుడిపాటి రాజగోపాల్, మద్దాల సూర్యప్రకాశరావు వంటివారు దీనిలో సంపాదక వర్గ సభ్యులుగా వ్యవహరించగా మల్లాది రామకృష్ణ శాస్త్రి, శ్రీపాద గణపతిరావు వంటివారు సలహా సంఘంలో ఉండేవారు. చలం మ్యూజింగ్స్‌ను ప్రచురించి సంచలనం కలిగించిన పత్రిక ఇది. తెలుగు రచనకు ఇంగ్లీషు పేరు పెట్టడమే కాక ఆ పేరును శబ్ద దోషాలు లేకుండా ఇంగ్లీషులోనే ప్రచురించడం ఈ పత్రిక మ్యూజింగ్స్ ప్రచురణలో విశేషం.ఇందులో చలం ప్రకటించిన 'పాపం' అనే కథ వివాహ వ్యవస్థను కూల్చేదిగా ఉందని విమర్శలు వచ్చేవి. ప్రజామిత్రలో ఒక వ్యాసం కూడా వచ్చింది. వీటిపై చలం తన మ్యూజింగ్స్‌లోనే ప్రతివిమర్శ చేసేవారు. తనను అర్థం చేసుకోలేని వాళ్ల కోసం "ఈ అశాంతి, ఈ కామోద్రేకం, వ్యభిచారం, స్వల్ప వాంఛలూ శాశ్వతం కావు. ఇంతకన్నా జీవితాన్ని ఉన్నతంగా ఆకర్షించి తృప్తినిచ్చే మహాశక్తి ప్రతివారికీ హక్కై వేచివుంది." అని ఆయన పేర్కొన్నారు. 'తాను జన్మ చేతనే అధికుడననే అహంకారం పురుష స్వభావంలోనే ఉంది' అంటూ ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ కథ 'పజిల్'లో ఆక్షేపించారు. పేదల కష్ట నష్టాలను పత్రికలు పట్టించుకోకపోవడంపై 'వాళ్లకు భూమి మీదనే చోటు లేసప్పుడు పత్రికల్లో చోటుంటుందా?' అని ఎత్తిపొడిచారు. ఒక మహిళా రచయిత ఆనాడే స్త్రీల గురించి, పేదల గురించి రాస్తూ సమాజంలోని హిపొక్రసీని ఎత్తి చూపడం విశేషం. ఒక వ్యక్తిగత బలహీనత కలిగిన ఒక సంపాదకుడి గురించిన ప్రేమ్‌చంద్ కథ ఒక దానిని 'రసిక సంపాదకుడు' పేరుతో అనువదించి ప్రచురించింది వీణ. 'నవ్య సాహిత్యం అంటే ఏమిటి?' అంటూ నోరి నరసింహశాస్త్రి రచించిన వ్యాసం మీద ఖండనలు, సమర్థనలను కూడా అది ప్రచురించింది.

విశ్వనాథ సత్యనారాయణ 'హాహాహూహూ' నవల, మొపాసా, టాల్‌స్టాయ్ అనువాదాలు, శరత్ నవలానువాదాలతో పాటు కారల్‌మార్క్స్ భారతదేశం గురించి రాసిన వ్యాసం, కాంగ్రెస్-సోషలిస్టు పార్టీని విమర్శిస్తూ మార్క్సిస్టు నాయకుడు నండూరి ప్రసాదరావు రాసిన వ్యాసం.. ఇలా రాజకీయ వ్యాసాలు కూడా ఇందులో వస్తుండేవి. అప్పుడప్పుడే విస్తరిస్తున్న సినిమాలపైనా రాసేవాళ్లు. సినీ నటీనటుల ప్రతిభను విమర్శనాత్మకంగా చెపుతూ వారినుద్దేశించే బహిరంగ లేఖలుగా రాసి ప్రచురించేవాళ్లు. రెండేళ్లలోనే జనాదరణ పొందిన ఈ పత్రిక ఆర్థిక తదితర ఇబ్బందులతో రెండే సంచికలు వెలువరించి (బహుశా 1935లో కావచ్చు) 1937లో అంతర్థానమైంది.

ఇరవయ్యవ శతాబ్దిరెండు మూడు దశకాలలో సాహిత్యవేత్తల దృష్టినాకర్షించిన పత్రిక 'ప్రబుద్ధాంధ్ర'. 1922లో ప్రారంభమై కొన్నేళ్లు నడిచి ఆగిపోయింది. తిరిగి 1937లో ప్రారంభమైంది. రాజమండ్రి నుండి వెలువడిన ఈ పత్రికకు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి సంపాదకులు కావడం విశేషం.

1923లో బందరు నుంచి వెలువడిన మరో మంచి మాసపత్రిక 'శారద'. సాహిత్య విలువలతో ఉత్తమ సాహిత్యాన్ని అందించడానికీ, వైజ్ఞానిక విశేషాలను సులభ రీతిలో తెలియజెప్పడానికీ ప్రయత్నించిన పత్రిక ఇది. అడవి బాపిరాజు నవల 'హిమబిందు'ను ధారావాహికగా ప్రచురించిందీ బందరు శారద. శ్రీరామశాస్త్రి దీని సంపాదకులు.

1924లో కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు భారతిని ప్రారంభించారు. మారిన పరిస్థితులు, తెలుగు ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సంపూర్ణ సాహిత్య పత్రికగా 'భారతి'ని తీసుకు వచ్చారు. భారతి తొలిసంపుటాలలో లబ్ధప్రతిష్టులనదగిన సాహితీ వేత్తలందరి రచనలు కనిపిస్తాయి. జాషువా, చిలకమర్తి లక్ష్మీనరసింహం అటువంటి వారిలో కొందరు. ప్రాచీన సాహిత్య పరిశోధనాత్మక రచనలూ, ఆధునిక రచనలూ పక్కపక్కన కనిపించేవి. కథలూ రాశారని చాలామందికి తెలియని వాఙ్మయ పరిశోధకులు వేటూరి ప్రభాకరశాస్త్రి రాసిన కథ 'కలికి చిలుక' 1924 జూన్‌లో ప్రచురించింది భారతి. కథలు, కవితలకు బొమ్మలేయించడం అంతకు ముందే ఉన్నప్పటికీ 'భారతి'లో అది ఒక పరిణత దశకు చేరుకుంది. దామెర్ల రామారావు, అడవి బాపిరాజు వంటి వారి చిత్రాలు, తలశెట్టి రామారావు కార్టూన్లు భారతికి ఆకర్షణలుగా ఉండేవి. 1938లో కాశీనాథుని కాలధర్మం అనంతరం 1972 తన అస్తమయం వరకు శివలెంక శంభుప్రసాద్ పత్రికను అవే ప్రమాణాలతో కొనసాగించారు. అర్ధశతాబ్ది నడిచి ఆ దశకంలోనే అది అస్తమించింది. శ్రీశ్రీ, దాశరథి, ఆరుద్ర, బాలగంగాధర తిలక్ రచనలు అనేకం ఇందులో అచ్చయ్యాయి. విద్వాన్ విశ్వం 'పెన్నేటి పాట' భారతిలోనే వచ్చింది. కొత్త రచయితను ప్రోత్సహించే భారతి విధానం కడవరకూ సాగింది.

భారతి పుట్టిన నాలుగు సంవత్సరాలకు విశ్వనాథ సంపాదకుడిగా వెలువడినది "జయంతి". భాషాభిమానంతో నడిచిందీ పత్రిక ఆలోచనా సంఘం. ఒక్కొక్క విషయానికి ఒక్కో సంఘం ఉండేది. అందులో నిష్ణాతులు సభ్యులుగా ఉన్నారు. విశ్వనాథవారి 'కిన్నెరసాని'కి జయంతి పుటలే పొత్తిళ్ళు. చలం నవలలపై విసుర్లు వచ్చేవిందులో.

1924 నుండి తెలంగాణా ప్రాంతం నుండి వెలువడిన భాషాసాహిత్య

పత్రిక ఆంధ్రాభ్యుదయము. వరంగల్ నుంచి వెలువడే ఈ పత్రిక గ్రాంథిక భాషావాదంతో నడిచేది.

రంగారెడ్డి జిల్లా మేడ్చల్ సమీపంలోని మక్తేవడ్డేపల్లి నుంచి దేశబంధు అనే మాసపత్రిక వెలువడింది. దేశబంధు ప్రారంభమైన కొద్దిమాసాలకే 1927 జనవరిలో హైదరాబాద్ నుంచి మరో మంచిపత్రిక 'సుజాత' ప్రారంభమైంది. సంపాదకుడు పసుమాముల నరసింహశర్మ. ఆయనను మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి ప్రోత్సహించారు. దీని తొలి సంచికలో 'తెలంగాణాము ఆంధ్రుల ప్రాచీన వైభవములకు పంట పొలమ'ని స్పష్టం చేశారు. అంతేకాదు.. ఆ తర్వాత కూడా తెలంగాణా గురించి కొందరికి గల పొరపాటు అభిప్రాయాలను తొలగించడానికి ఈ పత్రిక కృషిచేసింది. రాజకీయం, చారిత్రక వ్యాసాలతోపాటు సాహిత్య వ్యాసాలు, రచనలను కూడా ప్రచురించేది. కొన్ని సంవత్సరాలు నడిచి ఆగిపోయి 1950లో పునః ప్రారంభమై మళ్లీ ఆగిన పత్రిక ఇది.

విశ్వనాథ, నండూరి కొంతకాలం తర్వాత తప్పుకున్నారు. ఇలా తప్పుకున్న కొందరితో 1933లో బరంపురంలో జరిగిన ఆంధ్ర పండిత సభ నుంచి 'నవ్య సాహిత్య పరిషత్తు' ఆవిర్భవించింది. మూడు వార్షిక సభల అనంతరం ఆంధ్రపత్రిక వ్యవస్థాపకులు కాశీనాథుని వంటి వారి ఆశీస్సులతో నాలుగవ సభల సమయానికి 'ప్రతిభ'ను వెలువరించడానికి సన్నాహాలు ప్రారంభించారు. 1936 మేలో మొదటి సంచికను విడుదల చేశారు. దీని సంపాదక వర్గంలో గిడుగు, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, తల్లావజ్ఝల శివశంకర శాస్త్రి పేర్లు కూడా ఉన్నారు. తర్వాతి కొన్ని సంచికలలో శ్రీశ్రీ, ఉన్నవ, అడవి బాపిరాజు, చింతా దీక్షితులు, వంటి వారి పేర్లు కూడా ఉన్నాయి. ఒక వంక ఛందోబద్ధమైన పద్యాలనూ, మరోవంక గేయాలనూ ప్రచురించడమే గాక నాటికలు, ఏకాంకికలు, కథలు, వ్యాసాలు ప్రచురించేవారు. 'రసవంతములనీ, గద్యములనీ, నూతన విషయములు బోధించేవనే బుద్ధికి తోచినవి ప్రచురిస్తాము' అని సంపాదకులు ప్రకటించారు. ఆంధ్ర సాహిత్య పరిషత్తును ఎదుర్కోవడమే ప్రతిభ విధానమని వ్యాసాలు, సంపాదకీయాలను బట్టి తెలుసుకోవచ్చు. ప్రతిభ ఆరు సంచికలే వెలువరించి, నిధులు లేక నిలిచిపోయింది. శ్రీశ్రీ 'దూర భూలేఖ', 'కళారవి', 'భిక్షువర్షీయసి' గేయాలు, పురిపండ అప్పలస్వామి 'తొలినాటి సంద్రాలు' ఇందులో ప్రచురితమైన కొన్ని రచనలు.

మరో ప్రధాన పత్రిక 'ఆంధ్రశిల్పి'. శ్రీశ్రీ 'దేశ చరిత్రలు' తొలిగా ప్రకటితమైంది ఈ పత్రికలోనే. 'చెప్పని సందేశం' అనే శ్రీశ్రీ నాటిక 1948లో ఇందులో ప్రచురితమవగా, అందులోనిదీ గేయం. ఆవిధంగా యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ, శాంతినీ, మానవాళి సంక్షేమాన్నీ ప్రభోధించే ఒక మహోన్నత రచనను ప్రచురించిన కీర్తి ఆంధ్రశిల్పికి దక్కింది.

చెన్నపట్నంలో కొందరు నెలకొల్పిన ఆంధ్ర సాహిత్య పరిషత్ పద్ధతిలోనే 1940 అక్టోబర్‌లో హైదరాబాద్‌లో 'ఆంధ్ర సాహిత్య పరిషత్తు' స్థాపించారు. దీనిని 'హైదరాబాదాంధ్ర సాహిత్య పరిషత్‌'గా వ్యవహరించేవారు. రాయప్రోలు సుబ్బారావు, కాసింఖాన్, శివరామకృష్ణశాస్త్రి దీని వ్యవస్థాపకులు. 'రాకాశి'గా వ్యవహరించబడే ఈ పండిత త్రయం పరిషత్ పేరుతోనే ఒక పత్రిక నడిపింది. ఖురాన్‌ను వీరే తెలుగుతో ప్రచురించారు. ఆంధ్ర వాఙ్మయ చరిత్రను, 'నవ్య సాహిత్య వీధులు' గ్రంథాన్ని ప్రచురించారు. ఈ పరిషత్ పత్రిక కొద్దికాలం నడిచి ఆగిపోయింది. నేడు దీనిప్రతులు కూడా లభ్యం కావడంలేదు.

1960 దశకం తర్వాత నుంచి అనేక పత్రికలు వార, మాసపత్రికలుగా సాహిత్య ప్రధాన పత్రికలు తేవడం ప్రారంభమైంది. ఆంధ్రజ్యోతి, ఆంధ్రపత్రిక, స్వాతి, ఆంధ్రభూమి వంటి పలు మాస, వార పత్రికలు కథలు, కవితల ప్రచురణతో వచ్చేవి.

తొలి నాటి సాహిత్య పత్రికలను అలా వుంచితే తర్వాత కాలంలో వుద్యమ పరంగానూ వ్యక్తుల పరంగానూ నడిచి సాహిత్య సేవ చేసినవి చాలా వున్నాయి.వాటిలో కొంపెల్ల జనార్ధనరావు " ఉదయిని" ప్రముఖమైంది. అది కొంత కాలం నవ్య సాహిత్య పరిషత్తు పత్రికగానూ వుంది.శ్రీశ్రీ తన మహాప్రస్థానం అంకితమిచ్చింది ఈ జనార్ధనరావుకేనని చెప్పనవసరం లేదు. ముద్దు కృష్ణ జ్వాల పత్రిక కూడా ఆ కోవకు చెందిందే. తెలుగు స్వతంత్ర సాహిత్యానికి సేవ చేసిన మరో ముఖ్య పత్రిక.

అభ్యుదయ రచయితల ఉద్యమంతో పాటు అభ్యుదయ మాస పత్రిక కూడా నడిచింది.అయితే సంఘం ఉజ్వలంగా వెలుగొందుతున్నప్పుడు కూడా ఈ పత్రిక సరిగ్గానడవలేదు. నడిచిన మేరకు సాహిత్య చర్చకు కీలకమైన అనేక అంశాలు ముందుకు తీసుకురాగలిగింది. ఈ పత్రిక తీరు తెన్నులపై సుందరయ్య ఒక సమీక్ష రాశారు. అరసంతో పాటే ఈ పత్రికా కొంత కాలం వెనక్కు పొయి అనేక సార్లు పునరుద్ధరణలు పొంది అలా అలా వుంటున్నది.

అరవయ్యవ దశకంలోనే శ్రీశ్రీ ప్రధాన సంపాదకులుగా " నవత" అనే సాహిత్య మాస పత్రిక ఒకటి నడిచింది.దీని సంపాదకవర్గంలో చాల మంది ప్రముఖులుండేవారు.ప్రముఖ సినీ నటి సావిత్రి కూడా వున్నట్టు ఒక సారి ప్రకటించారు. అయితే నవత అంతగా నిలబడలేకపోయింది.

60వ దశకం చివరలోనే రాచమల్లు రామచంద్రారెడ్డి కడప నుంచి నడిపిన త్రైమాస పత్రిక "సంవేదన". కొద్ది సంచికలే వచ్చినా సాహితీ లోకంలో చిరకాలం నిలిచే ప్రభావం ప్రసరించగలిగింది. ఇందుకు ప్రధాన కారణం రా.రా. సాహితీ విమర్శలే.

వరంగల్ నుంచి వరవరరావు, హేమలత నడిపిన సృజన సాహిత్య పత్రికలలో ప్రత్యేకంగా చెప్పుకోతగింది. అరసం వెనకపట్టు పట్టిన దశలో అభ్యుదయ దృక్పథం గల సాహిత్య కారులకు ఇది వేదిక అయింది.తర్వాత విరసం ను బలపరచింది. ఈ పత్రికలో చలం ప్రత్యేక సంచిక,శ్రీశ్రీ ప్రత్యేక సంచికలతో సహా అనేక అంశాలపై విలువైన చర్చలు జరిగాయి. ఎవరి అభిప్రాయాలు ఏమైనా సృజన సంచికలు సాహిత్యాభిమానులకు ఎప్పుడూ విలువైనవిగానే వుంటాయి. చిన్నదైనా ఎక్స్‌రే మరో సాహిత్య పత్రికగా వెలువడి చాలా మంది యువకవులను ప్రోత్సహించింది.

1977లో రంగనాయకమ్మ ప్రజాసాహితి మాసపత్రిక ప్రారంభించారు. ఎమర్జన్సీ అనంతరం ప్రజాస్వామ్య పునరుద్ధరణ దశలో అది మంచి ఆదరణ పొంది సాహిత్య లోకాన్ని ఆకర్షించింది. రంగనాయకమ్మ జవాబులు, సినిమా సమీక్షలు వంటివి దానికి ఆకర్షణలుగా వుండేవి. తర్వాత కాలంలో అది జన సాహితి అధికార పత్రికగా మారి నిర్విఘ్నంగా నడుస్తూ ఇటీవలే రజతోత్సవం జరుపుకొంది. ఒక సాహిత్య పత్రిక ఇంత కాలం నడవడం విశేషమే. ఇందుకు నిర్వాహకులు అభినందనీయులు.

మరో వైపున విరసం అధికార పత్రికగా అరుణ తార మానపత్రిక వెలువడుతున్నది. ప్రజా రచయితల సంఘం తరపున సాంస్కృతిక ప్రగతి అనే పత్రిక కొంత కాలం నడిచి ఆగిపోయి ఈ నవంబరులోనే పునప్రారంభమైంది.

ఈ మధ్య కాలంలో అనంతం, ప్రజా భారతి, సంతకాలు, ప్రకృతిసాహితి తదితర సాహిత్య పత్రికలు వెలువడ్డాయి. వీటిలో కొన్నిఆగిపోగా కొన్ని నడుస్తున్నాయి. బెంగుళూరు నుంచి వచ్చే చైతన్యసాహితి అక్కడి తెలుగు సాహిత్య ప్రముఖుల పట్టుదల వల్ల విజయవంతంగా నడుస్తోంది. రచన అభిరుచి గల కథలను ప్రచురించి ప్రోత్సహిస్తే మిసిమి మరో విధంగా అభిరుచి గల పాఠకుల ఆదరణ పొందుతున్నది. రసమయి కళా సాహిత్యాలు మేళవించి నడుస్తోంది.

ఈ పత్రికలన్నిటి వైఖరులు ఒకే విధంగా లేవు.వీటి పట్ల ఆదరణలో కూడా హెచ్చుతగ్గులున్నాయి. ఇవే గాక ఇలాటివి మరి కొన్ని కూడా వుండొచ్చు. అన్నిటిని ఒకే వ్యాసంలో పరామర్శించడం సాధ్యమయ్యే పని కాదు. ప్రస్తానం ప్రారంభమవుతున్న తరుణంలో తనకు ముందు సాహిత్య సేవ చేసిన మంచి పత్రికలన్నిటిని స్మరించు కుంటున్నది. వాటిలోని మంచినంతటినీ స్వీకరించి కాలాను గుణమైన మార్పులతో ముందుకు సాగుతుంది.

ఇంకా చాలా పత్రికలు స్వల్ప కాలం మాత్రమే నడిచి సాహిత్య సేవ చేసినవి ఉన్నాయి. అసలు మన దృష్టికి రాకుండా మిగిలిన పత్రికలు కూడా చాలా ఉండొచ్చు. తెలంగాణా నుంచి వెలువడిన పత్రికలు ఈ జాబితాలో తక్కువ. బహుశా అందుకొక పెద్ద వ్యాసమే అవసరమౌతుంది. ఈ సందర్భంలో 'గోల్కొండ రచయితల సంచిక' అద్భుతమైన వివరాలను ఇచ్చింది. 1940 దశకంలో 'ఆనందవాణి' 'తెలుగు స్వతంత్ర' 'ఢంకా' 'జగతి' మొదలైన పత్రికలు మరుగు నుంచి ప్రారంభమై ఎంతో కొంత చైతన్యాన్నీ, భావ స్వేచ్ఛనూ ప్రకటించాయి! తెలుగు స్వతంత్ర' ప్రజాస్వామ్య జీవనశైలినీ సాహితీ రూపాలనూ స్పృశించేది. 'ఆనందవాణి' పత్రిక సంపాదకుడు, అధినేత ఎవరైనప్పటికీ... దాని వర్కింగ్ ఎడిటర్‌లుగా శ్రీశ్రీ, ఆరుద్ర మొదలైన వారెందరో పనిచేశారని చెపుతారు. మధ్య తరగతి సంస్కారానికి చక్కిలిగింతలు పెట్టే పత్రికగా దానికి ప్రశస్తి ఉండేది. 1955 వరకూ నడిచిన 'ఆంధ్రజ్యోతి' (మాసపత్రిక)ను ఇంచుమించు 'సమకాలీన సాంస్కృతిక పత్రిక'గా పాఠకులూ, రచయితలూ భావించే వారు. అందులో అనువాద సాహిత్యం-ముఖ్యంగా బెంగాలీ భాష నుంచి-విస్తారంగా ఉండేది. అలాగే శ్రీశ్రీ సిరిసిరిమువ్వ జన్మస్థానం ఆ పత్రికే. అన్నట్టు 'నవశక్తి' అనే కాంగ్రెస్ సోషలిస్టు పత్రిక (ఇంచుమించు కమ్యూనిస్టు పత్రికే)లో 'దేవదాసు' అనువాదం ప్రచురితమైంది. ఆ తర్వాతి కాలంలో అనువాదకుడు చక్రపాణిగారు... శరద్ నవలలనే కాక 'ఉదర నిమిత్తం' లాంటి రచనలనుకూడా అనువాదం చేశారు. 'యువ బుక్ డిపో' అనే ప్రచురణ సంస్థను పెట్టారు. తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధికెక్కిన అనేక మంది రచయితల రచనలను ప్రచురించారు. తాపీ ధర్మారావు, గూడవల్లి రామబ్రహ్మం నడిపిన 'ప్రజామిత్రతో సామాజిక సమస్యలతోపాటు సాహిత్య సమస్యలను కూడా చర్చించే వారు. 'ఢంకా' పత్రిక వస్తూ, ఆగుతూ, 1950 దశకం చివరి దాకా నడిచింది. అందులో సాహితీ వ్యానంగం, రచనలూ ఉండేవి... మరిచిపోయినవీ, అసలు దృష్టిలోకి రానివీ... ఎన్ని పత్రికలు ఉండేవో? ఇక్కడ పేర్కొన్న పత్రికలన్నీ 'బాధ్యతాయుతమైన భావవ్యాప్తికే కృషి చేశాయి. V

# హైకులు

**రౌతురవి**

పల్లె నిద్ర మానేసింది
పట్నంలో దూరి
పని కోసం

...

పాట ఏడుస్తుంది
బూతుల పెట్టెలో
బందీ అయినందుకు

...

అమ్మ టీవీ చూడనంది
బియ్యంలో రాళ్ళే చూస్తుంది
ఏరడం తెలికని

...

ఫ్యాక్టరీ కూతలో
వెన్నెలకు టాటా చెప్పింది
వేకువ

ఇప్పుడు పొలాల్లో
విత్తనాలు మొలవట్లే
రైతుల శవాలే

...

యుద్ధ విమానాల
సంగీత విద్వాంసుడు
అమెరికా


...

బషీర్‌బాగ్ చిందించింది
రక్తంకాదు
రేపటి స్ఫూర్తిని

...

చీకట్లో వచ్చింది
దొంగలకు చిక్కింది
స్వాతంత్ర్యం

## కవిత



*ఆధునిక చిత్రకళ, కవిత్వం రెండూ సామాన్యునికి ఒక పట్టాన బోధపడవు. ప్రస్థానం ముఖపత్ర చిత్రకారుడు రమణ జీవి కవి, రచయిత కూడా. తన ముఖచిత్రం గురించి తానేమనుకుంటున్నారో వివరించేదే ఈ కవిత. ముఖచిత్రకారుడే ఇలా రాయడం ఒక విధమైన ప్రయోగం.*

# సీతాకోకచిలకల నీడలు

**రమణ జీవి**

కాలం గడుస్తుంటుందా
నువ్వేమో నీ కాపలా పిల్లివి
ప్రపంచం మీద తిరుగుబాటు

ఫ్లైఓవర్ ప్రయాణమంటే
భయపడే పాప చేతిని
నీ చేతిలో ప్రేమగా పొదువుకొని
చాలా మందితో వొంటరిగా
నుంచుంటావు

ఫ్లైఓవర్ అంటే కాలమని
అనుకుందామా ప్రస్తుతానికి
అయితే ఫ్లైఓవర్ మీద చాలా ప్రయాణిస్తుంటాయి
ఓ ఏనుగుల గుంపు
ఓ చిరుతపులిని తరుముతూ

సింహం ఒకటి గంభీరంగా
వూగుతున్న భుజాలతో అటూఇటూ చూస్తూ
నడుస్తూ
పాప అరచేతిలో చమట

ఓ కుందేళ్ళ తండా
ఓ సీతాకోకచిలకల మేఘం
అలా ఎగురుతూ
ఎవరికీ తలెత్తే తీరిక లేకుండా
ఎవరి లోపల వాళ్ళు బంధీలయి

కాలం గడుస్తుంటుందా
నువ్వేమో ఇద్దరిలో వొకడివి
అద్దంతో నిరంతర యుద్ధం

వొంటరిగా చార్వాకుల కాలంలోకి నడవాలంటే
సందేహించే పాప భుజం మీద
ధైర్యంగా తడుతూ
చాలా మంది ఒంటరి వాళ్ళ మధ్య
పాప యిస్తున్న తోడుతో నడుస్తుంటావు

నడక అంటే కాలమని
అనుకుందామా ప్రస్తుతానికి
అయితే కాలం ఎప్పుడో మరణిస్తూ వుంటుంది
వుత్త శవాన్నే
తలా ఒక బుజం మీద మోస్తూ
ఒహోం ఒహోం
తొందర తొందర అడుగుల మధ్య
పాప ఒక్కతే ఎగురుకుంటూ

కాలం గడుస్తుంటుందా
మాటలన్నీ గానంలోకి ఒలికి పోతున్న
ఓ అర్ధరాత్రి సడన్‌గా గుర్తొచ్చి
ఖాళీగా వూగుతున్న కుర్చీని వెనకే విడిచేసి
చార్వాకులు మాస్క్ పీకేసి
ఫ్లైఓవర్ కాలంలోకి వెళితే

మెర్క్యురీలైట్ల వెలుతురును
మెడ వరకూ కప్పుకున్న
ఆ వొంటరి ఫ్లైఓవర్ నిండా
ఏనుగుల నీడలు
చిరుతపులి, సింహం, కుందేళ్ల నీడలు

ఇంకా వేటికోసమో తల ఎత్తితే
సీతాకోకచిలకల నీడలు
ఆకాశంలో నక్షత్రాలుగా

# కవిత

## నిశ్శబ్దమయిపోవటం

శివారెడ్డి



నిశ్శబ్దమయిపోవడం
ఆనందం కాదు, కానీ తప్పటంలేదు
సతత హిమపాతం వెనక ఏముంటుంది
అపూర్వ సహస్ర శిరచ్ఛేద చింతామణి

తెగిన తలలు మొలవటంలేదు
నారుమడి, నారుమడిగానే మిగిలిపోతుంది
నిశ్శబ్దమయిపోవటం
నిర్బంధమేమీకాదు,
నిర్బంధంలేకుండా
నిశ్శబ్దమయిపోవటమే విషాదం,
యిన్ని విషాదాల మధ్య
ఏకశిలా విగ్రహంలా మిగలటం అనివార్యంకాదు,

కానీ,
అనివార్యం కానివన్నీ
అనివార్యమయ్యే కాఠిన్యప్రపంచం
కరుణలేదు
రాతికనులనుండి
నీటిమాట రాలదు,

మాంసంకొట్టులోని మొద్దుకి
రెక్కలేం మొలుస్తాయి,
రెక్కలు తెగిన పర్వతాలన్నీ దారికడ్డంగా,
వద్దన్నా
వెంటపడివచ్చే కుక్క విషాదం,
నిశ్శబ్దమయిపోవటం మంచిదికాదు
అందుకే, మాట్లాడుతున్నా-
మీకు వినపడని మాటలు
కలలోని సుందరోద్యానవనాలు-

## ఆకాశ సముద్రం

వేంపల్లి గంగాధర్



మా ఊర్లో
సముద్రం లేదు
ఆకాశమే సముద్రంలాగా కన్పిస్తుంది
అందుకే...
ఆకాశాన్ని చూసిన
ప్రతిసారీ
సముద్రంతో మాట్లాడినట్లుంటుంది...

ఆకాశ మబ్బుల్లోనూ నీళ్ళే
సముద్రపొంగుల్లోనూ నీళ్ళే
అందుకే...
రెంటిని వేరుగా చూడలేను...

అవే నీళ్ళు...
అవే కెరటాలు...
అయినా సముద్రం నిత్యనూతనం
అవే సూర్యోదయాలు
అవే సూర్యాస్తమయాలు
అయినా ఆకాశం కాంతివంతం...

ప్రతి రోజూ
ఆకాశం
ఒక కొత్తవర్ణ చిత్రమౌతుంది
రకరకాల రూపాల్లో
తరాల తపనల్ని
తరతరాల నాగరికతల్ని స్వప్నిస్తూ
కొత్తగా పుష్పిస్తుంది...

కుంకుమ వర్ణంలో మెరిసే
మా ఊరి ఆకాశం
ఎప్పుడు చూసిన
సాగర దృశ్యాన్నే మోస్తుంటుంది...
అందులోనే
నేను కరిగిపోతుంటాను...

స్మృతి

# ప్రజల గొడవంతా మనగొడవే

- కాళోజీ

*ప్రజలు ఎంతో స్పందించారు. 'ప్రజాకవి' అని కూడా అన్నారు. అయితే కవినో, రచయితనో అనిపించుకోవాలనే ఉద్దేశం నాకెన్నడూ లేదని ముందే చెప్పినాను. చెప్పిన విషయంలో, నేను కోరుకున్న మార్పు మాత్రం రాలేదు. 40-50 ఏళ్ళ క్రితం రాసిన నా గొడవ, ప్రస్తుతానికి సరిపోతుందని అనుకోవాలో లేదా 50 సంవత్సరాల నా రచన సజీవంగా ఉన్నదని సంతోషించాలో, పరిస్థితులు ఇట్లాగే ఉన్నాయని ఏడ్వాలో తెలియడంలేదు. ఇదే 'నా గొడవ'.*

**కవితా రచన మీరెలా ప్రారంభించారు? మీకు ప్రేరణనిచ్చిన కావ్యాలు, కవుల వివరాలు చెప్తారా?**

నేను చదువుకున్నది పదవ తరగతి వరకే. దీని తర్వాత ఇంటర్మీడియెట్‌లో రెండో సంవత్సరం చదువుతుండగా ఆరోగ్యం బాగులేక చదువుకు స్వస్తి చెప్పడం జరిగింది. తెలుగులో నాలుగు వాచకాలు, ఉర్దూలో పది వాచకాలు, ఇంగ్లీషు పదవ తరగతి వరకున్న పుస్తకాలు, ఉర్దూలోనైనా, తెలుగులోనైనా, ఇంగ్లీషులోనైనా చదివిన చదువు ఈ మాత్రమే. దీని తర్వాత కావ్యం అనే పేరుతో ఉన్న ఏ పుస్తకం చదివి ఎరుగను. చదువుకున్న వాచకాల్లో.... ఉన్న కవితలు దాన్లో నాకు నచ్చిన పంక్తులు నన్ను ప్రభావితం చేసినాయి. ఇంట్లో అమ్మద్వారా, అన్న ద్వారా సావర్కార్ జీవిత కథతో లోకమాన్య తిలక్ గాథలతో ఆర్యసమాజం విషయంలో పరిచయం కల్గింది. నాయనగారు ఎప్పుడూ చదువే. తెలుగు భాగవతంలోని ప్రహ్లాద చరిత్ర, ప్రహ్లాదుని కథ నన్ను ఎంతో ప్రభావితం చేసింది. ఇంగ్లీషు వాచకాల్లో, ఇంగ్లీషు కవిత, స్కాట్ కావచ్చు. సరిగ్గా జ్ఞాపకం లేదు. Breaths there a man with sole so dead unto himself has not said this is my own matinee land. ఆ కవిత ఆధారంగా, రాసిన నా గొడవ

"మాతృదేశం మాట ముచ్చట ముదము గూర్పదు మదికి అని యెడి, పరమ నీచుడు పృథ్వి అంతట కాలియ వెదికిన కానదుగునా?

**నీరులేని ఎడారి ఐనను, వాన వరదల వసతి ఐనను అగ్గి కొండల అవలి ఐనని మాతృదేశము మాతృదేశమే?**

ఉద్యమాలలో ప్రచారం కోసం తిరుగుతున్నప్పుడు ఇచ్చిన ఉపన్యాసాలు ప్రభావం కంటే కథలు ఎక్కువ ప్రభావం చూపిస్తాయనే నమ్మకం. ఆ తర్వాత ఈ కథల కన్న నా 'గొడవ' రూపం క్లుప్తం, ఎక్కువ ప్రభావం చూపుతోందని నిర్ణయానికి వచ్చి ఆ ప్రక్రియ చేపట్టాను. అదే సాగింది. నేను ఉద్యమాలలో పాల్గొనడానికోసం ప్రేరణ చిన్నప్పుడు అమ్మ చెప్పిన సావర్కార్ విషయం ఆయన వీరోచిత కార్యక్రమాలు, సముద్రం ఈదడం, అండమాన్ జైల్లో జీవితం దానికి సంబంధించిన వివరాలు, సావర్కార్ రాసిన స్వీయ చరిత్ర మరాఠీ, అమ్మ చదివినపుడు అన్న వినడం, అన్న చదివినపుడు అమ్మ వినడం జరిగేది. అది విన్నాను. మా నాయన ఉర్దూ సాహిత్యం ప్రత్యేకించి కవిత, మరికొంతలో ఉచిత విద్య ప్రచారం చేసేవారు. ఉర్దూ పుస్తకంలో కొన్ని కవితలు ప్రత్యేకించి నన్ను ప్రభావితం చేసిన కవిత రాంప్రసాద్ బిస్మిల్‌ను వురికెక్కించినపుడు చదివిన గజల్ అది. నాయన, అన్న చదవగా విన్నాను. ఆ కవిత నాటికీ, నేటికీ నన్ను ప్రేరేపిస్తున్నది. నన్ను ప్రేరేపించిన వాటిలో మేనమామ నలదేవ్ శాస్త్రి, తలిదండ్రి వున్నారు. తెలుగులోనైనా నేను నేర్చుకున్నది మాటలతోనే. ఇంట్లో నాయనగారితో ఉర్దూ నేను తెలుగు నేర్చుకున్నది. ఉన్న కుగ్రామంలోని ఇరుగు, పొరుగు పిల్లలతో మాట్లాడ్డం జరిగేది. సాహిత్యపరంగా (ఆ దృష్టితో) నేర్చుకున్నది ఏమీలేదు. తెలుగులో పద్యం చదవడం (సంధులు, సమాసాలు మొదలైనవి విడదీసి) ఇప్పటికీ రాదు. ఏది ఏమైనా ఎక్కువగా సొంతంగానే నా 'గొడవ' ప్రారంభించాను.

**నా 'గొడవ' అనే పేరెందుకు ఎంచుకున్నారు? నిజానికి మీరు రాసిందంతా ప్రజల గొడవేకదా?**

ప్రజల గొడవంతా మన గొడవే. ఆ ప్రజలలో నేనొకొకడిని, నా రచనల్లో వ్యక్తిగతమైనవి ఏమీలేవు. చెప్పిందంతా సమాజపరంగా చెప్పిందే. అందుకోసమే నా 'గొడవ' అనే పేరు దానికి. సాహిత్యపరంగా, రచయితగా, కవిగా పేరు ప్రతిష్టలు సంపాదించుకోవాలని నాకెన్నడూ లేదు. నా రచన కవిత్వంగా భావింపబడాలని నేనెన్నడూ భావించలేదు. అందుకే నా గొడవలో నా గొడవనునది 'ఎదచించుక వచ్చునది, ఎడతెగక పారునది నాకు అనుపించునది, ఎడతెగని 'వా' గుడిది అన్నాను.

**అనేక సంపుటాలుగా నా 'గొడవ'కు పాఠకుల ప్రతిస్పందనను సంబంధించిన మంచి అనుభవాలు వున్నాయా?**

సాహిత్యపరంగా ఏమోకాని, ఉద్యమపరంగా ఆయా ఉద్యమాలకు సంబంధించి నేను ప్రభావితుడునై రాసిన నా 'గొడవ'కు ప్రజలైతే బాగానే స్పందించారు. ఆయా ఉద్యమాల రోజుల్లో నా 'గొడవ'ను సభలలో వినిపించాను.

ప్రజలు ఎంతో స్పందించారు. 'ప్రజాకవి' అని కూడా అన్నారు. అయితే కవినో, రచయితనో అనిపించుకోవాలనే ఉద్దేశం నాకెన్నడూ లేదని ముందే చెప్పినాను. చెప్పిన విషయంలో, నేను కోరుకున్న మార్పు మాత్రం రాలేదు. 40-50 ఏళ్ళ క్రితం రాసిన నా గొడవ, ప్రస్తుతానికి సరిపోతుందని అనుకోవాలో లేదా

50 సంవత్సరాల నా రచన సజీవంగా ఉన్నదని సంతోషించాలో, పరిస్థితులు ఇట్లాగే ఉన్నాయని ఏడ్వాలో తెలియడంలేదు. ఇదే 'నా గొడవ'.

***కాలంబురాగానే కాటేసి తీరాలె అంటూ ఆవేశంతో రాయడానికి కదిలించిన అంశాలేమిటి?***

అప్పటి నల్లగొండ జిల్లా జనగామ తాలూకా బైరాన్‌పల్లి మొదలైన గ్రామాల్లో రజాకార్లు, ఆనాటి నిజాం పోలీసులు వందలాది మందిని అతిక్రూరంగా హత్య చేసిన వార్త మేము గుల్బర్గా జైలులో ఉండగా మాకు చేరింది. ఆ వార్త విన్నాక బ్యారక్సులో సభ జరిపి ఆ సభలో వినిపించిన గేయం ఇది.

అంతకుముందే జైలు బయట ఉన్నపుడు 1946లో అదే జనగామ తాలూకా మాచిరెడ్డిపల్లి, ఆకునూరులో రజాకార్లు, పోలీసులు కలిసి చేసిన అత్యాచారాలు, స్త్రీల మానభంగాలు, గృహ దహనాలకు సంబంధించి "మాచిరెడ్డిలో, ఆకునూరులో దోచిన మానము చాలింక, పాలనా పేరిట, పల్లెపల్లెల్లో జరిగే పాపం చాలింక, బీదల సర్వస్వంతో ధనికులు చేసిన బేరం చాలింక, కాలము వ్యర్థము చేయగకళయని, రాసిన కవితలు చాలింక, కలము చేత కదలింపకున్న కాళోజీ కాయమే చాలింక అని రాసినాను. అంతకుముందే 'దొంగలు దొంగలు ఊళ్ళు పంచుకొని దొరలై వెలిగే దెన్నాళ్ళు, పోలీసండను దౌర్జన్యాలు పోషణ పొందే దెన్నాళ్ళు నల్లగొండలో నాజీ వృత్తుల నగ్ననృత్యమింకెన్నాళ్లు" అని ఎన్నాళ్ళు అనే గేయంలో ప్రశ్నించాను.

"కాలంబు రాగానే కాటేసి తీరాలి" 'ఎన్నాళ్లు' అనే గేయాలు ఈనాటికీ వర్తిస్తున్నాయి. అంటే నా 'గొడవ' ప్రభావం లేనట్లే కదా. అందుకే అనవలసి వచ్చింది. 'గంటము చెన్నము అరిగిను కంటకములే మాత్రము తరిగెను. ఎలుగెత్తి పాడిన నంతాలు, ఏ మాత్రం తీర్చెను లోకం తంటాలు. ఊరడి పోసిన పంది పిల్ల అరుపు పూజారికి చేయగలదా చెరువు. బలంతోడుగా లేని న్యాయం కవి కనిపెట్టిన గొప్ప ఉపాయం, 'కవుల కలసలు లేదు బుద్ధి, అన్నవాడు మహసుబుద్ధి' ఇదంత చెప్పడం కవిగా పేరొస్తే లాభంలేదు. దాని ప్రభావంతో ఏదైనా మార్పు వచ్చిందా లేదా అన్నది పరీక్ష. అందుకే రాయవలసి వచ్చింది (ఒక ఉగాది సందర్భంలో) ఏటేటా ఎందుకనే పాట ఏడు మారినా ఈడు ముదరినా ఏమి మారినది ఈ లోకంలో 'ఆ మార్పు లేదనే నా 'గొడవ' మార్పు కావాలనే నా గొడవ.

***ప్రజాతంత్ర ఉద్యమంతో భావపరమైన అనుబంధం వున్నా ప్రత్యేకించి ఎలాంటి సంస్థలు, సంఘాలతో మీరు సంబంధం పెట్టుకోకపోవడానికి కారణం?***

సమాజపరమైనా ఏ విషయమైనా మేధావిని స్పందింపచేసినపుడు వారి అభిప్రాయం వెల్లడి చేసే స్వాతంత్ర్యం ఉండాలె! ఆ వెల్లడికి మతపరమైన, పార్టీపరమైన అంతర్గత శాఖలపరమైన అడ్డంకులు రాకూడదని నా అభిప్రాయం. 'ఎవని మాట ఐతేమి ఏ మాటకు ఆ మాటే' అందుకే పార్టీ దృష్ట్యా పలకడం, పార్టీ అదుపులో పలకడం అది వెనకటి పాతివ్రత్యం వలె 'పార్టీవ్రత్యం' "పార్టీ తప్పంటే తప్పు పార్టీ ఒప్పంటే ఒప్పు'' అనే ధోరణి మహా ప్రమాదకరమైంది. రచయిత నిజాయితీకి ఈ నిర్బంధం అసలే పనికిరాదు. అందుకే ఆయా ఉద్యమాలు నడిపించే పార్టీలతో సహకరించినా సహకరించే రచనలు చేసినా ఆయా పార్టీల నిర్బంధం మాత్రం ఒప్పుకోలేదు. అందుకే ఏ పార్టీలో కట్టుబడలేదు.

***సమాజ విముక్తి విషయంలో మీ అభిప్రాయాలేమిటి? మార్క్సిజాన్ని మీరు విశ్వసిస్తారా?***

మానవ సమాజంలో ఏదీ తుది మాట కాదు. ప్రయోగార్థమే బ్రతుకు. బ్రతుకు ప్రయాణం నిండా, అడుగడుగునా ప్రయోగాలు జరుగుతూనే ఉంటాయి. దాన్లోనిలోపాలు కనిపెడ్తూ సవరించు కుంటూ మళ్ళీ మళ్ళీ కొత్త ప్రయోగాలు చేస్తూ పోవలసిందే. ఏ ప్రయోగం ఐనా తాత్కాలికంగా వచ్చిన మార్పైనా శాశ్వతమైంది కాదు. మురికి చేరుకుంటుంది. శుభ్రం చేసుకుంటూ పోవాలి. ఏ చీపురు కట్టతోనైనా శుభ్రం చేసుకున్నాం ఇక, శుభ్రం చేసుకునే పనిలేదు. అనడం సబబు కాదు. మళ్ళీ మళ్ళీ మురికి చేరుతుంటుంది. మళ్ళీ శుభ్రం చేసుకోవడం తప్పదు. ఉదయం లేవగానే నోట్లో నున్న పాచిన, పండ్లను శుభ్రం చేసుకుంటాం. ఎంత శుభ్రం చేసుకున్నా మళ్ళీ రోజూ పండ్లు తోముకోవలసిందే. అంతేగాని, ఒకసారి తోముకున్నాం గనక, ఇక తోముకునే అవసరమే పడదు అనలేదు. సమాజపరంగా జరిగే, రాజకీయంగా జరిగే మార్పుల విషయంలో కూడా అంతే 'దోపిడీ' దౌర్జన్యాలు అసలే జరగకుండా చూద్దామనే ఏర్పాట్లు కట్టుదిట్టాలు శాశ్వతం కావు. ఈ విషయమై ఎప్పుడూ అలజడి, ఆందోళన జరగవలసిందే. ప్రజాస్వామ్యానికి పునాది. అనవరత జాగరూకత తప్పదు. మానవుని మానవుడు మానవుని మాదిరిగా మన్నించలేనంత మాలిన మైనది మానవుని హృదయం. తనూ మానవుడినని, ఎదుటి వాడు మానవుడని గుర్తించడం జరగాలి. దానికై ప్రయత్నం సాగుతుండాలి. 'నేనింకా నా నుండి వరకే రాలేదు. మన అన్నప్పుడు గదా ముందడుగు, మనం అనే అభిప్రాయం రావడానికి ఎడతెగని ప్రయత్నం ఎల్లవేళలా సాగుతుండాలి.

***పౌరహక్కుల ఉద్యమంలో చురుకైన పాత్ర వహించే మీకు, కొన్ని తీవ్రవాద గ్రూపుల వ్యక్తిగత హత్యాకాండ పట్ల ఎలాంటి అభిప్రాయాలున్నాయి?***

ఎవరి మాటైతేమి.... ఏ మాటకు ఆ మాటే ఏ తీవ్రవాదం ప్రకారం ఎవరు ఏమి చేసినా అది ఆలోచన లేకుండా నాయకుని మాటనో, గ్రూపు నాయకుని మాటనో పాటించడం అసలు 'ఇజం' అని ఇంకో అభిప్రాయంగల గ్రూపుది తప్పని ఒకరితో ఒకరు పరస్పరం పోరాడుకోవడం అసలు 'ఇజం' తలపెట్టిన ప్రజాక్షేమానికి ప్రమాదం, విరోధం గ్రూపుల శక్తి సామర్థ్యాలు పరస్పర వైరుధ్యాలతో వ్యర్థమైపోతాయి. దాని కారణంగానే వ్యక్తిగత వైషమ్యాలు పగలూ, అంతశాఖలు, పరస్పర సంఘర్షణలు, మతం మతం మధ్య ఉండే సంఘర్షణల కంటే ఎక్కువ ప్రమాదకరమైనవి అని చరిత్ర చెపుతున్నది. మతం వద్దని ఇజాల పేరిట మళ్ళీ వెనుకటి ధోరణినే మఠాలుతయారై, ఏదైతేం, ఏమైతేం, ఎచటైతేం, హింస తప్పు, రాజ్యహింస మరీ తప్పు. కానీ ప్రతి హింస తప్పుకాదు. అని నా అభిప్రాయం. పౌరహక్కుల సంఘాలు నాకు తెలిసినంతమటుకు ఎప్పుడూ నేరము జరగాలని, న్యాయస్థానం నిర్ణయించిన ప్రకారం నేరస్తుడు శిక్షించబడాలనే అంతేగానీ పాలనాధికారం తన పోలీసుల ద్వారా ఏ

విచారణ లేకుండా ఎవర్నయినా శిక్షించడం (నేరస్తున్ని కూడా) తగదని పౌరహక్కుల కోసం పోరాటం చేసే వానిగానూ అభిప్రాయం. వ్యక్తిగతమైన హత్యకైనా, పార్టీలు చేసే హత్యకైనా చట్టబద్ధంగా చర్య తీసుకోవల్సిందే.

***మీ అసంపూర్ణ జీవిత చరిత్ర పూర్తి చేస్తున్నారా?***

జీవిత చరిత్ర మొదటి భాగం రికార్డు చేసిన 30-40 క్యాసెట్లు విని, రాసి ప్రచురించబడ్డది. విశాఖ మిత్రులు దీన్ని ముద్రించారు. వారే రెండో భాగం కూడా రావాల్సని ఓ ఇరవై, ముప్పై క్యాసెట్లు స్థానిక మిత్రుల సాయంతో రికార్డు చేసుకున్నారు. ఇంకా అది అసంపూర్ణమే. అయిన క్యాసెట్లు తిరిగి రాసుకొని ఇదే నా 'గొడవ' రెండవ భాగంగా ఎప్పుడొస్తుందో ఆ విషయంలో ప్రయత్నం చేసి మిత్రుల కెరుక.

***కవిత్వంలో నిబద్ధతను మీరు హర్షిస్తారా?***

జిహ్వకొరుచి, పుర్రెకో బుద్ధి అని సామెత. లార్డ్ బైరాక్ అన్నట్లు 'ఒకే ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్ళకు కదలిక, అట్లా రచయిత రచన ఉండాలి. ఏ మనిషికి కూడా ఆలోచనకు, ఆలోచన ప్రకటనకు నిర్బంధం ఉండకూడదనే మనం రచయితకు నిబద్ధత ఉండాలనడం విచిత్రం. నిబద్ధత తగదని స్వీయ ఆలోచనాపరంగా తన అభిప్రాయాన్ని వెల్లడించే స్వేచ్ఛా స్వాతంత్ర్యం కలవాడు ఒక రచయితే! ఏమతమైనా, ఏ ఇజమైనా వాని స్వాతంత్ర్యానికి అడ్డుపడకూడదని నా అభిప్రాయం.


***శక్తివంతమైన కవులు కాగోరే వారికి మీరిచ్చే సూచనలు?***

శక్తివంతము కానిది కవిత్వమే ఆకదు. ఒకే ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్ళకు కదలిక అన్నాడు బైరన్. మరినేను ఒలక పోసింది సీసాల కొద్ది, సిరా, ఏదీ ఒక్క మెదడైనా కదలదేం. అసలు నా మెదడు కదిల్తే కదా? రచయిత కదిలి కదలించాలి. బైరన్ కావచ్చు అన్నాడు "Ceaze thou heart ceaze to move as thou hast ceazed to move others కదలలేని కదపలేని ఎదబరువును మోయలేను" అన్నది నా గొడవ, నేనింకా నా నుండి మా వరకే రాలేదు. మన అన్నప్పుడు కదా ముందడుగు. ఆయన అన్న అభిప్రాయంతో రాయాలి.

***(2000, ఏప్రిల్)***

# కవిత

## సందర్భం



**జుగాష్విలి**

ఇవాళ
నేనొక దృశ్యం చూసాను
కన్నపేగు కాలిన వాసన
దిక్కుల్ని చుట్టేసుకోవడం
గుండె పగిలిన దుఃఖం
గొంతులోనే సుడులు తిరగడం
చిరునవ్వుల ప్రోవు
చితి పిడకల మధ్య పిగిలిపోవడం

ఆవేదన
ఆక్రోశమై ఆలోచనాలోచనమై
ఆయుధమై సాయుధమై
సమరమై అమరమై....

విషాదాశ్రువులకు యిక్కడ తావులేదు
కన్నీళ్ళు కత్తులవుతున్న దృశ్యం కదా యిది

## రేపు

**జి.వి. కరుణాకర్**

రేపు
నిరాశకు తొడిగిన
జోకర్ మాస్క్

రేపు
ఆశనరానికి గుచ్చుకొన్న
చీకిన ముల్లు

రేపు
అందని ఊపిరికి
ఆక్సిజన్ ఎడారి నీడ

రేపు
చెదిరిపోవడానికి అమ్ముడైన
బురఖా మొగ్గల రంగు

రేపు
పుట్టిన పిల్లల్ని పెంచలేని
తాటిచెట్టు కింద నిద్ర

రేపు
వాడిన చెట్టు రసంకోసం చూసే
వడగాలి అప్పు

రేపు
అప్పుకు సమాధానంలేని
పత్తిరైతు ఆత్మహత్యలవరద

రేపు
క్రీస్తుకు, సగటు మనిషికి
చేదునీళ్ళు, ముళ్ళ కిరీటం
సిద్ధం చేసిన రాజకీయగారడి

రేపు
కాషాయం కూల్చిన మినార్‌కి
సున్నీల్నే నిలబెట్టే
వెలుతురు గుహలోని చీకటి

రేపు
అలిసిన జీవితాలను
హత్తుకొనే విశ్రాంతి దినం

రేపు
కల్లోలాన్ని కళ్ళల్లో
బందించే బండరాయి

కథ

రుక్మిణి

# చావుసావు




***మా** ఊరి రైల్వే స్టేషన్ని చూసినపుడల్లా అస్తిపంజరం బోర్లా నిగడదీసుకుని వంగినట్లుగా వుంటుంది. దాన్లో మిగిలిన ఆకలి పేగులు గురగురమని కదలాడినట్లు ప్రయాణీకులు రైలాగినపుడల్లా ప్లాట్‌ఫారం మీద తిరగాడతారు. దిగే మాసిన గుడ్డలూ.. గలీజు మాటలూ... గంపలూ... చేతుల్లో చంకల్లో ఇరికించుకున్న పోరగాండ్లు. థర్డు క్లాసు సురుకు. బండి ఆగీ ఆగగానే తొడతొక్కిడిలో లోపలికి జొరబడే జనం... లోపల్నుండి కుందాపోట్లతో దిగడానికి వెంపర్లాడే జనం చాలా అనాగరికంగా కనిపిస్తారు.*

ఫస్టాసు పాసింజర్లయితే వి.ఐ.పి. లగేజీ.. ఖరీదైన డ్రస్సూ... బూటూ... నవనవలాడే పిల్లలతో 'క్యూ' పద్ధతిలో 'కుపే'లో జారగిలబడి ఏ ఇంగ్లీషు మాగజైనో స్టయిల్‌గా తిరగేస్తారు. పైగా ఫ్లాస్కులూ... మినరల్ వాటర్ బాటిల్సూ హంగామా సరేసరి!

అలాంటి దృశ్యం చూద్దామని నాకనిపించినా తరచుగా అవి కనిపించవు- ప్లాట్ ఫారం అటు చివరగా మూలుగుతున్న పెద్ద ముసలిపులిలా ఎర్రటి బోర్డుతో 'రైల్వే రక్షక దళం' వారి స్టేషను - అది 'పులి' సరుకు కాబట్టి దాన్లో వుండిన వాళ్ళంతా పులిపిల్లలో... క్రూరమైన తోడేలు జాతి వాళ్ళో అనుకోవడం. ఒకోమారు పొరపాటు సుమా అనుకోవడానికి ఆనవాలు మా సత్తిరెడ్డి చాలు!

సత్తిరెడ్డిది మా ఊరి దగ్గర్లోని పల్లెటూరే! పేద వ్యవసాయం ముసలి అమ్మా నాన్నలు మిడుకుతుంటే స్పోర్ట్సు కోటాలో వచ్చిపడిన కానిస్టేబుల్ డ్యూటీ 'సత్తి' వెలగబెడుతున్నాడు.

సత్తిరెడ్డి పీలగా పోలీసుద్యోగానికి పనికిరానివాడిలా చూడ్డాని కట్లా వుంటాడుగానీ.. ఆ మోకాలి పిక్కల్లోని బలమే పరుగుల పందెంలో ప్రైజులు తెచ్చిందేమో ఆ ఉద్యోగం అట్లా వచ్చింది. కానైతే మనిషి అందగాడే అయినా క్రాపు బాగా వెనక్కి నెట్టుకుపోయి నీళ్ళు నిండని చెరువులా... ఒడ్డు తేలిన వొరైలా వుంటుందాయె! కండ్లు ఆలోచన్లు నింపుకుని మనుష్యుల గుండె లోతుల్లోకి గుచ్చి చూస్తున్నట్లుంటాయి మరి! మనిషి మెతకలో కరుకో.. కరుకుదనంలో మెతకో తేల్చుకోవడం చాలా కష్టం!

ఆ దినం అట్లా సాయంత్రం ప్లాట్‌ఫారం మీదికి పోయేసరికి అప్పటికి ఉక్కగుక్కతిప్పుకోకుండా వుంది. అలగాజనం గోలగా లేరుగానీ... పోలీసు పోస్టు దగ్గర మాత్రం చిన్న గుంపు లాంటిది కనిపించింది. అందులోనూ సత్తిరెడ్డి మాటలు మెత్తమెత్తగా, కరుగ్గా మొత్తం మీద ధాటీగా వినపడుతున్నాయి. అయితే ఆ గుంపు పాత సినిమా టాకీసులో కొత్త సినిమా వస్తే ఆడవాళ్ళు టికట్లు తీసుకోడానికి గుంపు చేరినట్లుగా ఆకర్షణీయంగా వుంది. మొత్తం మీద ఆరు సాల్తీలు ఆడపిల్లలూ మంచి రంగులో వున్నారు. పాత పెట్టెల్లో దాచుకున్న కొత్త బట్టలు సింగారించుకుని కాస్త పెండ్లికళ వచ్చిన వారిలా కూడా వున్నారు. అయితే వాళ్ళకు ఎక్కడో ఎవరెస్టు శిఖరం ఎక్కి ఒక చోట జండాపాతి - ఈలేసి లోకానికి చూపుదామన్న ఉత్సాహం వున్నట్లు కూడా నాకనిపించింది.

వాళ్ళందరి మధ్యన వెంట మంది మార్బలం ఏమీ లాకుండా వచ్చి ఓట్ల కోసం దేబరించే నాయకుళ్ళా సత్తి తన నిజాయితీని దంచి పంచుతున్నారు. ఖరీదు పలకని నిజాయితీకి నీతి అండవున్నా దాని 'బరువు' చాలా తేలిక కాబట్టి చెవుల్లోకి దూరడం కూడా అంతంత మాత్రమే! సత్తి సత్తెకాలపు ఆనాటి మనుషల్లా ఆరడుగుల హరిశ్చంద్రుడిలా బలిష్టంగా... గంభీరంగా వుండడు. కలియుగం పేదమనిషిలా పీలగా వుంటాడు. తగిలించుకున్న యూనిఫాం కాకిరంగుదే అయినా అది వదులుగా... మనిషికి అతకని దాన్లా వేలాడుతుంది. కొంతమంది దాన్ని తగిలించుకుంటే సహజకవచం కప్పుకున్న తోడేల్లా పిటపిటలాడిపోతుంటారు. వెళ్ళుకొచ్చిన బొర్రకూడా యథావిధిన సహకరిస్తుంది. సరే.. పైన టోపీ తీస్తే నిగనిగా మెరిసే బట్టతలా.. ఏపుగా పెరిగిన దవడెముకలు ముందుకు రావడంవల్ల దవడలు లోతుకు పీక్కుపోయాయి. ఒకనాడు మొహం గుండ్రమే అయినా అనివార్యంగా అది కోలగా మారి, వెరసి గెడకర్ర టైపులోకి ఆకారం దిగిపోయింది. అందువల్లనూ ఈ మనుషులు పెడసరి మార్గాలననుసరిస్తున్నారన్న దుగ్ధ వల్లనే... సమాజం పూర్తిగా చెడిపోయిందన్న ఆదుర్దా వల్లనూ మనిషి ఊరికే ముందుకీ, వెనక్కీ వూగిపోతుంటాడు. అదీ సత్తిగాడి పరిస్థితి.

"అన్నా... సూడు... జర చూడవే...!" నాకు తెంపర్లుగా వస్తున్న దగ్గును కంట్రోలు చేసుకుంటూ వాళ్ళని పరిశీలనగానే చూస్తున్నాను. ఎంతైనా లంబాడీ పిల్లలు కాబట్టి తెల్లగా... బంగారురంగులో మెరిసిపోతున్నారు. అనాగరికం అందాన్ని దాచలేదుగదా! పైగా ఏదో పొడరు పూసుకున్న వాసనాయె! ఇరవయ్యేళ్ళకి మించని వయసు కాబట్టి మరింత పొంకంగానే కనబడతారు.

“అరె చుప్! జరా సంబాళ్... అరెభయ్... ఈ కానిస్టేబుల్‌కీ టికెట్ కలక్షన్ డ్యూటీ కూడా జాయింట్ చేసింద్రా? మా బాంబైల ఎవడి డూటీ వాడిదే! అరె జరా సంబాల్‌కీ బాత్ కరేనా!” అపుడు నా దృష్టి మొత్తం ఆ గుంపులోకెల్లా- అందాల ఫొటోకి నేనే ధీటూ అన్నట్లు ఉన్న బోరనే మరికాస్త విరుచుకుని మాట్లాడుతున్న ‘హీరోయిన్’ మీద పడింది- అబ్బో! సిన్మా కథానాయిక్కి కావలసిన లక్షణాలన్నీ పుష్కలంగా వుండేట్లు తయారయిందిగానీ. ప్రస్తుతం వయసు కాస్తంత పైబడినా గిడసబారి అది కనపడ్డంలేదు. మెడలో రెండుమూడు గొలుసులు... చేతులకు గాజులు... ఎంతైన చెవుల చుంకీలు... (అన్నీ బంగారపువే) ఒక పన్ను కూడా బంగారం... చేతి వేళ్ళనిండా వుంగరాలు.. చల్లుకున్న స్ప్రే వాసనలు స్టేషన్నిండా గుభాళిస్తున్నాయి. అయితే వచ్చిన చిక్కల్లా నోట్లో కసాపిసా ఎడతెరిపిలేకుండా ‘జర్దాకిళ్ళీ’ నములుతూ తుపుకూ తుపుకూ ఎక్కడబడితే అక్కడ రాజసంగా వుమ్మేయడం! అందర్లో ఆవిడ వ్యవహారమే కాస్తంత చిక్కుగా వుంది.

“దేఖో.. బాజాప్తా మా బాంబైకి టికట్లు తీసినాం! రిజర్వేషన్ భీ! మరి మద్దెలో ఈ పోలీసాయన లొల్లేంది? అరె బండెక్కొద్దంటడు... నో.. టూమచ్ (తుపుకు)

“అది కాదే అన్నా... ఇది రెడ్‌లైట్ ఏరియా బాపతు... మన సిగ్నల్ తండాదేఅయిదారేండ్ల క్రింద బొంబై చేరింది. అన్యాయంగా ఈ పోలీసులను (అరె చుప్! మధ్యలో సత్తి హీరోయిన్ మాట్లాడబోతే గడమాయించాడు) ఎక్స్‌పోర్టు చేస్తందే! అరె... ఎంతన్యాయం... ఘోరం...పాపంగాదె?”

ఆరుగులు ఆడపిల్లలు ఇదేం పట్టకుండా లంబాడీ బాషలో కువకువమని పగలబడి నవ్వుతూ ఓ చిన్న ట్రాన్సిష్టరులో అర్థంకాని హిందీ పాటలు వింటున్నారు. నాకైతే కేసు మొత్తం అర్థమైంది. అర్థంకానిదల్లా ఆ బొంబై హీరోయిన్ ధాటికి మా సత్తి కాలపు సత్తి తట్టుకుంటాడా అని!

“నువ్వాగు కోయిలారా.. ఆగు.. అరె సత్తి... వాళ్ళు టికట్లు తీసుకున్నారు గదా... రైలుబండేమో సెంట్రలు సర్కారుదాయె! ఆ బాంబే జనాలందరిదాయెం! వాళ్ళదోవన వాళ్ళు పోతానంటే నువ్వాపుతానంటావేం?” నేను కాస్త గట్టిగా గద్దించే సరికే నాకు ఊపిరి సలపనంత దగ్గుతెర కమ్ముకుని ఉక్కిరిబిక్కిరి అయ్యాను. హీరోయిను నా మీద చూపుల్లోనే సానుభూతి ప్రకటించి ఒక కొంటెనవ్వును ప్రసాదించడంతో నా నరాలు జివ్వుమని లాగాయి.

“నువ్వా అంతేనా! అరె.. అది రెడ్‌లైట్ ఏరియా... వీళ్ళు విజిటర్సా... టూరిస్టులూ కారు...!” సత్తి చెక్కిన సంకకర్రలా చెంగుచెంగున చిందులు తొక్కుతున్నాడు. హీరోయినేమో ఆవేశంలో మిక్కిలి వుద్విగ్నానికిలోనై విరుచుకుపడి వాడ్ని కొరికినంత పని చేసింది.

‘రెడ్‌లైట్.. నైట్‌వెయిట్ నీకెందుకు... చుప్... బహుత్‌దేఖా... అవునూ... నేను వీండ్లను తీస్కుపోయేది అక్కడకే- అందుకే- నీకేంటి... నీదేంపోయింది? అక్కడ నీలాంటి జవాన్లకు రోజూ మాముళ్ళిచ్చే చేయినాది! నువ్వా అట్లా అడుగు.. రేటు.. తీస్కో... పైసలేగదా.. పరమాత్మాహై... హౌమెనీ రుపీస్... సౌ... హండ్రెడ్.. దోసౌ.. అరెయార్.. (తుపుకు)...

సత్తి అఘాటున విరుచుకు పడిపోతాడేమోనని నేను వచ్చే దగ్గుతెరను కంట్రోలు చేసుకుని “మనీషా... అబ్బ...టైరో.. మావాడికేం తెల్వదు. ఏదో దిక్కులేక లారీ నౌకరీ చేస్తండుగానీ టైరో.. దేఖో... నేనో మంచి మాటడుగుతా.. అట్లాకూర్చో... బైటో... సత్తీ నువు స్టూలు లాక్కో”

హీరోయిను మెరిసే కళ్ళతో చాలా ఆప్యాయంగా నా వైపు చూసి కన్ను గీటింది. అపుడు నాపై అంతులేని ప్రేమ పుట్టుకువచ్చి వుంటుంది. అపుడు సాయంత్రం బాగా అవడంవల్ల చల్లగాలి కితకితలు పెడుతుంటే నాక్కాస్త ఇబ్బంది కలిగిన మాట నిజం! ఏం చేస్తాం?

“ఏయ్ లక్ష్మిలూ.. మిమ్మలే... మీకందరికీ ఇష్టం వుండే ఈ బొంబాయికి ప్రయాణం కట్టింద్రా.

నావంక వాళ్ళు నన్నో వెర్రివాడికింద చూసి కిసుక్కున నవ్వి మళ్ళీ రేడియోలో మునిగిపోయారు. నాకేం తోచలేదు- సత్తి హతీశుడై అప్పటికి అన్నీ కోల్పోయిన ధర్మరాజులా నా వంక దీనంగా చూస్తున్నాడు.

“సార్... తుమ్.. మీరు చాలా మంచోళ్ళు... అచ్చా... దేఖో... అక్కడ చుట్టలు పీకే వాళ్ళిద్దరు వీళ్ళ అయ్యలు (తుపుకు) జరపిలుస్తా... అరే.. ఆదిగా పిలవకముందే ఇద్దరు లంబాడా వాళ్ళు అక్కడికి కాస్తంత ఎడంగా చుట్టలు కాల్చుకుంటున్న శాల్తీలు వచ్చారు. వాళ్ళ అవతారాలు ఒకే తీరున వున్నాయి- కవలపిల్లల్లా పిర్రలు కనపడే గుడ్డలు... జీబురు తలలు... దానికో మాసిన తువ్వాలు... ఒంటి మీద చర్మం తప్ప మరేం లేదు. దరిద్రం ఇద్దర్నీ కవలపిల్లల్లా మార్చేసింది.

“ఈడ రోజంత మిరప చేనేరబోతే ఇరవైరూపాలు... చెనక్కాయ పీకినా కొట్టినా.. తెంపినా... బాదినా ఇరవయ్యే! కంపకొట్టినా... దాన్లో జారబడినా ఇచ్చేది అంతే! బానెవుందిగద... మరిపుడు వానల్లేక ఈ సమత్సరం గివ్వి కూడ తెవ్వాయె! ఇంటో జొన్నలు.. నూకలు ఏ గింజా లెవ్వాయె! రాయి పనికీ రప్పకూలికీ బిల్డింగు పన్లకీ పోదామంటె గంతేనాయె!”

చివర్లో వాళ్ళలో ఒకడు అరచేతి మీద చాలెంజీగా పెళ్ళుపెళ్ళున చరిచి ఒక అద్భుత ఆర్థిక రహస్యం చెప్పడంతో నాకళ్ళు గిర్రున తిరిగి మళ్ళా ఓ నిమిషంపాటు దగ్గాల్సి వచ్చింది.

“బిల్డింగు మేస్త్రీల కాడ పనికిపోతే పోకిరోళ్ళు.. మేస్త్రీల దగ్గరా.. అపుడపుడు పండుకోకతప్పదాయె... వాడు లేచి అయిదో పదో చేతుల పెడ్తే పెడ్తడు. లేదంటే రేపు గ్యారంటి కూలంటడు- అయితే మరి మా ‘సాయ్లు’ (కొయిరాలా) చెప్పిందే బాగుందిగదా... కాగా బొంబైల కూడ గిట్లనే ఒళ్ళమ్ముకుంటే ఒక్కరేత్రికి వందలు... సౌ... వందలు... అది గట్ల లచ్చలు లచ్చలు సంపాయిచ్చింది...!”

చివర్లో వాడి కంఠం జీరబోయి కండ్లనిండా నీళ్ళు నిండినా నాకు మాత్రం అట్లా ‘అట్లాంటి’ విషయాల్ని ప్లాట్‌పాం మీద బహిరంగంగా మాట్లాడుకోడానికి చాలా వెగటుగా వుండడంతో మళ్ళీ దగ్గుతెర కమ్ముకొచ్చింది.

నాకేం చెప్పాలో తోచక తికమక పడిపోయాను. అపుడే అటువేపు ప్లాట్‌పాం చివర్న ఓ గుంపు... రోదనలు... కలకలం రేగడంలో బతికిపోయాను- సత్తి చెంగున టోపీ తగలించుకుని అక్కడికి వురికాడు.

“ఒరె నాయనా... కాని చూడూ... ఇట్లా కడుపు కక్కుర్తికి కాని పనులు చేయడం మంచిదా? అహఁ... ఏదో ధైర్యం తెచ్చుకోవాలె... బతకడానికి బోలెడు మార్గాలు... కూలో... నాలో...?” అంటున్నపుడు నా మాటలు నాకే వెగటనిపించాయి.

హీరోయిను నావంక ఈసారి చాలా ఈసడింపుగా చూసింది.

“దొంగలు దొంగతనాలు చేసి బతుకుతండ్రు... జీ రహే (తుపుకు) చిన్న దొంగలు పెద్ద కేడీలయి డాన్, ఉస్తాద్ లవుతండ్రు... అరెభయ్... గిక్కడ... ఏ గావ్ యే ఎవడిష్టంవున్నట్లు వాడు బతికెతందుకు ఛాన్సు లేదు... మా బొంబైల తరీకంత అలగున్నది గాదు...!” హీరోయిన్ సామ్లా మరోమారు భారీగా బోర విరుచుకోవడంలో నా నరాలన్నీ

జివ్వుమన్నాయి- అపుడీ సత్తి ఆ గుంపులో నుండి... ఏదో... ఎవర్నో తిట్టుకుంటూ కాండ్రించి ఉమ్ముకుంటూ వచ్చాడు. వాడి వెనకే తాతలు ఆ దరిద్రంగొట్టు లంబాడీ కవలలు!

“సారూ... గాయన మా తండ పక్క ఎంకట్రెడ్డి ఆసామి... పురుగుల మందు తాగిండు- వానల్లేక పంటలు పాయె- అయితే మందు తాగటవేనా? ధు... గంత భయం పడేటోడు గొంతులావున భయం పడతాడు... గింతకాలం అసలెట్ల బతికిండో... పెండ్లాం పిల్లలు ఒకటే ఏడుపు...!” ఒక దరిద్రుడు చాలా అనహ్యంగా ఈసడించుకున్నాడు.

“పానంలోని పొట్టాడాలె... సస్తె ఏమొస్తది? పోరగాండ్ల వుసురు... పెండ్లాం ఏడుపు... సావంటే మజాకా అయిపోయింది...!” మరో దరిద్రుడు చుట్ట తీసి వెలిగించాడు.

“సూయిసైడు అటెంప్ట్? ఆస్పత్రికి పోయిందనక వుంటడన్న నమ్మకం లేదు- ఒకటే వాంతులు... వాసన... ఒరె.. గద్సరే... గిట్ల ఒళ్ళమ్ముకోటానికి బొంబైకి ఎందుకు పంపుతర్రా! గీడ బతుకు తెరువుదార్లు చూసుకోక... నా మాట వినండ్రా..” మా హరిశ్చంద్రుడు సత్తి ధర్మరాజులా తగులుకున్నాడు.

“అరె... గంజిగటక నాకెటోడు- గది దొరక్కున్నా ఆడ్నే పడుండమంటవ్- మాసామ్లి పాతిక ముప్పయి తులాల బంగారం... పది రేడియోలు... మూడు టీవీలు దెచ్చింది.. వాసన డబ్బాలు... టెరిలిన్ కోకలు... గీ తండాలల్ల వుండి ఇంగ బాగు పడేది లేదయ్యా... గివాళ ఏం లేనోడు ఎమ్మెల్లె అయితండు- అటెంక మంత్రయితండు...

ఈ బోడిగుండు మోకాలు తర్కంతో నాకు బాగా హుషారెక్కింది- బండిరావడానికింకా అరగంట టైముంది- సత్తి ‘ఆశ’ చాలించుకుని స్టేషను మాస్టరు గదివంక విసవిసా నడిచిపోయాడు. నేను నెమ్మదిగా అడిగాను.

“మీరు బొంబాయేపొండి... డిల్లీ దాక దేకండి... చూడు సామ్లి అక్కడగీ పోలీసు.. రౌండీల గోలుండదా...

సామ్లి విరబడినవ్వి! పైసేమే పరమాత్మా’ అని సైగ చేసింది.

“సర్లెగానీ... ‘ఎయిడ్సు’ గురించి విన్నారు గద... రోగం... అదిగాని వచ్చిందా... సావేగతి! మరింక మందులేదు... అసలది తగిల్నట్టు... జబ్బు సోకినట్టు కూడా మనకు తెల్వనే తెలవదు... దర్జగనే వుంటం.. ఇంగ అది లోలోపల తూలుసుడు సుమా చేస్తది... అదెందుకొస్తది... అదెల పన్లేక ఉత్తగనే పేరంటానికి రాదు.. రైలు బస్సు టికటు కొనుకునిరాదు... ఉత్తంగనే... ఎవనితోని బడితె వానితోని కలిసినా మంటే ఖతం...

ఆరుగురు ఆడపిల్లలూ చెవులు నావంకే రిక్కరించారు.

“ఇంజక్షన్ల్ల... హఫ్తా హఫ్తా తీసుకుంటంగద... ఏమైతది...!” హీరోయిను బింకంగా ఎదురుదాడికి దిగింది.

... ఇతర రోగాలకవి పని చేస్తయి. నిజం! హెచ్చైవీ వచ్చెది మన ఒంట్లో సొచ్చినా చాలకాలం దాకా మనకు తెలవదు- అది వచ్చినంక మనకు జరమొచ్చినా.. జలుబు చేసినా.. కాలు నొప్పయినా.. ఏ రోగమొచ్చినా అదింక నయం కానేకాదు... అది దాని లక్షణం...

ఈసారి మాత్రం ఆరుగురు నావంక కాస్తంత బెదురుగా చూసినా హీరోయను ‘తుపుకు’ మని ఓసారి ఉమ్మి చుట్టు పక్కల పరికించి చూసింది.

“అద్సరెసారూ... నిరోదులు వాడుకుంటంగద!” గుసగుసగా నా చెవిదగ్గిర అంటుంటే నా ఒళ్ళు సెగలు పొగలు గక్కింది.

“నువ్వా?” నేను వికవికనవ్వి అన్న మాటకు అది బిత్తరపోయింది- “అరె.. అది ఒక ఆశ.. అది వాడినా రావచ్చు... చాలా మందికి అట్లా వచ్చినై!’ ఎయిడ్స్ వచ్చినంక మున్సిపాల్టీ వాండ్లు సచ్చిన కుక్కనైనా ముట్టుకుంటరుగానీ వాడ్ని తాకరు- ఊరికి దూరంగా బతికుండంగనె పారేస్తరు... అడివిల కాదు... రాళ్ళు రప్పల.. నక్కలు కూడా పీక్కుతినవ్...”

ఆరుగురూ ఒకరి దగ్గరకు ఒకరు జరిగి ఒదిగి కూర్చున్నారు.

“అరె... మీ ఎ.పి. దాన్లో ఫస్టు.. నిరోద్ బుంగలు కూడా తగిలించుకుంటండ్రు. (తుపుక్) మా బాంబైల అన్ని సవులతులున్నై! ఏంగాదో!” సామ్లి వణుకుతున్న గొంతుకతో అని ఉమ్మేసింది.

“రోజూ లక్షల మంది దీంతో చస్తున్నారు. నీకది తగిలిందని తెలవగానే ఎవడూ నీ దగ్గరకురాడు- నిన్ను రానివ్వడు. బిడ్డను తల్లి... మొగుడ్ని పెండ్లాం... అబ్బో... డబ్బవసరమేగానీ ఈ జబ్బు మా డేంజరు గద... వచ్చి చేరిందనక తెలవదాయె.. తెలిసినంక మనం మిగలమాయె! అంతా ‘దొంగదెబ్బ యవ్వారం’.. అదెట్లనైనరావడానికి చాన్సుంది.

“అబ్బా... అసలు సావునెవడాపుతాడుసారూ... అదెట్లనైన ఎందులకెళ్ళైనా దూరుకుంట వస్తది!” సామ్లి విషాద వేదాంతం ఒలబోసింది.

“నీ సావు నువు సస్తే ఎవడిక పోయిందేంలేదు- నీ సావు వల్ల మళ్ళా కొంత మంది చావొద్దుగద... ఒకడికి తగిలి వాడు ముడుచుకుని సస్తే ఏ పీడా లేదు-మరి జనాలకంతటికీ చావును పంచి పెట్టడం ఏం ధర్మం? అదెంత ఘోరం.. కాదా? “అది” మంచిదా..!” నేను రెట్టించాను.

ఆరుగురు ఆడపిల్లలూ వాళ్ళ దరిద్రపుగొట్టు అయ్యాల దగ్గరకు జరిగారు. సామ్లి హీరోయిను మరో జర్దాకిళ్ళీ తీసి బుగ్గన బిగించింది. నేను నాకు పరిజ్ఞానం వున్న మేరకు హెచ్.ఐ.వీ-దశలూ.. ఎయిడ్సూ... లక్షణాలు చావలోని నరకయాతనల తాలూకు వివరాలు పురాణకథలా లాగించేస్తూనే వున్నాను. ఉన్నట్లుండి హీరోయిను సామ్లి బుర్రలో తటల్లున ఏం మెరుపు మెరిసిందో ఆడగాల్సిన ప్రశ్న మొహం మీదనే అడిగేసింది.

...సారూ... నువు డాక్టరువు కాదుగద... ఆపరేషన్లు చెయ్యవుగద.. ఛలో... బోలో! నేను అడిగిన ప్రశ్నకు అడ్డదిడ్డంగా తలూపాను.

“మరిగిన్ని మతలబులు.. కేసులు... శానా.. విశేషం.. వివరాలు... నీకెట్లా తెలుసు.. డేంజరే... భయం పెట్టడానికేగదా... డరానేకీ లియా యేబాతేః! దానికి మందులెందుకుండవే.. పైసా పేక్‌దేనా... సారా దవా దర్వాజా పర్ ఆయేగా... ఇంటి తలుపు దగ్గర సచ్చివాల్తయి... మా బాంబైలో బోలెడంత మంది డాక్టర్లు.. చిటికెలేసి తుపుక్కన ఉమ్మేసింది!

సామ్లి చెప్పిందంతా సావధానంగా విని నేను చాలా నింపాదిగా లేచి నుంచున్నాను- “అది కాదమ్మాయ్.. నేనూ ఇంతకు ముందు అల్లరి చిల్లర తిరుగుళ్ళకు కక్కుర్తి పడ్డవాడ్నే... అందుకే అది నాకూ దాపరించి ఆర్నెల్లయింది- మరింక నేను బతికేది కచ్చితంగా ఆర్నెల్లే... ఈ దగ్గూ... ఆయాసం... ఏదీ ఇక తగ్గేది కానేకాదు... నాకు తెలుసు... అందుకే...

మరో దగ్గుతెరతో నేను లుంగలు చుట్టుకుపోయాను!

V

# దృశ్యరూపం



నా కవితా చందన శాలా సుందర చిత్ర విచిత్రాలు...
నా అక్షరాలు వెన్నెల్లో ఆడుకునే అందమైన ఆడపిల్లలు

చిత్రం: **మోహన్**

**తిలక్**

## కవిత

# జోగు నృత్యం

వోరప్రసాద్

చంద్రుడు లేని ఆకాశం
సూర్యుడుండని పగలు
కాంతిని చూడని కళ్ళు
అల్లిన చీకటిలో
తనువు దొరపరమైంది
కనిపించే ప్రపంచం పెనుతుఫానై
తను గడ్డిపోచగా తల్లడిల్లింది
దురాచార సుడిగుండాలలో
మైనపుబొమ్మై మసిలింది
'నీవు పోచమ్మ పేరున ఉన్నవ్
నీవు ఎల్లమ్మ పేరున ఉన్నవ్'
భూలోక దేవత వన్నరు
లగ్గంలేని నీ జీవితం
పోచమ్మకే అంకితం అన్నరు
భూలోక దొరల స్వర్గానికి
ఒడుపుగా ఉంపుడుకత్తె సౌకర్యం
అంటరాని ఆడవాళ్ళ ఆచారాలు
నోములూ వ్రతాలూ కాదు
శవాల ముందు శవమై నాట్యమాడింది
ఊర్లల్లో గత్తర లేస్తే
ఊరపండగలో 'కొల్ల'గా
'రంగం' ఎక్కిన 'ఎరుపులామె'
ఊరందరినీ తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టింది
'కూలికి పనికిరావు దేవతవు' అంటే
ఊళ్ళన్నీ తిరిగి వడ్లు బిచ్చమడిగింది
ఊర్లో అందరి పరమై
అణువణువూ తడమబడింది
తండ్రిలేని పిల్లలకు తల్లై
పిల్లలడిగిన ప్రశ్నలకు తల్లడిల్లింది
అప్పుడు యవ్వనం చర్చించబడింది
ఇప్పుడు వృద్ధాప్యం దిక్కులేనిదయ్యింది
వేల సంవత్సరాల 'జోగిని' కొనసాగింపు
ఎంత జీవితాన్ని విధ్వంసం చేసిందో
ఆకాశమంత భూతద్దంతో వెదకాల్సిందే
దురాచారానికి బలైన తల్లుల
పిల్లల మనసులను హత్తుకోవాల్సిందే!



# ఉత్తరం... ఏడ్చింది?


పున్నమి వెంకటయ్య



అయ్యా ఎట్లున్నవయ్యా
పానం బాగుందా!
ఆపుడెపుడో మనకాడ
భూమిపై సినుకు పడనపుడు
గొంతారిపోయి కొండకు సూసినపుడు
మట్టిపై మొక్కలు మంట్లోనే కలిసినపుడు
పాడి పశువులు గాటికాడే
కాటికి పయనం కట్టినపుడు
కూడు గానక నీళ్లగానక
మాడి సస్తామని
పట్నం బోయి పైసలంపమని
జోడీ లుంగీలు, అంగీలు
సద్ది మూట సంకగట్టి
సర్కారు బస్సెక్కించినపుడు చూసాను!
అయ్యా... బాగున్నావు కదయ్యా!!
మా యమ్మంటే అడిగేటోన్ని
లేరుగదయ్యా!!
అయ్యా... సెల్లేట్లుందయ్యా!
నా ఎనక బుట్టిన ఎర్రతల్లి
నా ఎంగిలి సనుబాలు తాగిన
నా సిన్నతల్లి చేమమా... అయ్యా!
మీరంపిన సిట్టి సదివించగానే
నెత్తిన ఎత్తిన తట్టతో
నిట్ట నిలువున సోలాను!
అక్కున సేర్చుకోవాల్సిన బడి ఎక్కిరించిందా!
పత్తి సేను నీ సెలిమి కోరిందా?
ఊరి పొలిమర దాటమందా!
మల్లే లాంటి నీ పసిపాయాన్ని
పూలతోటకు తోడు చేసినందుకు
నన్ను చెమించమ్మ! చెమించు!!
ఈ ఉత్తరంతోపాటు
డబ్బంపుతున్న... తీసుకో తల్లి!!
వచ్చే దసర పండక్కి వస్తానో... రానో!
ఇంతే సంగతులు
నీ యన్న!!

కథ

పీపీ



# రా..మా...!

*కళ్లముందు జరుగుతున్న విషయాల్లో నిజానిజాలు తేల్చుకోవడమే కష్టంగా వుంటే కలల్లో కనిపించే వాటిని పోల్చిచూసుకోవడం ఇంకెంత కష్టం!*

*ఇప్పుడు వేణుగోపాల రావు స్థితి అలాగే వుంది.*

వారం రోజులుగా ఒకే కల..

వెంటాడి వేధిస్తున్న కల..

ఎవరో భయానకంగా కత్తులు కటార్లతో తరుముకొస్తున్న దృశ్యం..

ఆర్త నాదాలు.. హాహాకారాలు..

నెత్తుటి ధారలు.. శవాలు..

అన్ని లీలగా.. చాయగా..

కలత నిద్రలో అటూ ఇటూ దొర్లి పొర్లి ఆఖరుకు లేచి కూచుంటాడు.

. . .

అవి టీవీలో చూసిన దృశ్యాల తాలూకూ స్వప్నాలని తెలుస్తూనే వుంది.

కాని అర్థం కానిదొక్కటే.

వెంట తరిమే వాళ్లలో ఎవరిదో పరిచితమైన మొహం కనిపిస్తోంది.

ఎక్కడో గుజరాత్ గురించిన కలలో కలగాపులగంగా కనిపించే ఈ ముఖం తనకెలా తెలుసు?

తన బంధు మిత్రులెవరూ గుజరాత్‌లో లేరే?

ఆలోచించి ఆలోచించి అలసి పోయాడు.

కల వీడని నీడలా వెన్నాడుతూనే వుంది.

రోజూ లాగే కాస్సేపు కూచుని ఆంజనేయ స్తోత్రం చేసి పడుకున్నాడు.

. . .

"రామాయణం రాసినందుకు కుళ్లి కుళ్లి ఏడుస్తున్నాడు వాల్మీకి."

కవి సమ్మేళనంలో ఎవరో చదువుతున్నారు.

ఉలిక్కిపడ్డాడు.

రామున్ని, రామాయణాన్ని ఎవరైనా ఏదైనా అంటే వేణుగోపాల రావుకు మహాబాధ, కోపం.

సాహిత్యం మీద ఆసక్తితో వెళ్లిన వాడు ఆ గేయం పూర్తవకుండానే లేచి వచ్చేశాడు.

ఎవరో ఏదో చేశారని రామున్ని,రామాయణాన్ని ఎందుకు ఆడిపోసుకోవడం?

తను పుట్టినప్పటి నుంచి రామభక్తుడేనే..

దేవుడు ఎక్కడైనా ఇదంతా చేయమంటాడా?

చీమకైనా అపకారం చేశాడా? వూహూ...

అక్కడ గొడవ అంటే ఇక్కడ నుంచే ఇటు తిరిగి వెళ్లాడు.

అందరూ బాగుండాలనే కోరుకుంటాడు.

అలాటి తాను పూజించే రాముడు ఇలాటి వాటికి కారకుడవుతాడా? వేణు గోపాల రావుకు చాలా కోపం వచ్చింది.

రామయణం తీసి మరోసారి పఠించి పడుకున్నాడు.

. . .

ఎప్పటిలాగే మధ్యలో లేచి కూచున్నాడు.

ఈ రోజూ కల వచ్చింది.కాని రోజులా లేదు.

నిజంగానే కలలో ఎవరో గడ్డం మనిషి విపరీతంగా శోకించాడు.

అడవి మనిషిలానూ వున్నాడు. రుషి లానూ వున్నాడు.చేతిలో ఘంటం వుంది. జ్ఞాని అనిపిస్తున్నాడు.

ఎవరై వుంటాడు? ఎందుకేడుస్తున్నాడు?

లాభం లేదు. ఏమీ అర్థం కావడం లేదు.

"శ్రీ ఆంజనేయం, ప్రసన్నాంజనేయం, ప్రభా దివ్య కాయం, భజే వాయు పుత్రం, నమో వాలగాత్రం.. " దండకం ముగించి పడుకున్నాడు.

కొన్ని క్షణాల్లోనే మళ్లీ ఆ వృద్ధ రుషి. అయన కళ్లు ధారాపాతంగా వర్షిస్తూనే వున్నాయి.

ఎవరు స్వామీ? ఎందుకంతగా రోదిస్తున్నారు?

రోజూ రామాయణం చదువుతావు,నన్నే గుర్తు పట్టలేదా?

మీరు మీరు వాల్మీకి కదా .. తను ఆకస్మాత్తుగా గుర్తించాడు.

ఔను నాయనా..

మహానుభావులు, మీరు ఏడవడమేమిటి స్వామీ!

ఇంకేం చేయను? అయోధ్యలో రామాలయం గురించి ప్రళయం చూశాను. అదే అసురులు సబర్మతీ తీరంలో సర్వనాశనం చేస్తున్నారని విని మనసు ఆగక వెళ్లా

అసలు నేనెందుకు శ్లోకం సృషించాను? పక్షి ప్రాణం పోతే చూడలేకనే కదా? అలాటిది ఇన్ని వేల మంది శవాల గుట్టలుగా కనిపిస్తుంటే ఎన్ని రామాయణాలు రాయాలి? అయినా రామాయణంలో రావణుడు కూడా సీతను చివరి దాకా అశోకవనంలో బంధించి వుంచాడుకాని అంటుకోలేదే. అలాటిది అభం శుభం తెలియని వనితలను దారుణంగా అత్యాచారం చేసి చంపేశారే? పసిగందులను కూడా వధించారే! కడుపు చీల్చి పిండాన్ని కూడా ముక్కలు చేశారే? నేను రాసిన రాక్షసులకన్నా దారుణంగా ప్రవర్తించిన ఈ నరాధములను ఏం చేస్తే పాపముంటుంది?

శోకంతో కోపంతో రుషి ముఖం జేవురించింది.

ఆయన ముందు నిరుత్తరుడై నిర్వికారంగా చూస్తున్న మూర్తి తనదేనని కలతగా కదులుతున్న వేణుగోపాలరావుకు అర్థమవుతూనే వుంది. ఇంతలోనే నిద్ర పూర్తిగా చెదిరిపోయింది.

. . .

ఉదయాన్నే ఎవరో పిలుస్తున్నారు.

బయటకు వస్తే కాషాయం గుడ్డలు కట్టుకుని యువకులు కొందరు నిలబడివున్నారు.

అయోధ్యలో రామాలయానికి విరాళాలు వసూలు చేస్తున్నారట.

ముందు ఏదో కుంకుమ ఇచ్చి పెట్టుకోమన్నారు. ఆ తర్వాత కరపత్రాలు ఇచ్చారు.వేణుగోపాల రావు వాటిని పెద్దగా పట్టించుకోలేదు.

ఇప్పుడు తనేమి విరాళం ఇవ్వలేనన్నాడు.

అదేమిటండీ;దేవుడి కార్యానికి లేదంటారు.. వాళ్లు నిష్టూరంగా అన్నారు.

దేవుడే మనందరికి నీడ కల్పిస్తాడు. అతను నిర్లిప్తంగా అన్నాడు.

రోజూ రామాలయానికి వచ్చే మీరే ఇలా అంటున్నారే.ఐక్యమత్యం లేకనే మన జాతి ఇలా అయిపోయింది కోపంగా వినిపించిన గొంతును గుర్తించి చటుక్కున అటుకేసి చూశాడు వేణుగోపాలరావు.

రోజూ తనకు కలలో కత్తుల గుంపులో కనిపిస్తున్న ముఖం.

ఆలయంలో కూడా ఒకటి రెండు సార్లు చూశాడు.

నీ పేరేమిటి? ఎక్కడుంటావు? ఆతృతగా ప్రశ్నించాడు.

మీకెందుకు?

ఎందుకైతేనేం, ముందు నీవెవరో చెప్పు.గుళ్లో కనిపించే వాడివి గుజరాత్‌కెందుకెళ్లావ్?

నే వెళ్ల లేదు. మీరు ఎవరిని చూసి ఎవరనుకుంటున్నారో!

లేదు. నా కళ్లు నన్ను మోసం చేయవు. రోజూ చూస్తూనే వున్నాను.

వాళ్లు ఏమీ జవాబు చెప్పకుండా హడావుడిగా అక్కడినుంచి తరలి పోయారు.

వేణు గోపాలరావు ఏదో నిర్ణయానికి వచ్చినట్టు తలాడించాడు.

. . .

ఎన్నడూ లేంది గుళ్లో పడుకోవడమేమిటండీ అని అభ్యంతరం పెట్టింది అతని భార్య.

కాని వినలేదు.

నీకే అర్థమవుతుంది. అంటూ వెళ్లి పోయాడు.

ఆ రాత్రి వాళ్ల ఇంటి ముందు ఎవరో కదలాడినట్టు అనుమానం వచ్చిందని మరురోజు వుదయం భార్య చెప్పింది.

. . .

రామాలయం ముందు భాగం బాగా దెబ్బ తింది.వేణు గోపాలరావు శరీరం అక్కడ భయానకంగా పడివుంది.

పోలీసులు ఏదో రాసుకుంటున్నారు.చుట్టు పక్కల వారిని ప్రశ్నలు వేస్తున్నారు.

అతని భార్య హృదయవిదారకంగా విలపిస్తోంది.

" వద్దన్నా వినకుండా గుళ్లో పడుకున్నాడు. నా రాముడే కాపాడతాడని అన్నాడు. ఇంతలోనే ఇంత ఘోరం జరిగిపోయింది బాబూ ' అంటూ ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి పోయింది.

ఇంతలోనే ఒక కాషాయ యువకుల బృందం అక్కడకు చేరుకుంది.

మిగిలిన వాళ్లకు భిన్నంగా ఏవో శ్లోకాలతో నమస్కారం చేసింది.

రామభక్తుడు. రాముడి సన్నిధిలోనే పోయాడు. ఈ రామభక్తుని ప్రాణం తీసిన వారిని వదలిపెట్టేది లేదు.."

వొక యువకుడు మరీ అవేశంగా అన్నాడు.

అతన్ని గుర్తు పట్టడానికి వేణుగోపాల రావు కు ప్రాణం లేదు.

శాశ్వత నిద్ర పోయిన అతనికి ఏ పీడకలారాలేదు, అందులో వాల్మీకీ రాలేదు.

రామభక్తుడి హత్యపై రకరకాల కథనాలు మాత్రం వెలువడ్డాయి. ఆ ప్రాంతమంతా ఉద్రిక్తత అలుముకుంది.

వేణుగోపాలరావులాగే ఇప్పుడు చాలా మందికి రాత్రుళ్లు నిద్ర పట్టడం లేదు.పగలు కూడా ప్రతిఒక్కరూ కంగారుగా తిరుగుతున్నారు.

రెండు మూడు రోజులలో ఆ అవకాశం కూడా లేకుండా ఆ ప్రాంతంలో కర్ఫ్యూ పెట్టేశారు.

రామాలయంలో రాముడు భక్తుల కొసం విచారంగా కనిపిస్తున్నాడు.

రామం...నిశాచరగణ వినాశకరం...నామం

అనే రికార్డు మాత్రం ఆ కర్ఫ్యూ నిశ్శబ్దాన్ని చేదిస్తూ వినిపిస్తోంది.

V

## పుటుక నీది, చావు నీది,

# బతుకంతా దేశానిది!



ప్రజాకవి

**కాళోజీనారాయణరావు**

1914 - 2002

కలాన్ని గళాన్ని ఒకే పదునుతో ఉపయోగించడం అక్షరాల్లోనూ ఆచరణలోనూ ఒకే నిశిత వైఖరితో పోరాడ్డం కొంత మందికే సాధ్యం. ప్రజా కవిగా, ప్రజాతంత్ర యోధుడుగా కాళోజీ నారాయణరావు తెలుగు ప్రజల జీవితంలోనూ, తెలుగు సాహిత్యరంగంలోనూ అసమాన స్థానం ఆక్రమించారు.2002 నవంబరు 13న తొంభయ్యవ పడిలో కన్నుమూసిన కాళోజీకి ఇవే మా జోహార్లు.

బ్రిటిష్ ప్రభుత్వం పైన, నైజాం నిరంకుశ పాలనపైన ఆయన రాజీలేని పోరాటం సాగించాడు. రెండున్నరేళ్లపాటు కటకటాల వెనుక మగ్గాడు. అన్యాయానికి ఎన్నడూ తలవంచలేదు. తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషు, మరాఠీ హిందీ భాషల్లో ప్రావీణ్యమున్న కాళోజి 1947లో రజాకార్లు సాగించిన రాక్షస కృత్యాలపై నిప్పులు చెరిగాడు.

ఎమర్జన్సీకి వ్యతిరేకంగానూ పౌరహక్కులు రక్షణ కోసమూ ఆయన జరిపిన పోరాటం ఉత్తేజకరమైనది. ఒకవైపు ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటూనే మరోవైపు సమాజంలోని కుళ్ళును కడిగేసేందుకు కలాన్ని ఆయుధంగా చేపట్టారు. కవిత్వం వేరు -జీవితం వేరు అని కాకుండా తాను దేనినైతే నమ్మారో దానినే రాతలలోను, చేతలలోను చూపించారు. ప్రజాభిమాన ప్రతిబింబంగా అనేక పురస్కారాలు వెతుక్కుంటూ వచ్చినా పాలకులతో నేరుగా తలపడడానికి ఎన్నడూ వెనకాడలేదు. తెలంగాణాలో ఎక్కడ సభ జరిగినా కాళోజీ లేనిదే సంపూర్ణం కాదు. వయోభారం, అనారోగ్యంతో పెనుగులాడుతూనే యువకవులు రచయితలను ప్రోత్సహించే తన కర్తవ్యం ఆయన మానలేదు.వరంగల్‌లో ఆయన ఇల్లు అక్షరాలా సాహితీ కేంద్రం. 'దర్పణం' సంచికకు ఆయన తన అనుభవాలతో ఇంటర్వ్యూ ఇచ్చారు.గమనం ఆవిష్కరించారు.

నైజాం వ్యతిరేక పోరాటంలో దాశరథి రంగాచార్యతో కలిసి తెలంగాణా విముక్తి గీతాలు రాస్తూ ప్రజలను ఉత్తేజపరిచారు. మొన్నటికి మొన్న గుజరాత్‌లో నరేంద్రమోడి ప్రభుత్వదన్నుతో మైనారిటీలపై సాగిన నరమేథం ఆయన్ని తీవ్రంగా కలచివేసింది.ఓపిక లేకపోయినా గుజరాత్‌గాయం సభల్లో పాల్గొని తన దీక్షను నిబద్ధతను చాటిన కాళోజీ ఆ తర్వాత పూర్తిగా అస్వస్థతకు గురై కన్నుమూశారు.

**(దర్పణంకు కాళోజీ ఇంటర్వ్యూ పునర్ముద్రణ లోపలి పేజీలలో)**